# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి - 3

## వచన కవితలు - భాగం - 1



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి–3

### వచన కవితా సంపుటులు: భాగం - 1

త్రిపదలు, అనాది కొసనుంచి అనంతత్వంలోకి,

మోక్షం నా జన్మహక్కు, ఓయీ కవీ! కవిత్వం వ్రాయి

ప్రధాన సంపాదకులు

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

సంపాదకులు

ఆచార్య కర్రి సంజీవరావు (శిఖామణి)

సహాయ సంపాదకులు

శ్రీమతి బోయి విజయేందిర

శ్రీ గనుమల జ్ఞానేశ్వర్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

**Boyi Bhimanna - Vachanakavyalu-1**
Padmabhushan Dr. Boyi Bhimanna - Sahitya Peetham
Potti Sree Ramulu Telugu University
Hyderabad- 500 004

డా॥ బోయి భీమన్న శతజయంతి ప్రచురణ

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ప్రథమ ముద్రణ : 2010
ప్రతులు : 1000
మూల్యం : రూ॥ 110/-
ISBN NO : 81-86073-199-0

ప్రతులకు:
రిజిస్ట్రార్
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాద్ - 500 004

ముద్రణ: చరిత ఇంప్రెషన్స్
అజామా బాద్, హైదరాబాద్ - 500 044

Grams: "TELVERS"

Phone: Off: 040-23234815
Tele Fax : 040-23236911
E-mail: info@teluguuniversity.ac.in

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

# POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డన్స్,
హైదరాబాద్ - 500 004

---

## డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠాన్ని తేది 19-09-06న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు పరుస్తుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి డా॥ కొణిజేటి రోశయ్యగారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భీమన్న పీఠానికి తమ వంతు సహకారం కొనసాగిస్తున్నది.

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం, గేయం-వచనకవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
3. భీమన్న జీవితం-రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేయడం.
4. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
5. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.
6. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
7. భీమన్న రచనలపైన వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.
8. భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.

9. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, కొన్నింటిని భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి శరవేగంతో పూర్తి చేస్తోంది. రాష్ట్రం నాలుగు చెరగులా, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న తన కావ్యాలను రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికలను రెండు సంపుటాలుగా ప్రకటించాం. డా॥ భీమన్న రచనలను ఇంగ్లీషులోకి అనువాదం చేసేనిమిత్తం. ప్రసిద్ధులైన అనువాదకులకు అప్పగించి పూర్తిచేయుటం జరిగింది.

గడచిన మూడు సంవత్సరాలలో భీమన్న సమగ్ర సాహిత్యం పేరిట భీమన్న గేయ కావ్యాలు భాగం1, 2, భీమన్న పద్యకావ్యాలు భాగం 1,2, భీమన్న నాటకాలు 1,2, భీమన్న పీఠికలు భాగం 1,2, పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయ భీమన్న గ్రంథాలను ప్రచురించి విడుదల చేయడం జరిగింది. ఇది బోయి భీమన్న శతజయంతి సంవత్సరం.

డా॥ బోయి భీమన్న గారి వచన కవితా సంపుటులను అన్నింటినీ ఒకచోట చేర్చి కాలక్రమపద్ధతిలో విభజించి మూడు భాగాలుగా ప్రచురిస్తున్నాం. భాగం-1లో త్రిపదలు, అనాది కొస నుంచి అనంతత్వంలోకి, మోక్షం నా జన్మహక్కు, 'ఓయీ కవి కవిత్వం రాయి!' కవితా సంపుటులున్నాయి. భాగం -2లో గుడిసెలు కాలిపోతున్నై, కేదారేశ్వరి, రాధతో ఎగ్జిబిషన్, భీమన్న ఉగాదులు, డ్రగ్ ఎడెక్టులు కవితా సంపుటులున్నాయి. భాగం - 3లో గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, ఒంటరిగొంతు కవితా సంపుటులున్నాయి. తెలుగు వారి భాషా, సాహిత్యం, సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలుకల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరు అందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి భీమన్న రచనలను ఒకసారికి ముద్రణ (2008) హక్కులు ఇచ్చిన బోయి భీమన్న సాహితీనిధి అధ్యక్షులు శ్రీమతి హైమవతీ భీమన్నగారికి, ఇతర సభ్యులకు ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం, ఆదరణ ఉంటుందని ఆశిస్తున్నాను.

తేది: 10-9-2010

హైదరాబాద్

(అనుమాండ్ల భూమయ్య)

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

ఆచార్య కె. సంజీవరావు
కన్వీనర్

# గద్య కవితా విద్యాధరుడు బోయి భీమన్న

ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించి ఔననిపించుకొన్న కవులలో పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న ప్రథమ పంక్తిలోని వారు. వారి చేతిలో వచన కవిత కొత్త పోకడలను, ప్రయోగశీలతను సంతరించుకుంది. బయలుదేరిన చోటే ఆగిపోతే అది ప్రవాహం కాదు, అతను కవీ కాడు. నిత్య సజీవ స్రవంతిలా కవీ ముందుకు కదలాలి. పద్యరచనతో తన కవితా యాత్ర ప్రారంభించిన భీమన్న అటు తర్వాత గేయాన్ని, వచన కవితనూ సమాదరించాడు. తన సాహిత్య పరిణామ శీలత్వాన్ని గుడిసెలు కాలిపోతున్నై కవితా సంపుటిలో ఇలా వ్యక్తం చేసాడు.

ఆకాశంలో పద్యంగా ప్రవహించే వాణ్ణి
దూకి, గేయంలో పడ్డాను
అక్కడ నుంచిగెంతి, గద్యం మీద పడ్డాను.

ఆ గద్య కవితా ప్రక్రియ భీమ కవికి కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డును సంపాదించి పెట్టింది. 1973లో భీమన్న వెలువరించిన గుడిసెలు కాలిపోతున్నై గద్య కవితల సంపుటికి 1975లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ప్రకటించింది. పాలేరు, కూలిరాజు వంటి నాటకాలలో భీమన్న స్వీకరించిన సామాజిక ఇతివృత్త పరంపర భీమన్న వచన కవిత్వంలోనూ కొనసాగింది. "కవిత్వంలో ఛందస్సుల మొక్కలు నాటను, భావనలో సామాన్యుని కామన దాటను" అన్న కుందుర్తి మార్గానికి భీమన్న రచనలు దగ్గరగా ఉంటాయి. పద్యం రాయడం చేతగాక వచన కవిత్వం రాస్తున్నారన్న అపవాదును తొలగించిన వారిలో తిలక్, కుందుర్తి, వంటి వారితో పాటు భీమన్న కృషికూడా వుంది. తెలుగు కవిత్వంలో వచన కవిత ఇంకా పూర్తి స్థాయిలో ప్రవేశించని

కాలంలో భీమన్న 1962లో అనాది కొస నుంచి అనంతత్వంలోకి కవితా సంపుటితో వచన కవితా రంగంలో ప్రవేశించారు. "దాదాపు ఒక దశాబ్దానికి పూర్వమే శ్రీ బోయి భీమన్న గారు వచన కవితా రంగ ప్రవేశం చేసారు" అని 14-3-1976 నాటి విశాలాంధ్రలో 'విస్తరిస్తున్న వచన కవిత' వ్యాసంలో పేర్కొన్నారు కుందుర్తి. 'అనాది కొస నుండి అనంతత్వంలో'కి తో మొదలైన వారి వచన కవితా యాత్ర 2006లో వారి మరణాంతరం ప్రచురించిన కుక్క మొరుగుతూనే వుంది వరకూ డజను కవితా సంపుటులలో విస్తరించింది.

దళితులగోడును తన వాణిగా వినిపించడం. ప్రకృతి పురుషుల ప్రణయం 'ఆత్మ పరమాత్మల ఐక్యం, మూఢ దైవభావన తిరస్కరణ. రసాద్వైతం, జీవిత సత్యాలకు నిర్వచనాలు, తనదైన వ్యాఖ్యానాలు మొదలైన అంశాలు ఈ వచన కవితల నిండా పరచుకొని వున్నాయి. విస్తృతంగా రాయడం, ప్రతీదిన్న అంశాన్ని వస్తువుగా స్వీకరించడం' సూటిగా చెప్పాలనుకోవడం వల్ల ఈ వచన కవితల్లో కొన్ని చోట్ల వచనం పాలు ఎక్కువైనట్లుగా అనిపించవచ్చు. అయితే వస్తుబలం ఆలోపాన్ని కప్పేస్తుంది.

భీమన్న వచన కవితా సంపుటులు మూడు భాగాలుగా వెలువడుతున్నాయి. మొదటి భాగం -1లో త్రిపదలు, అనాది కొస నుంచి అనంతతత్వంలోకి, మోక్షం నా జన్మహక్కు, ఓయీ కవి కవిత్వం రాయి కవితా సంపుటులు ఉన్నాయి. భాగం-2లో గుడిసెలు కాలిపోతున్నై, కేదారేశ్వరి, రాధతో ఎగ్జిబిషన్, భీమన్న ఉగాదులు, డ్రగ్ ఎడిక్టులు, భాగం -3లో గిల్లి చెబుతున్నా, చివరి మెట్టు మీద శివుడు, ఒంటరిగొంతు సంపుటులున్నాయి.

**1.** త్రిపదలు: ప్రాచీన సాహిత్యంలో ద్విపదలా ఆధునిక సాహిత్యంలో త్రిపదలను ప్రవేశపెట్టిన ప్రయోగశీలి భీమన్న. 149 త్రిపదలు ఒక రకంగా శతకంగా భావించవచ్చు.

వంగితే సవారిచేస్తుందది
సవారిచేస్తే వంగుతుంది లోకం
గుర్రమో రౌతో ఎంచుకోవే

వంటి ఆణిముత్యాలు ఎన్నో ఈ త్రిపదల్లో పొదగబడ్డాయి. లౌకిక విషయాలతో పాటు తాత్విక విషయాలూ త్రిపదలకు ఇతివృత్తాలు. ఇది 1962లో అచ్చయింది.

**2.** అనాది కొస నుంచి అనంతత్వంలోకి: ప్రేయసీ ప్రియుల పరంగా చెప్పిన తాత్త్విక కావ్యం ఇది. ఇందులో ఆత్మ స్త్రీ అయితే పురుషుడు పరమాత్మ అని కవి స్వయంగా చెబుతున్నాడు.

హేమంత నిశీథం వంటి కవితల్లో కవి వర్ణించిన ఆకాశమండలంలోని అంశాలు కవి సంప్రదాయజ్ఞతకు. గ్రహరాశుల విజ్ఞానానికి నిదర్శనం. తలా తోక లేని కాలోరగం వెన్నున కన్నులా మెరుస్తుంది వర్తమానం అని ''రైలు ప్రయాణంలో'' వర్ణించడం కవిభావుకతకు పరాకాష్ఠ.

**3.** మోక్షం నా జన్మహక్కు: వేదాంత దర్శన కావ్యం. తరతరాలుగా వస్తున్న మానవ చింతన ధోరణి Thinking Process of Man కావ్యానికి స్ఫూర్తి అని కవితకు పీఠికలో రాసుకున్నారు. మరణాంతరం ఆత్మకూడా శరీరంతో పాటు దాని మూలపదార్థంలో లయించిపోతుందనే కొత్త సిద్ధాంతాన్ని కవి ప్రతిపాదించారు. వేద సాహిత్యం అంతా నా పిత్రార్జితం అని ఢంకా భజాయించి చెప్పారు.

**4.** ఓయీ కవీ కవిత్వం రాయి: **1971**లో జరిగిన అఖిల భారత తెలుగు రచయితల ఐదవ సభల సందర్భంగా జరిగిన కవితా సమ్మేళనంలో అధ్యక్షస్థానం నుండి భీమన్న వినిపించిన కవిత. కవి కావ్య వ్యవసాయ మానవ హృదయం కావ్య మధుపాయి అంటూ నీవు కవివే అయితే నిజంగా కవిత్వం రాయి నినాదాలు మానెయ్యి అని కవులకు ఉద్బోధిస్తారు.

భీమన్న సమగ్రసాహిత్య సంపుటాలలో ఇతర సంపుటాలను ఆదరించినట్లే ఈ వచన కావ్య సంపుటాలను పాఠకలోకం ఆదరిస్తుందని నమ్ముతున్నాను.

బోయి భీమన్న గారి మొత్తం రచనలను సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతి భీమన్న గారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్, డా॥ బోయి నాగవర్మగారు అందించారు. భీమన్నగారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన సహాయ సంపాదకులు శ్రీమతి బోయి విజయేందిర, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్‌లకు కృతజ్ఞతలు.

ఈ సంపుటిని గ్రంథముద్రణకు వీలుగా శుద్ధ ప్రతిని తయారు చేయించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారికి, సహకరించిన డా॥ ఎమ్. కనకదుర్గ గారికి, శ్రీమతి సి. పుష్పలత గారికి, సకాలంలో ముద్రించి ఇచ్చిన చరిత ఇంప్రెషన్స్ వారికి కృతజ్ఞతలు.

తేది: **10-9-2010**
హైదరాబాద్

కె. సంజీవరావు

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | త్రిపదలు | 1-44 |
| 2. | అనాది కొసనుంచి అనంతత్వంలోకి | 45-213 |
| 3. | మోక్షం నా జన్మహక్కు | 214-468 |
| 4. | ఓయీ కవీ! కవిత్వం వ్రాయి | 469-484 |

# త్రిపదలు

బోయి భీమన్న

సు ఖే లా ని కే త నం
హైదరాబాదు

సుఖేలా నికేతన

ప్రథమ ప్రచురణ

**1962**

ముద్రణ

బహుజన ప్రెస్

హైదరాబాదు - **4**

ప్రతులకు:

సుఖేలా నికేతనం

**92/ 2** ఆర్.టి., విజయనగర్ కాలనీ,

హైదరాబాదు

హక్కులు రచయితవి

వెల: రూపాయి

# ఒక మాట

మొన్న నీ మధ్య, ఏదో వ్రాస్తూ వుంటే, భావం మూడు పాదాలలోనే ముగిసి పోయింది. అలానే వుంచేస్తే యేం, అనుకున్నానప్పుడు. ద్విపదలాగే త్రిపద ఎందు కుండ గూడదు? తెలుగులో ఇంతవరకు వున్నట్టు లేదు! లేకపోతే మాత్రం, ఇప్పుడు వ్రాయ గూడదా?

అలా అనుకుని, వ్రాయడం మొదలుపెడితే, ఒక వారం రోజుల్లోనే ఒక వంద స్వేచ్ఛా గీతికలైనై! అనుకోకుండానే మరో యాభై వరకు పెరిగినై! సరే, క్రొత్త ప్రయోగం కదా, ప్రకటించేద్దామనిపించింది. లేడికి లేచిందే ప్రయాణం!

ఇంతలో, ఈ విషయం విని, ఛందస్సులలో "త్రిపాది" వృత్తం వున్నదని శ్రీ వడ్లమూడివారు, కన్నడంలో ఈ ప్రక్రియ వున్నదని శ్రీ నిడదవోలువారూ అన్నారు. వాటి సంగతెలాంటిదో మరి! నేను మాత్రం ఈ త్రిపద నా సొంత సృష్టే అనుకు న్నాను!

శతకంలా వ్రాశాను వీటిని. వీటిని వ్రాసేటప్పుడు ఎందుకో మా బావగారైన శ్రీ బి.యస్.మూర్తిగారు పదేపదే జ్ఞాపకం వచ్చారు. జ్ఞాపకం వచ్చినా, స్వప్నంలో కని పించి చెప్పినా ఒకటే అనుకొని, ఈ శతకాన్ని వారికి అంకితం ఇస్తున్నాను.

ఈ త్రిపదలలోని కొన్ని భావాలతో కొందరు ఏకీభవించరని నాకు తెలుసు. అనుభవాలు వ్యక్తికొక విధంగా వుంటై. రొటీను బ్రతుకులో రాగశబలత వుండదు. మునిగితే గాని ముత్యాలు దొరకవు. సెంటిమెంటును విడిచిపెట్టి అనాసక్తదృష్టితో చూడగలవారికి, నిష్ఠూరంతో కూడినదైనా, నిజం కనిపించకపోదు. నా భావాలు సార్వ జనికాలుగా భాసించకనూ పోవు.

రక రకాల భావాలు. తోచినవి తోచినట్టు వ్రాశాను. అందువల్ల ఏ త్రిపద భావం ఆ త్రిపదదే. నిరంతరత వుండకపోవచ్చు. భావాలలో పైకి పరస్పర వైరుధ్యాలున్ను కనిపించవచ్చు.

రచయిత

## సమర్పణ

దేశం, దేశం, ప్రజ, ప్రజ - అంటూ పరితపిస్తూ
వేదమాత రాల్చిన ఒక కన్నీటి బొట్టు నుంచి
పుట్టుకొని వచ్చినవాడు శ్రీ బి.యస్.మూర్తి!

తన చుట్టూ కన్నీరు, అంటరాని పేదల కన్నీటి మున్నీరు,
తాను అందులో అవతరించిన ఒక తెల్దామర మొగ్గ,
పరిసరాల దైన్యానికి క్రుద్ధ మైన కెంబుగ్గ!

మనిషి మనిషిని తినేసే "కానిబలిజం" కంటె
క్రూరమైన మనుజ హింస జరుపుతున్న హిందూయిజం
వైదికమా? దాని పేరిట బ్రతికే పైశాచికమా?

కోపంతో ఎర్రబడి, దుఃఖంతో నల్లబడ్డ శుద్ధ సాత్త్వికమూర్తి,
విద్యార్థిగా వికసిస్తూనే బాపూజీ పిలుపందుకున్న ఆర్షస్ఫూర్తి,
దేశోద్ధరణలో హరిజనోద్ధరణను మలచిన శ్రీ మూర్తి!

సత్యాగ్రహ సంగ్రామంలో బెజవాడ ప్లాట్ఫారం మీద
సామ్రాజ్యవాదుల తుపాకి గుండ్లకు గుండెసాచి నిల్చినప్పుడు
ఆంధ్రకేసరి కేసరాలే నిక్కబొడిచినై గర్వంగా!

నేడు చస్తే రేపటికి రెండున్న తెలుగు తెగువతో
జితోవా, మృత్యోవా అన్న భారత స్థిత ప్రజ్ఞతో
జాతికి నవోదయం సాధించిన నవజీవని!

కలాన్ని కత్తిలా నడిపించిన ఉగ్రసరస్వతి!
జీవితాన్ని అఖండ విజయంగా శ్రద్ధ వహించిన భద్రకాళి,
కణం నుంచి కనకాద్రికి పెరిగిన శ్రీ సూర్యనారాయణ!

జగత్తుకే భాయి ఈ బయ్యా వంశీయి!
అట్టి సహృదయికి ఇస్తున్నా ఈ నవనూతన కృతీశ్వరిని,
అతడే భరించ గలడీ మేరలు మీరే దూకుడు నని!

రసాలిని,
భాగ్యనగరం

బోయి భీమన్న
2-12-1962

1

ఈ సౌందర్య సుధార్ణవంలో ఏకాంతంగా
నేను కోరుతున్నది నిన్ను, నీవు కోరుతున్నది నన్ను!
మనిద్దర్నీ కోరుతున్నదీ పాలవెన్నెల చెన్ను!

2

నీవూ, నేనూ, మనచుట్టూ అమృతపదార్థమూ,
ఈ త్రికమే కదా ప్రపంచం అంటే?
దాని నలుపు తెలుపు నమూనాలే యీ త్రిపదలు.

3

ఆకాశంలో ఎగురుతూ నేలపై ఎలా బ్రతకడం?
ఏదో ఒక హృదయం రథంలా అమరితే కాని
జీవిత రణరంగంలో పురోగతి ఎలా సాధ్యం?

4

నీవు నా యెదురుగా వుండగా,
బొమ్మల్ని చూస్తూ కూర్చోలేను నేను,
అవెంతటి అమర చిత్రశిల్పాలైనా సరే!

## 5

నా ప్రేయసికీ, గులాబీకీ తేడా ఒక్కటే ;
ఈమె కోరివస్తుంది, ఆమె కోరితే వస్తుంది ;
ఈమె సౌజన్యం శాశ్వతం, ఆమె సౌరభ్యం క్షణికం !

## 6

ప్రేమించాను, ప్రేమించబడ్డాను,
ఆనందబ్రహ్మలో ఐక్యంకూడ అయ్యాను ;
అయినా, ఎందుకో శరీరంకోసం ఈ తపన !

## 7

అందరి శరీరాలూ దేవాలయాలే అయితే,
అందరి ఆత్మలూ పరంజ్యోతులే అయితే,
ఫలాని వ్యక్తినే ప్రేమించా నంటాడేం మనిషి ?

## 8

చూడగా, చూడగా, నా కనిపిస్తున్నదీ –
శరీరమే సత్యం, తక్కినదంతా అసత్య మని !
అందుకే నీవూ, నేనూ ఒక్కరం కాదని !

## 9

కొన్ని శరీరాలను డబ్బిచ్చి కొనవచ్చు,
కొన్ని మనస్సుల్ని అధికారంతో ఖరీదు చెయ్యవచ్చు.
నీ ఖరీదు మాత్రం ఖరారుగా నేను !

## 10

నన్నిచ్చి నిన్ను కొనుక్కున్నాను నేను !
మనిద్దరం ఒకళ్ల కొకళ్లం బానిసలం !
సంపూర్ణ దాస్యమే సంపూర్ణ విమోచనం !

## 11

నీవూ శరీరాన్ని కోరడంలేదు.
నేనూ శరీరాన్ని కోరడంలేదు.
శరీరాలు మాత్రమే మనల్ని కోరుతున్నై !

## 12

సుఖాన్ని కోరుతున్నది శరీరం.
మడిగట్టుకొంటున్నది మనస్సు.
తన్నుకొని చస్తున్నది ఆత్మ !

## 13

అలాచూస్తా, నేమున్నదక్కడ నీవుకాని అందం ?
అలావింటా, నేమున్నదక్కడ నీకుతెలీని రహస్యం ?
అలా వెతుకుతా, నేమున్నదక్కడ నిన్నుమించిన సత్యం ?

## 14

నా కోసం ఒక కానుకను కొనదలిచావు కదూ ?
నీకు నచ్చిన వస్తువులుంటే వుండవచ్చు మార్కెట్లో.
నాకు కావలసిందేదీ అక్కడ లేదు !

## 15

నే కోరేది రత్నశిల్పాలు కాదు, నీ ఒక్క ముద్దు !
దానివల్ల ఏం లాభ మంటావా ?
ఆ సంగతి నీకెందుకు ?

## 16

గౌరవం, మర్యాద, విందు, వినోదం,
ఇలాంటి ప్రాభవాలు కాదు నే కోరేది
నీతో ఒక్కలేశం ఏకాంతం !

## 17

దాచుకుంటే పోగొట్టుకుంటావు.
ఇచ్చెయ్యడమే భద్రపరచుకోవడం;
తనను తాను వదులుకోవడమే ముక్తి !

## 18

లేకలేక మనిద్దరం కలుసుకొన్నప్పుడు.
అక్కడ మూడోవ్యక్తి ని సహించలేను నేను ;
ద్వైతాద్వైత మొక్కటే ఆనందం నాకు !

## 19

"నీవు నీవు నీవు" - అన్న నిరంతర ధ్యానం లోనే
నేను నీవై పోతున్నాను సంపూర్ణంగా ;
కర్మను కొట్టేసిన క్రియే కర్త !

## 20

వేరు లేకుండా వృక్షం ఎలావుంది ?
పునాది లేకుండా సౌధం ఎలానిల్చింది ?
నీవు లేకుండా నే నెలావున్నాను ?

## 21

ఎన్నెన్ని నదులు ఒకటిగా కలిసినా,
పెద్దదాని పేరే వస్తుంది ఆ నదికి !
ఎన్నో నీవులు కలిసిందే నేను.

## 22

ప్రపంచంలో నేనుమాత్రమే వుండాలనుకోను నేను,
నాలాంటి కోట్లమంది కలసిందే ఈ ప్రపంచం !
నా హృదయంకూడ ఒక సుప్రపంచం !

## 23

సహజ ప్రవృత్తికి సంకెళ్ల తగిలించి,
అవి తెగిపోవడాన్ని అవినీతి అంటాడు మనిషి !
నిర్బంధమేనా నీతి అంటే ?

## 24

సౌందర్యం నగ్నం, దాన్ని చూడలేడు మనిషి !
సత్యం నగ్నం, దాన్ని ధరించలేడు మనిషి !
పరబ్రహ్మ నగ్నం, దాన్ని పొందలేడు మనిషి !

## 25

నీతి – అవినీతి, మంచి – చెడ్డ, పుణ్యం – పాపం,
ప్రకృతి సిద్ధమైన స్త్రీ పురుష జంట లివి !
జంటను విడదీస్తే మిగిలేది సున్న !

## 26

రాగ శబలతను వ్యభిచారమంటాడు మనిషి !
ఏ పేరుతో పిల్చినా – ఆ మాధుర్యమే లేకపోతే
మహర్షులే వుండేవాళ్లు కాదు మనకు !

## 27

వెలు గుంటేనే నీడ వుండేది ;
వెలు గెంత తీవ్రమైతే నీడ అంత దట్టం ;
నీడను భరించ లేకపోతే వెలుగునే తీసెయ్ !

## 28

ఏది సుఖ హేతువో అదే మానవ బలహీనత !
అందుకే దాన్ని నిషేధించడం సమాజం !
అదే దాని తెరవెనక బాగోతానికి కారణమున్నూ !

## 29

నిషేధించకపోతే, పట్టపగలే చివుళ్లను మేసేస్తుంది ;
నిషేధిస్తే, చీకటిమాటున తల్లివ్రేళ్లనే కొరికేస్తుంది ;
"లాలస" ఒక నిత్య తలనొప్పి సమాజానికి!

## 30

మనోవాక్కాయ శుద్ధే మానవ జీవితసిద్ధి,
వాటిని శాపించి కృతకం చేసిన మొదటి మనిషే
మనిషిని నరకం దారి పట్టించిన ప్రబుద్ధుడు !

## 31

తిండిని కొనగలవు రత్నాలు,
తినడానికి మాత్రం పనికిరా వవి !
అలాంటివే నీతులు, లోకంలో !

## 32

రత్నాల కంటె నీతులు ప్రాచీనం,
రత్నాల కంటె నీతులు సురక్షితం,
రత్నవర్తకుల కంటె నీతివర్తకులే ధనికులు !

## 33

ఈ వొడ్డు పోతే, ఆ వొడ్డు వస్తుంది చేరువకు !
వెనక్కి చూస్తే అంతా చెడ్డే!
ముందుకు చూస్తే అంతా మంచే !

## 34

సెక్సును శీలంతో ముడిపెట్టడం తప్పు ;
ఆహార నిద్రల వలెనే సెక్సు వ్యక్తిగతం ;
సర్వజన హితాభిలాషమే సౌశీల్యం !

## 35

ధర్మరాజుకు దుర్యోధనులు లేరు,
దుర్యోధనుడికి ధర్మరాజులూ లేరు,
నీ వెలుగునీడల ప్రతిబింబమే లోకం !

## 36

ప్రేమతో చూస్తే గులాబీ పూలతోట,
ద్వేషంతో చూస్తే రాళ్లగుట్ట, ప్రపంచం !
నీవు ఏది విసిరితే అదే నీకు తగులుద్ది !

## 37

నూటి కొక మంచివాడున్నా చాలు,
ఆ సమాజం మంచిదాని క్రిందే లెక్క ;
నూటికొక పువ్వున్నా అది పూలతోటే !

## 38

శకుంతల పుట్టే వరకూ మేనక ప్రియురాలే విశ్వామిత్రుడికి,
భరతుడు కడుపున పడేవరకూ, శకుంతల
ప్రాణమేదుష్యంతుడికి;
"స్త్వైరిత" ప్రియమే, దాని ఫలితమే దుర్భరం మానవుడికి !

## 39

పువ్వును చూస్తే పుణక బుద్ధి వేస్తుంది,
బ్రహ్మకైనా, వాడి అమ్మకైనా, లోకంలో!
"స్వ"ఒక్కటే స్వామిని ఏ స్వామి కైనా !

## 40

ప్రపక్తలు పుట్టనీ, భగవంతు డవతరించనీ,
సత్యం సత్యమే లోకంలో –
స్వార్థం ముందు, పరమార్థం వెనక, మనిషికి !

## 41

శత్రువు శత్రువూ కాదు, మిత్రుడు మిత్రుడూ కాదు,
ఎవ్వరికీ, ఎల్లప్పూడూ ప్రపంచంలో,
ఎల్లప్పుడూ వుండేది ఒక్కటే-అది స్వార్థం !

## 42

స్వార్థం లేకుండా వ్యక్తి లేడు.
వ్యక్తి లేకుండా సమాజం లేదు,
సమాజం లేకుండా భగవంతుడే లేడు !

## 43

అన్నమే పరబ్రహ్మ, ఆకలే బ్రహ్మ జిజ్ఞాస,
ఆకలి కింత అన్నమే ఆనందసిద్ధి,
కోటి విద్యలూ కూటికోస మన్నదే సత్యం !

## 44

తనకు లేదనీ, ఎదుటివాడి కున్నదనీ ఏడుస్తూ
పైకి అరుస్తాడు "అవినీతి" అంటూ, లౌక్యుడు !
వ్యాఘ్రం కంటె గోముఖవ్యాఘ్రం ప్రమాదకరం !

## 45

గోవు గడ్డి తింటుంది. వ్యాఘ్రం మాంసం తింటుంది.
ప్రతిజీవికీ ఒక విశిష్ట స్వభావం వుంది;
మనిషి ఒక్కడే గోముఖ వ్యాఘ్రం!

## 46

కుక్క సంతకు వచ్చినట్టే మానవుని బ్రతుకు,
తెలీదు ఎందుకు వస్తాడో, ఎందుకు పోతాడో ;
మధ్యలో తిండికోసం ఎంత కొట్లాట ! ఎంత రగడ !

## 47

పుడతాడు, బ్రతుకుతాడు, చస్తాడు, అంతే !
అంతకన్నా ఏముంది ప్రత్యేకత అతడిలో ?
మానవజన్మ ఉత్తమ మనేది మిథ్యావాదం !

## 48

నీతిని చెడగొట్టేదీ లోకమే,
నీతి చెడిందని గోలపెట్టేదీ లోకమే,
వ్యక్తి ఒక ఎలుక–ఈలోకం పిల్లికి !

## 49

కుడితే తేలు, కుట్టకపోతే కుమ్మరి పురుగు,
మంచీ చెడ్డా కూడ పనికిరావు లోకానికి ;
బోనులో వున్నా, సింహంలా బ్రతుకు!

## 50

మిరియపుగింజ మిట్టలపై బ్రతికే కోట్లాది జీవుల్లో
ఒక అణువు తొడగొట్టి సవాలు చేస్తున్న దెవరిమీదో !
నవ్వు వస్తున్నది మానవుని ప్రతాపం చూస్తే !

## 51

మనిషికి కావసింది యుద్ధమూ కాదు, శాంతీ కాదు ;
నిరంతర కృషిలో క్షణక్షణ ప్రవర్ధమానత !
పనిలేని శాంతి యుద్ధం కన్న భయంకరం !

## 52

నీ యింట తిని, విశ్రమించి నప్పుడే,
నీ యింటి వాసాలు కనిపిస్తాయి మనిషికి !
వాటి నతడు లెక్కపెడితే, ఎందు కంత కోపం ?

## 53

వంగితే సవారి చేస్తుంది.
సవారి చేస్తే వంగుతుంది, లోకం !
గుర్రమో, రౌతో, ఎంచుకో నీవే !

## 54

పనిచెయ్యి, ఫలితం కోరకు- భగవదాదేశం,
పనిచెయ్యకు, ఫలితం కోరు- మానవ స్వభావం ;
పర్యవసానం - నిరంతర దేవదానవ యుద్ధం !

## 55

తన మాటను తానే నమ్మని జీవి -
తన పని తనకే నచ్చని జీవి -
తన వ్యూహకు తానే బెదిరే జీవి - మనిషి !

## 56

ఐశ్వర్యం కలవాడే అందగాడు,
అధికారం కలవాడే మేధావంతుడు,
రెండూ లేనివాడు మందిలో ఒకడు !

## 57

కుక్కా, మానవలోకమూ, స్వభావంలో ఒక్కటే,
పారిపోతే తరుముతుంది.
తిరగబడితే పారిపోతుంది !

## 58

బలవంతుడే రాజన్నది సార్వకాలిక సత్యం.
రాజు కన్న బలవంతు డొక్క మొండివాడే !
మొండివాళ్ళలో శతమొండి కళాశీలి !

## 59

బలవంతుడే రాజు, బలవంతుడే భగవంతుడు,
ఏ యుగంలోనైనా, ఏ పేరుతో పిలవబడినా !
ఆధిక్యత కావలిస్తే బలం సంపాదించుకో !

## 60

రసాభాస రసమే, దాని స్థాయిభావం మృత్యువు ;
శూన్యం పదార్థమే, దానిగుణం నకారం ;
దొంగా మనిషే, అతడి ఉనికి స్వార్థం !

## 61

రాజకీయమేనా, సాంఘికమేనా, ఆర్థికమేనా, జీవితం ?
అంతకు మించి మరేం లేకపోతే,
వచ్చిన దారినే తిరిగి పోదాం పద !

## 62

పైకి పోయే కొలదీ బరువు పెరిగేది ఔన్నత్యం కాదు ;
క్రిందికి పడేకొలదీ తేలికయేది పాతిత్యమూ కాదు ;
బరువును బట్టి కొలవకు మానవతను !

## 63

ఈ నిరాలంబ నభోంతరాళంలో
ఏది పైని ? ఏది క్రింద ?
నీ కేసి వస్తే పైకి ! నీ నుంచి పోతే క్రిందికి !

## 64

వంచన చేసి అహల్యను పెళ్లాడిన వృద్ధుడు
అధికారంతో శపించ గలడంతే !
ఔదార్యంతో క్షమించ లేడు !

## 65

నాతిని రాతిని చెయ్యడం తేలికే,
నాతిని నవనీతం చెయ్యడమే గొప్ప !
రాతినే నాతిని చెయ్యగలిగితే – !

## 66

ప్రేమకూ పెండ్లికీ ఏమిటి సంబంధం ?
పైకి చేదుకునేది ప్రేమ, క్రిందికి లాగుకునేది పెండ్లి ;
రెండింటికీ సమన్వయం త్రిశంకు స్వర్గం !

## 67

ప్రేమ ఎద్దు, పెండ్లి దున్నపోతు,
రెంటినీ పూన్చకు జీవిత శకటానికి !
శివుడు కాలేకపోతే, యముడైనా కావాలి మనిషి !

## 68

ప్రేమిస్తే పెళ్లాడ వద్దు,
పెళ్లాడ దలిస్తే ప్రేమించ వద్దు,
రెండు కత్తు లొక వొరలో ఇమడవు !

## 69

ప్రేమ ఆత్మానుభూతి, పెళ్ళి విధ్యుక్త ధర్మం,
రెండూ రెండు నేత్రాలు జీవితానికి;
రెంటినీ కలిపి ఏకాక్షివి కాకు !

## 70

స్త్రీ పురుషులు పెళ్లికి ముందు ద్వైతం,
పెళ్లయిన క్రొత్తలో అద్వైతం,
పిల్లలు పుట్టిన తరువాత విశిష్టాద్వైతం !

## 71

పెళ్లికి ముందు నందన వనంలో ఊర్వశి,
పెళ్లి తర్వాత వంటగదిలో దాసి,
ప్రేమ పేరిట దౌర్జన్యానికి పతాక !

## 72

ఒక గొడుగు క్రింది కిద్దరు చేరడం పెండ్లి,
గొడుగు కామ పట్టుకోవడం పెత్తనం ;
విషాన్నో, అమృతాన్నో మధించి తెచ్చేదా కామే !

## 73

నిద్రమొగం వాడే ఇద్దరు పెళ్లాలను కోరడం,
మరో పని లేని సోమరిపోతుకే
ఇతరుల సెక్సు బ్రతుకును గురించిన పరిశోధన !

## 74

అమృతమూ, విషమూ తానే అయిందేది ?
స్వర్గమూ, నరకమూ తానే అయిం దేది ?
స్త్రీ ! స్త్రీ ! స్త్రీ ! ముమ్మాటికీ – స్త్రీ !

## 75

నిన్నెప్పుడూ, ఏదో అనాలనే వుంటుంది నాకు !
ప్రేమించాలి, ద్వేషించాలి, దూషించాలి, భూషించాలి !
అదే నా అన్వేషణ ! అదే నా ఆరాధన !!

## 76

ఉద్యోగాలు చెయ్యనీ, రాజ్యాలు పాలించనీ,
స్త్రీ స్త్రీ యే, పురుషుడు పురుషుడే ఏకాంతంలో !
వట్టి శరీరాలు ! నగ్న హృదయాలు ! శూన్యచిత్తాలు !

## 77

పగలూ, రాత్రీ రాధా కృష్ణులు';
క్రిందా, మీదా పడుతూవుంటూ రెల్లప్పుడూ !
పైనున్న వారిదే ప్రతాపం ఆ కాసేపూ !

## 78

దాచుకోకు, ప్రియా, ఎందుకా భయం ?
దేన్ని, ఎందుకు, ఎవరి నుండి దాచుకోనడం ?
దిగంబరత లేనిదే, చిదంబరత రాదు !

## 79

నగ్నంగా తనను తానే చూచుకోలేని వాడు
నగ్న సత్యాన్ని ఎలా చూడగలడు ?
మనిషికి ఆనందం అలంకారాలు మాత్రమేనో ?

## 80

నీవు, నేనూ ఒక్కటి కావాలంటే
నేను నీలోనో, నీవు నాలోనో కలవాలి !
మనిద్దరం మరొకరిలో నైనా కలవాలి !

## 81

కల్లోలంగా ప్రవహిస్తున్న కాలస్రవంతిలో
లోని లోతువా, మీది తరంగానివా నీవు ?
నీవేదైతే, నేనూ అదే !

## 82

ఎందుకీ సంయోగ వియోగ భావ సుఖదుఃఖాలు ?
శారీరకమైతే, అది సంయోగమే కాదు,
ఆత్మీయ మైతే, దానికి వియోగమే లేదు.

## 83

సర్వమత వేదాంతాల సారమూ చెప్పేస్తున్నా నిదిగో !
మతం సాంఘికనీతి, వేదాంతం ఆత్మనీతి,
రెంటినీ అధిగమించిందే బ్రహ్మనీతి !

## 84

నా మనస్సుకు నా ముఖమే అద్దం,
నా వాక్కుకు నా కవితే రంగం,
నా క్రియకు నేనే రూపం !

## 85

మర్మాలు, ధ్వనులూ, సంజ్ఞలూ కిట్టవు నాకు ;
చెప్పేదుంటే చెప్పేస్తాను నగ్నంగా,
వినేదుంటే విను సావధానంగా !

## 86

ఒక్కటిలా కనిపించే లోకం ఒక్కటి కాదు నిజంగా,
వ్యక్తి ఒక కేంద్రంగా అనంతలోకాల మిశ్రమం అది ?
ఏ వ్యక్తి లోకానికావ్యక్తితోనే సృష్టి స్థితి లయాలు !

## 87

మనిషి తానే తన లోకానికి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు,
తాను వలచింది గంగ, తాను మునిగింది రంభ !
అందుకే విశృంఖలత్వంలో అంత ఆనందం !

## 88

నాతో పుట్టి, నాతో పోయే నా లోకానికి
భగవంతుడైన నాకు
ఆత్మానందం కాక మరేమిటి ప్రధానం ?

## 89

బ్రహ్మవిద్య బ్రహ్మ విద్యేం కాదు చెప్పడానికి,
అందరకూ గురువొకడే గోపాలుడు,
ఉపరతి మాత్రం ఎవరిది వారిది !

## 90

సాక్షాత్తు అర్జునుడే పొందలేని మోక్షం
సాధ్యమే కేవల గీతాధ్యయనానికి ?
కన్నడు కాకుండా నరుడు కాలేడు పరుడు ;

## 91

అనుభవ రత్నభాండాగారం అనుభూతి,
అనుభూత్యాస్వాద మేఘం కారుణ్యం,
కన్నీరు మున్నీరైనప్పుడే జీవ బ్రహ్మైక్యం.

## 92

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ లక్ష్యంగా పుట్టిన కృష్ణుడు
ఒకటైనా సాధించ గలిగాడా చివరకు ?
భగవంతుడూ కర్మబద్ధుడే, స్వతంత్రుడు కాదు !

## 93

విచారించకు, దేవీ, విచారించకు దేనికీ !
కర్మను కడిగేసే శక్తి లేదు కన్నీటికి ;
కర్మ స్వయంభువు, కన్నీరు పొల్కడలి మాత్రం!

## 94

మనిషి ఏమీ చెయ్యలేడు మరో మనిషిని,
భగవంతు డెందుకో, ఏదో చేస్తే-
దాని కర్తృత్వం వహించి అహంకారిస్తాడంతే !

## 95

మనిషిని చూచి భయపడకు, ప్రియా !
అతడెందులోనూ నీ కంటే అధికుడు కాదు ;
జీవితంలో నీ జయం నీ చేతి లోదే !

## 96

మృత్యువును మించి జరిగే హానీ లేదు,
మృత్యువుకు జడిసి లాభమూ లేదు జీవికి !
ఇంకెందుకో మరొకరికి భయ పడడం !

## 97

ఒక రథం పోతే మరొక రథం, విజయ వ్రతుడికి ;
సంసార సంగ్రామంలో కూడా అంతే !
శరీరం సాధనమే, ఫలితార్థం కాదు !

## 98

రంగం  మీది నటుడు నిష్క్రమించి ఎక్కడికి పోయినట్టు ?
తెలుసునా తెరవెనుకటి వేషాలగది సంగతి ?
అతడేవేషంలో వస్తాడో రేపు ! గుర్తించలేం !

## 99

బాణం కాదు పెద్దపులిని చంపినట్టిది.
ఆ వెనక ఎక్కడో దాగివున్న వేటకాడు !
అకర్తృక వాక్య మీ అద్భుత జగత్తు !

## 100

ప్రాచీనత త్రవ్వుకొంటూ శ్మశానంలో బ్రతికేవాడికి
లభించేది శైథిల్యం. జీవపదార్థం కాదు ;
పునాది రక్ష్యమే ; ఆరాధ్యం కాదు !

## 101

భగవత్ప్రార్థన అవసరమే మనిషికి;
అయితే, అది భగవంతుడి బాగు కోసమా ?
తన అహంకార వ్యాధికే ఔషధం అది !

## 102

భగవంతుడు కోరేది వట్టి భజన కాదు,
తా నిచ్చిన పనిని చక్కగా నిర్వహించడం,
తండ్రి కోరేది బిడ్డల ప్రయోజకత్వం మాత్రం !

## 103

ఎందుకు వచ్చాను నే నీ లోకం లోకి ?
ఏమిటి పట్టుకుపోతున్నా నిక్కడ నుంచి ?
నా జీవిత సంపాదనలో అలాంటి దేముంది ?

## 104

గృహం, కుటుంబం, పదవి, ఐశ్వర్యం,
అన్నీ ఒక హంగు – నా చుట్టూ, నా బ్రతుకు కోసం !
పరిధి ఎంత పెరిగినా, కేంద్రం అంతే !

## 105

వద్దు ప్రేమ, వద్దు శృంగారం, వద్దు సెక్సు ;
రేపటి సమాజం ఒక కర్మాగారం ;
కావలసిం దొక్కటే – పని, వేతనం, తిండి !

## 106

రాతి మనిషికీ రాకెటు మనిషికీ లక్ష్యం ఒక్కటే, సుఖం ;
ఆ నా డది భూమిపై దొరికేది,
ఈ నా డది గగన కుసుమ మయింది !

## 107

కూర్చుని తినేవాడు పూర్వం మనిషి,
నిలబడే తింటున్నాడీ మెషీను కాలంలో ;
పరిగెడుతూ తింటాడికరాకెట్ యుగంలో;

## 108

మనిషి వేగం పెరిగి, విశ్రాంతి తరిగింది,
విశ్రాంతి తరిగి, సుఖం విరిగింది,
సుఖం విరిగి, దుఃఖం వెల్లివిరిసింది !

## 109

అధికారం కావలిస్తే రాజకీయాలలో దిగు,
ధనం కావలిస్తే వ్యాపారం నడువు
సుఖం కావలిస్తే వ్యవసాయం చేసుకో !

## 110

సుఖం అనే దెక్కడో లేదు. అది నీ నీడే !
అది పెరిగే కొలదీ వ్యక్తిత్వం తరుగుతుంది !
నీడ తొలగనిదే స్వయంప్రభ లేదు !

## 111

ప్రకృతి తన గాలానికి గ్రుచ్చిన తియ్యటి ఎరే
స్త్రీకి పురుషుడు, పురుషుడికి స్త్రీ !
మ్రింగిన తరువాత గాని తగులుకోదు ముల్లు !

## 112

అభీష్ట మేదో సద్యః ఫలంగా పొందక
ఎందుకీ నమూనాల చిత్రహింస ?
అందరూ వ్యాసాదులు కావడం కిట్టక నేమో !

## 113

వందమంది పెళ్లాలున్నా సంతానం వుండదు కొందరికి,
ఒక్కర్తా లేకుండానే పిల్లలు పుట్టేస్తారు కొందరికి !
ఎవరి పిల్లలైనా తన పిల్లలే ప్రకృతికి !

## 114

పులినీ, మేకనూ సమంగా పెంచే ప్రకృతికి
సరాసరి వారసురాలు కదా స్త్రీ ?
ఎందుకో, మరి, ఈ స్వపర భేద విద్వేషం !

## 115

తన పిల్లల్ని లోకమంతా ప్రేమతో చూడాలి.
తన అక్క పిల్లల్ని కూడ తాను దయగా చూడదు !
పిల్లల్ని కన్నా, మాతృదేవత కావడం లేదు స్త్రీ !

## 116

అద్దం ముందు నిక్కి నీల్గుతుంది ముఖం,
ముఖం వెనుక వెక్కిరిస్తుంది అద్దం,
ఆ రెంటికీ మసి పూస్తుంది కాలీపర్సు !

## 117

క్రింది వాడికి న్యాయం చెయ్యలేని వ్యక్తి
పై నుంచి న్యాయాన్ని ఆశించడం వ్యర్థం !
తన కొకరు క్రింద, తాను మరొకరికి క్రింద ;

## 118

మురికిని తొలగించేవాడు ముకిరివాడే అయితే,
చీకట్ని తొలగించేవాడు సూర్యుడెలా అవుతాడు ?
పాపాన్ని తొలగించేవాడు పాపి ఎందుక్కాడు ?

## 119

ప్రజలు చెప్పినట్టు చేసేవాడే మంచినాయకుడు,
పెళ్లాం చెప్పినట్టు వినేవాడే మంచి సంసారి,
నలిగిన దారిని నడిచేవాడే మంచి సామాజకుడు !

## 120

జీవితం ఒక అకౌంటు పుస్తకం,
ఒకటి రెండు తప్పుల్ని దిద్దుకోవచ్చు అందులోనే,
అన్నీ తప్పులే అయితే, పుస్తకాన్నే మార్చక తప్పదు !

## 121

పది గ్రంథాలను ఒక్కసారి చదివే కంటె,
ఒక్క మంచిగ్రంథాన్ని పదిసార్లు చదువు !
ఒక్క జీవమంత్రాన్ని వందసార్లు పఠించు !

## 122

శక్తికీ, అశక్తికీ ఒకటే "క్యూ" వా ?
ఆకును దాటి పువ్వు పైకి పోకపోతే ఎలా ?
కొండవాగు ప్రగతికి బండరాయి ఏడ్చి ఏం లాభం ?

## 123

జీవిత మనేది ఎప్పుడైనా ఎవరికైనా విషాదాంతమే ;
సంతోషారంభమూ, విషాదాంతమూ అది ;
జీవితాన్ని దాటి జీవించడమే శాశ్వతానందం !

## 124

అపకారం చెయ్యగలవాడు సన్నిహిత మిత్రుడే.
ప్రక్కలో బల్లెం కాగలది నమ్మిన భార్యే.
స్వార్థం వున్నప్పుడు ! దాని తోక త్రొక్కి నప్పుడు!

## 125

సర్వమానవ సర్వబాధా నివారణకు
ఒకే ఒక మందు చెప్పనా ?
కడుపు నిండా తిండికి గ్యారంటీ !

## 126

ఎక్కడో పుట్టి ఎక్కడో తిరిగి, ఎక్కడికో పోతుంది తుమ్మెద ;
అక్కడే పుట్టి, అక్కడే విరిసి, అక్కడే రాలిపోతుంది పువ్వు ;
ఎవరి పరిధి వారిది, దేని విధి దానిది !

## 127

అంత అందమైన పూదోట మనసు
ఎంత ఆకుల పాటుగా వుందో చూడు !
ఆ పాదా లెంత మురికిగా ఉన్నై !

## 128

ఈ నా డందరూ ప్రేమ అంటున్నది ప్రేమకాదు, నిజానికి,
ఆకర్షణ, మోహం, మమకారం–ఇత్యాదు లది !
స్వార్థరహిత వివశాత్మక సేవే ప్రేమ !

## 129

మనిషి మంచిగా, గొప్పగా బ్రతకడం కష్టమేం కాదు,
తన చుట్టూ వున్న దంతా స్వార్థమే నని గుర్తిస్తే !
తాను మాత్రం దాని కతీతంగా జీవిస్తే !

## 130

మనిషిని మరణం కంటే ఎక్కువగా బాధించే దేది ?
ఒకసారి రుచి చూచిన అధికారం పోవడం !
అధికారం స్వర్గం కంటె మధురం !

## 131

మానవలోకాన్ని పాలించాలని వుందా యేం ?
అయితే, పర్వతాలను భోజన రాశులుగా,
సముద్రాలను నీరాగా మార్చు !

## 132

నీతికీ, అవినీతికీ తేడా యేం లేదు –
తనకు దక్కిన సుఖం నీతి,
మరొకడికి దక్కిన సుఖం అవినీతి !

## 133

ఎవ రెన్ని చెప్పినా - అసలు రహస్యం ఇంతే -
జీవించడం ఒక్కటే జీవిత పరమార్థం !
ఆహారం ఒక్కటే సజీవనీతి !

## 134

నీతులకేం - శతకాలకు శతకాలే వున్నై ;
స్వర్గంలో రంభలూ నరకంలో యమభటులూ లేరా ?
నరుడు మాత్రం ఆ వానర వంశీయుడే !

## 135

ప్రేమ దివ్యమూ, భవ్యమూ అయితే,
ప్రేమ భగవత్ స్వరూపమే అయితే,
ఎందుకు మరి దాని కోసం ద్వంద్వయుద్ధాలు !

## 136

తన సుఖం కోసం మరొకర్ని దుఃఖపెట్టేది ప్రేమేనా ?
ఇద్దరు వ్యక్తులు అసూయతో కొట్టుకు చచ్చేది ప్రేమేనా ?
మరెవ్వరినీ చేర నివ్వని హృదయం లోది ప్రేమేనా ?

## 137

అది ప్రేమో, స్వార్థమో తెలుసుకోవాలని వుంది కదూ ?
అవ్యాజమైన ఆరాధన కలది ప్రేమ !
అసూయా ద్వేషాలతో పీడించేది స్వార్థం !

## 138

స్వార్థం తప్పుకాదు, అది సృష్టికే మూలభూతం !
నేను, నాది, నాకు - అనేదే సృష్టిచరిత్ర !
దాన్ని గుర్తించక పోవడం లోనే వుంది ప్రమాద మంతా !

## 139

పండితుడు, పామరుడు, సంసారి, సన్యాసి, - ఎవరికైనాసరే
బిరుద నామాలతో పిలిస్తేనే ఆనందం !
దురదపై వేడినీళ్లు పడితేనే సుఖమూ, శాంతీ !

## 140

అసత్యాన్ని సత్యంగా పూజిస్తున్న లోకానికి
నిజం నిష్ఠూరమే అవుతుంది ;
వాస్తవం దుర్భర మైనప్పుడు స్వప్నమే ఆరాధ్యదైవం !

## 141

నిర్భయంగా, నిష్పక్షపాతంగా
సార్వజనిక సత్యం చెప్పేవాడే ఋషి !
ఋషుల్ని బాధించేవాళ్లు రాక్షసులు మాత్రమే !

## 142

పరీక్షలూ, పరిశోధనలూ ఆత్మ కింపుగా వుండవు.
భావి సుఖానికి మాత్రం సోపానాలవి !
నిగ్రహం వుంటేనే పరమ పదానికి చేరుకోవడం !

## 143

అవ్యాజప్రేమ కుదరనే కుదరదు సాధారణంగా;
అది కుదిరిన చోటనే పరమేశ్వరుణ్ణి పొంద లేక పోతే
జన్మలో ఇక అది సాధ్యం కాదు.

## 144

నిన్ను నీవు నా కర్పించేసుకున్నావు, సరే !
ఎందుకు నా సుఖం కోసం ఆ త్రిప్పలు
ఎంత పంకం తరించి, ఈ మధువు తెచ్చావో నా గురించి !

## 145

వెంకటేశ్వరుడి గుడి అరుగుపై కూర్చుని
నీవు రాల్చిన ఆ జాలి కన్నీటి బిందువులే
ఈ ఆనంద విశ్వగోళాలు నా ముందు !

## 146

సహజసిద్ధమైన రేడియో సెట్టు ఈ మెదడు ;
ఆనుచేసి ట్యూను చెయ్యి ఏదో ఒక కేంద్రానికి ;
లభిస్తుంది వాణీవాద్యమో, లక్ష్మీగాత్రమో !

## 147

కారు మబ్బులు, శీతగాలులు, చిమ్మ చీకట్లు,
చుట్టుముట్టి ముట్టడించనీ, భయంలేదు !
నా కిప్పుడు ;
నా వెలుగు బైటిది కాదు, లోనిది !

## 148

ఒక పని ముగింపే మరో పనికి ప్రారంభోత్సవం !
ఎడతెగని పనుల పూర్ణ ప్రణాళికే జీవితం !
అసలు, జీవితమే ఒక పని ఈ అనంత క్షేత్రంలో!

## 149

అమృతం గ్రోలి, నీ హస్తకములాన్ని గ్రహించి,
ఇలా అనంతకాలం విహరించగలను ఈ విశ్వంలో !
అసంఖ్యాకంగా పద్యాలు పాడ గలను ఈ కంఠంతో !

❋ ❋ ❋


అనాదిక్రోసనుంచి
అనంతత్వంలోకి
బోయి భీమన్న



సాహితీలత

ప్రథమ ఫలం

**1962**

తొలిముద్రణ

శుభకృత్

శ్రావణ

శుద్ధ సప్తమి, మంగళవారం

హక్కులు

రచయితవి

మూల్యం

**4.00**

# నమస్కారం, స్వాగతం!

సామాన్యం, వైజ్ఞానికం, ఆధ్యాత్మికం – ఈ మూడు జ్ఞానం యొక్క అంతస్తులు.

ఒక సామాన్యుడు, ఒక విజ్ఞాని, ఒక తత్త్వవేత్త – ఈ ముగ్గురూ ఒక ఉద్యానంలో ప్రవేశించినప్పుడు – దాని అంద చందాలను, పూలను, పండ్లను, తేనెలను సమానంగానే అనుభవించినప్పటికీ, ఏతదనుభవానంద స్థాయిలో అంతస్తులు వేరు వేరుగా వుంటాయి.

ముగ్గురూ సహృదయులే. వారి ఆనంద స్థాయి మాత్రమే వేరు.

సహృదయులు కనుకనే ఉద్యాన శోభను అనుభవించి, తన్మయులు కాగలగడం. అదే ప్రకృతి సౌందర్యారాధన.

అనాది కొస నుంచి అనంతత్వం దాకా పరివ్యాప్తమైవున్న ఈ ప్రకృతిలీలలో సర్వకాలాల, సర్వదేశాల సమస్తోద్యానాల రసభావ సౌందర్య సమాహార స్వరూపమే కవితోద్యానం.

పై మూడు అంతస్తులవారూ కవితోద్యానంలో విహరిస్తారు. ఆనంద పారవశ్యం పొందుతారు.

ఉద్యానం బాహ్యం. కవితోద్యానం అభ్యంతరం. బాహ్యాభ్యంతరాలను సమన్వయించి, ఒక లయలో నడిపించడమే నిజంగా జీవించడం. లయాన్విత జీవిత పారమ్యమే ఆనందం. అదే బ్రహ్మ.

ఇక ప్రస్తుతం–

ఈ నా చిన్న కవితోద్యానంలో ప్రవేశించే సహృదయులకు నమస్కారం, స్వాగతం!

ఇందులోని ప్రేయసి కేవలం ప్రేయసి. ప్రియుడు కేవలం ప్రియుడు. ప్రేయసికి ప్రియుడు సాక్షాత్తు భగవంతుడు. ప్రియుడికి ప్రేయసి సాక్షాత్తు భగవతి.

నేను ఆత్మ, నీవు పరమాత్మ.

ఆత్మ స్త్రీ అయితే, పరమాత్మ పురుషుడు. ఆత్మ పురుషుడైతే, పరమాత్మ స్త్రీ.

కాగా–

నీవు అన్నప్పుడు – ఆ నీవు ప్రియుడు కావచ్చు, ప్రేయసి కావచ్చు, సందర్భోచితంగా.

సర్వప్రకృతీ అర్ధనారీశ్వర కల్పనా చమత్కృతే!

ప్రకృతిలోని సర్వసౌందర్య కళాస్థానాలూ స్త్రీలో నిక్షిప్తాలు.

క్రింద స్త్రీ పురుషులు. పైని తారా చంద్రులు. వీరి మధ్యగల సంబంధ బాంధవ్యాలే వివిధ ఋతు సంయుత కాలలీల, జీవలీల, విశ్వలీల.

వర్షర్తువులో "చెలరేగిన ప్రకృతి" శరదృతువులో శాంతించి, ప్రసన్నమవుతుంది.

"రేయి"లో స్వర్ణది చుట్టూ నల్లరేవడి పొలంలా వుంది ఆకాశం. నక్షత్రాలే పండిన ప్రత్తిపువ్వులు. గొర్రెల మంద మేషరాశి. ఆ ప్రాంతమంతా గోలోకం. ఆకాశంలో పాలసముద్రం నుంచి దివిజ గంగ విడిపోయే ప్రాంత మది. కార్తీక శుక్ల విదియ నుంచి పౌర్ణమి వరకు ప్రవర్ధ మానమయే రేయి ఇది.

"హేమంత నిశీథం"లో ఆ ఋతువులోని ఆకాశమండలం వర్ణితం. కాల పురుష మండలం (ఓరియన్) పైని మంగలికత్తిలా వుంది కృత్తిక. ఓరియన్‌లోదే ఆర్ద్ర. ఇదే శివుని మూడో కన్ను. దాని కవతల శకటాకారంలో రోహిణి, ఇవతల పార్వతీ పరమేశ్వర రూప పునర్వసు. తర్వాత తొండవలె పుష్యమి, ఆ ప్రక్క సర్పాకారంలో ఆశ్రేష వున్నై. ఒక ప్రక్కగా మృగ వ్యాధ రుద్ర (సిరియస్) నక్షత్రం వుంది. దీనినే కాలభైరవ మూర్తి అన్నాను. ధానుష్క మూర్తి మన్మథుడు లేని శూన్య మాసమిది. విరహం గాక మరేముంది?

ఫాల్గున పూర్ణిమ "ఫాల్గుని". పొగమంచు పడగలు ఆశ్రేష. సింహం సింహరాశి. దాని తోకలోది ఉత్తర. అయినా, దాని మూడు పాదాలు కన్యలోవే. కన్యకు మరోపేరు రోదసి. వైశాఖ పూర్ణిమ వైశాఖ. దాని ముందు నడుస్తున్న సఖులు ఫాల్గుని, రోదసి.

దివ్యపల్యంకిక, పెద్ద ప్రశ్న గుర్తు, సింహాసనం – వంటివన్నీ సింహరాశి సూచకాలే.

చిత్రా విశాఖలు పూర్ణచంద్రుడితో వుంటే, చైత్ర వైశాఖ మాసాలు. అవే సూర్యుడితో వుంటే చిత్తకార్తె, విశాఖ కార్తె. కృత్తిక పూర్ణ చంద్రుడితో వుంటే కార్తిక

మాసం. అది సూర్యుడితో వుంటే కత్తెర కార్తె. భూమిపై ప్రతి మార్పుకూ సూర్యచంద్ర తారాగతులే హేతువులని "ఆనంద" భావం.

కవి, విమర్శకుడు, సహృదయుడు – బ్రహ్మ, రుద్ర, మహావిష్ణువులు. ఈ ముగ్గురూ ఒకే ఒక మూర్తి. గంగ విష్ణు పాదోద్భవ. అక్కడే హంస వుంది. ఆకాశంలోని దివ్యదృశ్యం ఈ "అక్షరగంగ".

మృత్యుతీరం వదిలి జీవనతీరానికి రాక "ఇవతలి వొడ్డుకు".

నాదం పుట్టుక వీణా మండలంలో. ప్రతి తారా ఎటో ఒకటు పయనిస్తూనే వుంది – ఏ తీర్థ యాత్రకో.

మనది జలగోళం. జలం బద్ధకించి జడమైన లంకలు భూఖండాలు.

సూర్యచంద్ర తీరాల నడుమ హంస సుషుమ్న నాడి.

"గాలిపటం"లో రేవతి మీనరాశిలోది. ఆ ప్రక్కది (శ్రవణం) గరుడమండలం.

రైలు అభిసారిక, దాని సంకేతం అభిజిన్నక్షత్రం. సౌరకుటుంబం సిద్ధమైన కాలానికి గమ్యం అదేనంటారు సైంటిస్టులు.

ఈశ్వరత్వం ఐశ్వర్యం.

ఆషాఢభూతి, మేషాండుడు (ఇంద్రుడు) కలిసిన వాడు మేషాండ భూతి. బడా చుక్క సూర్యుడు.

అక్కడ ఆమెలో కలిగిన క్షణమాత్ర స్పందనకు ఇక్కడ ఇతనిలో ఒక రేయి రేయంతా కలిగిన ప్రతిస్పందన వర్ణితం "తెల్లారిపోయింది"లో.

ఆశావాదానికి రథం "మనోరథం".

వైశాఖ పూర్ణిమే రాధాపూర్ణిమ.

నెలవంక గంప నిండుతూ వచ్చి పూర్ణిమ అయింది. జాబిల్లి రబ్బరు బిళ్ళ అరిగీ అరిగీ ఆమావాస్య అయింది!

గీత ననుసరించే లోకం నడుస్తున్నది. ఇదే ''గీతా రహస్యం''. అందుకు కారణం లోకాన్ని అనుసరించి గీత చెప్పబడడం. నిత్యకర్మాచరణలో క్షణక్షణం కర్మ పరిహారమైపోతూ, చివరకు జీవికి విముక్తి లభిస్తుంది. ఈ నిత్య సత్యం తెలిస్తే మంచిది. తెలియకపోతే బాధలేదు. గీతను మించిన వ్యావహారిక సత్యం మరిలేదు లోకంలో.

తత్త్వవేత్త ద్వైతం నుంచి అద్వైతానికి పోతాడు. అతడిది తిరోగమనం. అది పైకి.

కవి అద్వైతం నుంచి ద్వైతంలోకి వస్తాడు. ఇతడిది పురోగమనం. ఇది క్రిందికి.

అతడిది నిర్గుణారాధన.

ఇతడిది సగుణారాధన.

అది నివృత్తి.

ఇది ప్రవృత్తి.

ఇదే ద్వైదీలీల.

ఇలానే అనేకం.

కవిత ఒక లయలో పుట్టుక వస్తుంది. లయ ప్రధానంగా పుట్టినట్టిది ఛందస్సు. ఛందోబ్రహ్మ అవాఙ్మానస గోచర సచ్చిదానంద మూర్తి.

ఏమి వ్రాసినా, ఎలా వ్రాసినా, అది ఏదో ఒక ఛందం క్రిందకు రాకమానదు. అది మన మహర్షుల సమ్యగ్దర్శన వైభవ విశేషం. లయబద్ధంకాని దేదీ విశ్వంలో లేదు. శబ్దభావ లయబద్ధమైన ఈ రకం రచనల్ని స్వేచ్ఛా గీతిక లంటే బాగుంటుందేమో!

''అనాదికొస నుంచి అనంతత్వంలోకి'' అంటే ఏమిటి? ''ఫ్రం ది ప్రజంట్ టు ది ఎటర్నిటీ'' అని ఒకరు, ''ఫ్రం ది మైనస్ ఇన్ఫినిట్ టు ది ప్లస్ ఇన్ఫినిట్'' అని ఒకరూ మా మిత్రులు అర్థం చెప్పారు. ఎలానైనా చెప్పుకోవచ్చు.

''తలా తోకా లేని కాలోరగం వెన్నున కన్నులా'' మెరుస్తుంది వర్తమానం (రైలు ప్రయాణంలో) అన్నప్పుడు, తోక మైనస్ ఇన్ఫినిటు. తల ప్లస్ ఇన్ఫినిటు. ఈ కన్ను నిత్యపురోగామి.

"నా కోసం, నా వెంట, అనాది కొస నుంచి అనంతత్వంలోకి దూకిన సాహసవతి" (జీవిత పుణ్యక్షేత్రంలో) అన్నప్పుడు, అనాది కొస వర్తమానం (ప్రజంట్) అని కూడ అనవచ్చు.

ఏది ఏమైనా-

ఈ నా కవితోద్యానాన్ని విశ్వపరమోద్యానంలో ఒక చిన్ని భాగంగా నిర్మించి, సహృదయులకు సమర్పిస్తున్నాను. వారికి ఆనందం కలిగితే ధన్యుణ్ని.

-బోయి భీమన్న

## సమర్పణ

సరసులు
సహృదయులు
సర్వజన శ్రేయస్కాములు
శ్రీ సంజీవరెడ్డి గారికి!

ఆంధ్రీప్రియ తనుజన్ములు
అమృతపూర్ణ సౌమ్యచిత్తులు
ఔదార్యగుణ రత్నాకరులు
శ్రీ సంజీవరెడ్డి గారికి!

జాతిపిత గాంధీజీ ప్రేమాస్పదులు
జాతీయోద్యమ దీక్షా వీరకంకణులు
స్వాతంత్ర్య సమర కురుక్షేత్ర విజయులు
శ్రీ సంజీవరెడ్డి గారికి!

అఖిల భారత పాలక పక్షాధ్యక్షులై
ఆసేతు హిమాచల
అపూర్వ పశ్చిమార్ణవ
పరివ్యాప్త పావన విశాల భారతావనీ

యావజ్జనతా చిత్తాధి నాథులై
ఆంధ్ర ప్రజా హృదయాధి నేతలై
ఆంధ్రరాజ్య రమా స్వయంవర వరవరేణ్యులై
హైదరాబాదు రాజధానిగా
ఆదేశిస్తున్న ముఖ్యమంత్రులు
రాజనీతి సరిత్సాగరులు
ప్రజాస్వామ్య పరిపాలనా దక్షులు
శ్రీ సంజీవరెడ్డి గారికి!

ప్రజల కష్టసుఖాలను పరామర్శించి,
సుఖ సంతోషాలను పెంచ నుద్యమించి,
కలిమి లేముల ఔద్ధత్యానికి అగస్త్యులై మించి,
అవినీతిని దహించి,
అసమర్థతను నిర్మూలించి,
జడత్వాన్నీ, జాడ్యాన్నీ త్రుంచి,
బంధుప్రీతినీ, ఆశ్రిత పక్షపాతాన్నీ తిరస్కరించి,
కులమత ప్రాంతీయ భేద భీకరతత్వాన్ని భస్మీకరించి,

నీతిని మన్నించి
శక్తిని గౌరవించి,
న్యాయాన్ని సముద్ధరిస్తున్న
శ్రీ సంజీవరెడ్డి గారికి!

ధర్మాన్ని పాలిస్తున్న
శ్రీ సంజీవరెడ్డి గారికి!
సాహిత్యాది కళాకల్ప వృక్షాలను పోషిస్తున్న
శ్రీ సంజీవరెడ్డి గారికి!

-రచయిత

# మనోరథం

పువ్వుల కంటే లెక్కకు ముళ్ళే ఎక్కువ
ఈ నా గులాబీ తోటలో!
అందుకని-

ముళ్ళ తోట అననా దీన్ని?
కోయిళ్ళు నాలుగే, కీటకాలు లక్షలు
ఈ నా రసాల వనంలో!
అందుకని-

పరిత్యజించి పోనా దీన్ని?
వసంతం ఒక్కటే, తక్కు ఋతువులు ఐదు
ఈ నా మధురోద్యానంలో!
అందుకని-

పెరికి పారవెయ్యనా దీన్ని?
లక్ష ముళ్ళ పొదల్ని భరించి
ఒక్క తోటైనా పెంచుకొందాం!
లక్ష అపస్వరాల్ని సహించి
ఒక్క పాటైనా పాడుకొందాం!
లక్ష కోరికల్ని పరిహరించి
ఒక్క మాటైనా కలుసుకొందాం!

## ఊహా మధురిమ

మబ్బుల మర్రి మెరుపుటూడల్లో వూగుతూ,
ఉర్వశిలా ఎంత రమణీయంగా వుంది నెమలి!

అది గొంతెత్తితే, మహతే మూగ పోదా?
ఎలమావుల చిగురు పరదాలలో నుంచి

మత్తెక్కించేస్తున్నది కుహూకుహూ మాధుర్యం!
అది ఎదటికి వస్తే, మోహినే మూర్ఛపోదా?

ఎందుకలా చిరునవ్వు లొలుక బోసుకొంటావు, గులాబీ?
మౌనంలోని మహా సత్య మంతా
నీ ముఖంలోనే పరిమళిస్తున్నదిలే!

# వసంత రచన

మల్లె పువ్వు ఎందుకు వికసించింది?
నీ హృదయం వెన్నెల కాయడం కోసం;

మామిడిపండు ఎందుకు పక్వమయింది?
నీ హృదయం రసమయం కావడం కోసం;

కోకిల ఎందుకు గానం చేస్తున్నది?
నీ హృదయం పురివిప్పి నాట్యం చెయ్యడం కోసం;

మబ్బు గాలి ఎందుకు వీస్తున్నది?
నీ హృదయం భావాంబరాలు పండటం కోసం;

వసంత రచనా లేఖన లేఖినీ బృందం మొత్తం
సర్వార్థ సమారోహం జరుపుతున్నది నీ కోసం;

రచన రసభావబంధురం కాకపోతే,
ప్రత్యంశం సౌందర్యంతో నిండక పోతే,
అందులో ఎలా విహరిస్తావు నీవు?
ఆనందం ఎలా కలుగుతుంది నీకు, మరి?

## రస కవిత

సరస్సు నుంచి తొలగిస్తే
సరోరుహం లేదు,
చంద్రిక నుంచి తొలగిస్తే
చంద్రుడు లేడు,
పాట నుంచి తొలగిస్తే
కోకిల లేదు,
ప్రేమ నుంచి తొలగిస్తే
నీవు లేవు,
నీ నుంచి తొలగిస్తే
నేను లేను!

నా పూజా జ్యోతివి నీవు!
నా జ్యోతి స్నేహ రసం నీవు!
నా రసకవితా వసంతవు నీవు!
నా వసంతోత్సవ శ్రీ వైశాఖివి నీవు!

## చెలరేగిన ప్రకృతి

విజృంభించి కొడుతున్నది నభం!
పిడుగులు విసురుతున్నది చిరచిర,
భూగోళాన్నే బంతిలా ఆడించేస్తున్నది స్వాతి,
ఆ చూపులు అగ్గి తూపులు!
క్షేత్ర ధాత్రి చెక్కిళ్ళపై ధారాపాతం!
గుండె లవిసిన సముద్రునిపై దూకారు
నదీ నద నాగాంగనలు కసిగా;

ఏమిటీ ప్రళయం?

పురుషుని పట్ల ఏదో అసంతృప్తి
చెలరేగి గింజుకొంటున్నది ప్రకృతి!
పండు వెన్నెలలా పకాలున నవ్వనీ అతణ్ణి!
క్షణంలో అంతా గప్ చిప్!

## రసం - భావం

పురుషుడికి స్త్రీ అందం,
స్త్రీకి పురుషుడు ఆనందం!

స్త్రీ పురుషుల సంగతి లేకుంటే
లేదు రసం-
లేదు భావం!

రస భావాల సంగతి లేకుంటే
లేదు కల్పం-
లేదు సంకల్పం!

కల్ప సంకల్పాల సంగతి లేకుంటే
లేవు నీవు-
లేను నేను!
మనిద్దరం లేకపోతే
మరేముంది ప్రపంచం?

## ఏక రూపత

ఎక్కడో – అంత రాంతరంలో
ఆత్మ ఆత్మానుభూతిని కోరింది;

అది భావరూపమై
ఏదో భావాభిరతిని కోరింది!
అది హృదయ రూపమై
ఏదో హృదయ స్పందనను కోరింది!

అది శరీర రూపమై
ఏదో శరీరోపభోగాన్ని కోరింది;
నాలో ఇవన్నీ ఏక రూపమై
నిన్ను కోరుతున్నై!

## శరీరమాద్యం

దేవతలకు అగ్ని వంటిది
సర్వ వాంఛలకు శరీరం!

సర్వ రస భావ సౌందర్యాలకు
మహా కావ్యం శరీరం!

సర్వ ధర్మాలకు, అనుభూతులకు
ఆనందాలకు చిత్రశాల శరీరం!

దాని తృప్తే – సంతృప్తి
నీకు, నాకు, సమస్తానికీ!

# ఎవరు నీవు?

చుక్కల్ని చూస్తూ
ఆరు బైట పండుకొన్నాను రాత్రి!

ఎన్ని చుక్కలు?

విశ్వ వస్తు ప్రదర్శనంలో
స్త్రీల ప్రత్యేకదినంలా వుంది నభం!

చక్కని చుక్కలు!
కాలేజీ అమ్మాయిల్లా
జట్లుకట్టి చుట్లు కొడుతూ
అందాల రాశులు!

ఒక్క చాంద్ర విశ్వకళా పరిషత్తులోనే
ఇరవై యేడు కాలేజీలు!
శతాధిక మండలాలు!
సహస్రాధిక కుటుంబాలు!

అనంతంగా విరబూచిన
ఆ ఆనంద నందనంలో
ఎన్ని కుసుమాలు తెలుసు నాకు?
ఆనంద విశ్వ కళాలయంలో

అనంత సౌందర్య భాండారం నుంచి
ఒక్క పరిచయ దరహాస లేశం కోసం
ఒక్క చల్లని చూపు కోసం
వెతుక్కొంటున్నాను నేను!

నాది కాని సౌందర్యం
నాకు గాని రసానుభూతి
ఎంత వుండి ఏం లాభం!

అందుకే వెతుక్కొంటున్నాను నేను-
ఈ రోదసీ ఊర్వశులలో
ఈ రాశీ భూత రంభలలో
ఈ రాధా అనూరాధలలో
ఈ అసంఖ్యాక రమ్య తారాగణంలో
ఎవరు నీవు?

## పుట్టు పూర్వోత్తరాలు

బ్రతు కొక తెల్లని మెరుపు తీగ
దాని పుట్టుక ఒక నల్లని మేఘం!

బ్రతు కొక పవిత్ర పరిశుభ్ర పద్మం
దాని పుట్టుక ఒక బురద కోనేరు!

బ్రతుకొక ఉజ్జ్వల విభాతం
దాని పుట్టుక ఒక గాఢ తమస్విని!

బ్రతు కొక నిత్యా నంద నిర్ఝరి
దాని పుట్టుక ఒక విషమ శిలా విఘ్నేశ్వరం!

బ్రతు కొక సంతత ప్రగతి
దాని పుట్టుక ఒక గతానుగతిక జడస్థితి!

ఎందుకు త్రవ్వుకోవడం పుట్టు పూర్వోత్తరాలు?
బ్రతుక్కు, ముఖ్యం దాని పుష్పఫల వైభవాలు!

## ఒక్కణ్ణి!

పాలవెన్నెల పూల సెజ్జపై
ఒక్కణ్ణీ పండుకో లేక
లేచి పొలం పోయాను నేను.

బంగారు వరి కుప్పల నిండు నీడలలో
ఒక్కణ్ణీ మసల లేక
నది వొడ్డుకు పోయాను నేను.

పొంగులు వారుతూ కెరటాలు వేసే
యౌవనాన్ని తనలోనే లీనం చేసుకొంటూ
మై మరచి నిద్రిస్తున్న నదీ దేవి సమక్షంలో
ఒక్కణ్ణీ కూర్చోలేక
తిరిగి సెజ్జకు చేరాను నేను.

ఒక్కణ్ణి కాను నే నిప్పుడు!
నీ సార్వత్రిక సౌందర్యజ్యోత్స్నలో
జాబిల్లిని నే నిప్పుడు!

# తెల్లారి పోయింది!

మనస్సులో ఏమను కొన్నావో యేమో,
హఠాత్తుగా మెలకువ వచ్చింది నాకు!

చిరునవ్వు నవ్వుకొన్నావో యేమో,
చెంగల్వలు తొంగి చూశాయి నాలోకి!
వెచ్చగా నిట్టూర్చి వుంటావు నీవు,

వెన్నెల పాలకడలిపై మీగడ కట్టి,
శరన్మేఘ శకలంలా సకలం
చెదరి, చిదప లయింది!
వెన్న కుదపలు చుక్కలై తేలినై!

వొళ్లు విరుచుకొని వుంటావు నీవు,
మన పూదోట మొత్తం మొగ్గ దొడిగింది!

చిటిక వేసి, ఆవులించి,
మళ్లీ నిద్రపోయి వుంటావు నీవు,
మొగ్గల్ని వికసింప జేస్తూ
కళ్ళల్లోనే తెల్లారి పోయింది నాకు!

## మనిషికి మార్గం మనసే

నిశాలత కొస కొమ్మను
వికసించింది ఎర్రగులాబీ,
దాని సుగంధాన్ని వొళ్ళంతా పూసుకొని
పగటి వేషం కట్టింది కాలం!

అడుగడుగునా ముళ్ళు గుచ్చుకొన్నై
తేనెటీగలు తరిమి తరిమి కుట్టినై
వొళ్ళంతా నెత్తురుతో తడిసి
రాలి పోయింది వేషం!
అనంత విశ్వసరోవరంలో
పగలపడి నవ్వింది నీలోత్పలం!

ఆ నవ్వే మళ్ళీ నిశా లత,
అందలి అపహాస్య భావమే ఎర్రగులాబీ!
ఎర్రగులాబి కాకపోతే, కెందామర!
ఏదైతేనేం – అదే మళ్ళీ, మళ్ళీ!
ఏది దేనికి పరమార్థం?

మల్లెకు పువ్వు
మామిడికి పండు
కోకిలకు పాట
పరమార్థం!
అంతరాత్మ అడుగు జాడలలో
పారమ్యానికి ప్రాకిపోవడం
పరమార్థం మానవతకు!

---

ఏక భార్యతకు రాముడు
బహు భార్యతకు కృష్ణుడు
హింసకు పరశురాముడు
అహింసకు గౌతమబుద్ధుడు
ఆదర్శ పురుషులు లోకానికి!

ఆత్మకు ఆదర్శం అంతరాత్మే,
మనిషికి మార్గం మనసే,
బ్రతుక్కు ఫలితం నిండు బ్రతుకే!

# నీకేసి

ఎంత ఉరవడితో దూకుతున్నది జలధార!
ఎంత నిసర్గ మనోహరంగా వుంది లోయ!
నా మనస్సు సమస్తం
శతథా చిదుపలై, కుదుపలై
వికసిస్తున్నది లోయంతా వసంతంలా!

చిగుళ్ళు, మొగ్గలు, పూలు, పండ్లు
పికాలు, శుకాలు, తెమ్మెరలు, తుమ్మెదలు
సమస్తం నేనై
ఆనందంలో ఉక్కిరి బిక్కిరై
అంజలి ఘటించాను నీ కేసి-

లోయ మొగదల
జలధార అవతల
పర్వత పంక్తి శిఖరంపై
నీ హార హృదంతరాళంలో
మరాళం రెక్కల చక్కదనాలకు

సువాసనా సువర్ణగంధం పూసే
సహస్ర దళ కమలంలో
ప్రసన్న వదనంతో
చిరునవ్వులు నవ్వుతున్న
నీకేసి!

# వానక సజ్జిక

తలంటి పోసుకొని
పొడుపు కొండ కొస కొమ్మున నిల్చి
తడికురుల్ని ఆరబోసుకొంటూ
లోకం కేసి లోల దృక్కుల్ని బరపుతున్న
సుందర విభాత శారదలా
ఎవరు నీవు?

నొసట చంద్ర తిలకం ధరించి
ముత్యాల చెంపసరాల తారళ్యంలో
పువ్వారపు పట్టుచీర రెపరెప లాడగా
వరిచేల గట్ల వెంట నడిచి వస్తున్న
పరిపూర్ణ పౌష్యసాయంలక్ష్మిలా
ఎవరు నీవు?

కొండవాగుల రాయంచ హొయల వొయ్యారాలతో
బంగారు ధాన్య రాసుల మొనమొగ్గల నిగ్గులతో
ఇంద్ర చాపంతో, ఇక్షురస భాండంతో
కమలాలు, కైరవాలు ఏకక్షణం వికసిస్తూన్న
వైశాఖీ ప్రియతమలా
ఎవరు నీవు?

# రేయి

మిన్నేటి ఆయకట్టు క్రింద
నల్లరేవడి ప్రత్తి పొలంలో
నెలవంక గంపను నింపుకొంటూ
నడిచి పోతున్నది రేయి!

నెత్తిపై గంప నిండే కొలదీ
పండు వెన్నెల కాస్తున్న దామె!
గొర్రెల మంద కంపెనీ చేనేత మిల్లులో
వెన్నెల చీరల తయారీ అట!

శరత్ప్రభా పీఠంపై నిల్చి
తారలకు తరళాంబరాలు పంచుతుంటావట నీవు!
నెత్తిపై నెలవంక గంపతో
నీ సముఖానికి వస్తున్నది రేయి!

నీ గోలోకాలు పాలించే గోపిక రేయి!
నీ వ్యోమ క్షేత్రాలు పండించే కర్షకాంగన రేయి!
నాకు నీ తొలి దర్శనం కలిగించనున్న
స్వాదు హృదయ రేయి!
సర్వ శుక్ల రేయి!

## ఎలా వుంటావో

నిన్ను గురించిన ఊహ
నా మనస్సరోజంపై చల్లగా వీచినప్పుడు
సువాసనలు గుప్పున రేగి
నరనరాలకు వ్యాపించి
నా శరీరం మొత్తం
ఒక కల్హారమే అయి గుబాళించింది!
నీ వూహే
ఇంత
నిసర్గ మనోహరంగా
లలిత కళా కల్యాణ జ్యోత్స్నగా
సుధారస భాండంగా
వుంటే!
ఇక, నీవెలా వుంటావో!

# హేమంత నిశీధం

కాల పురుషుని తెగమూసిన తల చీకట్లను
చెక్కిపొయ్యలేక ఏమంగలో విసిరేసిన కత్తిలా
మెరుస్తోంది కృత్తిక ఆకాశం వాకిటిలో!

నేను నీ కోసం వలె, నీవు నా కోసం
ఎలా కాగిపోతున్నావో ప్రదర్శిస్తోంది
అలంకృత శకటంపై యెక్కి రోహిణి!
ఏం జెయ్యను, సఖీ నేను?

క్రుంకి పోతున్న మీన మేషాలను లెక్కిస్తూ,
తూర్పున తొండ తలెత్తి వెక్కిరించగా,
విరహాగ్ని సర్పం వెన్నంటి బుస గొట్టగా,
ఇంకా ఆరని ముక్కంటి మూడో కంటికి
హృదయాన్ని కన్నీరు చేసి తర్పణమిస్తూ
మున్నీరుగా కుములడం తప్ప
ఏం చెయ్యను సఖీ, నేను?

తమ ఆనందమే లోకానందంగా
కదలిపోతున్నారు ఆది దంపతు లంతరిక్షంలో,

కాలభైరవమూర్తి కాపలాగా పోతున్నా డా వెన్క
అర్భకుణ్ణి నేను!
హేమంత నిశీథం ఇది!

పడివున్నా నిక్కడ ఒంటరిగా మంచు గడ్డలా!
యమున కావల ఎక్కడో దూరంలో
అంధకార మహాసముద్ర గర్భంలో
ఉషః కామేష్టి వహ్ని కుండంలో
ఎవరివో నిట్టూర్పులు రేపిన బుడగల్లా
లేచిపోతున్నాయి చుక్కలు పడమటికి!

ఆ యెవరో నే నేమో!
ఎవరి నిట్టూర్పునో నేను–
బరువుగా పడివున్నా నీ యడుగున
కాలపురుషుని ఆసన మహా శిలగా!

# ఫాల్గుని

శరచ్చంద్ర చంద్రికా సమాహ్లాద చిత్తంతో
మైమరచి ఆడుకొంటున్న లోక వృత్తంపై
పొగమంచు పడగల్ని విప్పింది హేమంతం!
ఆకలి గొన్న సింహంలా దూకింది శిశిరం!

బుసగొట్టి విజృంభించిన చలిపురుగు
శివరాత్రి మహోత్సవంతో
శంకరా భరణమై పోగా-
ప్రకృతి శరీరం నిండా దట్టంగా గ్రుచ్చి
ఎర్రని చిగురు కండల్ని పెకల్చి
నెత్తురు గోళ్ళను నాక్కొంటూ
కూర్చున్నది సింహం!

సింహం తోకను మెలిపెట్టి
మృత్యువును ముందుకు పారద్రోలి
అభయ హస్తం పట్టి
అందాల రోదసిని
అవనికి వసంతగా
నవజీవన భాస్వంతంగా

అవతరింప జేసిన అమృతధునీ!
ఫాల్గునీ!

మలయ మారుతం వొడిలో
మధుర మధూళికా!
సింహకేతన జటావీచిలో
ప్రసన్నేందు పూర్ణ చంద్రికా!
క్రియా శూన్య జడజగత్తులో
నవచైతన్య సంచాలినీ!
ఫాల్గునీ!

రసాలినీ హస్త కిసాలయ ప్రబంధంలో
పంచము స్వరసమాహ్వాన సంగీత సంపుటంలో
ఇక్షు రసధునీ తీర కేదారం గట్టున ఎక్కడో
నాకోసం ఎదురుచూస్తున్న వైశాఖికి ప్రియ సఖీ!
ఫాల్గునీ!

# కోరుకొన్న అతిథి

ప్రారబ్ధం పండుటాకులు
వాకిట్లో జలజల రాలినప్పుడు,
గాలిదేవర యింటి సౌఖ రెవడో
వాటిని తుడిచి పారబోసి నప్పుడు,
అప్పుడే అనుకొన్నాను నేను
అతిథు లెవరో వస్తున్నారని!

పొగమంచు బూజును దులిపి
పట్టు తెరలు కడుతున్నప్పుడు,
చల్లని కనుదమ్ముల కమ్మని కల్లాపులపై
చిటిముత్యాల ముగ్గులు పెడుతున్నప్పుడు,
ఆ వస్తున్న అతిథు లెవరో
అందాల రాశులే అనుకొన్నాను!

ఆకాశం చలువ పందిరికి
గుంజల్లా నిలబడ్డ యెలమావుల
కొమ్మల చిరుచెక్కిళ్ళను పుడుకుతున్న
ఎవరివో చేతివ్రేళ్ళ యెఱ్ఱని గోళ్ళు
ఎక్కడి కక్కడే అంకితమైపోతున్నప్పుడు,

నక్షత్రాలు చివురు మొగ్గలై
కిలికించితాలు పూలగుత్తులై
ముద్దులు మధుర ఫలాలై
ఆలింగనం కోసం చాచిన చేతులతో
ఎదురు తెన్నులు చూస్తున్నప్పుడు,
అనుమానం కలిగింది నాకు
ఆ అతిథి నీవై వుండాలని!

రానేవచ్చింది ఇంతలో
మధుప్రియా గాయన గాయనీ బృందం!
దివ్యపల్యంకికలో వచ్చింది ముస్తాబై
ఫాల్గునీ సఖీ పరివారం!

సప్తర్షుల దీవెన లవిగో దూరంలో!
వసుంధరపై రోదసి వాలినట్టుగా
వచ్చేస్తున్నా వదిగో-
వసంత లక్ష్మివి!
నే కోరుకొన్న అతిథివి!

## పూదోట పురిటి గదిలో

చీకటి మాయ పొరచిట్లి
విరబారిన నెత్తురు మడుగులో
కేర మన్న బాల సూర్యుని కేకకు
ఉలిక్కి పడి తలెత్తింది మొగ్గ
అద్భుతపడి చూసింది వెలుగును-
పూదోట పురిటి గదిలో
ఎఱ్ఱని సూర్యదీపం వెలుగును-
కెందమ్మి కనురెప్పలెత్తి, ఆ నెత్రు మొగ్గ!

బోసి నవ్వు లొలుక బోసికొంటూ,
కిరణబాలలతో కిలకిల నవ్వుకొంటూ,
పిల్ల తెమ్మెరల జట్లతో కలసి

కాలి బంతు లెగర దన్నుకొంటూ,
తప్పత్రాగిన అమృతరసాన్ని చొల్లుగార్చి
మర్త్యుల ముద్దులకు మాధుర్యాన్ని ఘటిస్తూ,
రంభా కలకంఠకూజితాన్ని
ఉద్యానవన కలకంఠాలకు మప్పుతూ,

కొమ్మ అమ్మ వెచ్చని వొడిలో
బాయి త్రాగి క్రొంజిగు రయింది,
విరిసి తలిరా కయింది,
పెరిగి ముదురా కయింది - అది!

వివిధ ఋతువుల రాపిడులకు రాటుదేరి,
రాగద్వేష ప్రవృత్తుల మధ్య నలిగి,
అనుభవాల ఒత్తిడులకు అలసి,
సుఖ దుఃఖాల పారమ్యం చూచి,
లోక స్వభావం జీర్ణంచేసుకొని,
గడితేరి కారా కయింది
పండి పండుటా కయింది!

ఎవని పిలుపు తాసై మొలకెత్తిందో,
ఎవని కరాలలో తన జీవితం ఫలించిందో,
ఎవని రసజ్ఞతలో తాను రాధాదేవి అయిందో,
అతడు బాలుడై, యువకుడై, వృద్ధుడై
తన చేతులలోనే ఎన్నోసార్లు
గిట్టడం, పుట్టడం చూచింది తాను!

అతని పుట్టుకతో ప్రకృతే వికసించేది!
అతని గిట్టుకతో లోకమే కన్నుమూసేది!

ఈ ఆనంద విషాదాల మేరల మధ్య
ఎంత కన్నీరు కార్చిందో తను!
ఎంత సత్యాన్ని దర్శించిందో తాను!

ఒకనాటి విభాతంలో
అపూర్వ తేజంతో శృంగార శ్రీనాథుడై వచ్చి
వాలాడు తన జీర్ణ హస్తాలలో, బాలరవి!
వణుకుతూ గుండెకు హత్తుకొన్న దతణ్ణి తాను!
అపారమైన అనుభవం పండిన తన చిత్తంలో అప్పుడు
మొలకెత్తిం దొక వినూత్న జ్యోతిర్భావం-
ఇక తానే అతని చేతుల్లో గిట్టి పుట్టాలని!

సుదీర్ఘమైన తన జీవిత వర్షంలో
ఎన్ని వందలసార్లు అతడు గిట్టి పుట్టలేదు?
అట్టి అపూర్వ మధురానుభూతి
అతని చేతుల్లో తన కొక్కసారి లభిస్తే!
రోజు కొకసారి ఎర్రటి రోజా మొగ్గలా
బాలుడై వికసిస్తా డతడు!
రోజులు, ఋతువులు గడుస్తున్నా
తనకా అదృష్టం ఎందుకు లేదు?
తలపు తలసూపిందో లేదో-
తక్షణం ఏం జరిగిందో యేమో-

కాలం చేసే మాయగారడీ ఎంత పాతదైనా
అంతు చిక్కని నిత్య నూతనమే కాదా మరి?
రెప్పపాటువలె ఏదో అయి,
పై కప్పు జారిపోగా
తళుక్కుమన్న దీపకళికలా,
స్విచ్చియేదో చిటుక్కుమనగా
జిగేలుమన్న విద్యుత్కణంలా,
హృదయాన్ని ఎవరో తట్టి తెరచినట్టు,
ఉలిక్కిపడి తలెత్తింది తాను!
అద్భుతపడి చూచింది ఎదురుగ్గా!
వొళ్ళంతా పుప్పొడి అంటిన తుమ్మెద రేనివలె
చిరునవ్వులు నవ్వుతున్నాడు ఉదయభానుడు!
తన పురాకృత పుణ్యఫల ప్రణయదేవుడు!
తాంబూలం నమిలిన పసిపాప నోట్లో
నాలుకవలె పూ మొగ్గై
తీయని క్రొంజివురు పెదవులపై
నాట్యం చేయసాగింది తాను
అదే పురిటి గదిలో
అదే కొమ్మ అమ్మ మెత్తని పొత్తిలిలో.

# నీ రూపకం

ఎర్ర తామర మొగ్గవు నీవు,
రసాల మామిడి పండువు నీవు,
పనస తొనవు నీవు,
మెరుపు తీగవు నీవు,
కొండ వాగువు నీవు,
చంద్ర కిరణం నీవు,
ముద్దబంతి పువ్వువు నీవు!
అన్ని ఋతువుల అందాలూ నీవు,
ఆనంద దేవతవే నీవు!
ఎందుకు ఈ చప్పని వాచ్యం నిన్ను గూర్చి?
అన్ని రుచులూ నీ పాద పద్మజలే!
సర్వార్థవ సమాహార సౌందర్య శారదవు నీవు!
అందుకే పిలుస్తాను నిన్నొక్క మాటతో
"ప్రేయసీ" అని!

# కిటికీ దగ్గర

నేను ఉదయం లేచి చూచేటప్పటికి,
ఆ కిటికీ దగ్గరే కనిపిస్తా డతడు !

"నా పరుగు పట్టుకో" మన్న ఉషః కన్యవెంట
చలిగాలికి రెపరెపలాడే పైట చెరగు వాసిగా
పరుగెత్తుతున్న బాలసూర్యుని పాదధూళి
ఎర్రగా తూర్పు దిగ్దేవి పాద పద్మాలకు
పారాణి పూస్తుండే సమయం అది !

ప్రతి రోజూ
ఆ కిటికీ దగ్గరే నిలబడి చూస్తాడతడు !
అతని చూపు తీగల చివర, దూరంలో,
పూస్తూవుంటుం దొక గులాబీ !
పందెంలో గెలవలేని సూర్యుని
కందిన చెమట ముఖంలా
రోజూ అదేచోట పూస్తుందా రోజా పువ్వు !
ఆ దేచోట నిలబడి చూస్తూ వుంటాడతడు !
తన కోసం చూస్తూ
తన్నుపైపే చూస్తూ
ఆశతీరక రాలిపోతూ
ఆ పువ్వుకు

రోజుకో జన్మ గడిచిపోతుంటే-
చూస్తూ నిలబడతా డతడు
అలా, ఆ కిటికీ దగ్గర
తదేక దృష్టితో ఆ పువ్వును !
తన్మయుమై సురభిస్తున్న ఆ పువ్వును !

# ఆనందం

పదహారేండ్ల పచ్చని పడుచులా విరిసి
తుమ్మెదలకు తేనె కరుళ్ళ విందులు గుడుపుతున్న
గున్న మామిడి నీడలో ఒంటరిగా కూర్చుని
నిన్ను గురించి ఆలోచించడం ఆనందం నాకు !

చిత్రా విశాఖలు చంద్రునితో కూడి
ఎన్ని అందాలు సృష్టిస్తున్నాయి లోకంలో !

చంద్రుని స్థానంలోకి సూర్యుడు వస్తే మాత్రం
చిత్ర చిరచిర లాడిపోతుంది !
విశాఖ విసిరి కొట్టేస్తుంది !

సూర్యస్పర్శ తగలగానే చుర్రున మండి
లోకంపై నిప్పులు కుమ్మరించే కృత్తికా బృందం
చంద్రునితో చెట్టాపట్టాలు వేసుకొంటూ
శరచ్చంద్రికలు కాపిస్తుంది జగత్తుచే !
హృదయాన్ని రంజించేది ప్రాభవం కాదు,
ప్రణయం అనడానికి సాక్ష్యం వేరే యెందుకు ?
లోకంలోని ప్రతి సుందర హృదయావిర్భాతికి
హృదయంలోని ప్రతి ఆనంద స్పందనకు

తారాశశాంక మధుర చుంబనమే హేతువేమో!
సమస్త ప్రకృతి సుఖదుఃఖాలను
వృద్ధి క్షయాలను పాలించే ఇతివృత్తం ఇదేనేమో!
ఏమో అనేది ఆలోచనకు మూలభూతం,
ఆలోచనమే లోచనం ఆత్మావిష్కృతికి!

అందుకే నిన్ను గురించి ఆలోచించడం నేను!
ప్రఫుల్ల రోదసీ సహకార చ్ఛాయలో
ఒక్కణ్ణీ కూర్చుని మాత్రమే కాదు-
నిలబడీ, నడుస్తూ, పనిచేస్తూ, నిద్రిస్తూ కూడ
ఆలోచిస్తూనే వుంటాను నీ గురించి!
ఆనందిస్తూనే వుంటాను నిన్ను భావించి!
ఆనందానికి నా నిర్వచనం:
"నిన్ను గురించి ఆలోచించడం"
ఆనందానికి నా ఉదాహరణ:
"నిన్ను గురించి ఆలోచించుకొంటున్న నేను".

## అల్లరిచేస్తైనా

కాలేజీ అమ్మాయిల్లా సీతాకోక చిలుకలు
ఫ్రంటు బెంచీ లాక్రమించాయి మా విరిదోటలో !
రంగురంగుల రెక్కల క్రీనీడల సోక్కిన ఏవో నీడలు
బరువుగా కరిగిపోయాయి ఆ మధుర సంభ్రమంలో !

శతాధిక శతపత్రాల సితపత్ర వృత్త వృత్తాంతాలు
మధువిద్యాగాన పానారక్త కంఠస్వరాల వికస్వరాలు
భావోదయ శిఖర పత త్వరా కర స్రవ త్రాప్పులు-
మొత్తం తోటంటా అటు మొగమైందా క్షణంలో !
మొత్తం బ్రతుకంతా అటు వాలిందా ముహూర్తంలో !
అటు మొగమై వున్న ఫ్రంటు బెంచీల వెనుక బెంచీలు
ఎటుమొగమైనా ఒకటే, కాని-
అటు మొగమే అయింది మరి తోటంతా
అటే వాలింది మరి బ్రతుకంతా
ఆనందాభాస అయినా భాసిస్తుందని !

అత్యంతం వెనుక, వెనుక బెంచీలో వున్నా
ఆభాసకు బాసికం కట్టలేని నేను,
అటుకేసి వున్న అద్దం ఎంత అందమైన దైనా
ఇటు నుంచి మొగం చూచుకోలేని నేను
అల్లరి చేసైనా రావాలి గురుపీఠానికి !
మొట్టికాయలు తినైనా చూడాలి ఎదురుగా నిన్ను !

ఫ్రంటు బెంచీలో
పతంగ పతత్రరోచీ రాగంలో
వసంత గురుత్వ ప్రాప్త భావ పరాత్పరంలో
బ్రహ్మానంద సబ్రహ్మచారిణీ !
అనంత జనుష్కృత పుణ్యసుధా సరస్సినిలో
వికసించిన ఉషస్వినీ ! సుమనస్వినీ !
ఏమైనా ఇటు మొగం చేసుకోవాలి నిన్ను
ఇనబింబం ఇందుబింబాన్ని వలె
ఇందుబింబం కుముదినీ అధరబింబాన్ని వలె!

పీరియడ్ ఆఖరుకైనా వస్తాను ముందుకు,
ఎంత అల్లరైనా చేస్తాను అందుకు !
చైత్రంపోతే వైశాఖం వుంది, విరీ !
తప్పించేది కాదు–
గెలిపించేదే ఈ గుబులు గుండెల సిరి !

## అన్నీ ఒకతోటలోవే

చల్లని పిల్లగాలులు కొమ్మలలో చేరి
కోతి చేష్టలు చేస్తున్నై !
చేవ కొమ్మలు కువకువ లాడగా,
లేత కొమ్మలు జవజవ లాడుతున్నై !
కొమ్మల బందాలు దాటలేని పూల కన్నెలు
చెక్కిళ్ళు కమిలి
పెదవులు చితికి
గిలగిల లాడుతున్నై

ఆ యెర్రని నెత్తురు చారలపై మూగుతున్నై
ఎక్కడెక్కడో
ఏ పంకజం రజః పంకం లోనో
పొర్లి వచ్చిన చీకటి చిదపల మూక !

ఎక్కడెక్కడో
ఏ ప్రారబ్ధపు దుర్వాసనలనో
అంటించుకు వచ్చిన అళి బృందం !

ఒకరి ఇబ్బంది మరొకరికి లాభావకాశం,
ఒకరి బాధ మరొకరికి ఆనందం !

పంకజం నుండి తుమ్మెద
మామిడిపై వాలింది !
మామిడి పూల నుండి తుమ్మెద
కొబ్బరి రెన్నపై చేరింది !
కొబ్బరి పువ్వారంలో పొర్లిన తుమ్మెద
దానిమ్మ మొగ్గ కెమ్మోవిని కరిచింది !
చెరకు వెన్నుల దీపాలలో వేగిన తుమ్మెద
పుచ్చపాదుల వీధుల వెంట పడింది !

లతలన్నీ ఒక తోటలోవే,
పూలన్నీ అందమైనవే,
రుచులన్నీ తృప్తి నిచ్చేవే,
ప్రతి తృప్తీ సత్ఫలితాన్ని చేకూర్చే,
ఆనంద మంతా ఒక్కటే–
ఒక జాతిదే !

అయితే-
ఆనందపు సంత బజారులో
ఆత్మీయతనే అర్పించగల ప్రకృతి
మామిడికి మామిడి పళ్లే ఇచ్చింది,
దానిమ్మకు దానిమ్మ పళ్లే అమ్మింది,
గులాబిని గులాబిగానే
మల్లెను మల్లెగానే
నీకోసం రిజర్వుచేసి వుంచింది !
ప్రభాతం దాటకముందే వచ్చావంటే
నా వనప్రభా !
నీ ప్రభ ముల్లోకాలకూ ప్రభే !

## నీ కళ్లల్లో నా క్షేమం

శైత్యం చేసినప్పుడు
కొబ్బరి బొండాలు తాగాలనీ,
అజీర్ణంగా వున్నప్పుడు
మొక్కజొన్న పొత్తులు తినాలనీ,
గొంతు నుస ఏర్పడినప్పుడు
సిగరెట్టుపై సిగరెట్టు కాల్చాలనీ,
ఏమిటో ఈ కోరికలు నాకు !

మిత్రులవలె కనిపిస్తాయి
శత్రువులై పీడిస్తాయి
పయోముఖ విషకుంభాలు
గోముఖ వ్యాఘ్రాలు ఈ కోరికలు !

ఎప్పుడో మింగేసేవే నన్ను
అమ్మా, అమ్మా అంటూ నీవు
నిత్యం నన్ను వెన్నంటి వుండకపోతే;

అప్పటి వరకూ ఎక్కడ వుంటావో నీవు
వద్దమ్మా అంటూ వస్తావు ముందుకు
సరిపడని ఏదో ఒక కోరిక
చేయిపట్టి నన్ను చీకట్లోకి లాగినప్పుడు !

పారిపోతుందది నిన్ను చూస్తూనే
ప్రాణాలు దక్కుతాయి నాకు !
ఎంత దూరంలో వున్నా
ఎంత నిద్దరలో వున్నా
ప్రొద్దు తిరుగుడు పువ్వులా నీ చిత్తం
నాపైకే వాలివుంటుందో యేమో-
చీమ చిటుక్కు మన్నాదంటే
శివం సుందరం అవుతాయి నీ కళ్లు !

సూర్యచంద్రులై పరిభ్రమిస్తాయి నా చుట్టూ !
అందుకే నిద్రపోతున్నా నిప్పుడు-
నిశీథాన్ని పరుచుకొని, హాయిగా,
అసంఖ్యాక విద్వేష విషగోళాల మధ్య,
నీవు మేల్కొనే వుంటావన్న ధైర్యంతో,
నా క్షేమం చూచుకొంటూనే వుంటావన్న నిశ్చింతతో !

## స్వయంకృతావరోధం

సహస్ర దళ సువర్ణ సౌగంధికం నీవు!
నా ఆరాధ్య దేవతవు నీవు!
నీ చుట్టూ నా పూజాసుమాలు విరిసే కొలదీ
గుత్తులుగా, గుబురులుగా అవి పెరిగే కొలదీ
తోటలై, తోపులై విస్తరించే కొలదీ
నీ–నా నడుమ దూరం కూడ
ఇంతై, అంతై, అనంతమై పోతున్నది!

పూర్వం నీవూ, నేనూ ఒక్కటే మూర్తి!
నీ చుట్టూ నేను, నా చుట్టూ నీవు!
ఇప్పుడు నిన్ను నేను చేరాలంటే
అపారమైన పుష్పవనాన్ని దాటాలి,

అసంఖ్యాకమైన పుష్పాల్ని పరామర్శించాలి,
ఆలస్యాన్ని లెక్కచెయ్యక
ఆప్యాయతను పంచిపెడుతూ రావాలి!
ఇదంతా నీ కోసం నా పూజాకల్పం కనుక
నిరాకరించరాదు దేవ్నీ!

ఇప్పు డెంతదూరంలో వున్నావో నీవు,
ఈ నా ఆరాధనా పుష్ప వనకుడ్యం వెనుకభాగంలో!
పూర్వం నీ ముఖాన్నే ప్రొద్దు పొడిచేది,
పెదవులు చుంబిస్తుంటేవి నాకు!
నీ జటా బంధంలో విరిసిన వెన్నెల వెన్నతడితో
తమాయించుకొని తనిసేవాణ్ని నేను!

ఇప్పుడేదీ ఆ సాన్నిధ్య సౌభాగ్యం?
ఆరాధన పెరిగే కొలదీ
ఆత్మీయత దూరమై పోతున్నది!
ఏకత్వ ప్రాభవం సడలే కొలదీ
నానాత్వం ఆకర్షిస్తున్నది!
ఆకర్షణల ఆలింగనాల నుంచి బైటపడేటప్పటికి
పూజావేళ దాటిపోతున్నది!
నీ కోసం నే పెంచుకొన్న పూజాపుష్పాలే
నిన్ను నాకు దూరం చేసి
తమ పూజకు నన్ను మలుపు కొంటున్నై!

## పూర్ణస్వేచ్ఛ కోసం

భరించలేను నీ వియోగాన్ని,
జీవించలేను నేను ఒంటరిగా !
నీవో - చైత్రంలోగాని రావు !
వైశాఖంలోగాని వికసించవు !
ఎలా మరి నా సంగతి ?

నీవు దగ్గర వున్నప్పుడు
ఎన్ని పాటలైనా పాడుకోవచ్చు
ఎన్ని పువ్వులైనా త్రుంచుకోవచ్చు
త్రుంచి నీ జటలో పెట్టవచ్చు హాయిగా !
నీవు దూరంలో వున్నప్పుడు
పెదవే కదల్ప గూడదు-
పువ్వే ముట్టగూడదు నేను !

నీ సమక్షంలో వుండే స్వేచ్ఛ
నీ పరోక్షంలో లేదు నాకు !
నీవు నా దగ్గర లేనప్పుడే
నాపై అజమాయిషీ ఎక్కువ నీకు !
అందుకే కోరతాను నేను
నీవు నిత్యం నా దగ్గరే వుండాలని !
పూర్ణాను భూతి కోసమే కాదు
పూర్ణ స్వేచ్ఛకోసం కూడ
అవసరం నీ నిత్యసాన్నిధ్యం నాకు !

## అవతలి కొస నుంచి

ఎప్పుడో
ఎక్కడో
విన్నాను నీ గొంతు!
గుర్తుండీ గుర్తులేదు నాకు!

ఏ నాటిదో
ఈ పచ్చకప్పురం పల్కుల పరిమళం!
ఏ జన్మాంతర వసంత వనప్రియా కలస్వనమో
ఏ కలహంస వాహనా మోహన వీణారవమో
పిలుస్తున్నది ఫోనులో నన్ను
నీ కంఠస్వరంలో
సప్తస్వరాలు మేళవించి!

అది-
నా హృదయ వీణా జీవతంత్రుల్నే
తన సరదాలకు శ్రుతి చేసుకొని,
నా మనస్సుచే తాండవ నృత్యం చేయిస్తూ,
నన్ను నన్నే మలచి వేస్తున్నది-
ఒక ప్రేమోన్మత్త పారవశ్య శిలా శిల్పమూర్తిగా!

అదృశ్యంగా
అదృష్టంలా
ఎక్కడో అవతలి కొసను నీవై వున్నట్టిది
ఏనాటి పరమ స్నేహ వాసనా విలసనమో!
ఎంతటి పురాకృత పుణ్యాఫల రసపాకమో!

## నిజమే కాని

నేను ఏడుస్తూ పుట్టిన మాట నిజం,
ధూళిలో దొర్లాడిన మాట నిజం,
ఎన్నెన్నో తప్పటడుగులు వేసి
ఎక్కడెక్కడో పడ్డ మాట నిజం;

పాలు త్రాగుతూ చనుమొనలు కొరికాను,
బువ్వ తింటూ చేతివేళ్లు కరిచాను,
ముద్దు కోసం అందిచ్చిన చెంపపై
ఫెళ్లున కొట్టి పారిపోయాను,
నిజం !
అంతా నిజం !

కాని–
ఆ ఏడుపే కలకంఠ కలస్వనమై

ఆ ధూళే కుసుమ సుగంధమై
ఆ తప్పటడుగులే తాండవ ముద్రలై
ఆ దౌష్ట్యమే ప్రగాఢ ఆరాధనమై
నీ వసంతాంగణంలో నిలబడ్డా నిప్పుడు !

హృదయం పరిపక్వమై గుబాళిస్తున్నది
మనస్సు ప్రతి పరిధినీ దాటి వచ్చేస్తున్నది
ఆత్మ ఆనందంతో అంజలి ఘటిస్తున్నది
నీ కోసం!

నా పాటలలో ఒక్క పాదం అయినా
నా తావులలో ఒక్క తరంగ మైనా
నా అడుగులలో ఒక్క సవ్వడి అయినా
నా చేతలలో ఒక్క తృణమైనా
నీ దాకా వస్తే-
నీ పూజకు పనికివస్తే-
నా బ్రతుకంతా నీదైనట్టే!
నా జన్మ తరించినట్టే!

## నన్ను కూడ

నీవు ఉదయభానుడివి,
పూర్ణచంద్రుడివి !
నే నొక తామర మొగ్గను,
కలువ కన్నెను,
కేవలం పంకజాన్ని !

నీ చూపులో వేల పద్మాలు వికసిస్తాయి !
నీ నవ్వులో లక్షల మల్లెలు సురభిస్తాయి !
నీ పలుకులో కోట్ల పికాలు పాడతాయి !
నీ ముద్దులో ప్రపంచమే ఫలిస్తుంది!

వసంత సుందర తారా మండలం వలె
పరమేశ్వర పదారవింద మకరంద ఝరి వలె
పరమమూ, పవిత్రమూ అయిన
నీ ప్రియ పరివారంలో
నన్ను కూడ చేరనీ !
ఏదో ఒక మూల
నన్ను కూడ వికసించనీ !

## రూపకల్పన

అమృత విహార జీవనలతా సమూల చూర్ణం
ఈ మట్టి!
అయినా-
ఇది వట్టి మట్టి!

దీని పుష్పఫల తరులతాదిక వైవిధ్యం
నీ భావశబలతకు నిదర్శనం!
నీ తలపుల తొలకరి ప్రతి చినుకూ
నీ ఈప్సిత రూపకల్పనకు అంకురం!

అంకురించాను నేను నీ ఇచ్ఛానుసారం!
నా సమస్తం నీ భావబిందునిహితార్థమే!
నీవు రచించుకొన్న వర్ణచిత్రం నేను,
నీ మనః ప్రవృత్తికి ప్రతిబింబం నేను!
నా లోపాలు
నీ ఇచ్ఛావైకల్యాలు!
నా అందాలు
నీ అనురాగ రేఖలు!

## సీతాఫలం

ఎవరి కోసమో ఎదురు తెన్నులు చూస్తూ
పలక మారింది సీతాఫలం-
ముఖం నిండా కళ్ళతో,
కళ్ళ నిండా కాంతితో,
రోదసీ వదన బింబంలా!

ఆకుల ముసుగు చీకట్లో నుంచి
తొంగి చూచి, చూచిం దది-
భూవలయపు మధుపాత్ర అంచును
పెదవులకు చేర్చుకొని
పైకి ఏ మెరుగున ట్టుండి
క్రింద
తోటల చిరుపాదాలను
త్రొక్కి నవ్విస్తున్న నిన్ను!

అలా చూచిందో లేదో
సరాలున వాలిందది నీ మీద!
బాల సూర్యుడవో, బహుళ చంద్రుడవో నీవు!
అందుకొంటావో చేతులు సాచి!
జార విడుస్తావో అలక్ష్యంగా!

## అక్షర గంగ

వ్రాసేటప్పుడు కవిబ్రహ్మవు నీవు!
పంచబాణుని ఒక్కొక్క బాణం లేఖినిగా
కల్పిస్తావు అసంఖ్యాక సౌందర్య వైవిధ్యాలను,
ఆనందం వొక్కటే పరమార్థం నీ సృష్టికి!

నీవు వ్రాసినదాన్ని నీవే పరిశీలిస్తున్నప్పుడు
పరమ విమర్శా నిశిత నేత్రుడివి నీవు!
తుడిచి పారేస్తావు అనౌచిత్య దోషతతిని
జాబిల్లి రబ్బరు బిళ్ళతో!

అదీ అరిగీ, అరిగీ
అమావాస్య అయిపోతూనే వుంటున్నది!

సహృదయ పాఠకుడివిగా
మళ్ళీ దాన్ని చదువుకొంటూ,
శారదా సమాలింగన ఆచ్ఛాదిత అర్థదేహుడివై
హంసపై పాదాలుంచుకొని
పవళిస్తావు నీవు ఆనందిస్తూ
పాలవెల్లి పరమ పదంలో!

అట్టి నిన్నా నేను ఆకర్షిస్తున్నది!
అట్టి నీ లేఖినినా నేను నడిపిస్తున్నది!
వద్దు నాకు అటువంటి అహంకారం ప్రభూ!
నీ ఆనందంలో నీవు
అలా క్రిందకి చూస్తే చాలు నాకేసి!
నీ పాదపద్మ పరాగం
నా ముఖాని కింత అంగరాగం కానీ!

పరమశివుడు తలదాల్చిన గౌరవం కాదు,
నీ పాదపద్మ గృహసేవా సౌభాగ్యం నే కోరింది!
వ్రాసుకో, విమర్శించుకో, పఠించి ఆనందించుకో!
నీ పాదస్వేద బిందువొకటి నేనుగా
రమ్యాక్షర గంగా భవాని అయి-

నీ ఆనంద సుధా మాధుర్యాన్ని
ప్రపంచానికి అవతరింప జేయుగలిగింది!
శ్యామల సస్యలక్ష్మి అయి-
నీ జగద్రస పోషకతా వైభవ పుష్టిని
ప్రపంచం నిండా వెదజల్లు తున్నది!
ఏ తత్సంతృప్తి చాలు నాకు, ప్రభూ!

## ఈశావాస్యం

ఏడెందం చందనమై కాలిందో
ఏ అందం మంటలుగా మారిందో
ఏ చిరస్నేహం చితాభస్మ మయిందో
ఏ ఆనందం అదృశ్యమై పోయిందో
ఈ శ్మశానంలో నిన్నొంటరివాణ్ని చేసి పాపం!

పట్టపగలే అంధకార బంధురమై
ఆత్మీయులున్నా ఏకాంతవాసమై
ప్రసూతి కేంద్రానికి రెండో సిబ్బిఐ
మిథ్యా వాదానికి ప్రత్యక్ష నిదర్శనమై
ప్రవర్ధమాన మౌతున్న ఒక శ్మశానాన్ని
ప్రపంచంలో అణువణువునా ప్లాను చేసి
దుఃఖానికి అమరత్వం కల్పించిన నియంతృత్వంలో
నీ పాత్ర భిక్షా పాత్రే అయినా-

ఇంకా ఇక్కడే వున్నావా నీవు శంకరా?
ఇంత భయంకరమా నీ ధర్మం, నటరాజా?
ఇంత గాఢమా నీ యనుబంధం, అర్ధనారీశ్వరా?
అనంతకాలంగా ఈ రుద్రభూమిలో కాపురంపెట్టి
నీవు వెతుకుతున్న అర్థం ఎంతటి పరమార్థమో కదా, ప్రభూ!

## ఆత్మే కావలిస్తే

దౌర్జన్యం ప్రాబల్యానికి
లొంగవచ్చు భౌతిక దేహం,
హృదయం మాత్రం కరగదు!

కారుణ్య ప్రాబల్యానికి
కరగవచ్చు హృదయం - కాని,
ఆత్మస్వాధీనం కాదు!

ఆరాధన ప్రాబల్యానికి మాత్రమే
ఆత్మోపరతి సాధ్యం!
త్వమేవాహం సిద్ధం!

దౌర్జన్యం పాశవ ప్రకృతి,
కారుణ్యం మానవ ప్రకృతి,
ఆరాధన దైవీయ ప్రకృతి!
హృదయం కావాలంటే జాలిపడు!
ఆత్మే కావలిస్తే ఆరాధించు!

# ఇవతలి వొడ్డుకు

చంద్రికా ప్రణయ సింహాసనం పై
మనోజ్ఞ మాఘ పూర్ణిమ!
అద్దరిని పని చూచుకొని
ఇద్దరికి బైలుదేరాను నేను,

గౌతమీ తరళ తరంగాలపై
నావలో – ఒక్కణ్నే!
కోటిపల్లి రేవులో బైలుదేరి
మెల్లగా కదిలింది నావ!

దిక్చక్రం అంచుకు
బారెడు దూరంలో జాబిల్లి
ఆశాలత ఎగురవేసిన
బెలూనులా ఆడుతోంది!
గాలిలేదు!

కెరటాల తెల్ల త్రాచులకు బెదరి
పారిపోయిం దెక్కడికో అది!
ముమ్మిడివరం బాలయోగి చేతనలా
తెరచాప నిశ్చలంగా వుండిపోయింది
కొయ్య నంటి పెట్టుకొని!

చుక్కాని సంస్కారం వెనక బలంగా
ఇద్దరి సువాసనలేవో ముందుకు నడిపించగా
మెల్లగా పోతున్నది నావ-
అలల అందెల వలపు కలిమితో
అమృతమూర్తినే వెంట తెచ్చుకొంటూ!

చీకటి దుప్పటి ముసుగు పెట్టుకొని
చెట్లు కునుకుతున్నాయి దూరంలో;
అక్కడక్కడ లంక పొలాల మకాములలో
జొన్నచొప్ప చలిమంటల చుట్టూ
కూర్చున్నై ఏవో కాలభూతాలు!
అంతా నీరవ నిశ్శబ్దం!

భుజాల వరకు వెన్నెల శాలువ కప్పుకొని
నిద్రపోతున్నది ప్రకృతి రాకేందుముఖి!
నీవూ నిద్రిస్తూంటా వీ సమయంలో!
అక్కడక్కడ నల్లని మబ్బుతునకలు
దోమల్లా ముసురుతున్నాయి
చుక్కల దోమతెరపై కెగబడి!

తారా మణీ మహితాందోళిక నెక్కి
చంద్రుడు పోతున్నాడు ఆకాశం అద్దరికి!
ఇద్దరికి తరిస్తున్నాను నేను
నా హృదయాందోళికలో
నీ ప్రతిమ నుంచుకొని
నీ కోసం!

అద్దరి దూరమైపోతున్నది,
అద్దరి తీరంలోని లైట్లలో ఒకటి
చంద్రుణ్ని అనుసరిస్తున్నదో అన్నట్టు
ఉత్తర పైకి లేచింది!

జీవనదీ ప్రవాహం నడిమధ్యంలో
ఒంటరి ప్రయాణీకుణ్ని నేను!
ఎంత నిర్మలంగా వుంది రేయి!
ఈ క్షణంలో నా ప్రక్కను నీవుంటే?
ఎంత మధురంగా వుండేది ప్రయాణం!

వెన్నెల కెరటాలపై
వెండి చేపలు ఎగిసిపడుతున్నై
ఎక్కడో నీటి గద్దలు
రామనామం జపిస్తున్నై
పల్లీల చేపల దోసెలు దున్నలవలె

దూరంలో జీవవేధ చేస్తున్నై
నగ్న నిసర్గ సత్యంలా వుంది రేయి!
ఈ క్షణంలో నీవు నా ప్రక్కను వుంటే?
వుంటే - ఎందుకు వస్తా నిద్దరకి నేను?
అద్దరి ఇద్దరి లేని ఈ నడిమధ్యంలో
ఈ తరుణేందు ప్రభా తారళ్యంలో
ఎగువకు నడిపించనా ఈ నా నావను?

హిమగిరి శిఖరాలను దాటి
క్షీరాబ్ధికి పట్టించనా దీన్ని?
అక్కడ నీకూ నాకూ ఒక
సుందర నందనాన్ని నిర్మించనా?
నీకోసం దాటుతున్నాను ఈ స్రవంతిని!
నీ కోసం వస్తున్నాను ఇద్దరికి నేను!
అద్దరి దూరమ్మై, మాయమ్మైపోయింది,
ఇద్దరి ఆనడం లేదు!
అద్దరి అంతా శూన్యం నాకు,
ఇద్దరిని నీవున్నావు నా కోసం!

చీకటిలో, చీకటి నడుమ పుట్టి
వెలుగుకు అలవాటుపడ్డ నేను
గిలగిల లాడిపోయాను క్షణం

ఎదర వెలుగు కనిపించక!
నావ కదుల్తూనే వుంది మెల్లగా,
మెల్లగా పోతున్నాడు చంద్రుడు;
నా మనస్సు-
నీ దగ్గరకూ - నాదగ్గరకూ
పరుగులు పెడుతూ
నురగలు కక్కుకొంటోంది!

తరగలతో కలిసి
తల బాదకొంటోంది నావ కమానుపై
పాపం మనస్సు!
నిన్ను నా దగ్గరకూ
నన్ను నీ దగ్గరకూ చేర్చాలని
పడుగులో నాడిగా పరుగులు పెడుతూ
అల్లేస్తూ వుంది మన మధ్య
అనురాగ రాగరత్న దుకూలాన్ని!

చిత్రించేస్తూ వుంది దాని నిండా
నీ మనోజ్ఞ ప్రతి రూపాలను!
తానే ధరించేస్తూ వుంది నీ రూపాన్ని
ప్రతి వసుమూర్తిలోను
నా ఆనందం కోసం!

చంద్రబింబం నీ ముఖంలా వుంది!
వెన్నెల శాలువ మెల్లగా తొలగించనా?
దాని అంచులు పట్టి గుంజి
నిన్ను క్రిందికి లాక్కోనా?
ప్రకృతి ప్రతిమూర్తిలోను నిన్నే చూస్తూ
నావనే మరిచాను నేను!

వచ్చేసింది ముక్తేశ్వరం రేవు!
కోటిపల్లి పుణ్యఫల కోటిని
ముక్తేశ్వరీ పదాంగుష్ఠమౌక్తికాల కర్పిస్తూ!
నావ దిగి ఒడ్డెక్కాను నేను నీ కోసం!
లోన, బైట, చుట్టూ గాఢంగా
నన్ను పొదివికొనివున్న నీ కోసం!

తీరానికి ఇంకా ఎంతో దూరంలో
చంద్రుడు క్రుంకే చోట
ప్రొద్దులా పొడిచే నీ కోసం!
అనంతకాల స్రవంతిని తరించి
ఇద్దరి జీవనతీరం చేరిన నన్ను
తెరచిన కౌగిలిలో
ఉక్కిరి బిక్కిరి చేసే నీ కోసం!

## ఒక్క ముద్దు కోసం

ఇంత సాహిత్యం నేను చదువుకొన్న దెందుకు?
నీ పేరు పలకడం కోసం!
ఇంత సంగీతం నేర్చుకొన్న దెందుకు?
నిన్ను నోటార పిలవడం కోసం!
ఇన్ని రంగుల్ని కలుపుతున్న దెందుకు?
నీ సహజ రూపాన్ని చిత్రించడం కోసం!
ఇన్ని భంగిమలు అలవరచుకొన్న దెందుకు?
నిన్ను సిసలుగా అనుకరించడం కోసం!
అసలు–
నే నింత దూరం వచ్చిందెందుకు?
మధురమైన నీ అధర బింబంపై
ఒక్క ఎర్రని ముద్దుకోసం!

## జీవిత పుణ్యక్షేత్రం

ఒక మహాక్షేత్రంలో తీర్థప్రజవలె
అందులేని ఆలోచనలు!
ఎక్కడి నుంచో, ఎక్కడికో, ఎందుకో
పడతోసుకుపోతున్న ఆలోచనలు!
తొడ తొక్కిడిగా వుంది నా బుర్ర
ఎందుకో ఆ ఉదయం నుంచీ!

తొడతొక్కిడి, రద్దీ, గోల
గాఢమై, సాంద్రమై, దుర్భరమై పోగా,
తెగేదాకా వడిపెట్టి లాగిన తాడులా
మెదడు నరాల పోగు సొమ్మసిలిపోగా,
స్తంభించిపోయాయి ఎక్కడివక్కడే
ఆలోచనలు!

ప్రతిమల్లా ఆలోచనలు!
రకరకాల రంగురంగుల ఆలోచనలు!
ఉత్సవానంతర క్షేత్రస్థలం వలె
యుద్ధానంతర కురుక్షేత్రం వలె
నిర్జీవ మహాజడ భారంతో
బుర్ర బీభత్సమైపోగా-
ఈ కశ్మలాన్నంతా తుడిచి
ఏట్లో పారబోద్దామని
బైలుదేరాను వైనతేయం వొడ్డుకి ఆ సాయంత్రం!

## 2

ఆంధ్రభూరమా హంసోత్తరీయం
వైనతేయం!
నా హృదయం!
గోదావరి శాఖ వసిష్ఠకు శాఖ వైనతేయం!
ఋతుకాంత లారుగురూ
కలిసి కాముని పూజించే
నిత్య వసంతాలయమ్మైన మా సీమకు
నూగారు వైనతేయం!

జనం గుంపులుగా పోతున్నా రెందుకో!
ఆలోచనల రభస నుంచి
విముక్తికోసం పోతున్నారేమో నాలా!
మానవజాతిని పట్టి పీడిస్తున్న
మాయలోరి ఆలోచనలు!
నిశ్చింతగా నీలోత్పలంలా బ్రతక్కుండా,
శూర్పణఖల్లాంటి ఆలోచనలు!
జనం గుంపులుగా పోతున్నారు
బంగారు పంటచేల గట్ల వెంట
అవతరించిన పర్వదేవతల్లా!

నీ రెండలో వాళ్ళ నీడలు
సరిగంగ స్నానాలు చేస్తున్నై!
వ్యక్తులు వేరు, నీడలు ఒకటే!
సాయం సంధ్య!
సంధ్యా సూర్యుల అనురాగ రసంలో
ఓలలాడుతూ పోతున్నారు జనం-
మహితమ్మైన ఏ క్షేత్రంవైపో!
మధురమ్మైన ఏ శ్రేయం కొరకో!

నేనూ అనుసరించాను వాళ్ళని
వాళ్ళలో ఒకణ్ని అయి!

## 3

ఔను – పర్వదినమే అది!
వైనతేయ తీరంలో
ప్రకృతి సౌందర్య పద్మానికి
కర్ణికలా వెలసిం దొక ఆలయం,
జీవిత దేవతాలయం!
ఆనాడు ~~ఈ~~ పుణ్యక్షేత్రంలో
అదృష్టదేవత కల్యాణోత్సవం!
దివిభువుల సమాగమోత్సవం!

స్వర్లోకం ఉన్నదున్నట్టు
మా సీమకు అవతరించిందో అన్నట్టు
హంస యానలు

ఐరావత గమనలు
వివిధాలంకార భూషితలు
సౌందర్య రాశులు
సహస్రదళ పద్మ సువర్ణ దళాల వలె
విరిశారు ఆ దేవాలయం చుట్టూ,
బహుముఖాల దారుల నుండి,
బహువిధాల వాహనాల నుండి!

గుంపులో, తొడతొక్కిడిలో
ఎలానో ముందుకు తోసుకుపోతూ
క్షేత్రం చేరాను నేను!
ఒంటరిగా వున్నప్పుడు ఆలోచనల తీర్థం,
తీర్థంలో వున్నప్పుడు ఒంటరి నా బుర్ర!
నా లోపలి ఆలోచనా పరంపర అంతా
బైట విరిసినట్టుగా వుంది క్షేత్రం!
చీకు చింతల సాలెగూడుల్నీ
అనుమానపు గబ్బిడాయిల రెట్టల్నీ
సమస్త కశ్మలాన్నీ వూడ్చేసి,

నవీకరించి, అలంకరించి,
ఎవరికోసమో సిద్ధం చేసిన
శృంగార మందిరం అయినది నా మనస్సు అప్పుడు

వైనతేయపు హస్తపల్లవాల సెత్తావులు సోకి!
ఆ యెవరి కోసమో
వొళ్ళంతా కళ్ళు చేసుకొన్న హృదయంతో
ప్రాంగణంలో నిలబడ్డాను నేను!

వర్షానికి దూత మెరుపుతీగ,
చిత్తానికి "పియే" అంతరాత్మ!
హృదయానికీ హృదయానికీ మధ్య
స్నేహతంత్రీ వార్తా తరంగం అది!
ఆ యెవరో నీ వని

ఎవరో చెప్తున్నారు నాకు-
జనన మరణ తీరవతీ పరప్రతీరం నుంచి:
నీ ప్రేయోరూపం
జన్మజన్మాల మధురారామాల నుంచి
టెలివిజను చిత్రంలా
పడుతున్నది నా మనః ఫలకంపై!
అపూర్వ సుందర సుందరి
అనురాగ రాగశాలిని

నా కోసం
నా వెంట
అనాది కొస నుంచి
అనంతత్వంలోకి దూకిన సాహసవతి
ఆత్మకు చిరపరిచితగా
అంతరాత్మకు యజమానినిగా
నా హృదయ నేత్రాల ముందు
నవ్వుతూ నిలబడింది వచ్చి!

వాస్తవంగా కట్టెదుట మాత్రం
ఒక్కటే జనం! జనం! జనం!
వస్తున్నారు పోతున్నారు ఎందరో!
ఆలయ ప్రాంగణంలో నిలబడ్డాను
అందర్నీ తప్పకుండా చూడవచ్చని !

అందాల రాశులు
హాసంలో ఆనందం చిందుకొంటూ
వస్తున్నారు, పోతున్నారు !
అందులో
ఎందరో నీ వంటి వాళ్ళు
ఒక్కరూ నీవు కావు!

అలా ఎంతసేపు నిలబడ్డానో
శిలాప్రతిమ నైపోయి!
ఆలయాంగణ స్తంభానికి
అతుక్కుపోయి!

## 4

వీణామండలం నుంచి
ఏదో మంగళ గీతాలాపన!
తారామండలం మొత్తం
కదలింది ఏ తీర్థయాత్రకో!
అనంతమైన యాత్రాపథంలో
ఏదో ఒక కాంతి మజిలీలో
ఏదో ఒక లీల
ఒక అభిరతి
ఒక చాలనం
సహస్ర దళ పద్మంగా వికసిస్తే
అది మహావిష్ణు పాదపద్మమైతే
అక్కడ గంగామతల్లి ఉద్భవిస్తే
ఆమె శివుని జటా జూటం చేరితే
అందు వెన్నెల పువ్వుపూస్తే
దాన్ని ధరించిన గౌరి తల దువ్వుకొంటే
దువ్వెన నుండి అమృతం చిందితే

బైలునిండా చిందిన ఆ బిందుకోటిలో
ఒక కణం
సప్తస్వరాలతో
సప్త వర్ణాలతో
సప్తర్షి మండల మకుట ధారిణియై
నిత్యం నృత్య భ్రమణ శీలయై
విడంబిస్తే-

ఓహో! దివ్య దర్శనం!
చూస్తున్నాను రెప్పవాల్చకుండా!
జలం బద్ధకించి జడం కాగా,
ఏర్పడ్డ బకాయిల్లాంటి లంకలలో
ఒక చిన్ని సీమలో
హిమవచ్ఛిఖరాగ్రంపై
వికసించిన జీవన రాజీవం నుంచి
ఒక మధు బిందువు జారింది!

దిగివచ్చింది రత్నసానువు నుండి
పద్మం నుంచి పద్మానికి దూకుతూ
సూర్య చంద్ర తీరాల నడుమ
హంసలా ప్రవహిస్తూ!

అంతలో ఎగిసిపడి
ఎక్కడో అదృశ్యమైపోయి
హేమాగ్ని కుండం నుంచి వలె
ఆవిర్భవించిం దొక దివ్య కన్యగా!

సజల నేత్ర సమాదర్శంలో
విశ్వరూప ప్రతిబింబం!
ఎంత చక్కని కల!
కల చక్కిలిగిలి పెట్టగా,
ప్రతిమా రూపం చలించి,
రెప్పవేసి చూశాను నేను!

ఆశ్చర్యం!
ఎదురుగ్గా ఎవరు?
నా ప్రతిమా రూపంలో
నిక్షిప్తమైన శిల్ప సౌందర్యాన్ని పరికిస్తూ
ఆనందిస్తున్న ఆ దివ్య కన్య!

ఆ నీవు!
అద్భుతపడి
నిగ్రహించుకొని,
నీ ఆనందం కోసం
మళ్లీ ప్రతిమనై పోవాలని,

మరచిపోయి
కళ్ళు మూసేసుకొన్నాను వెంటనే!
కాని–
కనిపెట్టేశావు నీవు!
నా పొరపాటే
అదృష్టదేవత కరుణా కటాక్షమయింది నాకు!
నా కలలోని నిన్ను
తెచ్చి నా కర్పించింది వైనతేయం!

నా ఆనందోత్ఫుల్ల హృదయం!
ఆలయ కల్యాణ మంటపంలో
ఒకటే తీర్థ ప్రజ!
జీవిత పుణ్యక్షేత్రంలో
నీవూ, నేనూ!

## మంత్ర బలం

కో – అన్న ఒక్క అక్షరంతో
ప్రకృతికే పులకాంకురాలు మొలిపించి
పువ్వులు పూయించేస్తున్నది కోకిల !
ప్రియా – అన్న రెండక్షరాలతో
అద్వైతాన్ని ద్వైతంగా మార్చివేసి
ఆనందాన్ని సృష్టించాను నేను ఆ పూలనిండా !

ఆనందం బ్రహ్మ-అది నాదం,
నాదానికి రూపం అక్షరం,
ప్రతి అక్షరం బీజాక్షరమే
ప్రతి మాటా మంత్రమే, మనిషికి!
తెలిసి తెలివిగా వాడుకుంటే
అక్షరాలే అక్షరలక్షలు పండుతై!
మాటలే మాణిక్య వీణ లవుతై!
బెడిస్తే - కస్సున లేస్తై అవే మిన్నాగులై!

కనుక, ప్రియతమా! ఇవిగో
ఆనందసుధా నిక్షేపాలు, పూలు!
మాధుర్యం నింపుకో బ్రతుకు నిండా,
మంత్రముగ్ధం చేసెయ్యి జగత్తు నంతా!

అర్థంలేని ఝుంకార మాత్రంతో
అల్పకీటకమే సుందర పతంగ మవుతున్నప్పుడు
అర్థంగల మాటల మంత్రబలంతో
అర్థాంగం ఎందుకు లభించదు నీకు ఐశ్వర్యంలో?
ఎందుకు మారదు లోకం?
ఎందుకు చేరదు గమ్యం?

## గాలి పటం

గాలిపటం వదులుతూ మైదానంలో నిలబడ్డ నీకు
అది ఎంత ఎత్తుకుపోతే అంత సంతోషం కదూ?
గాలి చాలకో, వీలు చాలకో అది గిలగిల కొట్టుకొంటుంటే
గిలగిల కొట్టుకోదా ప్రాణం నీకు కూడ?
చల్లని గాలివాటుకు చేపలా ఎదురెక్కుతూ,
మింటి కొలను నాచు నీటిలో మునకలు వేసే

కలువ కన్నెలతో దోబూచు లాడుకొంటూ,
పైకిపైకి పోతున్నది గాలిపటం!
ఇదేదో మీనరాజ మనుకొని
రేవతి కన్నుకొట్టిందో యేమో,
ఇదే తన పతంగ నామసార్థక్యం కోసం
గరుడమండలంపైకి దాడి తలపెట్టిందో యేమో !
ఏది ఏమైనా కానీ-

పోనీ దాన్ని పైకి! ఇంకా పైకి! మరీ పైకి!
నీ చేతిలో దారం వున్నంత మేరకు!
గాలి అందుకొని, వాలు జోరైనప్పుడు
దారం బిగించి పట్టకు, తెగిపోగలదు గాలిపటం;
తెగిపోతే, మరి నీకు దక్కదది!

గాలిలేక పడిపోతుంటే
చుట్టుకో దారాన్ని, చేదుకో గాలిపటాన్ని!
చేతిలో దారం వున్నందుకు ఫలం
గాలిని బట్టి పటాన్ని ఆడించడమే!
చీకటిపడ్డా, ఆట ముగించకు,
అది నీ హృదయాన్ని వెన్నెల తారల కందించే సూత్రధారిణి!

# హేతుభూతం

మల్లెపూల లోకి
మందార గంధం ఎలా వచ్చింది?
మామిడిపూల గెలలు
మద్యవాసన కొడుతున్న వేమి?
వేపపండుకు తీపి,
చెరకు రసానికి వగరు,
ఎలా వచ్చాయి?

ఎవరివి, నాయనా, ఈ ప్రశ్నలు?
నానా సూన సువాసనా రుచులతో ఆనందించే
సారంగ చక్రవర్తివా, నీవు?
హారి – భగవంతుడా!
సిగ్గెందుకు లేదయ్యా నీకు, ఈ ప్రశ్న అడగడానికి?

## ప్రణయ తపఃఫలం

నలిగిన మల్లెపూలను
కురుల నుండి విదల్చివేసి
మాసిన వెన్నెల చీరను
విప్పి పారవైచి

సహజ రాగ సుధా సరస్సులో
స్నానంచేసి
చిరునవ్వు సంజ దీపం వెలిగించి
బడా చుక్క కుంకుమ బొట్టుతో
గుబగుబ లాడుతూ
ఉదయినీ దేవిలా
వచ్చి
నా ముఖమా చూశావు?
నా పాదాలనా స్పృశించావు?
నా గుండెలకా హత్తుకుపోయావు?

సౌందర్యాగ్ని మధ్య నిల్చి
అంత ప్రణయ తపస్సు చేసి
దివ్యాదైవ పీఠంపై నీవు నిల్పుకొన్నది
నన్నేనా?

## నీ-నా

ఊహ ఉత్తరలా ఉదయించింది
కోర్కె కౌంజిగురై పులకించింది!
మాట పాటలా పరిమళించింది
మనసు తోటలా కువకువ లాడింది!
చూపు తూపులా గ్రుచ్చుకొన్నది
నిగ్రహం రెండుగా విచ్చిపోయింది!
నోరు నిప్పులా కరిచి
హృదయం వెన్నలా కరిగింది!
కౌగిలి కల్యాణ మంటప మయింది
శరీరం హారతి కర్పూరమై వెలిగిపోయింది!

## నాకు తెలుసు

నన్నింతగా రసభావోన్మత్తుణ్ని చేసిన
అపూర్వ సౌందర్య సుధావారాశివి
నీ వెవరో నాకు తెలుసు!

అలనాడు పరమశివుణ్నే వెంటబడజేసుకొని
మనోవిరథుణ్ని చేసి యేడ్పించిన
విశ్వమోహినీ పశ్చాద్విరహ తాప కణం నీవు!
నా అనంత జననాంతర సువాసనా పటలికి
ఆలంబనమై వికసించి గుబాళిస్తున్న
ఉషఃకిరణ రజోరజిత రాజీవనీ రమ్యవు నీవు!
చిరునవ్వు దీపం పెట్టి,
గిల్లి జ్ఞాపకం చెయ్యనవసరం లేదు-
నీ వెవరో నాకు తెలుసు!

## నా చీకటి

చీకట్లో దారీ తెన్నూ కానక
నే నలానే నిలబడిపోయి నప్పుడు,
నా చుట్టూ వెన్నెల కాయువచ్చిన
రాధా పూర్ణిమవు నీవు!

పచ్చని నీ పూర్ణ చంద్రువదన బింబం
నా తపఃఫలంలా
అమృతరసం చిప్పిలుతూ
నా పెదవుల కందినప్పుడు,
కన్యక చేతి మల్లెపూల పొట్లం పిగిలి
రోదసినిండా చెల్లాచెదరు కాగా
విశాఖా గుళుచ్ఛం నీ జటలో వ్రేలుతూ
నా ముఖంపై గుబాళించి నప్పుడు,
ఏదో మహేంద్రజాలంలా
నీ వెన్నెల నేను కాస్తున్నప్పుడు,
అప్పుడు తెలిసింది నాకు
నాకు అదృష్టమై నిన్నిచ్చి నట్టిది
నా చీకటే అని!

## సత్యం-శివం-సుందరం

తలనిండా మల్లెమొగ్గలు పెట్టుకొని,
నుదుట విదియ జాబిలిని దిద్దుకొని,
కన్నులలో నల్లకల్వలు వికసించి
వాల్చూపుల మదిరాధారలు నిండి
సోకిన నెలవుల నెల్ల
మైకంలో ముంచివేస్తుండగా,
కపోలాలు ఎర్రగులాబీలై
వాంఛా మాధుర్యాలను గుబాళిస్తుండగా,
నిలువెల్ల వెన్నెల కాస్తూ
మోహినీ మంత్ర దేవతవలె వచ్చి
ఎదుట నీవు నిలబడ్డప్పుడు-
నీ దరహాస రుచి కంటె సుందరం
నీ అనురాగ వీక్షణ కంటె శివం
నీ ఆనంద రూపం కంటె సత్యం
ఏముంది నాకు జగత్తులో?
నీవు తప్ప-
ఏమున్న దింక జగత్తు మాత్రం?

## సమస్తం నాదే

పూచే ప్రతి పువ్వూ నాదే!
పాడే ప్రతి పాటా నాదే!
మెరిసే ప్రతి మెరుపూ నాదే!
కురిసే ప్రతి జల్లూ నాదే!

సుధాకరుని వెన్నెల పానశాలలో
మైకంలో మునిగివున్న నాపై
అమాంతం గాఢంగా వాలి
ముద్దులతో గ్రుచ్చెత్తి
గుండెలకు హత్తుకొన్న నీలో
పొంగే శృంగారం అంతా నాదే!
పొదిగే మాధుర్యం సర్వం నాదే!
నేను కానిది సమస్తం నాదే!

## పూర్ణ విభూతి

నిన్ను ముఖాముఖి దర్శించిన భాగ్యవంతులకు
కోటి సూర్యప్రభవు నీవు!
నిన్ను వెనుక నుంచి చూచిన సన్యాసులకు
నిర్వికల్ప సమాధివి నీవు!
నిన్ను ప్రక్కల నుంచి మాత్రం తొంగిచూచిన విజ్ఞులకు-
ఊర్వశివో, మహంకాళివో నీవు!
నాకు మాత్రం
ఉభయ సంధ్యా దివారాత్ర సంపూర్ణమైన
పరిపూర్ణ మధుర మూర్తివి నీవు!
రమ్యరాధా రాకాసుధాఝరివి నీవు!
ప్రేయసివి నీవు!

## ఉగాది పచ్చడి

ఎందుకలా ముఖం చిట్లించావు, దేవీ?
ఉగాది పచ్చడి చేదుగా వున్నదనేనా?
ఏడుస్తూ ప్రారంభించిన మన యాత్రను
నవ్వుతూ ముగించవలసి లేదా మరి?
ప్రతి ఉగాదీ మన పుట్టిన రోజు పండుగే!
చేదును విరిచి తీపిని సంచితం చేసే పండుగ!
ఎంత చేదువుందో మన అభిరుచిలో
ఎంత తీపి బాకీపడ్డామో వసంతుడికి!
వాయిదా మొత్తం
కాస్త ఎక్కువగానే చెల్లిస్తాం!
తీసుకో మరి కొంచెం పచ్చడి!

## పల్లేరుకాయల పండుగ

అడుగడుక్కీ ఏవో సమస్యలు
కసుక్కున గుచ్చుకొంటున్నై!
నవ్వుతూ పోతున్నావు నీవు,
నీకు బ్రతుకొక పల్లేరు కాయల పండగ!

భరించలేక త్రొక్కిసలాడుతున్న కొలదీ
మరీ కంపల్లో ఇరుక్కుపోతున్నాను నేను!
నిజంగా, నా ప్రక్క నీవు లేకపోతే
పండక్కీ, పల్లేరు కాయకీ
సంబంధం తెలిసేది కాదు నాకు!
విఘ్నాలకు కూడ ఒక ఈశ్వరుడు మనకు!
సర్పాలు కంఠమాలలు అతడికి!
నీ వెనుకనే వస్తున్న నాకు
భయం ఎందుకులే, పద!

## ఒక జత దుస్తులు

పులిలా శాలువా కప్పుకొంటే పండితుడు,
ఈత రుప్పలా తలపెంచుకుంటే కవి,
చెక్కిన శిలలా సూటు వేసుకొంటే అధికారి,
తెగిన గాలిపటంలా తోకజాడిస్తే అగమ్మకాకి!
పంచె కడిచే పురుషుడు,
చీర కడితే స్త్రీ!

మనుషుల్నీ మనస్తత్వాల్నీ
వేషం చూచే పోకోల్చుంటాం తరుచు!
ఈ వేషాలు మనం వేసుకొన్నవి
ఈ దుస్తులు మనం మార్చుకోగలవి!

పరమేశ్వరుడే మనకిచ్చిన దుస్తులు శరీరాలు,
ఉద్రేకపడి మాపుకోకు వీటిని!
జాతికొక జత మాత్రమే ఇవి,
భద్రంగా వుండనీ మన జతను,
ఈ మంజు వసంత మంజూషలో
ఈ కర్పూర గుళికా చంద్రికా సువాసనలలో
చలువ మడతలు చెరగకుండా!

## మన కథ

ప్రతి జీవితమూ ఒక కథే
చిన్నదో, పెద్దదో
సుఖాంతమో, విషాదాంతమో
ప్రధానమో, అప్రధానమో
ప్రతి జీవితమూ ఒక కథే
ప్రతి గృహమూ ఒక నాటకరంగమే!

అనుభూతి చాలని వాళ్ళు
ఆనంద పరిపూర్తికై
సంపూర్ణ జీవిత కథనాలను
చదువుతారు పుస్తకాలలో
వింటారు రేడియోలలో
చూస్తారు వెండితెరలపై
చిత్రించుకొంటారు మనఃఫలకాలపై
గుండెల్ని పూడ్చుకొంటూ
తరిస్తూపోతారు ముందుకు!

తమ అనుభూతిలో తాము
తల మున్కలైన వాళ్ళు
ఆనంద పారవశ్యంలో
పారమ్యం చేరినవాళ్ళు

అంతర్ముఖులై
ఆత్మైక్యం పొందినవాళ్ళు
మనలా వుండిపోతారు
ఒకరిలో ఒకరై-
ఏకాంతంగా
ఒక మహాకావ్యంగా!

## కౌతుక కలలు

చెడ్డకల ఏదో వచ్చిందని
కలగి కన్ను లొత్తుకుంటున్నావు నీవు,
ఒక పాడు కర్మ కలలోనే తీరిపోయిందని
ఆనందంగా వుంది నాకు!
తడిసి తేరుకొన్న
ఆ పద్మదళాలే చెపుతున్నై సత్యం!

సుఖ స్వప్నం వచ్చినప్పుడే చింతపడతాను నేను
అంత సుఖం స్వప్న మాత్రమై పోయిందే అని!
జన్మలుగా రూపుకట్టడానికి చాలని
పురా సుకృత దుష్కృత కర్మలు
నవ్వించో, ఏడ్పించో పోతాయి కలల్లోనే
ఇంటికి అతిథులుగా రాలేని దొంగల్లా!
లేక – వెన్న దొంగల్లా!

ఎంత భీకరమైనట్టిదైనా సరే
పురాకృత దుష్కర్మల దోషాలన్నీ కలలైపోయి,
ఎంత చిన్నదైనా సరే సుకృతం
వాస్తవంగా
ఒక్క మల్లెమొగ్గగా నైనా
వికసింప జేయగల్గితే నన్ను!

నీ జటలో నా చిరునవ్వు
నీ పెదవిపై జిగేలు మనదా?
సంసారం దుఃఖసాగరం కాక
ఆనంద సుధాకరమే కాదా?

## శివలింగం

ముద్దరాలైన మాధవీ లతిక
మామిడిని ముద్దుముద్దుగా పెనవేసికొని
పెనుజొంపమై ఆక్రమించి
పువ్వులతో నింపివేసింది చెట్టంత చెట్టును !
తనను అనుభవించడానికి పిల్చిన తేటిని
తానే అనుభవించసాగింది పద్మం-
మునిమాపు వేళ. సందెవెన్నెల దుప్పటి క్రింద,
వెచ్చని తన కౌగిలిలో బిగించి వేసుకొని !

మలయానిల కుమారుల ముఖాలపై
మంజీరాలు శింజించే మేఘమాల
ఉజ్జ్వలమై విజృంభించి, విరుచుకుపడింది
నభోమంచంలో జ్యోతిర్దేవదేవునిపై !

చంద్రశేఖరు జటాజూటం నుంచి జారిన గంగ
ఉద్రేకంతో పరమవేగం పుంజుకొని
మహాసముద్రుణ్నే ముంచివేసింది!
ఉప్పునీరు చప్పనీరై పోయింది!

పరాపర పరాంకోటి కోటీశ్వర భీమశక్తి
ప్రకృతే పరాక్రమణ కాంక్షతో పై కొస్తున్నప్పుడు
పరమ
శివుడైనా ఏం చెయ్యగలడు-
శివలింగమై నిల్చిపోక?

## తరుణోదయ వేళ

పాత్ర ఒకటి చేతపుచ్చుకొని
కొంచెం పాలకోసం ఎన్ని కొట్టాలు తిరిగానో!
పాత్ర నిండా పాలు నింపుకొని
రవంత చక్కెర కోసం ఎంతగా చెమ్మటోడ్చానో!

నా నీడే ఒక అంధకార గాఢ నిశీథమ్మై
న న్నావరించుకొని కూర్చున్న దింతకాలమూ!
తలనిండా పువ్వులు పెట్టుకొని
నల్లకల్వల పట్టుశాలువా కప్పుకొని
వెన్నెల విరజిమ్ముకొంటూ వచ్చావు నీవు-

పగలు పూలకన్నెల రంగులకు బెదరి
రాత్రి బైలుదేరిన కాముని పున్నమిలా!
ఏ కళాతారల విశ్వపర్యటన దళానికి
నాయకత్వం వహించావో నీవు ఇన్నాళ్ళూ!

పూలు పూలగుత్తులు, ఒక్కొక్కటే వాడి రాలిపోతున్నా
క్రొత్తవి ఎప్పటికప్పుడు పొటమరించి వికసించగా,
తనను తానే నాకికొని పూరుతున్న
జాబిల్లి చక్కెర బిళ్ల నీ సిగపూవున వుండగా,
నీ పాదపద్మాకరమే క్షీరసాగరమ్మై

కెరటాలు వేసుకొంటూ నీ వెంటరాగా,
నా కుటీరాన్నంతా పరిమళంతో నింపావు నీవు!
నా బ్రతుకునే మాధుర్యంలో ముంచావు నీవు!
అవును-

నీ వొక్కసారి అనుకోవాలే గాని,
ఏ యెడారి సస్యశ్యామలం కాదు?
ఏ నిశీథం వెన్నెలతో నిండదు?

## పూర్ణిమ కేసి

చీకట్లో చీకటి ప్రోవు ఆ మైలురాయి!
అది కాలాన్ని దూరమానంలో కొలుస్తూ
శతాబ్దాలుగా నిలబడివున్న దక్కడ!
ఏమిటి వెతుకుతున్నావు దాని నొసట!

ఎంత దూరం వచ్చావో
గమ్యం ఇంకెంత దూరమో
తెలుస్తుందా అక్కడ?
అక్కడుండేది
దాని నుదుటి వ్రాత,
నీ నుదుటి వ్రాత కాదు!

చీకట్లో వెన్నెల ప్రోవువు నీవు,
నీ నుదురు శుక్ల విదియ,
ఎంత దూరం వచ్చావో
గమ్యం ఇంకెంత దూరమో
చూచుకోవలసినవాడు చంద్రశేఖరుడు!
నీ విక లేచి పద!
మన వచ్చే మజిలీ చైత్ర పూర్ణిమ!

# భరించగలను

ఎంత ఉక్కగా వుంది!
చల్లని నీ నిట్టూర్పు సువాసనల ముందు
ఇదేపాటి బాధ?
ఎడతెరపిలేని ముసురుగా వుంది!

నీ వలపు వెల్లువలో తలమున్కలుగా ఈతకొట్టే నాకు
ఇదొక వరప్రసాదమే కాదా?
అబ్బ-ఎంత చలిగా వుంది!
నీ వెచ్చని కౌగిలింతలో
నుసినుసి అయిపోదా ఇది?

ఎంత నీరసంగా వుంది!
నీ చిగురు మొగ్గల మొనల ఉత్తేజపు ఇంజెక్షనులకు
కరిగి చక్కాపోదా జడత్వం?
నిదా ఘామధ్యం దిన పంచాగ్ని జ్వాలలు
ప్రళయ భీకర వజ్రాపహాస కశాఘాతలు
హేమంత నిశీధాంతర హిమమచ్ఛిత మరుత్తులు
ఎన్నైనా సహిస్తాను నీ కోసం!

సర్వబాధా నివారిణీ ప్రేమసుధా గుళికవు నీవు
సర్వశ్రియంకరీ శాంకరీ కృపాదరస్మేరం నీవు
ఎన్నైనా భరిస్తాను నీ కోసం!
ఏమైనా త్యజిస్తాను నీ కోసం!

## ఉభయ సంధ్యామూర్తి

ఉత్సాహంతో లేచి
ఈలపాట పాడుకొంటూ
తువాలు భుజంపై వేసుకొని
తూర్పువాకిలి తెరిచాను నేను!
చెదరిన తల ముడుచుకొంటూ
నవ్వుతూ స్వాగత మిచ్చింది నాకు
ఉషఃకాంత!

అలసటతో లేచి
నిట్టూర్పులు విడుచుకుంటూ
చెమ్మట తువాలు పంచకు విసరి
పడమటి వాకిలి తెరిచాను నేను!
వేసుకొన్న జారుముడిలో
మల్లెమొగ్గలు తురుముకొంటూ
జాలిగా దగ్గరకు తీసుకొన్నది నన్ను
సాయంసుందరి!

## ఆ మూల పుష్పం

వేరు లేకుండా పువ్వులేదు,
పువ్వు లేకుండా వేరుంది!
ఆధిక్యత వేరుదే,
గౌరవం పువ్వుది!

పువ్వు-వేరు-
రెండూ రెండు కొసలు,
ఏదో ఒకటి
ఏదో ఒక కొస కాయక తప్పదు!

పువ్వు వేరైతే
వేరులా పోషణభారం వహించాలి!
వేరు పువ్వైతే
పువ్వులా లోకాన్ని మోహింప చెయ్యాలి!
అదీ ఇదీ, ఇది అదీ అవుతూనే వున్నైగా?
పనినిబట్టి విలువ,
స్థానాన్ని బట్టి పేరు,
వ్యక్తిత్వాన్ని బట్టి సాఫల్యం!

ఎందుకు మరి ఈ
అధికత్వాల్పత్వ వ్యర్థ కురుక్షేత్రం!

## విలయ వైభవం

మల్లెతీగ పూయక
పూతగురించి చెపుతోంది!
కోకిల పాడక
పాట గురించి ప్రసంగిస్తోంది!

మామిడి కాయక
కాపు గురించి వాగుతోంది!
మేఘం కురియక
వానగురించి మాట్లాడుతోంది!

అగ్ని మండక
మంట గురించి ఉపన్యసిస్తోంది!
అన్నం అరగక
అజీర్ణ గీతాలు పాడుతోంది!
విజ్ఞాన యుగం!

## విలయ వైభవం! హద్దుల్లేవా?

తన దొడ్లోనే తప్ప
మరెక్కడా పువ్వులు పూయ వంటున్నాడేమి టతడు?
తనకు పెట్టిన తోటలోతప్ప
రుచిగల పండ్లు పండనే పండవట!

అహంకారానికి
హద్దు ల్లేవల్లే వుంది!
పుల్లయ్యలాంటి అవతారపురుషుడు
క్రింద నుంచి ఎలా పుడతాడు (ట)!

తాను తింటున్న ప్రతి దుంపా
ఇంకా క్రింద నుంచే పుడుతున్న దంటే
ఆశ్చర్యపోయి
ఆహారం మానేశాడు మొన్నటి నుంచీ!

అజ్ఞానానికి
హద్దు ల్లేవల్లే వుంది!
పాదపూజలూ, పరమాన్నాలూ లేకపోతే
క్షణం బ్రతకలేని ఆసన్యాసి
వేదాంతం ఉపదేశిస్తున్నాడు, చూడు!

అందుకే ఆ మాగాణీ సుక్షేత్రం
"మెట్ట" అయి వూరుకుంది!
అనౌచిత్యానికి
హద్దు ల్లేవల్లే వుంది!

గుడి చుట్టూ ప్రాణాచారం పట్టే భక్తులు
పుణ్యం కోసం విసిరిన గింజలతో
ప్రొద్దులు పుచ్చుకొంటున్న ఆ పావురం
ఎత్తున ఎక్కడో గోపురంపై కూర్చుని,

వాళ్ళంతా తన నీడలోనే బ్రతుకుతున్నారని
సూర్యుడితో చెప్తున్నది, విను!
అసంస్కారానికి
హద్దు ల్లేవల్లే వుంది!

## చీకటిలో ఎవరు?

చీకట్లో ఎవరు నీవు?
దైవానివా? దయ్యానివా?
అదృష్టమువా? దురదృష్టమువా?
చీకట్లో ఎవరు నీవు?

నీ గుండెలోది కరుణమా? ద్వేషమా?
నీ చేతిలోది టార్చిలైటా? పిస్తోలా?
కాలవృత్తం ఇరుసుపై
పూర్ణవ్యాసం నా విహార భూమి!

చీకటి ఎంత విస్తరించినా
సరాసరి లెక్కకు
సగానికి మించదు గద?
అంధకారం ఎంత దట్టం అయినా
కళ్లు మూసుకొన్నప్పటి స్థితి కంటె
గాఢతరం కాదుగద?

గతం ఒక చీకటి భూతం!
ఏం జేస్తుందది నన్ను?
భవిష్యత్తు ఒక తమో విమోహిని!

నమ్మడం ఎలా దాన్ని?
వర్తమానపు వ్యాస భూమిలో
చీకటి పొలిమేరల నడుమ
వెలుగు పొడుగునా
ఇటూ అటూ కేరంతొక్కుతూ

గతం నుంచి నవజీవనాన్ని
భవిష్యత్తుకు తోడిపోస్తున్న
నిత్యకృషీవలుణ్ని నేను!
బెల్లిస్తున్నావో, బెదిరిస్తున్నావో నన్ను?

చీకట్లో ఎవరు నీవు?
అంతా కనిపిస్తున్నట్టే వుండి
ఏమీ కనిపించని చీకట్లో
ఎవరు నీవు?

## ఉన్న అందాన్ని చెరపకు

కరుణామయ ప్రణయశీల శైతల్యతకు
మధురాక్షర గాన పరా కోకిలలకు
ఆకరమైన సుందర సహకార వల్లిచే
పూజకు తెల్లగన్నేరు పూలు పూయించానని
గర్వపడుతున్నావా?

మంచి తోట మాలివే నీవు
కాని–
తోట యజమానివి కావు!
కుహు కుహూ మధుర మణిత స్వరాలకు
పునరుజ్జీవన సుధాకర రుచులకు
ఆకరమైన వసంత కోకిలచే
మూకలో కాకిగోల చేయించానని
గర్వపడుతున్నావా?

మంచి జీవలక్షణ పరివర్తక శ్రేష్ఠుడవే నీవు,
కాని–
లోక కల్యాణ కళాభిజ్ఞుడవు కావు!
అందాలు పనికిమాలిన వనీ
రసాలు లగ్జరీలనీ
మధుర భావాలకు మార్కెట్టు లేదనీ

అందుకని–

సమస్త రసభావ సౌందర్య నందనాలను
ఎక్కడి కక్కడ నరికిపారవైచి
పొగ తోటలు పెంచుతున్నానని–
గర్వపడుతున్నావా?
సరస్వతికి నర్సు దుస్తులు కుట్టించే
మరుని చేతికి మరతుపాకి అందించే
మంచి లౌకికుడవే నీవు!

కాని–

## లేడు - ఉన్నాడు

అమావాస్య
గాఢాంధకారం!
చంద్రుడు డేమైపోయాడో!
ఏమైపోతాడు? ఉన్నాడు!
ఉన్నాడా? ఏడీ?

లేడే! లేడు!
లేడా?
ఉన్నాడు! ఉన్నాడు!
ఎక్కడ?
శుక్లపాడ్యమి చరణ మంజీరమై!

కృష్ణ చతుర్దశి శిరోభూషణమై!
కాలభామిని కంఠదేశంలో
రేచుక్కల పమిటె క్రింద!
రాకానాయకమణీ యుక్త మాణిక్యహారం
వెనక ముడిగా!

ఎలా చూడ్డం వాణ్ని?
శుక్లా కృష్ణుల రాసక్రీడలో!
మృత్యువును జయించిన మరుక్షణం!

## గీతా రహస్యం

వానగాలుల వాల్చూపులలో
అలలు అలలుగా వయ్యారాలు పోతున్న
వరిచేల గట్టున, బీరపువ్వులా
ఎవరు బాలా, నీవు?

చీకటి పచ్చగడ్డిని కోసి
వేగుచుక్క గడ్డి గంపలో కూరుతున్న
ఉషఃకన్యలా ఎవరు నీవు?

అలనాటి అప్సరసలు
అంతఃపుర కాంతలు
అసూర్యంపశ్యలు
పరదాలలోని మచ్చు బొమ్మలవలె
ఆకుల బనిపి క్రింద గరికపోచలవలె
పాలిపోయిన అందాలు నీ ముందు!

పాతచింతకాయ పచ్చడి నంజుకొంటూ
చప్పిడి పథ్యంచేసే మా ఛాందస సాహిత్యకులకు
నీ సౌందర్య రుచులు నిషిద్ధాలైనై!
ప్రకృతిసిద్ధమైన నీ మధుర జీవితం
రేజీకటి అయింది వారి కళ్ళకు!

వానకోయిల గుర్తించకపోతే
వసంత వనం వికసించదా?
అనాసక్త చిత్తంతో
అందాలు పరిమళించగా
గోదావరి పంటకాల్వలా
ఏదో యీలపాట పాడుకొంటూ,

ఎదర నా ఉనికిని కూడ గమనించక
ఏకాగ్ర మనస్కతతో
నీ పని నీవు చేసుకొంటూ పోతున్న
గోపాలకృష్ణుని గీతారహస్యం నీవు!
ప్రజ్ఞాన రత్న జ్యోత్స్నవు నీవు!

## వెతక్కు దేన్నీ

వెతక్కు దేన్నీ,
ఎదురుచూడకు ఎవరికోసమూ,
నీవు వెదికేది నిన్నే!
నీవు ఎదురుచూచేది నీ కోసమే!

దేన్నో వెదకి వెదకి
నిరాశతో మరణించారు వేదాంతులు!
ఎవరికోసమో ఎదురు చూచి చూచి
నిస్పృహతో కన్నుమూశారు భక్తులు!

మేకపిల్లను మెడలమీదే పెట్టుకొని
ఊరంతా వెదక్కు వెర్రిగా!
నిన్ను నీవు తెలుసుకొన్నప్పుడే
నన్ను నీవు కలుసుకోగలవు!

ఆ నేను నీ ప్రతిబింబాన్నే!
నీ మనఃఫలకంపై చిత్రిత మవుతున్న
శతకోటి కోరికల విశ్వరూపాన్నే!
అందుకని-
వెతక్కు దేన్నీ,
ఎదురుచూడకు ఎవరికోసమూ!
నిన్ను నీవు కలుసుకో!
ఆ నీవే నేనని తెలుసుకో!

# అహం-కారం

గాలిగోపురం శిఖరం నుంచి
గుడి శిఖరం చూస్తున్న పావురంలా,
నా ఉన్నతికి నేనే గర్వపడి
గాలిలోకి ఎగిరిపోయాను నేను,
మొత్తం క్షేత్రమే
నా వెంట పడుతుందన్న అహంకారంతో!

మేఘాల వెల్లువలలో
పల్లిటీలు కొట్టుకొంటూ,
పాలకడలి ఆవిరులపై
ఇడ్లీలా వుడికిపోతూ,
ఆకాశగంగలో పడి కొట్టుకుపోయి,
నెలవంక గూట్లోకి చేరాను చచ్చి,
బ్రతికిన జీవుడితో!

నేను వదిలివచ్చిన చిన్నగుడిలో
శివుని సిగలో
ఒక వెండి జడపిన్ను మాత్రం
ఈ నా నెలవంక గూడు!
నా "అహం" అక్కడే దిగడిపోయింది!
"కారం" కరిగి కన్నీరై ప్రవహిస్తున్నది!

## ఇంటు - బైటు

ధర్మభారంతో నడుంవంగిన కర్మదేవతలా
వచ్చాడత డింటికి,
బరువు దించి, చెమట తుడిచి
శ్రమను పంచుకొన్న దతడి అర్ధాంగి!

ఉన్నదేదో తిని,
చిన్న పిల్లకు కథలు చెప్పి,
కాంతను తృప్తిగా నిద్రపుచ్చి,
మేను వాల్చాడతడా ప్రక్క!

సామాన్య డతడు!
సంసార సాగరుడతడు!
ఆ యింటి బైట అరుగు మీద
నిద్రపట్టక కొట్టుకొంటున్నా డొక యోగి!

ఆహార నిద్రా మైథునాలు
పశుధర్మాలని విసర్జించి
తెలియనిదాన్ని దేన్నో అన్వేషిస్తూ
తెల్లవార్చేశాడతడు బ్రతుకును!
గృహమొక అజ్ఞానపు గూడని
సన్యసించి పోయాడత డెక్కడికో!

అరణ్యాలు, పర్వత పంక్తులు,
గ్రహాలు, గ్రహకూటాలు,
నక్షత్రాలు, నక్షత్ర కుటుంబాలు!
భూమ్యాకాశాలలో ఎక్కడికివెళ్ళినా,
వెలు గెక్కడ వుంటే అక్కడ
మళ్ళీ మరొక కుటుంబం!

వెళ్ళేకొలదీ గహనం!
వెతికేకొలదీ శూన్యం!
యౌవనం, సౌందర్యం, కళ, ఆనందం
మనిషికి పరమేశ్వరుడిచ్చిన సమస్తం
పోగొట్టుకొని వచ్చి కూలబడ్డా డతడు
ఆ యింటి బైట అరుగుమీద-

ఆకాశం మల్లెపందిరి నిండా
విరబూచిన మొగ్గల మిలమిలలు
పరమపురుషుడు ధాత్రీదేవి వంక
కనుగొట్టుతున్నట్లున్నాయని విసుక్కొంటూ!

ఇంట-
జ్ఞానతేజం ఘనీభవించిన దీపం వెలుగులో
గాఢ సుషుప్త్యానందస్థితి!

బైట–

అనంతత్వ మాయామయ నభ స్తమోవాగురలో
మనోహంసీ గిలగిలావస్థ!
ఇంట అజ్ఞాని, బైట జ్ఞాని లోకదృష్టికి!
బైట అజ్ఞాని, ఇంట జ్ఞాని బ్రహ్మదృష్టికి!

## తారతమ్యం

ఏవగించుకోకు గొంగళిపురుగును చూచి,
దాని హృదయం బంగారు రెక్కల స్వేచ్ఛా వైభవం!
ఉబలాటపడకు వెండిలా మెరిసే కుబుసం చూచి,
దాని అంతరంగం భయంకర విషవాహిని!

ఆశించకు మెరుపుకన్నె వలపు కౌగిలి కోసం,
దాని స్పర్శే విడిపించుకోరాని యమపాశం!
ఈసడించకు వాకిట్లో బంతిపువ్వు మూగి నవ్వును
అది నీ కోసమే పూచిన పురాకృత పుణ్య సర్వస్వం!

## నిన్నూ అంటారు

శకుంతలకు తల్లి
భారతజాతికి మూలజ్యోతి
మేనక నేమన్నారు?
కాళిదాసుని కవితాప్రభ
మానవ ప్రకృతికే ప్రణయపీఠం
ఊర్వశి నేమన్నారు?

"లంజ" అన్నారు!
రాధ నేమన్నారు?
కృష్ణపరమాత్మకు జీవాత్మ
సర్వాద్య, సర్వవంద్య, పరాత్పరతర
శ్రేయః కేంద్రానికి ప్రేయః పరిధి

ఆరాధన కధిదేవత
రాధ నేమన్నారు?
"స్వైరిణి" అన్నారు!
గంగాభవాని నేమన్నారు?
ద్రౌపది నేమన్నారు?
సీత నేమన్నారు?
అనార్కలి నేమన్నారు?
రంగాజమ్మ నేమన్నారు?

నిన్న మొన్నటి యెంకి నేమన్నారు?
ఎన్నెన్నో అన్నారు పిచ్చిగా!

నిన్నూ అంటారు, శ్రావణీ!
దీర్ఘ వినీల కేశ సౌభాగ్యాన్ని
నా చిదాకాశం నిండా విరజిమ్మి,
మెరుపుచూపుల జడులు విసురుతూ,

అలల అందెల ఆటలతో, పాటలతో
నా తనువున పులకలు పండిస్తూ,
లోకానికి ముసురు ముసుగై, విసుగై,
నా హృదయ పయోధిపై పొంగిపొర్లే నిన్ను
నిన్నూ అంటారు లోకులు
వట్టి "బురద" అని!

అసూయతో, అసహనంతో
తమకులేని అందం, చందం, ఆనందం
నీకున్నదన్న యేడ్పుతో
నిన్నూ అంటారు, కానీ-
పడ్డవాళ్ళు చెడ్డవాళ్ళు కారెప్పుడూ,
పడేవాళ్ళే తారలు చరిత్రలో!

ప్రణయం పవిత్రం ప్రకృతికి!
ఆనందం అమృతం జీవితానికి!

## జీవిత స్వరూపం

జీవితం ఒక నిత్యనవోద్యానం కాదు,
అనుక్షణం మారే మహారణ్యం అది!
అక్కడ కేవలం మోదుగులే మోసులెత్తవు,
వ్యాఘ్ర వదనాలు కూడ విప్పారతై!

కోకిలలు మాత్రమే కాదక్కడ,
రాబందులున్ను వుంటై!
నీవు గులాబివైతే పరిమళించు
మామిడివైతే ఫలించు

కోకిలవైతే పాడుకో
అది నీ అదృష్టం!

అయితే-
లోకం చేతికి ముళ్ళున్నాయి
రోడ్డుప్రక్క కంకర రాళ్ళున్నాయి
పొగమంచు కంట్లో నిప్పులున్నాయి!

అజాగ్రత్తగా వుండి
అదృష్టాన్ని నిందించుకోకు!
కనుక్కున గ్రుచ్చుకోవడం
నైజం కంటకానికి!
నిందించి లాభం లేదు,
అందకుండా పైకి పో!

పరిమళించు!
ఫలించు!
నీ యదృష్టంతో
దురదృష్టానికి చికిత్స చెయ్యి!
ఊహాగానం కాదు జీవితం,
ఆకలి దప్పులు గల యాథార్థ్యం అది!

# నిరయాగ్ని కొలిమి

నీటిని కరగించడానికి
వంద డిగ్రీల వేడి చాలు,
లోహాన్ని కరగించడాని కది చాలదు!
మట్టిని కరగించా లంటే
మార్తాండుని కుంపటి కావలసిందే!

అరచేతిలోనే కరగిపోతుంది వెన్న,
ముద్దుకే కరగిపోతుంది ప్రేమహృదయం!
మానవతకు చిహ్నమైన
జాలిగుండె కరగడానికి
ఒక్క కరుణగాథ చాలు!
ఒక్క కన్నీటి బొట్టు చాలు!
కానీ-

స్వార్థం తప్ప మరేదీ అర్థం కాని,
వ్యవహారం తప్ప ఉదారతలేని,
చిత్త కాఠిన్యాన్ని కరగించాలంటే
నిరయాగ్ని కొలిమి తప్ప
గత్యంతరం లేదు!

## నీవే ఎందుకు కాకూడదు?

ఎవరా శ్రావణి?
ఎవరా శరత్ప్రభ?
ఎవరా రత్నజ్యోత్స్న?
ఎవరా ఫాల్గుని?
ఎవరా వైశాఖి?

ఓ ప్రశ్నిస్తున్న లోకవతీ!
ఎందుకీ వ్యర్థ ప్రశ్నలు?
అది ఎవరో ఎందుక్కావాలి?
నీవే ఎందుక్కాగూడదు?
నీ అదృష్టం నీ కళ్ళల్లోనే వుంది,
చూచుకో హృదయ దర్పణంలో!

నిన్ను ప్రేమించడం నీవు ప్రేమించడంలోనే వుంది,
వెతుక్కో, ఆత్మోద్యానంలో!
ప్రతి తీగా పల్లవిస్తుంది
ప్రతి పూవూ పరిమళిస్తుంది
ప్రతి తోటా ఫలిస్తుంది
దాని దాని సైజాన్నిబట్టి!

నీవూ వికసిస్తావు, పరిమళిస్తావు, ఫలిస్తావు

నీ తరుణంలో నీవు-
నిరాసక్త నిర్మల చిత్తంతో
ఆరాధిస్తూ వేచివుంటే!

అసూయతో అగ్గిని వెదజల్లితే
గ్రీష్మికవు కూడ కాలేవుకదా!
ఆ రసానంద రాధా పూర్ణిమ
ఆ మనోరమ వైశాఖి

నీవే ఎందుకు కాగూడదు?
నీపై ఎందుకు రాగూడదు?

# లోకం తీరు

నేను కళ్లు మూసుకొని పాలు త్రాగుతున్నానని
లోకం చెవి కొరుకుతున్నా డొక మార్జాల మిత్రుడు!
నేను దొంగజపం చేస్తున్నానని
ప్రచారం చేస్తున్నా డొక బకుడు!

నేను రాసక్రీడ అంటూ కామకేళిని కీర్తిస్తున్నానని
యాగీ చేస్తున్నా డొక మేషాండభూతి!

నేను పూల వీధులకు
తేనెలు సరఫరా చేసే నెపంతో
పూలనే రాల్చి పారేస్తున్నానని
గోలపెట్టేస్తున్న దొక కందిరీగ!

# చెప్పలేక

నిన్ను ప్రేమిస్తున్నా నని
నోటార చెప్పలేక
కన్ను కొట్టాను నీకేసి!
కాని-
చూడలేదు నీ వది!
నీవు కరుణించకపోతే
చస్తాననిచెప్పలేక
కళ్ళొత్తుకొన్నాను,
గుండెలు బాదుకొన్నాను,
కాని-
గ్రహించనేలేదు నీ వది!
నాద బ్రహ్మ వక్షంపై
ఆనంద వీణావాదంగా
ప్రేమ పదం నా పెదవుల నుండి వినాలని
స్పష్టంగా నా హృదయం తెలిసికోవాలని
ఆశించి, ఆశించి, ఆశించి-
నిరాశా హిమభారంతో
మొగుచుకు పోయావు నీవు!
నోరుండీ, లేని మూగినై,
వాచ్యం అవాచ్య మనుకొంటూ,

కళ్ళు మాత్రం అప్పగించి
చూస్తూ వుండిపోయాను నేను!
వుండివుండి ఎండిపోయాను చివరకు!
కళ్ళు మాత్రం
ధ్రువ – అగస్త్య నక్షత్రాలవలె
ఒకదా న్నొకటి చూచుకొంటూ
వుండిపోయాయి అలా!

## నేనేమో?

ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్టున్నావు?
కంటి మీద రెప్పే వెయ్యడం లేదు!
నిజంగా
దేవతలా వున్నావు!
మననం!
ధ్యానం!
పరధ్యానం!
నీ చుట్టూ ఏమి జరుగుతున్నదీ
నీ శరీరం ఎక్కడ పడివున్నదీ
ధ్యాసే లేదు నీకు?
నిజంగా
నిన్ను
ఇలా
శిల్పకన్యలా
తీర్చి
దిద్దుతున్న ఆ శిల్పి ఎవరో!
నిజంగా అతడు ధన్యుడు!
ఎన్ని పూలు రాలిపోతున్నై
నీ చుట్టూ
నీ కోసం

పూచి!

ఎన్ని పాటలు!

ఎంత అందం!

ఎంత మాధుర్యం!

ఏదీ కదిలించదు నిన్ను!

ఎంత నిశ్చల సమాధి!

నిజంగా

అపూర్వ సుందర శిల్పకళాఖండం నీవు!

ఎవరా మహాశిల్పి? దేవీ!

ఎవరా సఫలీకృత మనోరథుడు? దేవీ!

ఒకవేళ-

అతడు

నేనేమో!

కొంచెం ఇటు చూడవ్?

## శిలా శిల్పం

కళ్ళు కాయలు కాచేలా
వేచివున్నావు తోట పూచేవరకూ,
తోట పూచి కాయలు కాస్తున్నా
నీ కళ్ళు అలానే వున్నాయేం?
పువ్వుపై ఏ తుమ్మెదో వాలిందని
కాయను ఏ కాకో పొడిచిందని
పండ్లను రాలిపోనిస్తూ
బండలా వుండిపోయావా?
వేయి కళ్ళతో ఎదురు చూచిన వసంతాన్ని
వృథాగా వెళ్ళిపోనిస్తున్నావా?
అలానే అయితే-
నీ వెంతటి సుందర సౌందర్య దేవతవైనా
వట్టి శిలా శిల్ప కళాఖండానివే!
మానవ చేతనా మధుర మూర్తివి కావు!

## సౌఖ్య రహస్యం

ఏకపత్నీ వ్రతుడు శ్రీరామచంద్రుడు
సీతకు బ్రతుకంతా సీతమ్మశోకం!
దక్షిణ నాయకుడు శ్రీకృష్ణదేవుడు
రాధ, రుక్మిణి, నీల, సత్య, కుబ్జ-
వేలకొలది ప్రేమశాలినులలో
ప్రతికాంత బ్రతుకూ ఒక సుధా లహరి!
ఎవరి ఆరాధన వారిది
ఎవరి ఆనందం వారిది!
అదే సౌఖ్య రహస్యం!
తోటలో పూస్తాయి లక్షలాది పూలు,
ఏ పువ్వు సాఫల్యం ఆ పువ్వుది,
అన్నిటికీ వసంతం ఒక్కటే!
బ్రతుక్కు బ్రతుకుతో పోలిక లేదు,
ప్రేమకు ప్రేమతో పోటీ లేదు!
నీ సుఖం నా చిత్తవృత్తికి బందీకాదు!
బందీతనం నరకం కన్న దుర్భరం!
పరులతో పోల్చుకొని పోటీపడడం
అవ్యక్త మనస్తత్వానికి చిహ్నం!
అసూయ అబలత్వానికి గుర్తు!
నీ బ్రతుకు నీ భావంతోడిది,

నీ సుఖం నీ చిత్తంతోడిది:
పరాధీనత దుఃఖం
ఆత్మోపరతి సుఖం
అదే సౌఖ్య రహస్యం!

## స్వర్గమంటే

మొన్నటి తాతా, అవ్వా నిన్న లేరు,
నిన్నటి అమ్మా, నాన్నా నేడు లేరు,
నేటి నీవూ, నేనూ రేపు వుండం!
వుండేది సుకృతమేనే, సఖీ!
నీ ఆనందంకోసం నేను,
నా ఆనందం కోసం నీవు,
చేసే త్యాగమే సుకృత మంటే!
అది ఎవరిది వారిదేనే, సఖీ!
నీ సుఖదుఃఖాలకు నీవే కర్తవు,
నీ భవిష్యత్తుకు నీవే నిర్మాతవు,
పరులతో పోల్చుకొని ఏడ్వడం నరకం!
స్వర్గమంటే నిన్ను నీవు దిద్దుకోవడమేనే, సఖీ!

## దివారాత్రాలు

బ్రతుకుతూ, బ్రతుకును నిందించకు!
చస్తూ, చావుకు భయపడకు!
బ్రతుకును నిందిస్తూ బ్రతికేవాడు దొంగ!
చావుకు భయపడుతూ చచ్చేవాడు పాపి!
బ్రతుకు సమగ్రంగా బ్రతకడం కోసం!
చావు సంతృప్తిగా చావడం కోసం!
దాని వెనుక ఇదీ, దీని వెనుక అదీ!
దివారాత్రాలు! దివ్య సౌందర్య విలసితాలు!
దాని కలవాటుపడి దీన్నీ
దీనికలవాడుపడి దాన్నీ
కంటగించుకోకు!
కన్నీరు తేకు!

# భక్తి-విభక్తి

నేను
ఎంత అహంకారం నాకు!
నన్నే అందరూ ప్రేమించాలని
నాకే సమస్తం సమర్పితం కావాలని
నా వల్లనే సూర్యచంద్రులు ప్రకాశించాలని
నా ఆనందమే లోకానందంగా చెల్లాలని
అబ్బ - ఎంత స్వార్థం నాకు!
నాతోనే పుట్టింది ప్రపంచం,
నా యందే లయమై పోవాలది!
అన్నీ విభక్తులేనే!
నా జీవితమే విభక్తుల మయంలా వుంది!
ప్రతి విభక్తీ ఒక స్వార్థాంశగా
విభక్తి సప్తకం నా పరిపూర్ణ జీవితం!
అసలు నేనే ఒక విభక్తినైపోయా!
ఈ విభక్తులన్నీ భక్తితో సేవించగా
నేను వాటికి నాయకత్వం వహిస్తూ
ప్రథమనై వుండిపోనా?
షడ్క్రమల మాలికా శిరః కుసుమ సంగతిలా
నీ భక్తినై విముక్తి పొందనా?

## మళ్లీ తపస్సులోకి

తపస్సు చేసుకొంటూ
నాలో నేను జీవించినప్పుడు
అంకురించాను మల్లె మొగ్గగా,
వికసించాను గులాబి పువ్వుగా
ఫలించాను రసాలగా!

కన్ను తెరచి
లోకంలో బ్రతకడం ప్రారంభించి
గిల్లి వేసుకోబడ్డాను రాత్రి అందం కోసం!
మాల గ్రుచ్చబడ్డాను మహాసభ గౌరవం కోసం!
ఇంధనమైపోయాను లోకం ఆకలి మంటలో!

ఇప్పుడు మిగిలిందేమీ లేదు నాకు!
నా రుచులన్నీ, అభిరుచులన్నీ,
నా సాయంసంధ్యారుచిలో లీనం కాగా
కేవలం మోడుగా
మళ్ళీ తపస్సులోకి పోతున్నాను–
విభాత రాగ రమగా నీవు రేపు వచ్చినప్పుడు
నీ దరహాస రుచినై విరియాలన్న కోరికతో!

## జీవన మరందపం

ప్రభాతంలో
పద్మాంగనా పరిష్వంగం నుంచి
విమోచన లభించింది నాకు.

నవ సంధ్యారాగంలో స్నానం చేసి
లోకబాంధవునికి వందనం చేసి
బైలుదేరాను పనిలోకి నేను.

పగలంతా గడిచిపోయింది
పరమేశ్వరుని కృపామధూళిని
ప్రతి పువ్వుకూ పంచిపెట్టడంలో.

స్వాంతం సంతృప్తిపడింది
ఆత్మ ఆనందపరిప్లావిత మయింది
శరీరం అలిసింది,
మనస్సు మాత్రం రెక్కల సువాసన లల్లార్చింది
మరేదో మజిలీకోసం
మరింకేదో మహానుభూతి కోసం!

సాయం సంధ్యారాగ సరోవరంలో
స్నానానికి సిద్ధమైన నాకు
లోతెంతో ఎందుకు యోచన?
చిమ్మచీకటి కంటె
చిక్కని మైమరపు కోరుతున్న నాకు
రేయి అమావాస్యో, పూర్ణిమో ఎందుకు చింత?
మళ్ళీ ఏ జలజాంగనా పరిరంభంలోనో
చిక్కుకొనే వీలున్న నాకు
ఆనందం కాక
ఎందుకు ఆరాటం?

# మళ్లీ వెన్నెల

అయిపోయింది అమావాస్య
తలచుకుంటే గుండెలు గుభేలు మంటున్నై

ఎంత చీకటి! ఎంత చీకటి!

పెరిగిపోతూ వచ్చిన సుఖభోగాల నీడలా,
పేరుకొంటూ వచ్చిన అజ్ఞాత పాప పంకంలా,
చీకటి సముద్ర కెరటం–
ఉవ్వెత్తున లేచి, ముంచి, విరిగి, వెల్లువై
చప్పగా తీసిపోయింది, చూడు!

నేడు శుక్లపాడ్యమి!
వికసించిన చెంగల్వ కొలను!
ఏ దివ్యసౌగంధికాల కోసమో
కలగ్గొట్ట బడ్డ మిన్నేటి నుంచి
ఎగసిపడి నీ చూపుల్లో దాక్కొన్న
చిరుచేపల మిలమిలలు!
వెన్నెల వాగులలో ఈతలు!
ఆనంద క్రీడా యాత్రలు!
మళ్ళీ మల్లెపూలు!
మళ్ళీ వెన్నెల!

## నాలుగు మాటల్లో

నిన్ను స్మరిస్తూ అంకురించాను నేను!
నిన్ను ప్రేమిస్తూ వికసించాను నేను!
నిన్ను అనుభవిస్తూ ఫలించాను నేను!
నిన్ను పూజిస్తూ తరించాను నేను!

## నిత్యవసంతం

లోకం ఒక సంక్లిష్ట కీకారణ్యం,
జీవితం ఒక వసంతం నాకు!

పికంగా వచ్చాను నేను
కషాయ కంఠం విషాదగీతంతో!
పికంగా పాడాను నేను
ప్రతిభా పరాంకోటి రసభావ పారవశ్యంలో!
పికంగా పోతాను నేను
పరిపక్వతా సమ్యగానంద గానంతో!

అపార సాహితీ రూప హర్ష ప్రతర్షలో
జీవితం ఒక నిత్య వసంతం నాకు!

# ద్వైధీ లీల

ఎవరు నీవు?

ఊహ తెలిసినప్పటి నుండి
ఒకటే ప్రశ్న నాకు–
ఎవరు నీవు?

ఎలా వుంటావు నీవు?
ఎక్కడ, ఏవిధంగా లభిస్తావు నీవు?

ప్రశ్నతోనే ప్రారంభమయింది
నీ కోసం నా అన్వేషణ!

ఏవేవో పువ్వులు చేయెత్తి
నన్ను తోటల్లోకి పిల్చినప్పుడు,
ఏవేవో పాటలు గొంతెత్తి
నన్ను వృక్ష లతాగ్రాల కాహ్వానించి నప్పుడు,
మబ్బు కొమ్మలకు వానకాళ్ళ ఊయెలలు కట్టి
తద్దిపండుగలు చేసుకునే మెరుపు కన్నెలతో
పొడుపు విడుపు కొండలు తొక్కి తూగు నప్పుడు,
ఋతుకాంతలు మాతృకలై
కుమారుని వలె నన్ను లాలిస్తూ

తమ సమస్త శోభాసౌభాగ్యాలతో
నన్ను ముంచెత్తి నప్పుడు,
నీ ప్రణయస్పర్శ అనుభవిస్తూనే వచ్చాను!
నీ సాన్నిధ్యం గుర్తిస్తూనే వచ్చాను!
ప్రతి అందంలోను, ఆప్యాయతలోను
నిన్ను పసిగడుతూనే వచ్చాను!
నీ కోసం నా అన్వేషణ
క్షణక్షణం పెరుగుతూ వచ్చిందందుకే!

భూమిపై ఎంత సౌందర్యం!
ఎంత వైవిధ్యం!
ఆకాశంలో ఆ తేజోమూర్తులెవరు?
మెత్తగా దున్నిన నల్లరేగడి పొలంలా
మణులు, మాణిక్యాలు, రత్నాలు, ప్రవాళాలు
రాశులుపోసి గుప్పెళ్ళతో చల్లినట్టు
ఆ వెలుగు పంట లేమి?
రోహిణి అలా కాలిపోతున్నది!
ఆర్ద్ర ఎందుకో మండిపడుతున్నది!
జ్యేష్ఠ ఎవరినో తరుముకుపోతున్నది!
పుష్పబాణుని ఆ ఉరవడి ఎవరి మీద?
ఎవరా పాలకడలిలో పండుకొన్నవారు?
ఎక్కడి దా సముద్రఘోష?

శిశిరాకాశంలోని ఆ పెద్ద ప్రశ్న గుర్తు
నా ముఖం మీదే గ్రుద్ది నట్టుండేది నాకు
ఆలోచించే కొలదీ!

హిమవిచ్ఛిఖరాగ్రంపై నిలబడి
రాత్రింబవళ్ళే నేత్రాలుగా
భూమ్యాకాశా లంతటా
ఎంత వెతికాను నీకోసం!
నాకు వలెనే వెతుక్కొంటూ వచ్చిన వారి
ఆశాభంగాలేమో ఈ పర్వతరాశులు!
అన్వేషణాగ్ని చల్లారిపోయిన మంచుగడ్డ లివి!
శిఖరాయమానంగా వున్న దిక్కడ పడి
శంకరుని మాయావాద విభూతి!
భార్య అనుకొని
ఆమె నీడతో చిరకాలం కాపురం చేసిన
సూర్యుడి కంటె శంకర శిష్యాగ్రణి ఎవరు?

భక్తి, జ్ఞానం, వైరాగ్యం.
ఆచారాలు, కర్మకాండ, విధి నిషేధాలు,
పాపం, పుణ్యం, శిక్ష, వెలి!
మహారణ్యం పెరిగింది
మానవ బుద్ధి నిండా!

మేటలు వేసింది
మానవ జీవ స్రవంతి!
పాలుత్రాగి రొమ్ముగ్రుద్ది నట్టు
స్త్రీ పురుష సంబంధమే మహాపాపమని
ప్రచారం చెయ్యసాగారు ప్రవక్తలు!
ఆచరణ సాధ్యంకాని నీతిని విధించి
అవినీతిని పెంచేశారు నిరంకుశులు!

ముక్తికాంతకు మడిబట్టలిచ్చి,
రంభ యింటి చుట్టూ మూగసాగారు కర్మిష్ఠులు!
తాను అల్లుకొన్న వలలో తానే చిక్కుకొని,
తన్నుకొని, బిగుసుకుపోయిన మానవుడు
సంసారం దుఃఖసాగరం అనుకొంటూ,
పారిపోసాగాడు దారిదుమ్ము జేగురు గుడ్డలతో!

ఏమిటి ఈ అవ్యవస్థ?
ఒక్క మానవుణ్ని మినహాయిస్తే,
తక్కిన సర్వ ప్రకృతీ ఎంత హాయిగా వుంది!
పువ్వులు పిలుస్తున్నాయి,
తుమ్మెదలు విందులు గుడుస్తున్నాయి,
కోకిలలు గొంతెత్తి పాడుతున్నాయి,
వర్షాలు విడుదు లందుకొంటున్నాయి,

నదులు పొంగుతున్నాయి,
సముద్రాలు ఉప్పొంగుతున్నాయి,
క్షేత్రాలు ఫలిస్తున్నాయి,
అమృతం పంచుతున్నాడు చంద్రుడు,
ఎంత ఆనందంగా వుంది ప్రకృతి!
చీకటిని వెనక్కి నెట్టివేసుకొంటూ
వెలుగులోకి పోతున్నది అనుక్షణమూ!
ఎందుకు?

ఇదంతా జడమేనా?
కేవలం భ్రాంతి మాత్రమా?
ఛాయా సదృశమా?
ఎవరి చిత్తవృత్తికో ప్రతిబింబమా?
నియంత కొలువుకూటంలో
నిర్బంధ సేవా విధానమా?
స్వేచ్ఛాపూర్వక హృదయార్పణమా?
దాసోహం మనస్తత్వమా?
త్వమేవాహ ప్రజ్ఞానమా?
ఇదంతా వట్టి మాయా మాత్రమైతే
మాయాసీత గాథలా రసహీనం;
దాసానుదాసత్వంలో
ఆత్మానుభూతి లేదు!

తోలుబొమ్మలకు కర్తృత్వ మెక్కడిది?
కర్తృత్వ స్వేచ్ఛ లేక, కర్మ లేదు!
త్వమేవాహం స్వకుచమర్దనం కాదా?
ప్రపంచమే పాప ఫలితమైతే
ప్రపంచ స్రష్ట పుణ్యాత్ముడా?
నరకాన్ని సృష్టించిన వాణ్ని
కరుణాళువని ఎలా అంటాం?

భక్తి జ్ఞాన వైరాగ్యాలు,
సంపూర్ణ దాసత్వం,
కర్మ సిద్ధాంతం,
మాయా వాదం,
నైతిక వర్తనం,
జీవకారుణ్యం,
అన్నీ అపోహలే!
అన్నీ అపమార్గాలే

ఏ మార్గం వెంట పోయిన రథాలు
ఆ మార్గం చివర భగ్నమనోరథాలై
పురావస్తు పరిశోధన శాఖకు
ఉపశాఖల్ని అంటుకడుతున్నై!

అయితే, ఎవరు నీవు?
పోయేకొలదీ అనంతం బాహిర ప్రకృతి!
వెదికే కొలదీ అగాధం దాని రహస్యం!
అంతఃపురం ఎక్కడ?
ఏది దారి?
శంకర శిఖరాగ్రంపై నిల్చివున్న నా వెన్నులో
హఠాత్తుగా ఏదో
పాములా కదిలి
పద్మంలా విరిసి
పక్కున నవ్వింది!
గిరుక్కున తిరిగాను వెనక్కి!
ఎదురుగ్గా నీవు!
ఏమి టిది?
ఇదేనా నీ అంతఃపురం?
నేనేనా నీ అంతఃపురం?
ఎంత గమ్మత్తుగా వుంది!
అవును!
పరిధికేసి పయనిస్తున్నా నింతవరకు!
నా వెన్నంటి వస్తున్నది కేంద్రం!
నేనే ఆ కేంద్రం!
నే నెక్కడ వుంటే అక్కడికి
అపారమైన దూరం నా పరిధి!

పరిధి లేని వృత్తం నా చుట్టూ!
నిన్ను నాలోనే వుంచుకొని
నీ కోసం ఎంత వెతికానో!

ఇంతకీ, ఎవరు నీవు?
నిన్నెక్కడో చూశా ఇదివరలో!
ఎన్నోసార్లు చూశాను నిన్ను!
కోటలో మహారాణివి నీవు,
రోడ్డుపై పాకీ పిల్లవు నీవు,
తోటలో పువ్వువు నీవు!
రోదసిలో తారవు నీవు!
ఎక్కడో చూడడ మేమిటి నిన్ను?
అసలు పుట్టినప్పటి నుంచీ
జట్టు విడిచేలేము మనిద్దరం!
ఎంత గమ్మత్తుగా వుంది!
మనిద్దరం ఒక్కటి!

శంకరుని కొండపై
ఏమిటా శంఖారావం?
"త్వమేవాహం" అనేనా అంటున్నావు నీవు?
నేనూ అదే అంటున్నాను!
అయితే-

మనిద్దరం ఒకటే అయితే
నీ కోసం ఎందుకింత విరహం నాకు?
ఏమిటీ వెతుక్కోవడం?
నిన్ను కలుసుకోవడం కోసం
ఎందుకీ తహతహ శరీరానికి?
ఏమిటీ ఆరాటం మనస్సుకి?
ఇదంతా మిథ్యే అయితే
మనిద్దరమూ మిథ్యే కామా?
ఎవరో ఒక్కరే మిథ్యే అయితే
రెండో వానిలో ఆ తపన దేనికి?
పరిపూర్ణత్వం కోసం ఆ త్రిప్పలు దేనికి?
నీవూ, నేనూ ఒకటే అయితే
నన్ను నేనే కలుసు కొన్నానా ఇప్పుడు?
చిరునవ్వు నవ్వుతున్నావు నీవు!
వినోదంగా వుంది నా పరిస్థితి నీకు!

బ్రహ్మపదార్థం ఒక్కటి,
అర్ధనారీశ్వర ద్వైధీ శక్తి అది;
అదే పరమ శివుడు!
అతడే నటరాజు!

సరస్వతి అతని రచన!
తన రచనను తానే చూచుకొంటూ
తన్మయుమైపోతున్న భావుకు డతడు!
రచన అతని కల్పనే కాదా?
ఎందుకంత వ్యామోహం దానిపై?

క్రియ లేకుండా కర్త వున్నాడు,
కర్త లేకుండా క్రియ లేదు!
కర్మ క్రియలోదే - ప్రాధాన్యం లేదు దానికి;
క్రియా కర్తలు సరస్వతీ శివులు!
కర్తకు క్రియపై వ్యామోహం,
క్రియకు కర్తపట్ల ఆరాధన!
క్రియలో కర్త వ్యక్తీ భూతుడు,
కర్తలో క్రియ లీనీ భూతం!
"త్వమేవాహం" నిజమే,
నిర్వచనలో వుంది పొరపాటు!
కర్త ఎంత సత్యమో
క్రియ అంతే సత్యం!
కర్త స్థిరం
క్రియ అస్థిరం
అస్థిరత్వం మిథ్య కాదు!

రజ్జు సర్పభ్రాంతి మానవుడికి,
మానవుడే ఒక భ్రాంతి–ఎవరికి?
ఆ యెవరో భ్రాంతి మరెవరికో!
అంతం లేదీ పిడివాదానికి!
భ్రాంతి కూడ సత్యమే–దాని పరిధిలో అది,
పదార్థం నుంచి పదార్థం కానిది పుట్టదు,
రూప గుణ వృత్తి వుద్దేశాలు భేదించవచ్చు;
శివుడు పరము పదార్థం,
అతని శక్తి శివ–సరస్వతి!
శివుడు విద్యుద్వాహిని,
అది విశ్వం ప్రతి వస్తువులోను అంతర్వాహిని!
దాని పొడవునా, చుట్టూ జరిగే
వివిధ క్రియలూ సరస్వతి!

సరస్వతి క్షణప్రభ,
దీపతోరణం ఆమె!
ప్రతి దీపమూ వెలుగుతూ, ఆరుతూ,
వెలుగుతూ సాగిపోతుంది!
ఒక జీవ సూత్రానికి గ్రుచ్చబడ్డ రత్నాలు
~~ఈ~~ వివిధ విశ్వ గోళాలూ!
అందుకే అంత క్రమంతో గమిస్తున్నా యవి!
ఆ సూత్రం అంతర్వాహిని,
దాని ధారా వేగ క్రియారూపం ప్రకృతి!

అంతశ్శక్తి ఎంత సత్యమో
దాని బాహ్య రూపమూ అంతే సత్యం!
క్షణభంగురం కావచ్చు నది,
మిథ్యమాత్రం కాదు!

అనాది శివపారమ్య బ్రహ్మ!
అర్ధనారీశ్వర పరాశక్తిగా అది
ప్రవహిస్తున్నది అనంతత్వం లోకి!
దీపం వెలుగూ, పంకా గాలీ
ఒకే కరెంటు నుంచి పుట్టినట్టు
పుట్టాం నీవూ, నేనూ
దేశకాల పరిస్థితీ భూత ప్రకృతిగా!
మనం ఇద్దరంగా వుంటే – అది ప్రకృతి,
మనం ఒక్కరమైపోతే – అది బ్రహ్మ!
కలుసుకొంటూ, విడిపోతూ,
కలుసుకొంటూ వినోదిస్తాం మనం!

సమాగమ సుఖ పారవశ్యమూ,
వియోగ దుఃఖాతిరేకమూ,
రసాలే మనకు!

అందుకే జీవిస్తున్నాం వియోగంలో,
అంతమైపోతున్నాం సంయోగంలో,
పరమాత్మగా గ్రీన్ రూంలోకి పోయి,
నటరాజుగా అవతరిస్తున్నాం రంగంలో!
నటాంశ రాజాంశల ద్వంద్వం మనం!
అనుక్షణం అనంతకోటి ద్వంద్వాలు
అంతర్లీనమైపోతున్నై పరమాత్మలో!
నిలిచిన గర్భఫలా లీ విశ్వగోళాలు!
అర్ధనారీశ్వరుని అకాండ తాండవ మిది!
ఎంత దివ్యంగా వుంది!

అనాదిగా అనుభూతుల్ని పెంచుకొంటూ,
అహరహం ఇతోధిక వికసనంతో
సువాసనలు చిమ్ముకొంటూ వస్తున్న ఆదిదంపతులా మనం!
నీవూ, నేనూ తప్ప
సృష్టి లే దసలు!

స్త్రీ దేహాంతః పురవాసి శివుడు,
పురుష దేహాంతఃపురవాసిని సరస్వతి!
ప్రతి దేహమూ ఒక పుణ్యక్షేత్రం,
శివ సరస్వతీ మహాక్షేత్రం అపవర్గం!

పురుషరూప శిల్పమూర్తిని నేను
నీ స్త్రీరూప శిల్పమూర్తిపై
అంతులేని వ్యామోహం నాకు!
అప్పుడు నీవు సరస్వతివి నాకు!
ఆనంద పారవశ్యంలో
దేహదృష్టి విలుప్తమై పోయినప్పుడు
ఆత్మగా నీ ఆత్మపట్ల
అపారమైన ఆరాధన నాకు!
అప్పుడు నేను సరస్వతిని నీకు!

పారవశ్యం పారమ్యం చేరి
అపరా పరా సరిత్సాగర సంగమంలో
ఆత్మ స్పర్శే విముక్తమై పోయినప్పుడు
ఎవరు శివుడు?
ఎవరు సరస్వతి?

ఇప్పుడు – నాలో
ప్రత్యణువూ నీ అంతఃపురమే!
నీ చుట్టూ నీవు నిర్మించుకొన్న శిల్పం
చిరవియోగ విదగ్ధ చిత్తోద్వేగంతో

పరమ శివుడై విజృంభిస్తున్నది నీలోకి!
విభ్రాంత సరస్వతివి నీ విప్పుడు!
పరమ పరముడైన నీలోని శివునిపై
విరుచుకు పడతావో యేమో నీవు!
కేంద్రం మనిద్దరికీ మూలభూతమైన బ్రహ్మ,
దాని అపరిమిత పరిధులం నీవూ, నేనూ!
నీవూ, నేనూ, నీవూ, నేనూ – అనంతత్వం మనం
అర్ధనారీశ్వర జీవకణాలం!
వియోగ విరహవేదనతో, ఆత్మ నివేదనతో
వెతుక్కొంటూ వచ్చి ఇక్కడ కలిసాం!
ఇక విడిపోవద్దు మనం!
మనం ఇద్దరంగా వుంటూ
బ్రహ్మైక్య పరమానుభూతితో
విశ్వావలోకనం చేదాం నిరంతరం!

## లక్ష్య జాగృతి

అంధకారపు అవ్యక్తావస్థ నుంచి
జాగృతివైపు ప్రయాణం చేసుకొంటూ
కాంతి చైతన్య క్రియా పుష్పఫలాల అరుణోదయం
ఇంకెంతో దూరం లేదన్న సంతోషాన్ని
గొంతెత్తి ప్రకటించింది కాల జ్ఞాని!
ఆనందభైరవి ఎత్తుకొంది కోకిల!

పద్మిని బిగి కౌగిలి మెల్లిగా సడలించుకొని,
బైట మావిచిగురు తేనెటరుగుపై చేరి
భూపాలకు తన కంఠాన్ని మేళవించింది తేటి!

ఆరామాంతఃపురంలో
మలయ సమీర కుమారుల గుసగుసలు వింటూ
పనిపాటులకు ఆయత్తమయింది కూలిపేట!
శుక్రుని రాగజ్యోత్స్నలో
సుఖ పారవశ్యం పారమ్యం చేరుకోగా
ఎంత మనోజ్ఞంగా వుంది వసంత విభాతం!

సర్వ ప్రకృతీ మేల్కొని
ఆనంద స్నాతమై
అరుణోదయ పూజా గృహంలో
వెలిగించింది సూర్య దీపాన్ని!
పద, ఇక, ముందుకు!

# రైలు ప్రయాణం

ఆదీ అంతం లేకుండా
వెలుగూ చీకటీ పట్టాలుగా
వెళ్లొస్తా, మళ్లొస్తా అంటూ
సాగిపోతున్నది ఈకాలం రైలుబండి!

ఎక్కడ బయలుదేరిందో ఇది!
ఎంతవరకూ పోతుందో మరి!
ఎక్కేవాళ్ళెక్కుతున్నారు
దిగేవాళ్ళు దిగుతున్నారు.

వెళ్ళేకొలదీ పెరుగుతున్న రద్దీ!
క్రిక్కిరిసిన జనంలో కీచులాటలు!
స్టేషను వచ్చినా దిగనివాళ్ళు,
దాటిపోయినా గుర్తించని వాళ్ళు,
బండికి అలవాటు పడిపోయి
దిగడానికేడ్చేవాళ్ళు,
మందంగా పోతున్నదని విసిగేవాళ్ళు
మహావేగం అని బెదిరేవాళ్ళు,
దిగేస్టేషను దూరంలో వుండగానే
అన్నీ సర్దుకొని కూర్చునేవాళ్ళు,

అంతవరకు నిద్రపోయే, పేకాడో
అడావుడిగా దూకేసేవాళ్ళు,
టిక్కెట్టు లేకుండానే బండెక్కేవాళ్ళు,
బండిలోనే బిజినెసు చేసేవాళ్ళు,
రకరకాల ప్రయాణీకులు!

నవ్వుతూ ఎక్కి, ఏడుస్తూ దిగేవాళ్ళు
ఏడుస్తూ ఎక్కి, నవ్వుతూ దిగేవాళ్ళు
ప్రక్కవాళ్ళతో స్నేహంచేసి
ఆడీ పాడీ ఆనందం కూర్చేవాళ్ళు
ప్రక్కను మనుషులున్నారన్న గుర్తే లేక
ఊసీ, చీదీ అసహ్యం చేసేవాళ్ళు
దిగేవాళ్ళకు కన్నీటితో వీడ్కోలిస్తూ
ఎక్కేవాళ్ళను ఆశతో తిలకించేవాళ్ళు
అప్పుడే దిగిపోతున్నావా అంటూనే
పీడ విరగడయిందని నిట్టూర్చే వాళ్ళు
వెళ్ళి రమ్మని చెప్పి
వెళ్ళిపోయినందు కేడ్చేవాళ్ళు
బండెక్కించి, కేకలు పెట్టి సలహాలిచ్చే వాళ్ళు
బండిపోయినా స్టేషన్ను వదలని వాళ్ళు
రకరకాల మనస్తత్వాలు!

ఏవేవో బాధలు, బాధ్యతలు
ఎన్నెన్నో తొందర పనులు
ఎక్కడెక్కడికో పరుగులు!
ఉండేది కొద్దిసేపే అయినా
ఆ సేపూ, ఆ స్థలమూ సొంతం, శాశ్వతం అనుకొని
దెబ్బలాడే వాళ్ళు
దుఃఖం కొనితెచ్చుకొనే వాళ్ళు!
తాము ఏదో అవస్థపడి ఎక్కేసి
వెనకవాళ్ళని రానివ్వని వాళ్ళు
దొంగలున్నారు జాగ్రత్త అని చెపుతూ
ఇటూ అటూ దొంగచూపులు నిసిరేళ్ళు!
టిక్కెట్టు కలెక్టర్ని పసిగట్టి
లెవటరీలో దూరి కూర్చునేవాళ్ళు
నిలబడే నిద్రపోయే వాళ్ళు
నిద్రనటిస్తూ ప్రక్క స్త్రీలపైకి వొరిగేవాళ్ళు
రకరకాల మనుష్యులు!

తన గర్భగోళంలో
ఇంత గంద్రగోళం జరుగుతున్నా
ఏమీ పట్టించుకోని రైలుబండి
సాగిపోతున్నది పట్టాలపై పారాణి అద్దుకొంటూ
బరువుగా, నిండుచూలాలులా!

నిత్యం నిండు చూలాలు,
సతతం పచ్చి బాలెంతరాలు,

ఏ అభిజిత్సంకేతాన్ని కోరో
నిర్విరామంగా పోతున్న అభిసారిక,
పాపం పుణ్యం లెక్కచేయక
అపారమైన సంసారసాగరాలను
అసంఖ్యాకంగా మోస్తున్న మూలపుటమ్మ,
ఈ ధూమవేణి

ఆకాశంలో ఎర్రని, పచ్చని దీపాలు!
భూమిపై అవే ప్రతిబింబాలు!
సాత్వికమైన తెల్లదనంలో దాగి
భరించరాని ఎన్ని మొరటురంగులో!

ఆవిరి తరంగాలు, ఉంగరాలై, బొంగరాలై
పొగ మబ్బుల పాలపుంతలో
గిరికీలు కొడుతుండగా
చూచి సంతోషమైనా పడకుండా
పోతున్నది యాంత్రికంగా!
ఉదరమే కాని, హృదయం లేదన్నట్టుగా!

ప్రతిక్షణమూ ఒక స్టేషను,
ప్రతి స్టేషనుకూ ఒక మాష్టరు,
అవసరమైనప్పుడే కనిపిస్తాడు గార్డు,
అసలే కనిపించడు డ్రైవరు!

ఎవరో పిల్లదానిచేయి పట్టుకు నడుస్తున్న
ఆ గ్రుడ్డి బిచ్చగాడు
మన బండికి డ్రైవరే లేడంటున్నాడు!
అసలు బండే లేదట ఆ మాటకు వస్తే!
అతని కున్నదంతా అతని ఆకలి!
అది తీరుతూ వుండడం అతని లక్ష్యం!

భుక్తికోసం భక్తి గీతాలు పాడేవాళ్ళని,
వంటకోసం పెళ్ళాడేవాళ్ళని,
వృద్ధాప్యంలో ఇంత కూడూ గుడ్డా కోసం
చచ్చిన తర్వాత ఇన్ని నీళ్ళ కోసం
పిల్లల్ని కనే వాళ్ళని,
ఎవరికీ ఎందుకూ పనికిరాని స్థితిలో కూడ
డొంకలపై మురికిపాతల్లా వ్రేలాడే వాళ్ళని,
భరించక తప్పదు లోకం!

మనం మాత్రం ఏం చెయ్యగలం?
వెయ్యి అతడి జోలిలో ఒకపైసా!

తెలిసిన గతంలో నుంచి
తెలియని భవిష్యత్తులోకి
అనుక్షణం దూసుకుపోతున్నది బండి!
వర్తమానం నీ నడుంలా వుంది!
వుండీ లేనట్టి దది!

లేకా వున్నట్టి దది!
నిరంతర క్షణిక సత్యం అది!

భూత భవిష్యన్మణిహారానికి
కొలికి పూసలా జిగేలు మంటూ,
అనంతమైన అంధకార గర్భంలో
ఒక మెరుపు మిణుగురులా రివ్వుమంటూ,
తలా తోకాలేని కాలోరగం వెన్నున
కన్నులా మిలమిల లాడ్తూ,
వర్తమానం నీ నడుంలా వుంది!

వచ్చిం దేదో స్టేషను!
ఎంతో సేపు ఆగదు బండి,

ఆగినట్టు కనిపిస్తుందది అలసిన మనసుకు,
ఆగే పోతుందది పనితీరిన తనువుకు;
అందం, చందం చూద్దామని
ఆత్మను ఆనందంతో నింపుకొందామని
విహార యాత్రకు కదిలిన మనవంటి వాళ్ళకు
అసలు ఆగనే ఆగ దది!
అగణిత వేగంతో పోతూ
ఆహ్లాదాలు వికసిస్తుం దది మనసిండా!
కులుకుతూ, మధువు లొలుకుతూ,
వొయ్యారంగా వొళ్ళంతా కదుపుకొంటూ,

అసూయతో చూచేవాళ్ళ కళ్ళల్లో
మసిబొగ్గులు విసిరికొడుతూ
శృంగారమయ మవుతుంది మన కది!
పుచ్చుకో ఆ పళ్ళూ, పాలూ!
తీసుకో ఆ పూలు!
ఎక్కడ పూచాయో యేమో
ఇంత దూరం వచ్చాయి నీ కోసం!
నా కళ్ళే అద్దంగా
తురుముకో వాటిని జటలో!

ప్రకృతి సుందర దృశ్యాలన్నీ
నీ ముఖంలోనే వున్నాయి!
స్థలం ఎంత ఇరుకైతే
అంత గాఢంగా హత్తుకుపోతాం!
ఒక్కరి స్థలం చాలు మనిద్దరికీ!
పెరగనివ్వు లోకాన్ని!

మనం ముందుకు పోతూవుంటే
బైటలోకం వెనక్కుపోతున్నది, చూడు!
మనం వెనక్కిపోతే
అది ముందుకు పోతుంది!

ఆ నది వొడ్డున కొబ్బరితోట
మన సీమలాగే వున్నది అచ్చంగా!

చూచిన దృశ్యమే చూస్తాం
చేసిన కార్యమే చేస్తాం
పొందిన ఆనందమే పొందుతాం
చరిత్ర పునరావృత్త మవుతుంది
కాని–
అదీ, ఇదీ వొకటేనా?

ఉదయం సూర్యోదయం లా
సాయంత్రం చంద్రోదయం లా
భాసించే నీ కందోయి
నవనవోన్మిషితం కాదా?
లిప్త కొక అందం వెలయిస్తూ
అనుక్షణం వినూత్న కామనతో
అలరించడం లేదా నన్ను?

గతంలాంటి దేదో వర్తమానంలో మెరిసినా
అదే ఇదికాదు ఎన్నటికీ!
గతం పునాదిపై
భవిష్యత్ ఇటికల్ని ఎప్పటికప్పుడు
పేరుస్తూపోయే తాపీ మేస్త్రీ వర్తమానం!
మన అనుభవం ప్రతిదీ క్రొత్తదే,
సంస్కారం ఒక్కటే ప్రాతది!
భూత భవిష్యత్తుల నడుమ
వెలుగు వంతెన అది!

ఏదో వంతెన దాటుతున్నది రైలు!
క్రింద ఏదో మహాప్రవాహం!
ఏ హిమగిరి శిఖరాగ్రం నుంచో అది!

ఎందుకలా విసురుతావు ముఖం నిండా
ఆ తుమ్మెదల్లా కుట్టే చూపుల్ని?
నీవు మానవకాంతవు కాకపోతే
నేను అనిమిషుణ్ని అయేవాణ్ని కాను!
నీవుంటే, దేవత లక్కరలేదు నాకు!

అపూర్వ సౌందర్యాలతో
అమృత మాధుర్యాలతో
నిత్య నూతనంగా భవిష్యత్తు
వర్తమానంపై విరుచుకు పడుతుంటే
ఆనందం పట్టలేక
ఉక్కిరి బిక్కిరై పోతున్న మనకు
గతం ఒక పరువు దుప్పటి మాత్రం!

అందం లేని వాళ్ళను
నగలు పెట్టుకోనీ,
ఓపిక లేనివాళ్ళను
పై తరగతిలో పయనించనీ,
పెట్టంతా గుర్రుపెట్టి నిద్రపోతోంది!
స్నానం చెయ్యి నీవు ఈ వెన్నెల వెల్లిలో!

# మోక్షం నా జన్మహక్కు

(వేదాంత దర్శన కావ్యం)

★★

రచన:

బోయి భీమన్న

ప్రచురణ:

సాహితీ నిధి

## ఉపనయనం

ఈ కావ్యానికి స్ఫూర్తి తరతరాలుగా వస్తున్న మానవ చింతనా ధోరణి, thinking process of man.

మెదడు ఒక పుష్పం అనుకొంటే, అది వికసించే కొలదీ వ్యక్తమయ్యే గుణాలు అందం, పరిమళం, మాధుర్యం, మృదుత్వం, సౌహార్ధం. ఇవి పంచజ్ఞానాలు. వీటి వ్యక్తీకరణ కోసమే జ్ఞానపీఠాధిష్ఠితమైన ఆత్మ తన చుట్టూ పంచేంద్రియ నిష్ఠమైన శరీరాన్ని నిర్మించుకొంది.

అట్టి వికాస క్రమంలో ఇంతవరకు మానవుడి ఆలోచనా ధోరణి రెండు భాగాలుగా సాగింది. ఒకటి – జననం మొదలు మరణం వరకు గల జీవితం గురించి. రెండు – మరణా నంతరం ఆత్మ గతి ఏమిటనేది. ఒకటి Physical, రెండోది meta-physical. ఒకటి భౌతిక జీవితం, material life. రెండోది ఆధ్యాత్మిక విభూతి, spiritual transcendency.

భౌతిక జీవితం అనుభూతమవుతూనే వుంది. దానికోసం ఎంతో ఆలోచనా, ఘర్షణా, కృషీ, కుట్రా జరుగుతూనే వుంది. ప్రగతి కూడా కనిపిస్తూ వుంది. అయితే, దీనంతటికీ "యజమానిని, భోక్తను నేను" అంటున్న ఆ "నేను" ఎవరు?

మనిషిని అనాదిగా తికమక పెడుతున్న ప్రశ్న ఇది. ఈ ప్రశ్నకు సమాధానం కోసం నిరంతరంగా జరుగుతున్న అన్వేషణే నేడు మనకు లభిస్తున్న ఆధ్యాత్మిక చింతన అంతా, వేదాంతమంతా!

ఈ "నేను" అంటున్న దాన్ని ఆత్మ అన్నారు. ఆత్మ వేరు, శరీరం వేరుగా కనిపిస్తున్నది కదా? ఆత్మ పోయిన శరీరం దాని మూల పదార్థాలలోకి కరిగిపోతున్నది. మరి, ఆత్మ ఏమవుతున్నది? ఆత్మ కూడా తన మూల పదార్థంలోకి తిరిగిపోవడం సహజం కాదా?

మరి, మరణానంతరం ఆత్మకు మరొక రకమైన జీవితం కల్పించ బడడంలోని రహస్యం ఏమిటి? ఏమిటో చెప్పడానికే వ్రాశానీ గ్రంథం.

# మరణానంతర వ్యవస్థ

పాంచభౌతిక శరీరం పోయిన తర్వాత, దానిని అంతవరకూ త్వమేవాహంగా మోసుకు తిరిగిన ఆత్మ, దానిని విడవడానికి ఎంతగానో బాధపడిన ఆత్మ ఇంకా బ్రతికే వుంటుందనేది ఒక అభిలాష (wish thinking). అది కేవలం అపోహ మాత్రమే.

ఈ అపోహ ఆధారంగా నిర్మించబడినట్టిదే ప్రపంచంలోని తాత్త్విక సాహిత్యం అంతా, భారతీయ వేదాంతమంతా.

లోకంలోని అన్ని మతాలకు, అందరు దేవుళ్ళకు, వాళ్ళ సంప్రదాయ సంఘర్షణలకు, స్వర్గ-నరక, కర్మ జన్మ సిద్ధాంతాలకు ఈ అపోహ కారణం.

మానవ జీవితానికి పరమ లక్ష్యం శాశ్వత దైవ సాన్నిధ్యసుఖ మనో, స్వర్గ నివాసమనో, జన్మ రాహిత్యమనో, జీవ బ్రహ్మైక్యమనో, మోక్షమనో వివిధ మతాల పండితులూ చేసే ప్రచార మంతటికీ హేతువు ఈ అపోహే.

మరణానంతరం ఆత్మ జీవించివుంటుందనేది నిజం కాదు. శరీరంతోపాటు ఆత్మ కూడ దాని మూల పదార్థంలో లయించిపోతుంది. ఈ మూల పదార్థాన్నే నేను పరమాత్మ అన్నాను.

పృథివి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం - ఇవి అయిదూ ఒకే పదార్థానికి అయిదు దశలు. ఈ అయిదూ కూడ మూల పదార్థంలో త్వరగానో, ఆలస్యంగానో లయించిపోయేవే. శరీరం లాంటి ఘన పదార్థం ఎక్కువ కాలం తీసుకొంటే, ఆత్మ వంటి సూక్ష్మ శక్తి క్షణంలో కలిసిపోతుంది.

సముద్రంలో ఒక మంచుగడ్డను వేస్తే, అది కరగడానికి కొంత టైంపట్టవచ్చు. ఒక నీటి బొట్టును వేస్తే, అది వెంటనే లీనమైపోతుంది.

నీటి బొట్టు విడిగా వున్నంతసేపే దాని వ్యక్తిత్వం, రంగూ, రుచీ, ఆకారం, వాసనలు వగైరా. అది సముద్రంలో పడగానే అవన్నీ పోతై. బొట్టు అస్తిత్వమే పోతుంది.

ఇలాంటివే ఎన్నో ఉదాహరణలు చెప్పవచ్చు. దీపం ఆరిపోతే మళ్ళీ వెలిగించినపుడు, ఆ పోయిన వెలుగే తిరిగి రాదు. బేంకులో వంద రూపాయలు కట్టి, వంద రూపాయలూ వెంటనే తీసుకొన్నా, మనం కట్టిన ఆ నోట్లే రావు.

ఆత్మ కావచ్చు, వెలుగు కావచ్చు, నీరు కావచ్చు, పైకం కావచ్చు. ఏదైనా, పోయేది ఉమ్మడి నిల్వ (Common Pool)లోకి పోతుంది. వచ్చేది ఉమ్మడి నిల్వ నుంచి వస్తుంది. పోయిన దాని వ్యక్తిత్వం పూర్తిగా పోతుంది. వచ్చేది కొత్త వ్యక్తిత్వంతో వస్తుంది. కనుక, పున ర్జన్మలకుగాని, వాస్తవ కర్మ బంధాలకు గాని ఆస్కారం లేదు.

సృష్టిలోని జీవాజీవ సమస్తానికీ Common Pool పరమాత్మ.

జీవ బ్రహ్మైక్యం, అంటే ఆత్మ పరమాత్మలో కలిసిపోవడం మోక్షం. అంతవరకు అద్వైతం చెపుతున్నది. అయితే – మోక్షం సిద్ధించడానికి అది కొన్ని షరతులు పెడుతున్నది. ఏ షరతులూ అక్కరలేదంటున్నాను నేను.

## వేదాంతం అంటే

వేదాంతం అంటే వేదాలు చెప్పిన చివరి మాట అని.

వేదాలు చెప్పిన విషయాలు చాల వున్నై. ఆనాటి దేశ కాల పరిస్థితుల ననుసరించి సుఖంగా, తృప్తిగా, గౌరవంగా, ప్రయోజనాత్మకంగా మానవుడు బ్రతకడం ఎలాగో వివ రించాయి వేదాలు.

శత్రు దాడుల నుంచీ, క్రూర మృగాల నుంచీ మాత్రమే కాక, తమ అధీనంలో లేని ఆధి భౌతిక, ఆధ్యాత్మిక, ఆధి దైవిక బాధల నుంచి, ఆపదల నుంచి ఆత్మ రక్షణ ఎలా చేసు కోవాలో కూడా బోధించాయవి.

శరీరమూ, పంచ భూతాలూ తెచ్చి పెట్టే బాధలు అనుభవంలోవే. తన ఆత్మే తనకు తెచ్చిపెట్టే బాధలూ చాల వున్నై. తనకు తెలియకుండానే, తన ప్రమేయం లేకుండానే, ఎక్కడి నుంచో తనపై విరుచుకుపడే బాధలు సైతం తక్కువేం కాదు. అట్టి బాధలను తెచ్చిపెట్టే అజ్ఞాత శక్తినే దైవం అన్నారు.

ఈ బాధలన్నిటినీ ఎదుర్కోడానికి యంత్రాలే కాదు, మంత్ర తంత్రాలూ కావలసి వచ్చినై. అందుకు పరిశోధనలూ ప్రారంభమైనై. అంతవరకు జరిగిన పరిశోధనల రికార్డులనే నాలుగు వేదాలుగా ఎడిట్ చేశాడు మత్స్యగంధేయుడు.

మొట్టమొదటగా దైవం మానవుడికి అపకారిగానే పరిచయమయింది. మనం ముఖ్యంగా గుర్తించవలసిన వాస్తవం ఇది.

పంచ భూతాల వెనుక, ఆత్మ వెనుక ఏవో అతీత శక్తులు (ఒకటో, అనేకమో) వుండి, తమను ఆడిస్తున్నాయనే అనుమానం వచ్చిన ఆనాటి మేధావులు అట్టి శక్తుల్ని ప్రసన్నం చేసుకొని, వాటిచేత మంచి చెయ్యించుకోడానికి రకరకాల పథకాలను రూపొందించారు. అందులో భాగాలే ప్రార్థనలు, పొగడ్తలు, పూజలు, బలులు, బహుమానాలు, యజ్ఞాలు, నైవేద్యాలు – ఈ బహువిధ కర్మకాండలన్నీ.

ఈ అన్నిటి ద్వారా కొన్ని కొన్ని ప్రయోజనాలు లభిస్తున్నాయని అనుకొన్నా, చివరకు మరణం తప్పడం లేదు కదా!

ఎంత గొప్ప మానవుడి జీవితానికైనా మరణమే ముగింపా? కోటీశ్వరుడికీ, కూలి వాడికీ శ్మశానమే గమ్యస్థానమా?

అశాంతి చెలరేగింది గొప్ప వాళ్ళలో. ఏదో ఒకటి చేసి, ఎలాగైనా సరే మృత్యువును తప్పించుకోవాలనే తపన ప్రారంభమయింది.

## మత భేదాలు

అంతవరకు వేదార్ణవాలలో మునిగి తేలిన వ్యాసుడికి కూడ అదే బెంగపట్టుకొని వుండవచ్చు.

వేదాలన్నీ జీవితం గురించే చెపుతున్నై. అందుకే ఆయన పరిశోధనలు మొదలు పెట్టి వుంటాడు. తనలాంటి వాళ్లు ఇంకా కొందరుంటారుగా? అలాంటి సహ చింతకులను ఇంటర్వ్యూచేసి, ఒక్కొక్క అభిప్రాయంతో ఒక్కొక్క ఉపనిషత్తును తయారుచేశాడు! అందుకే అందులో అంతంత భావ వైరుధ్యం!

శరీరంతోపాటు ఆత్మ కూడ మరణిస్తుందా?

ఇంత పాండిత్యం, ఇంత తపస్సు, ఇంత సంపద, ఇంత అధికారం, ఇంత అభిజాత్యం మట్టిపాలేనా?

అలా కాకూడదు. శరీరం పోతే పోయింది. ఆత్మ పోగూడదు. ఆత్మ శాశ్వతంగా బ్రతికే వుండాలి. ప్రతి వాళ్లకూ వుండే ఆశాకాంక్ష ఇది.

శరీరంతోపాటు ఆత్మ మరణించకపోతే, మరి ఆ తర్వాత ఆత్మ పరిస్థితి ఏమిటి?

స్వర్గం, నరకం, అలాంటివే వివిధ లోకాలు, భూతప్రేత పిశాచాది రూపాంతరాలు, పునర్జన్మలు లాంటి ఎన్నో అవస్థలు మరణానంతరం ఆత్మకు కల్పించబడినై. వితంతువు లాంటిదే కదా విదేహి కూడా?

ఈ బాధలన్నీ పడలేని ఆత్మకు జన్మరాహిత్యమే మోక్షం అన్నారు.

ఇదంతా కూడ వ్యాసుడికి గందరగోళంగానే అనిపించి వుంటుంది. ఆయన నిత్య పరిశోధకుడు కదా. అందుకే ఉపనిషత్తుల్ని వడపోసి బ్రహ్మ సూత్రాలనూ, వాటిని కూడ పిండి భగవద్గీతనూ ప్రకటించాడు.

వేదాల నుంచి పురాణాలు, కథలు, కావ్యాలుగా ప్రవహించిన శాఖ సాహిత్య మయింది. ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీతగా వెలువడ్డ శాఖ వేదాంత మయింది.

సాహిత్యం వాస్తవ జీవితాన్ని సస్యశ్యామలం చేస్తుండగా, వేదాంతం ఆత్మకు ఒక శాశ్వతానంద స్థితిని సమకూర్చడానికి ఆలోచన ప్రారంభించింది. ఈ ఆలోచన ముఖ్యంగా మూడు మార్గాల్లో సాగింది.

1. దేవుడెక్కడో ఒక పరలోకంలో వుంటాడు. ఇక్కడ శరీరాన్ని వదిలేసిన ఆత్మ (జీవుడు) అక్కడకు పోయి, ఆయన రాజ్యంలో శాశ్వతంగా వుండిపోతుంది.

జీవుడు వేరు, దేవుడు వేరు అనే వూహ మీద ఆధారపడ్డ ద్వైతం (Dualism) ఇది. ఎల్లప్పుడూ దేవుణ్ణి చూచుకొంటూ, సుఖంగా బ్రతికేసే సాలోక్యం ఇది. ప్రపంచ మంతటా మొత్తం మీద అమల్లో వున్న ఊహ ఇదే.

2. దైవ రాజ్యంలో జీవుడి భక్తి ప్రపత్తులను బట్టి ఉన్నతోన్నత స్థానాలు లభించే ప్రణాళిక విశిష్టాద్వైతం. జీవుడికి దైవ సామీప్యం, సాన్నిధ్యం కూడా లభిస్తాయిందులో. మరీ గొప్ప భక్తులకు సాకార స్థాయి కూడ అందవచ్చు. అట్టి భక్తులు దేవుడి ఆకారంలోనే, ఆయన అనుభవించే సుఖ భోగాలన్నిటినీ అనుభవిస్తూ వుంటారు. ఈ స్థితిని నేను Identicalism అంటున్నాను.

ఈ స్థితిలో జీవుడు దేవుడితో సమానంగా వుంటాడు. ఈ కాలపు పోలిక తేవాలంటే – కేబినెట్ రేంకు అనవచ్చు. పూర్తి అధికారం మాత్రం దేవుడికే వుంటుంది.

3. జీవ బ్రహ్మైక్యం అద్వైతం. జీవుడు, దేవుడు వేరు వేరు కాదు. జీవుడంటే జీవాత్మ. దేవుడంటే పరమాత్మ, పరబ్రహ్మ. ఇవి శక్తులు. వీటికి లింగభేదం లేదు. ఒకదాని నుంచి ఒకటి ఉద్భవిస్తుంది. ఒకదానిలో ఒకటి కలిసిపోతుంది. అహం బ్రహ్మాస్మి అనేదిక్కడే. పరమాత్మ నుంచి పుట్టిన ఆత్మ తిరిగి పరమాత్మలో కలిసిపోయి, తాను పరమాత్మే అయిపోతుంది – నీటిచుక్క సముద్రంలో పడి సముద్రమే అయిపోయేలా.

ఈ స్థితిని నేను Mergerism అంటున్నాను. ఇదే మోక్షం, జన్మ రాహిత్యం, Salvation.

## సమైక్య భారతీయత

సందర్భం వచ్చింది కనుక ఇక్కడొక సత్యం చెప్పాలి. మత్స్యగంధి దాసరాజు కూతురు. దాస, దస్యు, నిషాద, కిరాత శబ్దాలతో పిలువబడ్డ వర్గాలు ఆర్యులు కారు. ఆర్యులతో సహా ఈ వర్గాలన్నీ కలిసిపోయి భారత జాతిగా ఏర్పడుతున్న కాలమది.

అరుంధతి మనుమడైన పరాశరుడి రంగేదో తెలియదు. మత్స్యగంధి రంగేదో తెలి యదు. అయితే వాళ్ళ కుమారుడైన వ్యాసుడు మాత్రం నల్లటి వాడు. అతడి రంగునుబట్టే అతడికి కృష్ణుడు అనే పేరు వచ్చింది. వేద విభజనచేసి వేదవ్యాసుడయ్యాడు తర్వాత.

అందుకే చెపుతున్నాను, వేదాలు ఆర్యులకు మాత్రమే చెందినట్టివి కాదు. వేద సాహిత్యం భారతీయులు అందరికీ చెందినట్టిది. దానిని వర్గ దృష్టితో, పాక్షిక దృష్టితో, మత దృష్టితో విమర్శించడం న్యాయం కాదు.

వేద సాహిత్యమంతా నా పిత్రార్జితం. నా పిత్రార్జితం నాకీనాడు పనికిరాకపోవచ్చు. నాదైనదంతా నాణ్యమైనది కాకపోవచ్చు. ఆ కాలంలో వాళ్లలా జీవించారు. అంతే.

''కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ ఇండియా'' అనే గ్రంథంలో రకరకాల జాతుల కలయికతో ఏర్పడిందే భారత జాతి అనీ, వేదకాలపు చివరి దశలో అనగా క్రీస్తు పూర్వం 10వ శతాబ్ద ప్రాంతంలో భారతజాతి రూపుదిద్దుకొన్నదనీ చెప్పబడింది. చూడండి–

The Indian way of life, as it emerged with the birth of "the Indian man" which took place as the result of miscegenation of

Nishada, Kirata, Dasa, Dasyu and Arya, i.e. of the Mongoloid and Austric, the Dravidian and the Indo-Aryan or Indo-European, we have to bid good - bye to theories of hoary - antiquity of Indian Aryan culture.

We might look upon the 10th century B.C., the last phase of the Vedic age, as that time when the Indian man came into being.

The beginnings of the Vedic Period go back to the 14th or 15th century B.C.

## ఎందుకు దిగజారింది?

ఆ విధమైన మిశ్రమ జాతి, ఆదిలో బహుముఖ ప్రజ్ఞా ప్రభావాలతో ప్రపంచాన్ని శాసించిన భారత జాతి, ఈనాడు ఇంతగా ఎందుకు దిగజారిపోయిందో, పునరుజ్జీవం ఎలా పొందగలుగుతుందో సూచిస్తూ, అదే గ్రంథంలో పబ్లిషర్ల నోటు ఏమంటున్నదో చూడండి.

"India's strength rests upon the principles of the unity of man, the unity of thought, and the unity of spiritual experience. She has flourished when they have been well expressed, and she has degenerated when they have been forgotten or submerged. India lives today because, inspite of centuries of degeneration, these principles have been kept alive in the national consciousness. India shows a resurgence of strength today, and that strength will be measured by the degree to which she can succeed in putting these principles into practice, adopting them to the special conditions of the modern world.

ఈ విషయంలో మన పత్రికలు కూడా ఎంతగానో హెచ్చరిస్తూ వున్నాయి. 1988 ఫిబ్రవరి వనిత ఏమంటున్నదో చూడండి.

"వసుధైక కుటుంబం ధ్యేయంగా అన్ని మతాలూ లోక కల్యాణం కోసమేనని అను కున్నా, మానవ ప్రగతికి ఆటంకం కలిగించే కొన్ని స్వార్థ శక్తులు, అభివృద్ధి

నిరోధకులు మొదటి నుంచీ మతాలకు సంబంధించిన సదుద్దేశాలను వక్రీకరిస్తూ, తమ భావాలకు విశేష ప్రచారం లభించడానికి రకరకాల కట్టుకథలు అల్లి, పామరజనులను మభ్యపెడుతూ, వారి మనసుల్లో మూఢనమ్మకాలు పాతుకుపోయేలా చేస్తూ వచ్చారు. ఆ ప్రయత్నాలు ఇప్పటికీ కొనసాగు తూనే వున్నాయి.

"మనుషుల మధ్య రకరకాల విభేదాలు కల్పించి, శత్రుత్వాన్ని రేకెత్తించి, వారు ద్వేష జ్వాలల్లో భస్మమయ్యేలా చేసే ప్రయత్నాలు ఒక ప్రక్క - నమ్మకాల పేరుతో జనంపై మత్తుమందు జల్లి వారిలో నిర్మాణాత్మకమైన కృషిపట్ల ఆసక్తిలేకుండా జాతి నిర్వీర్యం కావడా నికి దోహదం చేసే ప్రయత్నాలు మరోప్రక్కా మన దేశాన్ని సంక్షోభానికి గురిచేస్తున్నాయి.

"ఈ క్లిష్ట సమయంలో అటువంటి ప్రచారాలకు, మూఢ నమ్మకాలకు సభ్యసమాజం నిరసన తెలిపి, ప్రజలందరి సమైక్యతను కోరుతూ, అభ్యుదయంవైపు పురోగమించడానికి కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వుంది." (Feb - Vanita - 1988).

ఈ అవ్యవస్థకంతకూ కారణం వ్యక్తులూ కాదు, నాయకులూ కాదు. తరతరాలుగా ఒకే మూసలో బిగుసుకుపోయిన సాంఘిక వ్యవస్థ కుళ్ళి కంపు కొడుతూ వుంది. దాని కాలుష్యంలో మెదళ్లు తమ ప్రతిభను కోల్పోయాయి. డాక్టర్ గోపి ఒక కవితలో అంటాడు-

"ఇక్కడ సెంటిమెంటు కోసం రాయిగా మారాలి, ప్రతిఫలం కోసం యాచించాలి, స్పష్టత కోసం కన్ఫ్యూజు కావాలి, కవిత్వం పేరుతో కాకిలా అరవాలి" అని!

అలా దిగజారిపోయిన మానవతను ఉద్ధరించి, ఋజుమార్గంలో పెట్టాలంటే సమత, నిజాయతీ ప్రాతిపదికగా వ్యవస్థే మొత్తం మారాలి.

అందుకే జీవిత లక్ష్యం మోక్షం కాదు, మోక్ష లంఘనం అంటున్నాను.

"ఆనాడు నగర జీవితం నరక ప్రాయం, పల్లె కాపురం స్వర్గతుల్యం అనుకునే

వాళ్ళం. ఈనాడు పరిస్థితి తల్లక్రిందులైంది. సభ్యత, సంస్కారం, సేవాభావం గల వ్యక్తికి పల్లె నివాసం దుర్భరమైపోయింది. బోడితలలను మోకాళ్ళకు ముడిపెట్టే వారికి, అరచేతిలో వైకుంఠం చూపించే వారికి (వంచకులకు, స్వార్థపరులకు) ఈనాడు పల్లెలు నెలవు లయ్యాయి.'' అంటూ వాపోయారు - జమీన్ రైతు ఎడిటరు నెల్లూరు శ్రీరామమూర్తి గారు, 1987 ఏప్రిల్ 24 నాటి పినాకినీ తీరంలో.

నగరాలూ, పట్టణాలూ మాత్రమే కాదు, పల్లెటూళ్ళు కూడ దినేదినే ఎలా నరక కూపాలుగా మారిపోతున్నాయో అద్దంలోలా చూపుతున్న కరుణ కావ్యం ఆ వ్యాసం.

ఇక్కడ నేను దీనిని ఉదాహరిస్తున్నది - మానవ పాతిత్యం పట్ల మానవతా వాదులు ఎంతగా ఆందోళన చెందుతున్నారో చూపడానికే.

మరి, శతాబ్దాలుగా మతాలు, వాటి దేవుళ్లు, గురుపీఠాలు, వాళ్ల వేదాంతాలు, నాయకులు, వాళ్ళ రాజకీయాలు, కవులు, వాళ్ళ కావ్యాలు చేస్తున్న నీతి బోధలన్నీ ఏమైపోతు న్నట్టు? దైవం, నరకం, పునర్జన్మవంటి బూచులు మానవుణ్ని ఎందుకు బెదిరించలేకపోతున్నై?

అవన్నీ అబద్ధాలుగా తేలిపోయినందువల్ల. ఏదో మాదిరిగా బ్రతకడమే మానవుడి జీవితలక్ష్య మైపోయినందువల్ల. ధనానికి తప్ప మనిషిలోని మరే విలువలకూ గుర్తింపు లేకుండా పోయినందువల్ల.

ధనవంతులు, నాయకులు, రౌడీలు చేసే నీతి బోధలను నమ్మే స్థితిలో లేరు ప్రజలు ఈనాడు. కళ్లు తెరిచారు. ధనార్జన కోసం ఎగబడుతున్నారు. నీతి నిజాయితీలు కిలో కందిపప్పును కూడ కొనలేకపోతున్నప్పుడు, ఏం చేస్తారు?

మరి, దైవ భక్తులూ, జటాధారులూ రోజురోజుకు ఎక్కువైపోతున్నారు కదా అనే ప్రశ్నకు, నిస్పృహవల్ల అలా జరుగుతున్నది అనేది జవాబు.

## నివృత్తి - ప్రవృత్తి

ఆత్మ, పరమాత్మ, జీవాత్మ, ఘటాత్మ అనే మాటల తోటల్లో పెరిగిన నేను, వాటన్నిటినీ అధిగమించి రసాత్మగా వికసించాననుకోవచ్చు. నిజానికి నేను చిట్టడవుల్లాంటి కోనసీమ తోటల్లో పెరిగాను. నాకు ఎక్కడ చూచినా సౌందర్యమే కనిపించేది. సంగీతమే వినిపించేది. ఊహల నిండా సాహిత్యమే గుబాళించేది. ఈ విధంగా వేదాంత గ్రంథాల కంటే వేదాల వైపే నా అభిరుచి పరుగులు తీసింది.

నాకు వేదాల నిండా కవిత్వం కనిపించింది. అనేక జాతుల, అనేక భాషల పాత కొత్త సాహిత్యాలను కొద్ది కొద్దిగా అయినా రుచి చూచిన నేను ఈనాడు చెప్పగలిగిం దేమిటంటే భారతీయ వేద సాహిత్యంలో కనిపించేటంత రసవంతమైన కవిత్వం మరెక్కడా లేదని! నేను వేదాలను (అనువాదాల ద్వారా) చదివింది వాటిలోని కవిత్వం కోసమే.

"అహం బ్రహ్మాస్మి", "తత్త్వమసి", "త్వమేవాహం" వంటి నివృత్తి లక్ష్య సూక్తుల కంటే 'రసోవైసః', 'ఆనందో బ్రహ్మ' వంటి ప్రవృత్తి లక్ష్య సుభాషితాలే నన్ను ఆకర్షించటంవల్ల నేను చిన్నప్పటి నుంచీ కూడా వేదాంతాన్ని వదిలేసి కవితా జీవిత పథంలో ముందడుగు వేస్తూ వచ్చాను. బాల్యావస్థ దాటి, కాకినాడ కాలేజీలో చేరే వరకు నా మనస్థితి అలానే కొనసాగింది. అక్కడ మాకు లెక్చరరుగా వున్న నాస్తికతా గురువు గోరా (గోపరాజు రామచంద్ర రావు) గారి ఎదుట ముఖాముఖిగా నిలిచే వరకు అదే పరిస్థితి. దేవుడు వున్నాడా, లేడా అనే మీమాంసకు అంత సాంఘిక ప్రాధాన్యం వున్నదనే సంగతి అంతవరకూ నేను గుర్తించనే లేదు.

"నీవు దేవుడు వున్నాడని అనుకొంటే వున్నాడు. లేడనుకొంటే లేడు" అనే మాట ఒక అద్వైత వేదాంతి చెప్పగలిగిన మాట. నేను అట్టి వాతావరణంలోనే పుట్టి పెరగడంవల్ల, నాకు కూడ ఆ మాట అర్థమైనట్టే వుండేది. అందువల్ల నేను ఆ మాటనే గోరాగారికి చెప్పి, ఆయన నాస్తిక బృందంలో చేరిపోయాను.

సాంఘిక ప్రయోజనం దృష్ట్యా దేవుడున్నాడనుకొని పూజలు చెయ్యనూ వచ్చు, లేడనుకొని తన పనేదో తాను చేసుకోనూ వచ్చు. సామాన్య మానవుడి పద్ధతి అది.

ప్రతిభావంతుడైన ఒక కళాకారుడికి అట్టి ద్వైదీ వర్తన ఎంతోకాలం సాధ్యం కాదు. అద్వైత వేదాంతంలో పరమాత్మ వుంది. పరమాత్మ ఆత్మగా వికసించే ప్రక్రియా విశేషమే ఏ కవికైనా కావ్యవస్తువు. పరమాత్మ, ఆత్మ, ప్రకృతి, జీవితం వంటి ప్రవృత్తుల ప్రమేయం లేకుండా ఏ వ్యక్తీ భావుడుకు కాలేడు, కవి కాలేడు, కళాస్రష్ట కాలేడు.

ఈ సమస్యను గురించి చాలా కాలం తర్వాత నేను గోరాగారితో చర్చించినప్పుడు ఆయన నాతో ఏకీభవించి, నేను తమ బృందం నుంచి తప్పుకోడానికి అంగీకరించారు. విశ్వ మూలకమైన పరమశక్తి ఏదో ఒకటి ఉన్నదనడం వాస్తవమేననీ, అయితే అట్టి శక్తి ఒకటి ఉన్నదని మనం అంగీకరిస్తే దానికే దేవుడని పేరు పెట్టి ప్రజలు పూజలు సాగిస్తారనీ, అందువల్ల అసలేదీ లేదనడమే తమ ఉద్యమం లక్ష్యమనీ ఆయన అన్నారు.

ఏదో ఒక శక్తి వున్నదనుకొన్నా, లేదనుకొన్నా ఫలితం ఒక్కటే అయినప్పుడు సాంఘిక మూఢాచారాల నుంచీ, వాటి అభ్యుదయ నిరోధక శృంఖలల నుంచీ మానవుణ్ణి తప్పించి, మానవజాతి పురోగమనానికి తోడ్పడే గోరాగారి ఉద్యమానికి ఏ దేవుడూ లేడనటమే మంచి పద్ధతి.

లౌకిక ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా వాస్తవ సత్యాలపై ఆధారపడి కావ్య సృష్టి చెయ్యవలసిన నావంటి వాడికి లోకాలోక ప్రవర్తకమయిన ఒక పరమాత్మ వునికిని గుర్తించడం తప్పనిసరి. అందుకే ఆస్తికత్వమూ, నాస్తికత్వమూ పరస్పర విరుద్ధాలుగా కనిపించినా, సిద్ధుడైన అద్వైతిక దృష్టిలో రెండూ ఒక్కటే. ఒకే సత్యానికి బొమ్మ బొరుసులు. నేను ఏమి చెప్పినా, ఏది వ్రాసినా దానంతకూ పునాది బలం ఇదే. ఇదే సమైక్య భారతీయ తాత్త్విక దృక్పథం - ''ఏకంసత్, విబుధా బహుధా వదంతి''.

## జవాబుల్లేని ప్రశ్నలు

మరణానంతరం ఆత్మలు ఎక్కడికి వెళతాయి? ఏయే రకాల ఆత్మలు ఏయే లోకాలకు వెళతాయి?

అవి మళ్ళీ ఈ మన లోకానికి ఎలా తిరిగి వస్తాయి? ఎందుకు తిరిగి వస్తాయి?

నిరంతరంగా ఎంతో మంది జన్మిస్తున్నారు. మరణిస్తున్నారు. ఈ జనన మరణాల మధ్య ఏదైనా సంబంధం ఉన్నదా?

జీవికీ జీవికీ మధ్య ఎన్నో హెచ్చుతగ్గులు, సుఖదుఃఖాలు వుంటున్నై కదా? అందుకు హేతువేమిటి?

సృష్టిస్థితి లయ కారణమైన పరమశక్తి (శక్తిమంతుడు) ఉండెనా? ఉంటే, దాని (అతడి) స్వభావ స్వరూపాలు ఎలాంటివి?

ఇలాంటి ప్రశ్నలు అనేకం వేదకాలంలోనే ఉత్పన్నమైనై. అయితే, ఈ ప్రశ్నలకు వేదాలలో జవాబులు లభించలేదు.

వేదాలు భౌతిక జీవితానికి సంబంధించినట్టివి. ఆధ్యాత్మిక పరిశోధన పూర్తిగా వ్యక్తిగత మైనట్టిది. వేద విద్యలు ప్రావృత్తికాలు కాగా, ఆధ్యాత్మిక విద్య నైవృత్తికం.

ఎంతటి వేద పండితుడైనా చూడగలిగింది మృత్యువు వరకే. ఆ తర్వాత ఏమైనా వున్నదా? వుంటే అదేమిటి? లేక, ఏమీ లేదా? జీవితానికి మృత్యువే ముగింపా? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు వేద ఋషులవద్ద లేవు.

ఈ వాస్తవం మనకు శ్వేతకేతుడి చరిత్ర స్పష్టపరుస్తుంది.

వేద విజ్ఞానాన్ని క్షుణ్ణంగా తెలుసుకొన్న శ్వేతకేతుడు పాంచాల దేశ మహారాజైన ప్రవాహణుడి ఆస్థానంలో, మహారాజు అడిగిన పై ప్రశ్నలకు జవాబులు చెప్పలేక పోయాడు. ఆ తర్వాత అతడూ, అతడి తండ్రి ఉద్దాలకుడూ మహా రాజును దర్శించి, ఆయన వద్ద బ్రహ్మ విద్యను గ్రహించారు.

బ్రహ్మ విద్య అంటే ఆనాడు (ఈనాటికీ కూడ) మరణానంతరం ఆత్మ ఏమౌతుంది అనే విషయం గురించి తెలుసుకోవడం.

మరణానంతరం జీవుడు నిజంగా ఏమవుతాడు?

శ్వేతకేతుడు ఎప్పటివాడు? వేదకాలపు వాడు. ఆనాటి ఆచార వ్యవహారాలకు ఎదురు తిరిగి, విప్లవాత్మకమైన మార్పులను తెచ్చినవాడు. వేదాంత విద్యా వికాసానికి

కారణభూతుడైన వాడు. ద్వైత అద్వైత మతభేదాలకు నిమిత్తమాత్రుడైనవాడు. అట్టి మహామేధావికి, విప్లవ చైతన్య మూర్తికి ఆనాడు ఎదురైన ప్రశ్నలు ఈనాటికీ లోకంలోని మహితాత్ములందర్నీ తికమక పెడుతూనే వున్నాయంటే, అందుకు కారణం ఏమిటి?

అవి జవాబులు లేని ప్రశ్నలు కనుక! మరణానంతర జీవస్థితి గురించి ఎవరికీ తెలి యదు కనుక!

ఈ గందరగోళాని కంతకూ కారణం ఆత్మకు చావులేదనుకోవడం.

నరకయాతనలు, నీచ జన్మాంతర దుఃఖాలు, ప్రేత పిశాచరూప వికారాలు ఎన్నిటినైనా భరించడానికి సిద్ధపడతాడే తప్ప, మానవుడు ఆత్మ మృతి చెందడానికి ఒప్పుకోడు.

మరి, అద్వైతం ప్రతిపాదిస్తున్న దేమిటి? ఆత్మకు శాశ్వత విశ్రాంతినే కదా?

శరీరం చచ్చిపోవడం మృత్యువు

ఆత్మ చచ్చిపోవడం మోక్షం,

చచ్చిపోవడం అంటే–

దేని మూలకంలోకి అది చేరిపోవడం!

శరీరం పంచభూతాలలోకి చేరిపోతుంది. పంచభూతాలంటే ముడి పదార్థాల రూపంలో పరమాత్మే కదా? అవి పోగానే, వాటితోపాటు ఆత్మకూడ పోతుంది. ఆత్మ వెంటనే పరమాత్మలో కలిసిపోగా, పంచభూతాలు తీరిగ్గా కలుస్తాయి. బాధేముంది? అన్నీ ఒకే బ్రహ్మ పదార్థం కదా?

మృత్యువుకు భయపడే నరుడు మోక్షం కోసం అంత ఆరాటపడతాడెందుకు? రెండూ ఒకటి కాదనుకోవడం వల్లనే!

# ఉచ్ఛ నీచాలు కల్పితాలు

మృత్పిండ మేకో బహు భాండ రూపా
సువర్ణ మేకో బహు భూషణాని
గోక్షీర మేకో బహు ధేను రూపా
ఏకం పరాత్మా బహు దేహ వర్తీ!

మా అయ్యా నా చిన్నప్పుడెప్పుడో, శిష్యులతో గోష్ఠి జరుపుతూ, ఉదాహరించిన శ్లోక మిది. బహుశా నేను జీవిత ప్రాంగణంలో, పంచాబ్ద ప్రాయంలో మొదటిసారిగా వినిన, తదాదిగా స్మృతిలో వుండిపోయిన శ్లోకం ఇదే అనుకోవచ్చు.

ఈ శ్లోకం ఎక్కడిదో తెలీదు. నాలుగో చరణం కరెక్టుగా గుర్తులేదు. అర్థం మాత్రం గుర్తుంది. అర్థాన్నిబట్టి ఈ చరణాన్ని ఇలా అతికాను.

ఈ శ్లోకాన్ని ఉదాహరించి, అర్థాన్ని వివరిస్తూ ఒక కథ చెప్పే వాడాయన. అన్ని జీవులలోను ఉన్న పరమాత్మ ఒక్కటే, జన్మలలో ఉచ్ఛనీచాలు లేవు అనేదా కథ.

ఒక గురువు ఒక రోజున తన శిష్యులతో ఇలా చెప్పాడట:

"నేను ఈ రాత్రి మరణిస్తున్నాను. నేను చేసిన ఒక చిన్న పొరపాటువల్ల వచ్చే జన్మలో ఒక పంది కడుపున పుట్టవలసి వుంది. పుట్టడం తప్పదు. అయితే, పందిగా మాత్రం బ్రతకలేను"

శిష్యులు ఒక్కసారిగా గొల్లుమన్నారు.

"వద్దు, గురువర్యా! వద్దు, పంది జన్మ వద్దు. అంత అసహ్యకరమైన నీచ జన్మ వద్దు, వద్దు–"

తప్పదన్నాడు గురువు. కర్మఫలం అనుభవించక తప్పదన్నాడు. ఒక్క సహాయం మాత్రం చేసి పెట్టమన్నాడు శిష్యుల్ని.

"పందిగా పుట్టక తప్పదు కాని, పందిగా బ్రతకడం నుంచి తప్పించుకోవచ్చు. అందుకు మీ సహాయం కావాలి"

ఎలాంటి సహాయమైనా సరే చేస్తామన్నారు శిష్యులు. గురువు చెప్పడం సాగించాడు:

"ఎరుకల గురవయ్య తెలుసుగదా. అతని పందుల్లో ఒకటి పలానా రోజున మిట్ట మధ్యాహ్నం ఈనబోతూ వుంది. అందులో ఒక పిల్లను కొనెయ్యండి. పైకం ముందే చెల్లిం చెయ్యండి. పంది ఈనే సమయంలో మీరక్కడే వుండండి. ఈనిన వెంటనే, ఆ పిల్లల్లో నొసటి మీద తెల్లటి మచ్చవున్న పిల్లను తీసుకొని వెంటనే చంపివెయ్యండి. అటువంటి పిల్ల అదొక్కటే వుంటుంది."

గురువు మరణించాడు. పంది పిల్లల్లో నుదుట మచ్చగల పిల్లను శిష్యులు తీసుకొని, దానిచుట్టూ కూర్చున్నారు. వెంటనే చంపెయ్యాలి. అయితే ఎవరు చంపాలి? ఎలా చంపాలి? ఆ పిల్ల సాక్షాత్తు గురువుగారే కదా? గురుహత్య పాపం కాదా?

ఇలాంటి ఆలోచనలతో కాలయాపన జరిగింది. చివరకు ఒక శిష్యుడు తెగించి కత్తి ఎత్తేటప్పటికి –

"ఆగు!" అన్నదా పిల్ల!

"ఆగు! నన్ను చంపవద్దు. మీరు ఆలస్యం చేశారు. ఈ జీవితం మీద నాకింతలోనే ఎంతో మమకారం ఏర్పడిపోయింది. ఈ పంది జన్మే ఇప్పుడు నాకెంతో ఉత్తమోత్తమ మైనట్టి దిగా కనిపిస్తున్నది! లోకంలో నా పంది తల్లి పొదుగును మించిన మాధుర్యం మరేదీ వుండదు. నన్ను వదిలెయ్!" అంటూ ఆ పిల్ల ఒక్క ఉరుకులో తల్లివద్దకు పారిపోయింది!

ఈ కథలో ఎంతటి సత్యం గోచరమవుతున్నదో గమనించండి!

జన్మలన్నీ సమానమే. ఉచ్చనీచాలు మానవ దృక్పథం తోడివి. కాగా, పాపంచేస్తే, నీచజన్మా, పుణ్యంచేస్తే ఉత్తమ జన్మా కలుగుతుందనే కర్మ వాదంలో పసలేదు, నిజం లేదు.

ఈ కావ్యాన్ని ఎలా చదివి అర్థం చేసుకోవాలో సూచించడానికే ఈ ఉదంతాన్ని ఇక్కడ పేర్కొన్నాను. ఆలోచించండి!

# పిచ్చుక మనస్తత్వం

అద్దం ముందు చేరిన పిచ్చుక, అద్దంలో తన నీడను చూచి, అది మరొక పిచ్చుక అనుకొంటుంది. దానిని ముక్కుతో పొడుస్తుంది. కాళ్ళతో తన్నుతుంది. తాను ఏంచేస్తే అద్దంలో పిచ్చుక అదే చేస్తుండడంవల్ల, ఆ పిచ్చుక రెచ్చిపోయి పెద్ద పోరాటమే ప్రారంభిస్తుంది.

ఇది మా వరండాలో ఒక దైనందిన దృశ్యం. ఒకొకసారి అద్దం ముందు రెండు మూడు, నాలుగైదు పిచ్చుకలు చేరడం కద్దు. అప్పుడు చూడాలి వాటి రభస?

పిచ్చుక మెదడు కంటె ఎక్కువగా వికసించినట్టిది మనిషి మెదడు. వికాసంవల్ల నాణ్యత పెరగవచ్చునే తప్ప, పదార్థం అదేగా? అందుకే పోటీ (శత్రు భయం) అనే అద్దం ముందు మానవులలో అన్ని మతాలు, మత కలహాలు, పరాక్రమాలు, దురాక్రమణలు, విజయాట్ట హాసాలు, దాసత్వ దైన్యాలు!

ఒకే తల్లి సంతానమైన అన్నదమ్ములు స్త్రీ కోసమో, సంపదకోసమో పోటీపడి కొట్టుకు చస్తున్న సమాజంలో ''మన మందరం దేవుని బిడ్డలం'' అంటూ అరిచినంత మాత్రం చేత ఒరిగేదేమిటి? తండ్రిని చంపి కొడుకు సింహాసన మెక్కిన ఉదంతాలు చరిత్రలో ఎన్ని లేవు? దేవుడొక్కడే జగత్పిత కావచ్చు. సొంత తండ్రినే చంపినవాడు ఉమ్మడి తండ్రిని లెక్కచేస్తాడా?

నిజంగా దేవుడొక్కడే జగత్పిత అయితే, మరి జగత్తులోని అన్ని జీవరాశుల పట్లా అతడికి సమదృష్టి లేదేమి? కనీసం వివిధ మానవ సమాజాల మధ్యనైనా సామరస్యం కలిగించ డేమి? పోనీ, ఒకే సమాజంలో ఇన్నిన్ని మతాలెందుకు? ఇన్నిన్ని కులాలెందుకు? భజన లెందుకు? కలిమి లేముల తేడాలెందుకు?

మెదడు జంతుస్థాయిని దాటి, మానవ పరిధిలోకి వికసించి ఎన్ని కోట్ల సంవత్సరా లయిందో తెలీదు. మన కృతయుగమే 40 లక్షల సంవత్సరాల నాటిది(ట). ఆనాటి నుంచీ కూడ తెలివైన వాళ్లు సామాన్య మానవులకు బోధిస్తున్నదేమిటి?

1. ఈ సృష్టికంతకూ కర్త ఒకడున్నాడు. అతడే దేవుడు. అతడెక్కడో పరలోకంలో వుంటాడు.

2. పాపం చేస్తే దేవుడు శిక్షిస్తాడు. నరకంలో తోసేస్తాడు.

3. పుణ్యం చేస్తే దేవుడు సంతోషిస్తాడు. స్వర్గం ప్రసాదిస్తాడు.

ఈ బోధలవల్ల మానవ ప్రవర్తనలో కలిగిన మార్పేమిటి? ఏమీ లేదు.

మానవుణ్ని సామాజిక విధి నిషేధాలకు కట్టివేసి వుంచుతున్నది పరస్పర జీవితాధార సాపేక్షకత. అనగా తాను సుఖ శాంతులతో బ్రతకాలంటే పొరుగువాడి సుఖ శాంతులకు భంగం కలిగించరాదనే ఎరుక. తానొకటి కొడితే, పొరుగువాడు రెండు కొడతాడనే భయం!

## కాలక్షేపాలు – రంజక శిల్పాలు

దేవుడు, స్వర్గం నరకం – అనే ఊహలు మానవుడికి కాలక్షేపాలుగా వున్నాయే తప్ప, వాస్తవాలుగా ఏనాడూ లేవు. వాటిని గురించి అంతగా పట్టించుకొన్న వాళ్ళూ లేరు.

అయితే, జీవితంలో ఎవరూ ఆచరణలో పెట్టలేని ఈ ఊహలు క్రమంగా మాసిపోవ డానికి బదులు, వాసికెక్కుతున్నాయెందుకని? పునర్జన్మలు, ప్రారబ్ధకర్మలు, ముముక్షు మార్గాలు వగైరా సరుకంతా ఈ మానవ చింతనా మార్కెట్టులోకి ఎక్కడి నుండి దిగుమతి అయినట్టు? ఈ వంచన ఇంకా ఇలా ఎంతకాలం సాగేటట్టు?

దేవుడు, స్వర్గం, నరకం అనేవి రాజకీయ వ్యాపార వస్తువులుగా తయారవుతూ వచ్చాయి. వాటికి సంబంధించిన పవిత్ర ప్రవచనాలు రాజకీయ వాగ్దానాలుగా దిగజారుతూ వచ్చాయి. మతాలు దేవుడికోసం కాక, తమతమ ప్రాంతీయ సాంఘికాచారాలను నిలుపు కోవడం కోసం పోరాటాలు జరిపే సైనిక కూటాలుగా పరివర్తన చెందాయి.

చరిత్రలో జరిగిన ప్రతి మత యుద్ధమూ అవతలివాళ్ళ దేవుణ్ణి నరికేసి, తమ దేవుణ్ణి ఆ స్థానంలో ప్రతిష్ఠించడం కోసమే జరిగింది. తమ దేవుణ్ణి రక్షించుకోవడం కోసమని చెప్పి ప్రజల్ని రెచ్చగొట్టి కూడగట్టడం, వాళ్ళ మూర్ఖావేశాల ద్వారా తమ ప్రయోజనాలను సాధించు కోవడం నాయకులకు అలవాటయింది. ఈ విషచక్రం

శాశ్వతంగా దొర్లుతూ వుండాలంటే, ప్రజలెప్పుడూ అజ్ఞాన రేఖకు దిగువలోనే వుండవలసి వుంది. అలా వాళ్ళను తొక్కిపెట్టి వుంచడం కోసం సృష్టించబడినట్టిదే భక్తి జ్ఞాన వైరాగ్య విధి నిషేధ కర్మకాండ అంతా! మరణా నంతరం జీవాత్మ అనుభవించడం కోసం కల్పించి ఉంచబడ్డవే నరకకూపాలూ, స్వర్గ సౌధాలూ, పితృ లోకాలూ అన్నీ!

ఈ వ్యవహారంలో, నేనేమనుకొంటున్నదీ క్లుప్తంగా వివరించే గ్రంథమే ఈ నా కావ్యం.

వైజ్ఞానిక పరిశోధన (Scientific research) అంతా పాంచభౌతిక రంగంలో జరుగుచున్నట్టిదే. ఆధ్యాత్మిక రంగం ఈనాటికీ ఊహల మీదనే ఆధారపడి వుంది.

ఊహలలో – గతంలో గొప్పవాళ్ళుగా చెలామణీ అయినవాళ్ళ వూహలకూ, వర్తమా నంలో నాయక వర్గాల వాళ్ల వూహలకూ బలం అధికం. అవి చాలావరకూ గతాను గతిక వ్యవస్థను బలపరిచేవిగా వుంటై. మార్పును ప్రోత్సహించవు. మార్పులేకుండా ప్రగతి వుండదు.

ఈ కావ్యాన్ని చదివేటప్పుడు ఈ వాస్తవాలను దృష్టిలో వుంచుకోవాలి.

## వేదాంత దర్శన కావ్యం

బాలయోగీయం కావ్యం ముగించి, దానికి పీఠిక వ్రాస్తున్న సమయంలో కలిగింది నాకు – మోక్షం గురించి నేననుకొంటున్నదేమిటో స్పష్టంగా చెప్పాలని. అంతవరకు నేనిలాంటి కావ్యం వ్రాస్తాననే వూహే లేదు. ఆ పీఠికలోనే మోక్షం నా జన్మహక్కు అనే ఉపశీర్షిక క్రింద క్లుప్తంగా నా ఉద్దేశాన్ని వ్యక్తం చేశాను. ఆ తరువాత అనిపించింది – దీన్ని ఒక ప్రత్యేక కావ్యంగా వ్రాస్తేనే బాగుంటుందని. అదీ ఈ కావ్యోత్పత్తి వుదంతం.

భారతదేశం వంటి సనాతన దేశాలు ప్రపంచంలో ఇంకా చాలానే ఉన్నై. కాలక్రమంలో కొత్త కొత్త దేశాలు, కొత్త కొత్త నాగరికతలు అనేకం ఏర్పడుతూ వచ్చాయి. ఆధ్యాత్మిక జిజ్ఞాస, తాత్విక చింతన ఒక్క భారతదేశంలోనే కాదు, తదితర దేశాలన్నిటా

జరుగుతూనే వస్తున్నది. అయితే ఈ విషయంలో భారతీయుల పాత్ర అతి ప్రాచీనమైనట్టిదీ, విశిష్టమైనట్టిదీను.

అదీకాక, ప్రధానమైన ఆధునిక జాతులలో ఆధ్యాత్మిక జిజ్ఞాస కంటే వైజ్ఞానిక పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడుతూ వుంది. ఆయా దేశాలలో మతాలు వున్నై. పరలోకాలు వున్నై. వాటిలో దేవుళ్లూ వున్నారు. మతానికొక దేవుడూ, ఆ దేవుడికొక అందమైన పరలోకమూ వుంటూ వున్నై. అయితే, మోక్షానికి మాత్రం మరెక్కడా ప్రాధాన్యం లేదు. మోక్షం గురించిన చింతనకు బహుశా భారతదేశమే పుట్టిల్లు కావచ్చు.

మోక్షానికీ, పరలోకాలకూ, స్వర్గ నరకాలకూ, మొత్తం మీద మరణానంతర జీవితానికి సంబంధించిన అన్ని వూహలకూ, భారతీయ ఋషులే మూలకర్తలనిపిస్తుంది నాకు. అందుకే భారతీయ చింతననే కేంద్రంగా తీసుకొని నేను ఈ కావ్యాన్ని నిర్మించడం జరిగింది.

ఒక్క ఆస్తిక చింతనకే కాదు, నాస్తిక చింతనకు కూడా భారతదేశమే మూలపీఠం. వేద కాలంలోనే బృహస్పతి అనే ఋషి నాస్తిక చింతనకు విత్తనం నాటినట్టు కనిపిస్తూ వుంది. చార్వాకుడు, జాబాలి ఈ మతానికి చెందినవాళ్లు. ఉమర్‌ఖయ్యామ్ మహాకవి యొక్క సూఫీ రస భావతత్వాన్ని రామాయణకాలం నాడే జాబాలి చెప్పాడనిపిస్తుంది నాకు. వశిష్ఠుడూ, జాబాలీ సమకాలీనులు. ఇద్దరూ రెండు తాత్విక మార్గాలకు నాయకులు. ఆ కాలం వాడే వాల్మీకి. ఈ ముగ్గురూ కూడా కుల, మత, వర్గ విభేదాలు లేని విశ్వమానవులు. నిర్మలమైన, నిష్పాక్షికమైన సత్యాన్వేషణ చేయదగిన వాళ్లు అటువంటి మహనీయులే.

ఎక్కడో వుండే దేవుడు తీర్పుచెప్పే వరకు యుగయుగాలుగా చచ్చి పోయిన వాళ్ల అసంఖ్యాకమైన ఆత్మలన్నీ అలానే పడి వుంటాయనో, మళ్లీ మళ్లీ పుడుతూ చస్తూ వుంటా యనో చెప్పేది ఆస్తిక మతం. భక్తి ద్వారా, కర్మకాండ ద్వారా, జ్ఞానం ద్వారా, యోగం ద్వారా ఆత్మకు మోక్షం కలుగుతుందనేది కూడా ఈ ఆస్తిక మతంలోదే. దేవుడనే వాడెవడూ లేడనీ, జీవితం ఒక్కటే సత్యమనీ, హాయిగా బ్రతకడమే జీవిత లక్ష్యమనీ చెప్పేది నాస్తిక మతం.

నా ఉద్దేశ మేమిటంటే ఆస్తిక మతం పూర్తిగా అపోహ అనీ, నాస్తిక మతంలోని ప్రకృతికి వెనుక మరే శక్తీ లేదనే మాట కూడ నిజం కాదనీ. జీవబ్రహ్మైక్యమే మోక్షమనే అద్వైతుల సిద్ధాంతంతో ఏకీభవిస్తూ, అట్టి బ్రహ్మైక్యానికి వాళ్లు చెప్పే నియమ నిబంధనలేవీ అక్కరలేదనీ, మోక్షం దానంతట అదే సిద్ధిస్తుందనీ నేను ఈ కావ్యంలో ప్రతిపాదిస్తున్నాను. అందుకే ''మోక్షం నా జన్మహక్కు'' అన్నాను.

## విప్పి చెప్పిన రహస్యం

ఈ కావ్యానికి ప్రెస్ కాపీ తీసిన వాళ్ళలో మొదటి వ్యక్తి మా ఆవిడ హైమవతి. ఆమె అంటుంది–

''ఇందులో పునరుక్తి చాలా వుంది. అదలా వుంచి, ఎవడి బ్రతుకు వాడు బ్రతకలేకే చస్తున్న ఈ రోజుల్లో నీ మోక్షం ఎవడిక్కావాలి?'' అని!

ఇందులో పునరుక్తి వున్నదన్న సంగతి ఆమె చెప్పే వరకు నాకు తెలియనే తెలియదు. నేను చెప్పదలచిన అంశానికి సంబంధించి ఎప్పుడేభావం స్ఫురిస్తే ఆ భావాన్ని అక్షర బద్ధం చేస్తూ వచ్చాను. అందువల్ల పునరుక్తిలా కనిపించేది దృక్పథ భేదమూ, వచో వైవిధ్యమూ కావచ్చు.

ఇక – మోక్షం ఎవడిక్కావాలి అంటే, ఎవడికీ అక్కరలేదనేదే నేను చెపుతున్నదీనూ. ఈనాడే కాదు, ఏనాడూ కూడ మోక్షమనేది మానవుడు కోరదగిందిగా లేదు. కోరి తపస్సు చేసిన వాళ్ళు, సర్వసంగ పరిత్యాగులైన వాళ్ళు కొందరున్నా – అట్టి వాళ్ళు దాన్ని పొందా రనడానికి దాఖలాలు లేవు.

మృత్యువుకు అధిపతి అయిన యముడు సావిత్రి చేతిలో ఓడిపోయాడు. నచికేతు డికి ఉపదేశం చేశాడు. అర్జునకుడికి మృత్యు రహస్యాలను చెప్పాడు. అందువల్ల లోకానికి జరిగిన మేలేమిటి? అవన్నీ భావుకుల ఊహలు. వాళ్ళు పొందిన దైవ సాక్షాత్కారాలన్నీ వాళ్ళ వాళ్ళ ప్రగాఢ మనో విభ్రాంతులు.

''నీ మోక్షం గోల నాకెందుకు? నా మోక్షం నాది'' అన్నాడు బొజ్జా కృష్ణశాస్త్రి, కావ్యం పేరు మాత్రం విని. ''అదే వ్రాశాను. పుస్తకం చదువు'' అన్నాను.

కావ్యాన్ని పూర్తిగా చదివిన వారా వేణు అన్నాడు, ''ఇందులోని ప్రతి కవితా ఒక తపస్సు. తపః ఫల సారాంశమే చివరి నాలుగు పంక్తులూ.''

భగవద్గీత పద్దెనిమిది అధ్యాయాల సారాంశమూ ''సర్వ ధర్మాన్ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ'' అనే వాక్య మొక్కటే కదా?

''టిప్పణములు చేసి, చప్పని మాటలు

చెప్పుచుందు రెన్నొ స్మృతులు, శ్రుతులు;

విప్పి చెప్పరేల వేదాంత సారంబు?

అన్నాడు వేమనయోగి. ఆయన కోరిక ఇప్పుడు మీ ద్వారా నెరవేరింది. వేదాంత రహస్యాన్ని ఇంత బట్టబయలుగా చెప్పిన వాళ్లింతవరకు ఎవళ్లూ లేరు'' అన్నారు పెచ్చెట్టి చెల్లారావుగారు.

చెల్లారావుగారు కవి, గాయకుడు, నటుడు, ప్రధానంగా హస్త సాముద్రికంలో పరిశోధన చేసి అదొక సైన్సు అని నిరూపించిన మేధావి.

స్కోరు బోర్డు లాంటిది మానవహస్తం

స్కోరు అంకెలే చేతి రేఖలు

ఆట సాగేకొలదీ అంకెలు మారుతుంటై

అనే (153వ) కవితతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని అంటూ, జీవిత గమనాన్ని బట్టి చేతి రేఖలు మారుతుంటాయనీ, ఏ వ్యక్తి చేతి ముద్రలనైనా దఫదఫాలుగా తీసినవాటిని ఒకచోట వుంచి పరిశీలిస్తే ఈ వాస్తవం స్పష్టపడుతుందనీ చెల్లారావుగారు వివరించారు.

"It has been proven positively that lines in the hand change in unison with changes in the mental attitude of a subject..." అనే సుప్రసిద్ధ సాముద్రిక శాస్త్రవేత్త విలియం బెన్‌హాం గారి వాక్యాన్ని కూడ ఉదహరించారాయన. "The mind produces controls and alters the lines" అంటూ బెన్ హాం !

శరీరం మీద మనస్సుకుగల సర్వాధిపత్యాన్ని వైజ్ఞానికంగా అంగీకరిస్తున్న అభ్యుక్తి ఇది.

# సాంఘికం - ఆధ్యాత్మికం

''సామాజిక వ్యవస్థకు మార్క్స్ విప్లవ పంథాలా, భారతీయ వేదాంత సిద్ధాంతానికే విప్లవాత్మకమైన నవ్యతను సంతరించుకొన్నది మీ ''మోక్షం నా జన్మహక్కు'' గ్రంథం. భారతీయ వేదాంతానికే కాదు, యావత్ విశ్వ జనావళికీ మోక్షం విషయంలో మార్గం చూపగల ఉత్తమ వేదాంత విషయక కవితా గ్రంథం ఇది.

''శతాబ్దాల తరబడి వేదాంత పరంగా భారతదేశంలో ఒక (ముముక్షు, దానికి అనుబంధించిన జప, తప, యోగ సాధనాదిక) వ్యవస్థను నేటి వరకూ నెలకొల్పి నడుపుతున్న మహాపురుషులనబడే గురువులూ, ఆచార్యులూ, పీఠాధిపతులూ, పూజారులూ, ఋషులూ ప్రజలను ఏవిధంగా పెడమార్గం పట్టిస్తున్నారో మీ గ్రంథం స్పష్టపరుస్తున్నది. మీరు ప్రతిపాదిస్తున్న ఈ సిద్ధాంతం ప్రాచుర్యంలోకి రావలసి వుంది. ఈ విషయంలో నాలాంటి అనేకులు మీ కృషికి చేదోడు వాదోడుగా వుండగలరనే నా విశ్వాసం.''

ఈ గ్రంథాన్ని చూచి చిట్టిమల్లె శంకరయ్య M.A., M.Phil. గారు వెలిబుచ్చిన అభిప్రాయం ఇది. రుద్రశ్రీ అనే కలం పేరుతో అనేక కవితలు వ్రాసిన శంకరయ్యగారు ''సాహిత్యంలో ఆయుర్వేదం'' గురించి పరిశోధన చేసి డాక్టరేట్ పట్టాను పుచ్చుకొన్నవారు. ఆయన ప్రధాన వ్యాసంగం తాత్త్విక చింతన. భారతీయ వేదాంత విజ్ఞానంలో ఆయనకు ఒక అధికారం వుంది. మోక్షం గురించిన నా సిద్ధాంతం ఆయనకు ఎంతగా నచ్చిందో పై వాక్యాలే స్పష్టం చేస్తాయి.

ఈ సందర్భంలో ఆయన వెలిబుచ్చిన ఒక సందేహం–

''మోక్షం పొందే హక్కు కొందరికే కాదు, అందరికీ కలదంటున్నారు మీరు (కవిత 11). అంతేకాక, అందుకు ఏ నియమాలూ అక్కరలేదంటున్నారు. అయితే ప్రవృత్తి మార్గం నుంచి జీవుడు నివృత్తి పథంలో మోక్షం పొందాలంటే యమ నియమాదులూ, ప్రాణాయామా దులూ, యజ్ఞ వ్రతాదులూ, పుణ్య క్షేత్ర సందర్శనాదులూ ఎన్నో చెయ్యవలసి వుంటుందం టున్న ఈ వ్యవస్థ అంతా కేవలం

హుళక్కియేనా? హుళక్కియే అయితే, మరి అదంతా ఎందుకు కల్పించబడినట్లు? అది పెద్దలకు తెలియకనా? తెలిసివుండే, దగా చేస్తున్నా రంటారా?''

దీనికి నా జవాబు (i) ఆది కాలంలో ఇవన్నీ అజ్ఞానంవల్ల కల్పించబడిన అపోహలే. (ii) ఈనాడు మాత్రం ఈ అపోహలను స్వార్థపరులైన బలవంతులు బలహీనులైన సామాన్య ప్రజలను తమ అధీనంలో వుంచుకొనేందుకు వాడుకొంటున్నారు (iii) మోక్షం సహజసిద్ధం. అది అందరికీ ఎట్టి ప్రయత్నమూ లేకుండానే సిద్ధిస్తుంది.

''ఉత్తమ, అధమ జన్మలకు కారణం పుణ్యపాపాలు కాదన్నారు మీరు. బాగానేవుంది. మరి, సృష్టిలో ఇన్నిరకాల జీవులు పుట్టడానికి ఏమిటి కారణం?'' ఇది మరొక ప్రశ్న.

అనాదిగా మేధావుల్ని పీడిస్తున్న ప్రశ్న ఇదే. అయితే మరి, సృష్టి తొలిసారిగా ఏర్పడి నప్పుడు ఏ పాపపుణ్యాలు అందుకు కారణమయ్యాయి? అంతకుముందేమీ లేదు కదా?

పోనీ, దేవుడే ఒక్క వారంరోజుల్లో ఈ సృష్టినంతటినీ చేసేశాడనుకొందామా? అతడుండే పరలోకాన్ని ఎవరు సృష్టించినట్టు? అంతకు ముందు దేవడెక్కడున్నట్టు? అసలు దేవుడెలా పుట్టినట్టు?

దేవుడే సృష్టికంతకూ కర్త అయితే, ఇంత పరస్పర విరుద్ధమైన సృష్టిని అతడెందుకు చేసినట్టు? సరదాకా? పాపపుణ్యాలు, పాడి నేలలు, బురదగుంటలు, ఒకజీవి నొకజీవి చంపి తినడాలు – ఇవన్నీ ఒక దేవుడి సృష్టే అయితే, మరి వాటిపట్ల మనకు రాగద్వేషాలు దేనికి? దేవుడి సృష్టిలో ఏ జీవిని ద్వేషించినా ఆ దేవుడిని ద్వేషించినట్టే కాదా?

ఇలాంటి ఏ ప్రశ్నకూ ఇంతవరకు ఎవరికీ జవాబు దొరకలేదు. నేను చెప్పగలిగిందేమి టంటే–

1. దేవుడున్నాడనుకొంటే, అతడొక్కడు కాదు. ఒకొక్క జీవజాతికి ఒకొక్క దేవుడుండి వుండాలి.

2. దేవుడొక్కడే, అతడు సర్వశక్తిమంతుడు అని చెపుతూ – అతడికి ప్రత్యర్థిగా సైతానునో, కర్మనో కల్పించడం దైవద్రోహమే అవుతుంది.

3. దేవుణ్నికాదని సైతానో, కర్మో సృష్టిని నడిపిస్తుంటే, అలాంటి దేవుడు వుంటేనేం? లేకుంటేనేం?

4. దేవుడు లేడంటున్నాను నేను. పరమాత్మ వుంది. అది ఆదిమధ్యాంత రహితమూ, సర్వగుణాత్మకమూ అయిన మహాశక్తి. నేను లేడంటున్న దేవుడు పరమాత్మకు పర్యాయ పదంగా వాడబడుతున్న వ్యక్తి.

5. ఆ మహాశక్తిలోని ప్రతి పరమాణువూ ఒక జీవాణువే. ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులున్న బీజాణువే. అది మొలకెత్తగలదు. అనుకూలమైన ఆకారాన్నీ, గుణాన్నీ పొందగలదు. వికసించ గలదు. విస్తరించగలదు.

6. పాత ఆకారాలు పోతుంటై, కొత్త ఆకారాలు వస్తుంటై. లక్షల, కోట్ల సంవత్సరాల మీద జరిగే మార్పులివి.

7. ఆకారం పొందిన పరమాత్మ బీజాణువునే ఆత్మ అన్నాను. దాని శక్తి అది పొందిన శరీరంతోడిది. అన్ని రకాల శరీరాలలోను మానవ శరీరం ఉత్తమోత్తమం.

8. మానవ సృష్టి ఒకేసారి, ఒకేచోట జరిగింది కాదు. ఆర్య, మంగోలియా, నీగ్రో వంటి జాతులు వేరు వేరుగా ఆవిర్భవించినట్టివి. మొదట్లో అన్నీ సంచార జాతులే. ఆధునిక ప్రపంచ జాతులన్నిటికీ అవే మూలజాతులు. నేటి ప్రతి జాతీ వాటి మిక్చరే. పైగా, మానవ సృష్టి జరిగిన నాటి భూఖండ స్వరూపం కూడ ఈనాడున్నట్టు లేదు.

9. ఉత్తమ, అథమ జన్మలనేవి లేవు. ఏ జీవి జన్మ దానికి ఉత్తమమైనట్టిదే. ''పంది బురద మెచ్చు, పన్నీరు మెచ్చునా'' అనే విమర్శ మనిషి చేస్తున్నట్టిది. ''బురద కంటె వేరె పరమార్థ మేముంది?'' అని పంది అనుకొంటుంది. అది మనిషి మీద పెత్తనం చెయ్యాలను కొంటుంది. కానీ, అందుకు దాని శరీరం అనుకూలంగా లేదు.

10. పందీ, మనిషీ పరమాత్మ రూపాలే. అదీగాక, పరమాత్మ తన కనుకూలమైన రూపాన్ని ఉంచుకొని, తక్కిన దాన్ని త్యజించివేస్తుంది. తాను ఎంచుకొన్న రూపానికి త్యజించిన రూపాలను ఆహారంగా చేసుకొంటుంది. అట్టి చర్యను హింస అనడం అజ్ఞానం.

ప్రపంచ వేదాంత చింతన నిండా ఇలాంటివే ఎన్నో వున్నై. వాటిని వైరుధ్యాలనుకోవడం పాక్షిక దృష్టి. ప్రకృతి విజ్ఞానం ఇంతగా పురోగమించిన ఈ కాలంలో కూడ దేవుడు, భక్తి, స్వర్గనరకాలు వంటి మూఢ విశ్వాసాలు ప్రచారంలో వున్నాయంటే అందుకు కారణం అవి ధనిక వర్గాలకు రాజకీయ వ్యాపార వస్తువులుగా మారడమే అనడంలో అతిశయోక్తి లేదు.

## మరికొన్ని వివరణలు

1. జీవుణ్నీ, దేవుణ్నీ అంటే జీవాత్మనూ, పరమాత్మనూ విడదీస్తున్న మాయ ఏమిటి? ఎక్కడిది? ఎలా పుట్టింది? అలా విడదీసే అధికారం దానికెవరిచ్చారు? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు లేవు. కనుక మాయావాదం ఆధార రహితం.

రజ్జు సర్ప భ్రాంతి వంటి అలంకారాలు భౌతికాలే కాని, పారమాత్మికాలు కావు.

2. జీవాత్మ కనిపిస్తూ వుంది. పరమాత్మ కనిపించడం లేదు. కనిపించని దాన్ని సత్యమనీ, కనిపిస్తున్న దాన్ని అసత్యమనీ అంటున్నది అద్వైతం. సత్యం నుంచి అసత్యం ఎలా పుడుతుందీ?

అందుకే నేను రెండూ సత్యమే అని చెపుతున్నాను. పరమాత్మ శాశ్వత సత్యమైతే, ఆత్మ క్షణిక సత్యం. క్షణిక సత్యాల నైరంతర్యమే జగత్తు.

3. బ్రహ్మ సత్యం, జీవం సత్యం, ప్రకృతి కూడా సత్యమే అని అద్వైతేతర మతాలు అంటున్నై. కాని వాటికి మాయా వాదం లాంటిదేదీ దొరకలేదు. అందువల్ల అవి పరలోకాలనూ, అక్కడ దేవుళ్ళనూ, స్వర్గ నరకాదులనూ ఆశ్రయించవలసి వచ్చింది. వీటికి పామరజనంలో మంచి మార్కెట్టు దొరికింది.

సెక్సు, క్రైం సినిమాలనూ, స్వర్గనరక సిద్ధాంతాలనూ పెంచిపోషించే వాళ్లు సాధారణంగా నాల్గవ తరగతి పామరజనమే కదా? ఇప్పుడందరూ అదే స్థాయికి దిగజార్చబడ్డారు – నిరంతర ప్రచారం ద్వారా, మార్గాంతరాలను మూసివెయ్యడం ద్వారా.

అయితే, ఈ నరక భీతీ, స్వర్గ వాంఛా శరణాగతికీ, దాసదాస్యానికీ దారితీసి, సమా జాన్ని ఆత్మ వంచనలోను, అవినీతిలోను ముంచినై. ఏ విధమైన తర్కానికీ

అందని అజ్ఞానమది. అందుకే ప్రాజ్ఞులూ, మేధావులూ వాటన్నిటినీ మూఢ విశ్వాసాలుగా కొట్టిపారేశారు.

4. హేతువిరుద్ధమైన దేదీ సత్యసంబద్ధం కాదు అనేది నా సిద్ధాంతం కూడ. అయితే, ఏదైనా ఒక విశేషం హేతువు కందకపోవచ్చు. భవిష్యత్తులో అది వాస్తవ పరిధిలోకి రావచ్చు. అందుకే దేనినీ పూర్తి అసత్యంగా కొట్టిపారవెయ్యవద్దంటున్నాను.

సాముద్రికం, జ్యోతిషం, విగ్రహారాధన, కళాకేళి కల్పన వంటి వాటిని సదవగాహనతో భరించవచ్చు అంటున్నదందుకే.

5. అలానే దేవుడున్నాడనే ఊహను కూడ భరించవచ్చు కదా అంటే – అది వ్యక్తి గతమై ఉన్నంతవరకు భరించవచ్చు. తన మనస్సే తన దేవుడు. ఒకరిదేవుడు మరొకరి దేవుణ్ణి బాధ పెట్టగూడదు.

6. ''విత్తు ముందా, చెట్టు ముందా?'' వంటి ప్రశ్నలతో తికమక పెట్టేస్తుంటారు ప్రజల్ని. దీనికి నా స్పష్టమైన జవాబు విత్తే ముందు అని. పరమాత్మే విత్తనాల మడి. బీజ క్షేత్రం. చెట్టు లేకుండానే విత్తనం వుంది. రూపగుణ సమానత్వంతో భారీయెత్తున విత్తనాలను ఉత్పత్తి చేసే సాధనం మాత్రమే చెట్టు.

7. ''బీజం మాం సర్వభూతానాం విద్ధి'' (గీత. 7.10) సకల భూతాలకూ తానే బీజం అంటున్నాడు కృష్ణుడు, తానే దేవుడనంటూ చెపుతున్న గీతలో బీజమయమైన పరమాత్మకు తానొక ప్రతినిధిగా మాట్లాడుతున్నాడాయన. తానే పరమాత్మకాడు. పరమాత్మకు నామరూపాలు, జనన మరణాలు లేవు.

8. దేవుడు, ప్రవక్త, అవతారం, నాయకుడు, వీరుడు వంటి ఎవర్ని పూజించినా వ్యక్తిపూజ కిందకే వస్తుంది. వ్యక్తి పూజ అభ్యుదయ నిరోధకం. ఏ లక్ష్యంకోసం పోరాడి, తపస్సుచేసి ఒక వ్యక్తి పూజనీయుడయ్యాడో ఆ లక్ష్యాన్ని విస్మరించేస్తారు జనం. మరి ఆ వ్యక్తిని ఇక పూజించడమెందుకు? కేవలం లోకవంచనకే కదా!

9. ప్రారబ్ధం, దురదృష్టం వంటివేం లేవు. ఒక వ్యక్తికి వరసగా అపజయాలు కలుగుతూ వుంటే, అతడి మనస్సు మరొక విషయంపై లగ్నమై వున్నదన్నమాట. ఆ మరొక విషయమేదో గమనించి, మనస్సును అటు మళ్ళించుకోవలసి వుంది.

10. అసలు ఆత్మ (soul, spirit) అనేదే ఏదీ లేదనేదాకా వెళ్లింది కొందరి

మేధావుల నాస్తికవాదం. అందులో కొందరికి పునర్జన్మలున్నై మళ్ళీ. వాళ్లలో ఎవరూ కూడ సజీవ దేహానికీ, మృత దేహానికీ తేడా ఏమిటో చెప్పగలిగే స్థితిలో లేరు.

11. లోకంలోని తాత్త్విక చింతన కంతకూ భారతీయ వేదాంతమే మాతృ స్థానీయం. భారతీయ వేదాంతాన్ని తీర్చిదిద్దినవాడు వేదవ్యాసుడు.

వేదవ్యాసుడు కవి, భావుకుడు, వేదాంతి కాడు. అందుకే ఆయన తత్త్వోపదేశం కవిత్వ స్థాయిలో నడుస్తుంది. అందరికీ ఆనందం కలిగించే ఆ విశ్వజనీన స్థాయి నుంచి క్రిందికి త్రోసివేయబడి, రాజకీయ పార్టీలకూ, వ్యాపార సంస్థలకూ జైకొట్టే బానిసగా కవిత్వం వాడుకోబడుతున్న ఈ రోజుల్లో ఆత్మీయమైన దేనికీ విలువ లేదు నిజమే. అంతమాత్రం చేత నిరాశ చెందనవసరం లేదు. సాధారణ మానవుణ్ణి అపోహల నుండి ఉద్ధరించవచ్చు. అందుకే ఈ నా ప్రయత్నం.

కుల – మత – వర్గ కబంధ హస్తాల నుంచి కవిత్వానికే కాదు, వేదాంతానికి కూడ విముక్తి కలిగించవలసి వుంది. గమనించండి!

12. దేవుడి కాహారంగా వేల మందిని చంపే మతోన్మాది కంటే, లక్షల మందిని చంపే మలేరియా దోమ గొప్పది.

13. ''నన్ను నేనే నడుపుకోవాలి. నన్ను నడిపే దేవుడెవడో లేడు'' అనే జ్ఞానం ప్రతి వ్యక్తికీ కలగకుండా మానవజాతి ముందుకు పోలేదు.

14. యుద్ధం చెయ్యవలసింది జాతిని రక్షించుకోడానికి, దేవుణ్ని మెప్పించడానికి కాదు.

15. చాలామంది వృద్ధులు భయపడేది మృత్యువుకు కాదు. వృద్ధాప్య నిశ్శక్తికీ, మృత్యువేదనకూ మాత్రమే. మతాన్నీ, దేవుణ్నీ నమ్ముకొని ఆశాభంగం పొందేకంటే, వృద్ధుడైన ప్రతి వ్యక్తీ తాను పరమాత్మలో కలిసిపోతున్నాననే సంతృప్తితో మరణించడం మంచిది కాదా? ఏ మతం చెప్పే దేవుడు నిజమైన దేవుడో ఎలా తెలుస్తుంది? అవసాన దశలో ఎవరికైనా నా సిద్ధాంతమే ఆనందప్రదం. ఆత్మ శాంతికి అమృతాస్వాదనం.

16. జరామరణాలు రెండే మానవుడి శత్రువులు, మనం యుద్ధం చెయ్యవలసింది వాటి మీద.

17. మానవుణ్ని నడిపించేవి ఆవేశాలు. అవి కావేశాలు కాగూడదు.

# పురుషోత్తమత్వం

''దేవుడు లేడు, పరమాత్మ వుంది అన్నారు కదా! పరమాత్మ కూడ లేదంటే పోలా?'' ఆకాశవాణి ప్రసాదరావుగారి ప్రశ్న ఇది.

పరమాత్మ ఒక శక్తి. సముద్రంలో మంచుముక్కల్లా సృష్టి అంతా అందులో తేలి ఆడుతూ వుంది. అందులో ఒక పెద్ద ముక్కనే దేవుడంటాం అంటే అనవచ్చు కాని, అసలు శక్తే లేదనడం సాధ్యం కాదు.

రామకృష్ణ పరమహంస శక్తిని కాళీ రూపంలో సాక్షాత్కరింప (మెటీరియలైజ్) చేసుకో గల్గితే, వివేకానందుడు పరమహంసనే మహాకాళిగా చూడగలిగాడు. ఇవన్నీ వ్యక్తిగత మనో విలాసాలు. ఏ వ్యక్తి మనో రూపం ఆ వ్యక్తిదే – అది గ్రామ దేవత కావచ్చు, శివలింగం కావచ్చు, బుద్ధ విగ్రహం కావచ్చు, సత్యసాయి కావచ్చు, నిర్గుణ పరబ్రహ్మ కావచ్చు.

చిల్లర దేవుళ్ళకు మొక్కడాన్ని ఎందరో వేదాంతులు పరిహసిస్తూ వచ్చారు. కాని ఆ మొక్కడం అనేది ఏదో రూపంలో కొనసాగుతూనే వుంది. ఎందుకని?

ఒక వ్యక్తి మనో రూపాన్ని ఇతరులపై రుద్దాలంటే బలప్రయోగం చెయ్యాలి. లేక, విశ్వాసం అనే తేనెతో ఆ మాత్రను మింగించాలి. అలా ఏర్పడినట్టివే మత సమాజాలు. ఒక బలవంతుడైన వ్యక్తి యొక్క వ్యక్తిగత మనోరూపమే ఆ వర్గం (ట్రైబ్) వారందరికీ ఆరాధ్యమై, అదొక మతమవుతుంది. ఉమ్మడి దేవుడు, మతానికొక దేవుడు పుట్టుకొచ్చిన విధం ఇది. అందుకే అన్ని వైరుధ్యాలు.

మిత్రులు నిత్యానందరావుగారి సందేహానికి కూడ నా జవాబిదే. మొదట్లో అనేక మంది దేవుళ్ళుండడమే బాగున్నదనుకోవడం, తర్వాత దేవుడొక్కడే అయి వుంటాడనుకోవడం, ఆ మీదట స్వర్గం కోసమో, మోక్షం కోసమో కృషి చెయ్యడమే జీవిత లక్ష్యమనుకోవడం – ఇది జ్ఞానోదయ వికాసక్రమం. అయితే మరి – అజ్ఞానికీ, జ్ఞానికీ కూడ మోక్షం దానంతటదే సిద్ధిస్తుందంటే, ఇక జ్ఞానం ఎందుకు? అదీ ఆయన ప్రశ్న.

జ్ఞానం జీవితం కోసం. ప్రకృతి శక్తులను అర్థం చేసుకొని, స్వాధీనం చేసుకొని జీవితాన్ని విజయవంతంగా నడుపుకోవడం కోసం.

''దేవుడు లేకపోతే, మానవలోకం మన గలుగుతుందా?'' ఈ ప్రశ్నకు జవాబు మరొక ప్రశ్నే. ''ఇతర జీవరాశులకు అక్కరలేని దేవుడు మానవులకే ఎందుకు కావలసి వచ్చాడు?''

మానవుడికి దేవుడి అవసరం శాంతి భద్రతలను కాపాడే ఒక పోలీసాఫీసరుగా మాత్రమే. ఈ పరాధీన భావం మానవుడి నుంచి ఉత్తమ క్రియాశక్తిని తొలగించి వేసింది. ఆ స్థానంలో చేరిన విశ్వాసం ప్రసాదించేది గుడ్డి ఆవేశాన్ని మాత్రమే.

''సత్యసాయి సాక్షాత్తు దేవుడు'' అన్నారు సైనాల గణేశ్వరావుగారు. ఆయన సత్యసాయి భక్తుడు. అవుననడానికి అభ్యంతరమేదీ నాకు కనిపించలేదు.

సత్వగుణం, రజోగుణం, తమోగుణం ఈ మూడు పరమాత్మ గుణాలే. ఇందులో ఏ ఒక్క గుణం అతిశయించి వున్నవాడైనా పురుషోత్తముడే అవుతాడు. అయితే, మానవు లాశించే సుఖశాంతులకు ప్రధానం సత్వం కనుక, సత్వగుణాధికుణ్నే ఆరాధించడం జరిగింది. దయ, ధర్మం, న్యాయం, ఆర్త రక్షణ మున్నగు సాధు లక్షణాలను సత్వగుణాభి వ్యక్తులుగా పేర్కొనడం జరిగింది.

ఈ దృష్టితో చూస్తే, సత్యసాయి పురుషోత్తముడే. వ్యక్తిగతమైన శక్తులను, తనవైన సమస్త సంపదలను ప్రజల ఆరోగ్య విద్యా విజ్ఞానాల కోసం ధారపోస్తున్న సత్యసాయి వంటి మహితాత్ముడు ఆ పురుషోత్తముడి దశావతారాలలో కూడ కనిపించడు. పురుషోత్తముడే దేవుడంటే, సత్యసాయి అంతకంటే గొప్ప దేవుడు.

## మతకలహాలకు కారణాలు

కేవలం మత వైషమ్యాలు కారణంగా రెండు మతాల వాళ్ళు కలబడి కొట్టుకొంటు న్నారంటే, వాళ్ళు తమ తమ దేవుళ్ళ అనుమతి తీసుకోకుండానే ఆ పనిచేస్తున్నారను కొందామా? మత కలహాలకు కారణం మతోన్మాదులా, వాళ్ళ దేవుళ్ళా?

ఇదంతా పరిశీలించే చెప్పాను నేను – మతకలహాలకు కారణం ఆ మతాల వాళ్ళ ఆచారాలలోని వైరుధ్యాలేనని. ఎడారి వాసుల ఆచారాలు, డెల్టా వాసుల ఆచారాలు

పరస్పర విరుద్ధాలుగా వుంటై. ఒక ప్రాంతం వాళ్ళు మరో ప్రాంతానికి వెళ్ళినప్పుడు, ఆ ప్రాంతపు ఆచారాలతో సమాధానపడాలి. అలా సమాధానపడకుండా, దైవభక్తి కంటె ఆచారాలే ప్రధాన మన్నట్టు వ్యవహరించే వాళ్ళతో మత సామరస్యం కుదరదు.

"ఆధునిక ప్రపంచ నాగరికతకు అణుబాంబు విధ్వంసమే అవసరం లేదు. ఆ పుణ్యం మతమే కట్టుకోగలదు. మత మారణాస్త్రం దేశ ఆంతరంగిక జీవనంలోనూ, ప్రపంచ ప్రత్యక్ష రాజకీయాలలోనూ విధ్వంస రాగం ఆలపిస్తూనే వుంది. కొన్ని దేశాల్లో మతం ప్రచ్ఛన్నంగానూ, కొన్ని దేశాల్లో కేవలం రాజకీయం పేరిటనూ హింస జరుపుతూనే వుంది."

(రక్త సముద్రం వెనుక ఓ పాలస్తీనా అనే శీర్షిక క్రింద ఉదయం 5-5-87 సంచికలో "శి" అనే కలం పేరుతో ప్రచురించబడిన వ్యాసం.)

లేని దేవుణ్ని కల్పించుకొని, మన అత్యాచారాలకు అతణ్ని అడ్డం పెట్టుకోవడం న్యాయం కాదంటున్నాను. మతం ముసుగుతో అమానుష అగ్రెసివ్ రాజకీయాలు నడిపే దుష్టులను శిక్షించగల మనోబలం ప్రజా ప్రభుత్వాల కుండాలంటున్నాను. వోట్ల కోసం మానవ ధర్మాన్ని బలిపెడుతూ, సహజీవన ప్రచారం కోసం కోట్లు ఖర్చు పెట్టడంలో నిజాయితీ లేదంటున్నాను.

ఈ తరహా కావ్యంలో వృద్ధాప్యానికి చెందిన కవితల ఔచిత్యాన్ని ఒక మిత్రుడు ప్రశ్నించడం జరిగింది. ఆయన ప్రశ్నించే దాకా ఆ విషయం నాకు తట్టనే లేదు. భావం వచ్చింది, వ్రాసేశాను, అంతే!

వృద్ధులంటే నా దృష్టిలో డెబ్బై అయిదు సంవత్సరాలు దాటిన వాళ్ళు. అట్టి వాళ్ళే ఏ జాతికైనా గర్వకారకులు. ఈ రోజుల్లో వాళ్ళ శాతం ఎక్కువగానే వుంది. మరి, వాళ్ళ సుఖ శాంతులకోసం మనం ఏం చేస్తున్నట్టు?

చిన్నప్పుడు తన కొడుకును ఒడిలో పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడిన తండ్రి వృద్ధుడైనప్పుడు, ఆ తండ్రిపట్ల అదేవిధమైన శ్రద్ధను ఆ కొడుకు చూపవలసి

వుంది. మరి, చూపుతున్నారా? ఉమ్మడి కుటుంబాలనాటి విధి నిషేధాలు విడివిడి సంసారాల ఈ రోజుల్లో ఆచరణసాధ్యాలు కావు. వృద్ధాగామాలు నెలకొల్పి, వారి యోగక్షేమాలపట్ల ప్రభుత్వమే శ్రద్ధ చూపవలసి వుంది. వృద్ధాప్యాన్ని జయించే పరిశోధనలను తీవ్రతరం చెయ్యవలసివుంది.

## ఆత్మీయ సోషలిజం

భూమి బల్లపరుపుగా వుంది, హిరణ్యాక్షుడు భూమిని చాపలా చుట్టాడు, సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడు వంటివన్నీ ఎలా అపోహలో మతం చెప్పే దేవుడు కూడ అలానే అపోహ అంటున్నాను నేను.

దేవుడు ఒక జాతికి (దేవతలకు) మద్దతుగా మరొక జాతి వాళ్లను (దానవులను, రాక్షసులను, శూద్రులను) చంపాడనే పురాణ కథలు అమానుషమైనట్టివి, స్వార్థపరుల కుయుక్తులూ మాత్రమే.

వేదకాలంలో ఆర్యులు తమ శత్రువులను చంపారంటే, అవి రాజకీయాలు. బలమైన జాతివాళ్లు బలహీనులైన జాతుల వాళ్లను ఓడించడం, చంపడం, బానిసలుగా చేసుకోవడం ఎప్పుడూ జరిగేదే, ఇప్పుడూ జరుగుతున్నట్టిదే. అందుకే – ఫిర్యాదులు చెయ్యడం వ్యర్థమనీ, ప్రతి వ్యక్తి బలం సంపాదించుకోవాలనీ నేను పదే పదే హెచ్చరించడం.

మానవ జీవిత లక్ష్యం సుఖశాంతులతో జీవించడమే అంటున్నాను. అయితే అవి ఎలా లభిస్తై? మానవులందరకూ సాంఘిక న్యాయం, ఆర్థిక సమానత్వం చేకూరితే లభిస్తై. అందుకు దేశం ఒక యూనిట్‌గా, అన్ని దేశాలలోను ఒకే రకం ఆర్థిక ప్రణాళికతో ఆత్మీయ సోషలిస్టు (Spiritual Socialist) వ్యవస్థ ఏర్పడాలని సూచించాను. దానికొక ఆరుసూత్రాల కార్యక్రమాన్ని ప్రతిపాదించాను. దీనికి సంబంధించిన వివరాలు నా సాహిత్యం నిండా వున్నై.

Individual freedom, social equality, free supply of primary needs, right to work of one's liking and easy access to luxuries of life - are the five basic essentials of my Spiritual Socialism.

మానవాభ్యుదయానికి Spirit and Sense ప్రాతిపదికగా వుండాలని అంటూ ఒక ఉద్యమాన్నే ప్రారంభించారు మిత్రులు డా. దాసరి ధనపతిరావుగారు.

మానవుడు కోరవలసింది మృత్యుంజయత్వాన్ని. మోక్షాన్ని అధిగమించిపోవాలి. శరీరం శిథిలం (decompose) కాగూడదు. ఆత్మగా మారిపోవాలి. ఆత్మ పరమాత్మలో కలిసిపోగూడదు. తన వ్యక్తిత్వాన్ని తాను నిలుపుకొంటూ జీవించాలి. దివ్యదృష్టి, దూరశ్రవణం, మనోవేగం ఇవీ నేను కోరుకొనేవి. అవ్యక్తమైపోవడాన్ని కాదు.

పరమాత్మ రూపమైన ఆత్మ పరమాత్మలో సంచరిస్తూ, సంకల్ప మాత్రం చేత రూపారూపాలు ధరిస్తూ, విశ్వసృష్టి స్థితి లయాలను కంట్రోలు చెయ్యాలి. పూర్వ మేధావులు హరిహరాదులను ఊహించిన పద్ధతి ఇదే. అయితే, అది వట్టి వూహగానే వుండిపోయింది. వాస్తవం కావాలనేది నా ఆకాంక్ష.

ఇక్కడ మరొక విశేషం చెప్పాలి. పరమాత్మ ఒక మహాచైతన్య శక్తి. దాని నుంచి వెలికి వచ్చిన ఒక్కొక్క అణువులో ఎంతెంత శక్తి వుంటున్నదో మనందరికీ తెలిసిన వాస్తవమే. అయస్కాంత శక్తి, విద్యుచ్ఛక్తి, ఎలక్ట్రానిక్ శక్తి, లేజర్ శక్తి వంటివన్నీ భూశక్తులే. విశ్వంలో భూమి ఒక అణుమాత్రం. ఈ శక్తులన్నిటికీ మూలకమైనట్టిది పరాశక్తి. అది లేదంటే మరేమీ వుండదు. ఆ మరేమీ లేని స్థితి కూడా పరమాత్మే.

## Fact వేరు, Fiction వేరు

వేదాలు, పురాణాలు, కొంతవరకు ఉపనిషత్తులు, ఇతిహాసాలు, కావ్యాలు, కథలు, గాథలు మతానికి సంబంధించి నట్టివి కావు. అవి ఆయా కాలాలలోని జీవితాలకు సంబంధించినట్టివి.

అవి అతిశయోక్తులు కావు, అబద్ధాలూ కావు. మానవుడికి ఆనందాన్నీ, ఆదర్శాన్నీ, వినోదాన్నీ, విజ్ఞానాన్నీ ఇచ్చేటందుకు కల్పించబడినట్టివే కళలూ, కవిత్వాలూ.

కాకీ నక్కా కథ, కుందేలూ తాబేలూ పోటీ నిజంగా జరిగాయా అని ఎవరూ అడగరు. అవి అసహజం అనిపించవు. అలాంటివే పురాణాలూ, కావ్యేతిహాసాలూ. అవినీతి ధర్మరస పోషకాలు.

దేవుడు, మతం, వేదాంతం పరిస్థితి వేరు. ఇవి తర్కానికి నిలవ్వలసినట్టివి. మూఢ విశ్వాసాలు కాగూడదు.

Fiction వేరు, Fact వేరు. వీటి మధ్యగల తేడాను గుర్తించి చెయ్యాలి ఏ విమర్శ అయినా. కవిత్వంలో Fact ఉండవచ్చు. వేదాంతంలో Fiction ఉండకూడదు. Fact స్పష్టంగా తెలియక, Fictionను ఆశ్రయిస్తారు చాల మంది తత్త్వ బోధకులు. అట్టిది వట్టి ప్రచార సాహిత్యమే అవుతుంది. ఇటు ఆనందాన్నీ ఇవ్వదు, అటు సిద్ధాంతాన్నీ చెప్పదు.

''నీవు చెప్పదలచింది స్పష్టంగా చెప్పావు. బాగుంది'' అన్నాడు నా బాల్యమిత్రుడు బడుగు వెంకటరెడ్డి, నా చేతిలోని ఈ పీఠిక ప్రూపుల్ని చూచి.

## ఇంగ్లీషులో చెప్పివుంటే

''మీరీ భావాలను ఇంగ్లీషులో వ్రాసివుంటే బావుండేది'' అన్నాడొక సహృదయ మిత్రుడు. అలా చాల మంది అన్నారు. నాకూ చాల సార్లు అనిపించింది. నిడదవోలు వారూ, నార్లవారూ ''దీప సభ''ను ఇంగ్లీషులో కుదించి వ్రాస్తే బాగుండునన్నారు.

అయితే, తెలుగుకు స్వతంత్ర భారత్‌లో ఇంత దిక్కుమాలినతనం దాపురిస్తుందని ఆనాడు ఎవరనుకొన్నారు?

తెలుగు, హిందీ భాషలకు రాజవైభవాలను ఊహించుకొని, ఇంగ్లీషును ఆలక్ష్యం చేసిన విద్యార్థులం మేము. ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు ఆశించిన స్వరాజ్యం ఇది కాదు కదా!

కీలక పదవుల్లో వున్న వాళ్ళు కుల మత వర్గ పక్షపాతాలతో, స్వార్థ సంకుచితత్వాలతో ప్రతిభను నిరోధిస్తూ, భాషాభ్యుదయాన్నే కుంటుపరుస్తారని ఎవరనుకొన్నారు?

అయినా, భావానికి భాషేమిటి? విశ్వభావనకు నా మౌలిక భావనను నేర్పించ గలిగితే చాలు నాకు.

ఎందరెందరి ఆశలో, ఆసక్తులో, ఆర్తులో, అనుభూతులో పరమాత్మలోకి భావ రూపంలో నిత్యమూ ప్రవేశిస్తూనే వుంటై. అక్కడి వాటికి వ్యక్తిత్వాలుండవు. వాటిలో మౌలిక మైనవి అభ్యుదయానికి తోడ్పడగా, కానివి కరిగి పోతూ వుంటై. నేను కోరేది విశ్వశ్రేయస్సు, స్వాతిశయ ప్రతిష్ఠ కాదు.

''కొన్ని ఫీలింగ్సుకి లాజిక్ వుండదు. అనుభూతి మాత్రం వాస్తవం'' అంటారు సుప్రసిద్ధ నవలిస్టు యండమూరి వీరేంద్రనాథ్, ఆఖరి పోరాటంలో. ప్రకృతి ధర్మాన్ని, జీవ స్వభావాన్ని, మానవ ప్రవర్తనను సమన్వయ పరిచే యత్నమే లాజిక్ అంటే. ప్రకృతిని అధిగమించి పరమాత్మలో క్రీడించగలది మనస్సు. ఫీలింగ్సు మానసికాలు. పరమాత్మ వాస్తవం కనుక, అనుభూతీ వాస్తవమే. ఆవేశపడిన మనస్సు పరమాత్మ ఒడిలో విశ్రమించి పొందే ఉపశమనమే అనుభూతి.

మనస్సుకు అట్టి ఉపశమనాన్ని ఇవ్వగల ఏ పనినైనా మానవుడు చెయ్యవచ్చు.

అంతా కర్మ, ప్రారబ్ధం, ప్రాప్తం లేదు, దురదృష్టం వంటి మాటలు ఆశాభంగం వల్ల కలిగే నిస్పృహను సూచించేవి.

ఆశలు అందరికీ వుంటై. చాలా వుంటై, వాటి మధ్య పోటీలూ, పోరాటాలూ కూడ వుంటై. ఒక ఉద్యోగం కోసమో, ఒక క్రీడలోనో పదిమంది పోటీపడినప్పుడు గెలిచేది ఒక్కడే కదా? తక్కిన తొమ్మిది మందీ ఆశాభంగంతో దిగులుపడక తప్పదు. అట్టి దిగులుకు మిస్టిక్ పదజాలం వాడడం నిష్ప్రయోజకం.

## అంకితం చరిత్ర

నా కావ్య సృష్టి ప్రతిదాని వెనుకా ఒక ప్రత్యేక గాథ వుంటుంది. అలాగే, నా అంకితాలు ప్రతిదాని వెనుకా ఒక ప్రత్యేక చరిత్ర వుంటుంది.

ఎంతటి రస భావ రమ్య రోదసీ విహంగాలైనా, నా కవితలన్నిటికీ ఆధారాలు వాస్తవ జీవిత సంఘటనలో, అనుభవాలో అయివుంటై. నేను స్వయంగా అనుభవించని ఏ రసమూ భావావేశాన్ని పొందదు, కవితా రూపం ధరించదు.

నా అంకితాలు కూడ అలాంటివే. అన్నీ నా స్వయం వరాలు. నా ఇష్టమై ఇచ్చినట్టివి.

నేను అంకితం ఇచ్చిన వారిలో పేదలున్నారు, సామాన్యులున్నారు, కోటీశ్వరులూ వున్నారు. అందులో నాకు తోడ్పడిన పేదలున్నారు, అస్సలు పట్టించుకోని ధనికులూ వున్నారు. కృతి కర్తగా నాకు వారందరూ సమానులే, సమాన గౌరవనీయులే.

నాలో కూడా ఒక అవగుణం వుంది. నాకు నచ్చితే చాలు, అవతలి వ్యక్తి ఇష్టా నిష్టాలతో ప్రమేయం లేకుండానే అంకితమిచ్చేస్తాను. అది నా స్నేహ లక్షణం. ఒకసారి స్నేహం చేస్తే, అంతే. దానికి నా పరంగా భంగం కలగడమనేది వుండదు. అది అజరామరంగా అలా వుండి పోతుంది.

ఈ అంకితం చరిత్రలో కూడ ఒక విశిష్టత అలాంటిదే వుంది.

చాల సంవత్సరాల క్రితం నేను ఆంధ్ర యూనివర్శిటీ సెనేటు సభ్యుడుగా వున్న కాలంలో, 1953 ప్రాంతంలో ఒకసారి వాల్తేరు వెళ్లినప్పుడు, అబ్బూరి రామకృ ష్ణరావుగారితో కలిసి ఒక హాస్టలుకు వెళ్లాను. అబ్బూరివారు గొప్ప కవి. ఆయన వ్రాసిన "మల్లికాంబ" కావ్యాన్ని ఇంటర్‌లో మోడర్న్ పొయిట్రీగా చదివాం. అందులోని పద్యాలన్నీ నాకు అప్పట్లో కంఠస్థంగా వుండేవి. అంత చక్కని పద్యాలవి. అప్పటి నుంచీ ఆయనపట్ల నాకెంతో భక్తి. ఆయనకూ నా పట్ల అంతటి వాత్సల్యమే ఉండేది.

అది యూనివర్శిటీ విద్యార్థుల హాస్టలులో ఒక రూము. రూంలోకి చాలా మందే చేరారు – ఆచార్యులూ, విద్యార్థులూ కూడ. నా సాహిత్యం గురించిన ప్రసక్తి కూడ వచ్చింది. అప్పుడు నేనెందుకన్నానోగాని, ఒక మాటన్నాను–

"నా సాహిత్యాన్ని చదువుతున్న వాళ్లూ, మెచ్చుకొంటున్న వాళ్లూ అంతా ఇతర కులాల సహృదయులే. ఎవరు నా సాహిత్యంద్వారా చైతన్యవంతులై, భారత సమాజంలో సాంసతికంగా ఒక ఉన్నత స్థాయికి పెరగాలని గాఢంగా వాంఛిస్తున్నానో ఆ హరిజన యువకు లెవళ్లూ నా సాహిత్యం చదవడం లేదు."

ఒక్క క్షణం నిశ్శబ్దం తర్వాత ఒక యువకుడు కొంచెం లేచి అన్నాడు, "కవిగారూ! మీరు మీ స్టేట్‌మెంటును ఉపసంహరించుకోవాలి."

"ఎందుకని?"

"అది నిజం కాదు కాబట్టి"

''రుజువు కావాలి''

'నేనే.''

అప్పుడు చూశాను తిన్నగా ఆ అబ్బాయి ముఖంలోకి. ప్రశాంతంగా, ప్రసన్నంగా, తెలివి తేటలు వెన్నెల కాస్తున్న ముఖం అది. చిరునవ్వుతో కలిసి వచ్చినా, సవాలు చురుగ్గా వుంది.

''మీకిప్పుడే రుజువు చూపుతాను'' అంటూ అతడు ఆ పక్కనే వున్న తన రూంకు వెళ్ళాడు. ఆ లోగా అక్కడెవరో చెప్పారు నాకు – అతడొక హరిజన విద్యార్థి అనీ, ఆనర్సు చదువుతున్నాడనీ. అంతలో అతడు వచ్చి, ఒక పుస్తకాన్ని నా చేతికిచ్చాడు. అది నా ''రాగో దయం'' గేయసంపుటి! పేజీలు తిరగేశాను. ప్రతి పేజీ మార్జినులోను పెన్సిలుతో నోట్సు వ్రాసి వుంది!

ఆ అబ్బాయే జూపూడి అమ్ములయ్య!

అలా జరిగింది ఆయనతో నా తొలి పరిచయం.

అదేవిధమైన విమర్శతో, అదేవిధమైన సవాలుతో, అదేవిధమైన రాగోదయం నోట్సుతో ఒక ఇంటర్ విద్యార్థికి సంబంధించిన సంఘటన ఒకటి నాకు కాకినాడ కాలేజీ హాస్టల్ ఆవరణలో తటస్థపడింది. ఆ విద్యార్థి బొజ్జా తారకం.

వాల్తేరులో అమ్ములయ్య, కాకినాడలో తారకం – సాహిత్య పరంగా నన్నెంతో ఆనంద పరచిన సమానాంతర సంఘటనలవి.

ఆ తర్వాత అమ్ములయ్య గారితో పరిచయం పెరుగుతూ వచ్చింది నాకు. సాహితీ విద్వత్తులోనే కాదు, కవిత్వ రచనలో కూడ అమ్ములయ్య గారి నవనవోన్మేష వికాసం నన్నెంతో ఆహ్లాదపరిచింది.

చదువంటే కేవలం ఉద్యోగాల కోసమే కాగూడదు. ఉన్నత సంస్కారానికి అది ప్రాతి పదిక కావాలి. అప్పుడే జాతికి బహుముఖ వికాసం లభిస్తుంది. అమ్ములయ్య గారి వంటి ప్రతిభావంతులే జాతి అభ్యుదయానికి రవి చంద్రికలు.

అమ్ములయ్యగారిది గుంటూరు జిల్లాలోని జూపూడి గ్రామం. ఇంటి పేరు జూపూడి. తండ్రి పెద వీరయ్యగారు. తల్లి అమ్మక్కమ్మ గారు. వ్యవసాయ కుటుంబం. పెద వీరయ్యగారు చక్కగా పాడేవారు. నాటకాలు ఆడేవారు. సొంత పొలాలున్న ఆస్తిపరులు. ఇతరుల అవసరా లను గుర్తించి సహాయపడే ఉత్తమ సంస్కారులు.

బ్రాహ్మణ కోడూరు, తెనాలి, బందరు పట్టణాలలో ప్రాథమిక, ఉన్నత, కళాశాలల విద్యను ముగించుకొని, ఆంధ్ర యూనివర్శిటీ వాల్తేరులో ఆనర్సు చదివిన విద్యాధికుడు అమ్ములయ్యగారు. ఆయన సతీమణి రత్నజ్యోతి. సారస్వత కృషిలో కూడ ఆయనకు ఆదర్శ గృహిణి.

"అమూల్యశ్రీ" అనే కలం పేరుతో వివిధ పత్రికలలోను, గ్రంథ రూపంలోను అమ్ములయ్యగారు వెలువరించిన కవితలు సాహితీ సరస్వతికి నిజంగా అమూల్యాభరణాలు. కవితే కాదు, విమర్శ కూడ ఆయనకు అభిమాన ప్రక్రియే. ఈ మధ్య సాహితీ సమ్రాట్ డా. బెజవాడ గోపాలరెడ్డి గారి రచనలపై అమూల్యశ్రీ గారు ప్రకటించిన సమగ్ర సమీక్ష ఆంధ్ర భాషా భాండారానికి ఒక క్లాసిక్.

నా సాహితీ యాత్రలో ఒక విలక్షణమైన మార్గాన్ని అనుసరించిన వేదాంత కావ్యం ఈ నా "మోక్షం నా జన్మహక్కు". పోరాటం అక్కరలేని హక్కిది. మానవుడు పోరాడవలసింది జీవిత హక్కులకోసం. యుగ యుగాలుగా మానవ మేధస్సును చుట్టుకొని వస్తున్న అపోహల చీకటి తెరలను తొలగించివేసే జ్ఞానోషస్సు ఈ కావ్యం. దీనిని నాకు అత్యధిక ప్రేమపాత్రుడైన అమ్ములయ్యగారికి అంకితం ఇవ్వగలగడం నా అదృష్టం.

## అమ్ములయ్యగారి కృతి స్వీకారం

ఈ కావ్యాన్ని నేనెంత ప్రేమతో అర్పించానో, అంత ప్రీతితోను స్వీకరించారు మిత్రులు అమ్ములయ్యగారు. కృతిని స్వీకరిస్తూ ఆయన ఇలా అన్నారు:

"1950లో బందరు కాలేజీలో చదువుతున్న రోజుల్లో – రాంజీ గవర్నమెంటు హాస్టల్ "యూనివర్సరీ ఫంక్షన్"కి 'పాలేరు' నాటకం వేయడం జరిగింది! అందులో నాది భూస్వామి పాత్ర (ఆ పాత్ర పేరు గుర్తులేదు). ఆ నాటకం నాకు నచ్చింది! ఆ రోజుల్లో గోదావరి జిల్లా లలో పల్లె పల్లెల్లో ఆడుతున్న నాటకమది."

తరువాత 'కూలి రాజు' కూడా ఆడాం కాని, నేను ఏ పాత్ర వేసిందీ గుర్తు లేదు.

హాస్టల్ లైబ్రరీలో దొరికిన భీమన్న కావ్యాలు చదివాను - జానపదుని జాబులు - రాగోదయం -

అలతి అలతి లలిత పదాలతో - రమణీయంగా - రాగరంజితంగా - కమనీయంగా - భావస్ఫోరకంగా సాగే - భీమన్న రచనలంటే నాకు ఎంతో ఇష్టం!

అప్పటికీ భీమన్నతో వ్యక్తిగత పరిచయం లేదు. అది సాహితీ పరిచయం మాత్రమే!

వ్యక్తిగత పరిచయం - 1953లో - వాల్టేరులో ఆంధ్రా యూనివర్సిటీలో - బి.ఏ. ఆనర్సు చదువుతున్న రోజుల్లో - భీమన్నగారు యూనివర్సిటీ సెనేట్ సభ్యులుగా వాల్తేరు వచ్చినపుడు. నాకు అత్యంత ప్రాణమిత్రులు, ఆనాడు నాకు సహాధ్యాయి అయిన శ్రీ కె.ఎస్.ఆర్.వమూర్తి (ఐ.ఏ.ఎస్. - ప్రస్తుతం రాష్ట్ర ఆర్ అండ్ బి డిపార్టుమెంటులో ప్రిన్సిపల్ సెక్రటరీ) గారు కూడ అప్పుడు ఇంగ్లీషు లిటరేచర్ - బి.ఏ. ఆనర్సు చదువుతున్నారు. ఆయన, మరికొందరు మిత్రులు భీమన్నగారిని పరిచయం చేసారు.

నేను భీమన్న నాటకాల్ని వేసిన సంగతి - ఆయన కావ్యాల్ని చదివిన సంగతి వారితో ముచ్చటించి నపుడు "నా కావ్యాలు అన్నీ - చదువుతున్న వాళ్ళలోనూ ఒకడున్నాడంటే - చాలా సంతోషంగా వుంది - నిన్ను చూచి గర్విస్తున్నా-" అని ఆనందపడిపోయారు. ఆయన నన్ను మెచ్చుకుంటే, నా ఆనందానికి గూడ అంతు లేదు.

అంతే - యూనివర్సిటీలో చదువుతున్న రెండు సంవత్సరాలు - భీమన్న గారు ఎప్పుడు వచ్చినా - నా గెస్టుగానే వుండేవారు. ఉన్న రెండు రోజులూ - సాహిత్య గోష్ఠులే! నా సాహిత్య ప్రియత్వాన్ని - నా కవితా వ్యాసంగాన్ని గురించి వాకబు చేసి నన్ను ఎంతో ప్రోత్సహించేవారు.

ఆనాటి నుండి యీనాటి వరకు మా యిద్దరి మధ్యనున్న ప్రేమానురాగ స్నేహ బంధం చెక్కుచెదరలేదు. వారి యింట్లో నేనూ ఒకణ్ణి అయిపోయాను. భీమన్నగారి సతీమణి హైమవతి గారు గాని - పిల్లలు పల్లవి - విజయేందిర గాని నా యెడల ఎనలేని ప్రేమాను రాగం చూపుతున్నారు.

నాలో యింకా సాహిత్య ప్రియత్వం – కవితాభి నివేశం వుందంటే – అది భీమన్న గారు ఎప్పటికప్పుడు యిస్తున్న ప్రోత్సాహ బలమే! చేస్తున్న సలహాల ప్రభావమే – ఉన్నతో ద్యోగిగా వున్నా – "నీకున్న కవితాభినివేశం చంపుకోవద్దనీ – వ్రాస్తూ వుండమని – ఏమి వ్రాస్తున్నావని" నన్ను హెచ్చరిస్తుంటారు.

భీమన్న కావ్యాలలో నాకు నచ్చినవి – రాగోదయం, గుడిసెలు కాలిపోతున్నాయి, భీమన్న రాభీలు, శివాలకలు. అన్నిటికంటే నాకు నచ్చింది భీమన్న బొమ్మ. బొమ్మలో పరబ్రహ్మాని దర్శించి తాదాత్మ్యం చెందిన భీమన్న కవి అంటే అందుకే నాకు వల్ల మాలిన అభిమానం! గురువుగా, తండ్రిగా, పెద్దన్నగా, సాహితీ మార్గదర్శిగా భీమన్న కవి నాకెప్పుడూ ఆరాధ్యుడే!

అట్టి మహాకవి తమ వేదాంత కావ్యాన్ని నాకు అంకితమిస్తుంటే ఎంత ధన్యతో! వినయంతో ఆనందంతో అంజలి ఘటించి అందుకొంటున్నాను. – అమ్ములయ్య.

మిత్రులు అమూల్యశ్రీగారు నా గురించి చెప్పిన మాటలు అతిశయోక్తులైనా సాహార్ద్ర మధుపూరితాలు, సౌజన్య పూవుటమ్ములు. అందుకే వాటి నిక్కడ సహృదయుల కోసం పొందు పరిచాను. కావ్యాన్ని ఈ విధంగా స్వీకరించినందుకు బహుధా కృతజ్ఞుణ్ని.

## మేధావుల సర్వజ్ఞత్వం

Integration is made a myth; and castist, religious and linguistic fanaticism is allowed to devastate the country.

Now at present the country is left at the mercy of grabbing and terrorism, bringing to the top of polity the old theory "struggle for existence and survival of the fittest." అంటున్నారు మేధావులు, వర్తమాన మానవ చరిత్రను చూచి వాపోతూ.

"ఈ మేధావులున్నారే, వీళ్ళు అంతా తమకే తెలుసు ననుకొంటారు" అన్నారు డా. గోకుల మిత్రాగారు చిరుకోపంతో, ఆయనవద్ద చికిత్స పొందుతున్నప్పుడు నేను తనతో ఏదో విషయంలో వాదించినప్పుడు.

ఆయన హాస్యానికన్నా, అది పరమ సత్యమే. ఘనీభవించిన బ్రహ్మ పదార్థమే కదా మేధస్సు? ఏదో ఒక ప్రజ్ఞలో పరాంకోటికి, శిఖర స్థాయికి చేరుకొన్నవాడే మేధావి. అట్టి వాళ్ళు తాము సర్వజ్ఞుల మనుకోవడం సహజమే.

అట్టి మేధావి మనోయోగ శిఖరం మీద నిలబడి, చుట్టూ చూడగల్గినప్పుడు, అతడికి సర్వే సర్వత్రా పరమాత్మే దర్శనమిస్తుంది. అప్పుడతడు సర్వజ్ఞుడు కాగలడు. శర్వుడొక్కడే సర్వజ్ఞుడు అన్నాడు శ్రీనాథ కవి. శర్వుడు (శివుడు) మృత్యుంజయుడట కూడ. అయితే అలాంటి విరాట్‌పురుషుడు సాహిత్యంలోను, సినీమాలలోను తప్ప వాస్తవంగా మరెక్కడా కనిపించడు. మహా కనిపిస్తే, అది భక్తుని స్వయం చిత్రిత మనోమూర్తి మాత్రమే.

మనస్సే పరమాత్మకు సన్నిహిత సాకార మూర్తి. దాన్ని అజరామరం చేసుకోవడమే మృత్యుంజయత్వం. అది సాధ్యమా అంటే, సాధ్యమే. పరమాత్మ తనను తాను వ్యక్తీకరించు కొన్నదందుకే మరి!

## ప్రచార ధోరణి నమూనా

ఈ పీఠిక ప్రూఫులు దిద్దుకొంటున్న సమయంలో దూరదర్శన్‌లో ''ప్రశ్న-జవాబు'' ప్రోగ్రాం వచ్చింది.

''తాజ్‌మహల్‌ను కట్టిందెవ్వరు?''

''షాజహాను''

''కాదు''

మరెవరు? కూలీలట! రాళ్లు కొట్టిన కూలీలు, ఇటుకలు పేర్చిన కూలీలు, సున్నం మోసిన కూలీలు! నిజమే కదా!

ఎంతటి గొప్ప సత్యావిష్కారం!

మరణానంతర జీవస్థితికీ, కర్మ సిద్ధాంతానికీ, మోక్షానికర్హులు కొందరే అన్న భ్రాంతి కల్పనకూ జరిగిన ప్రచారం ఇలాంటిదే! అవును నిజమే అని ప్రజలు నమ్మేటంత తెలివిగా జరిగే ప్రచారం!

అయితే మరి, తాజ్‌మహల్‌ను వలె, తిహారీ జైలును కట్టిన వాళ్లు కూడ కూలీలే కదా!

అయితే మరి, ఈ కూలీలు దేశమంతటా (లోకమంతటా) వున్నారు కదా. మరెక్కడా మరొక తాజ్‌మహల్ లేవలేదేమి?

తాజ్‌మహల్ బూర్జువా నిర్మాణ మనుకొంటే, జైలూ అలాంటిదే కదా. వాటిని కూలీ లెందుకు కట్టాలి?

ఇలా ఆలోచిస్తూ ఇటూ అటూ చూస్తూ వుంటే, నా దృష్టి పోతన విగ్రహంపై పడింది–

"భాగవతాన్ని వ్రాసిందెవ్వరు?"

"బమ్మెర పోతన"

"కాదు"

మరెవరు? తాటి చెట్లను పెంచిన కర్షకులు, తాటాకులను కొట్టిన కార్మికులు, దస్త్రాలుగా కుట్టిన నౌకర్లు, గంటాలను చేసిన కమ్మర్లు!

ఇదేదో తమాషా అనుకోవద్దు. సాహిత్యం పేరుతో, వేదాంతం పేరుతో రాజకీయ ప్రచారం జరుగుతున్న ధోరణి ఇది. ఇదే సామాన్య మానవుడి మెదడు వికసించకుండా గిడసబరచిన ధోరణి! మేధావుల మెదడును స్వార్థం వైపు మళ్లించిన ధోరణి!

## 1+0 = వ్యక్తి

పరమాత్మ "0" అనుకొందాం. అది పూర్ణ చైతన్య శక్తి. దాని నుంచి పుట్టింది "1". అది 2,3,4 వగైరాగా ఎదిగింది. అదే బీజం. ఈ బీజం అలా ఎదగ గల్గింది "9" వరకే. ఆ తర్వాతిది "10". ఈ 10లో బీజం, పరమాత్మా జంటగా చేరాయి. వేదాంతాన్ని ఈ విధంగా కూడా మనం అర్థం చేసుకోవచ్చు.

(i) పరమాత్మ సున్నా కదా. దానికి స్వయంగా విలువలేదు. తనకొక విలువను సంతరించు కోడానికే ఒక బీజాన్ని కల్పించుకొని, దాని పక్క చేరిందది. బీజం తనలో నుంచి పుట్టిందే. తానే. అయినా, ఆ పక్క తాను చేరినప్పుడే తనకొక వ్యక్తిత్వం ఏర్పడుతూ వుంది. పరివ్యాపనం జరుగుతూ వుంది. జాగృతం కావాలనే ఇచ్ఛ తీరుతూ వుంది.

(ii) పదిలోని ఒకటి శరీరం అనుకొంటే, సున్నా ఆత్మ. 1+0= వ్యక్తి. ఇందులో ఒకటిపోతే, మిగిలేది పరమాత్మ. పరమాత్మకు ఆత్మత్వం కలిగేదీ, ఉండేదీ అదొక శరీరాన్ని అంటిపెట్టుకుని వున్నంతవరకే.

సున్నా (ఆత్మ) పోతే, మిగిలేది ఒకటి. అది వట్టి బీజం. బీజానికి 9 వరకు ఎదిగే గుణమే తప్ప, వ్యాపన శక్తి లేదు. అందువల్ల సున్నా పోయిన ఒకటి దాని మూలకంలోకి అది తిరిగి (కరిగి) పోతుంది.

(iii) ఆదిలోని ఒకటీ, పది (10) లోని ఒకటీ ఒకటి కావు. రెండూ వేరు వేరు. మొదటి దాన్ని చెరిపేసి రెండో దాన్ని వెయ్యలేదు. రెండో ఒకటి (10లోని ఒకటి) కొత్తది. మొదటిది పోయి, అదే ఈ రెండోదిగా తిరిగి పుట్టలేదు. అంటే, పునర్జన్మ లేదు.

## మనిషే మనిషికి సమస్య

''జీవిత ప్రయోజనం సుఖ శాంతులతో జీవించడమే కావచ్చు. మరి, జీవిత సంపూర్ణ వికాస కృషే ప్రగతి – అంటే ఏమిటి? అందుకు మానవుడేం చెయ్యాలి?'' ఇది మా ఇంజనీరు కె.వి.రమణమూర్తి ప్రశ్న.

ఈ విషయాన్ని నేను ఈ కావ్యంలో విపులంగా చర్చించాను. జీవిత వికాసమంటే ప్రజల్ని మోసగించడంద్వారా ధనరాశుల్ని కూడబెట్టుకోవడం కాదు. వోటర్లకు కుహనా వాగ్దా నాలు చెయ్యడంద్వారా అధికార పదవులకు ఎగ్రబాకడమూ కాదు. ప్రతి వ్యక్తీ తన ప్రతిభను కార్యరూపంలో ఆవిష్కరించుకొంటూ జీవించడమే వికాసమూ, ప్రగతీ నా దృష్టిలో.

''నీతీ, నిజాయతీ అనే మాటలు పూర్వమెప్పుడో రాజ్యమేలాయేమో గాని, ప్రస్తుతం మాత్రం వాటి ఉనికే లేదని చెప్పాలి'' (1988, ఫిబ్రవరి విపుల). ఈ విధంగా పత్రికలూ, ప్రజలూ కూడ విమర్శిస్తూనే వున్నారు. దైవభక్తీ, మైకు భజనలూ దివి భూవులను ఏకం చేస్తూనే వున్నై. అంతకు మించి – స్వార్థం, క్రౌర్యం, కామం, వంచన విజృంభించి మానవ జాతినే తినెయ్యడం మొదలు పెట్టినై. ఏమిటిదంతా? మత పెద్దలూ, తత్వవేత్తలూ కల్పించిన దైవభీతి ఏది? నీతి బోధలేమైపోతున్నై?

వీటి బండారం బైటపడింది. ఇవన్నీ పట్టి అపోహలని తేలిపోయింది. "If there is really no God, for the sake of human existance we have to create one" అనే దశ దాటిపోయింది. పెద్దలు కల్పించిన బూచికో, బూచోడికో బెదిరిపోయి ఒదిగివుండే అమాయకపు శైశవ స్థితిలో లేడిప్పటి మానవుడు.

అందుకే, పాత వ్యవస్థ, పాత యుక్తులు ఇక పనికి రావనీ, కొత్త మానవీయ ప్రగతి ప్రణాళికతో యువలోకం ఆర్గనైజు కావాలనీ ఉద్బోధించాలనీ కావ్యంలో

ఇబ్బందులు, దురదృష్టాలు, సమస్యలు వంటి కష్టాలలో ఎక్కువ భాగం మనిషికి మనిషి కల్పించేవే. ప్రకృతి కల్పించేవి తక్కువ.

ప్రకృతిని తల్లి అనుకొంటే – చరాచర, చేతనా చేతన వర్గాలన్నీ ఆమె సంతానమే. ఆమె కర్తవ్య నిర్వహణలో తారతమ్యాలుండవు. కష్టసుఖాలు కలిగితే అవి సామూహిక ప్రణాళికలో భాగాలే తప్ప, వ్యక్తిగతమైనట్టివి కావు.

మనిషి సంగతి వేరు. మనిషిని పాలించేవి స్వకీయమైన ఇష్టానిష్టాలు. ఎంతోమందికి సుఖ సంతోషాలు కలిగించేదైనాసరే ఒక అంశం ఒక వ్యక్తికి ఇష్టం కాకపోతే, అతడు దానిని వ్యతిరేకిస్తాడు. ఎన్నో సమస్యలు సృష్టిస్తాడు. కష్టాలు కలిగిస్తాడు. అతడు బలవంతుడు కూడ అయితే, యుద్ధాలు చేస్తాడు. ప్రాణాలు తీస్తాడు.

అతడట్టి చెడు పనులు చేస్తున్నప్పుడు అతడికి దైవభీతి వున్నదా? లేనప్పుడు మరి అలాంటి దేవుడివల్ల ప్రయోజనం ఏమిటి?

ఈనాడు దేవుడు, స్వర్గం, మోక్షం వంటి వాటిని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. మానవుడింకా జంతు దశలోకి దిగజారిపోకుండా ఆపాలంటే, అందరికీ కనీసావసరాలు సులభంగా లభించేటట్టు చూడగల వ్యవస్థ ఏర్పడాలి.

మనిషిని మనిషి హింసించే అవసరం లేకుండా సుఖంగా బ్రతకగలగాలి. సుమనస్కంగా వికసించగలగాలి.

## తుది పలుకు

''భగవంతుడు భక్తుల్ని పరీక్షిస్తాడు''ట. ఎందుకట? ఒక దొర తన సేవకుల విశ్వాస పాత్రతను పరీక్షిస్తాడు. అదే నమూనాలో దేవుణ్ని సృష్టించారు పండితులు.

దొర తన సేవకులను, గురువు తన శిష్యులను, తండ్రి తన బిడ్డలను, నాయకుడు తన అనుచరులను పరీక్షలకు గురిచేయవచ్చు. సర్వజ్ఞుడైన, సర్వ శక్తిమంతుడైన దేవుడెందుకు చేస్తాడలా?

స్వార్థపరులైన బలవంతుల మధ్య నిజాయితీ పరులు ఎన్నో కష్టాలుపడుతూ వుంటారు. అట్టి వాళ్లకు సహనం నేర్పడం కోసం వేదాంతులు సృష్టించిందే ''దేవుడు భక్తుల్ని పరీక్షిస్తా''డనే మాట. ఈ వేదాంతుల గురించి ఇంగ్లీషులో ఒక సుభాషితం వుంది. "Philosophers look in a dark room for a black Cat which is not there" అని.

అందుకే నేను చెపుతున్నాను, ఆలోచించండి. అనుసరించండి. పాత ధోరణి వదిలేసి, ఈ కొత్త పద్ధతిలో ఆలోచించడం మొదలుపెడితే, మానవులంతా సమానంగా సుఖపడగల వ్యవస్థ దానంతటఅదే నెలకొంటుంది.

దేవుడు లేడు, పరమాత్మ వుంది
పరమాత్మ సర్వగుణ చైతన్య శక్తి
అది మనస్సుగా వికసించింది
నీవు దానిని ఎలా వూహిస్తే, అది నిన్ను అలా అలరిస్తుంది.
కనుక-

క్రూరుడైన నియంతగానో, స్వపర భేదాలు చూపే అహంకారిగానో, ఆశ్రిత పక్షపాతి గానో, శరణాగత మాత్ర రక్షకుడిగానో దేవుణ్ణి ఊహించుకొని చెడిపోవద్దు. దేవుడు వరాలిస్తా డనేది కూడ అబద్ధమే.

ఈ కావ్యాన్ని చదివే అదృష్టం ఎవరికైనా కలిగితే, అట్టివారికి ఏవైనా సందేహాలు కలిగితే, వాటిని తీర్చడానికి అవసరమైన అంశాలన్నీ ఈ పీఠికలో దొరుకుతాయి. పరిశీలించండి.

అపోహలను, దురూహలనూ పరిహరించి, అమృతోహలతో మనస్సును నింపుకోండి!

-భీమన్న

# 1. మోక్షం సహజసిద్ధం

మానవుడా !
నీవు విద్యార్థివో, వ్యవహర్తవో
పనివాడివో, తేరగాడవో
నాయకుడివో, కార్యకర్తవో
క్రూరుడవో, కృపామతివో
వేదాంతివో, విషయార్తుడవో
నల్లటివాడవో, తెల్లటివాడవో
పరోపకారివో, స్వార్థపరుడవో
ఏ దేశం వాడవో, ఏ జాతి వాడవో

ఎవడవైనా కానీ -
నీవు మానవుడవు !
జీవ లతకు వికసించిన
పరమాత్మీయతవు !

## 2

లేనివాడు కలవాడు కావచ్చు
కార్మికుడు యజమాని కావచ్చు
మూర్ఖుడు మేధావి కావచ్చు
వామనుడు త్రివిక్రముడు కావచ్చు.
ప్రధానం నీ స్థితి కాదు, నీ స్థాయి కాదు,
నీ పదవి కాదు, నీ ప్రతిష్ఠ కాదు,
నీ వృత్తీ, విగ్రహ పుష్టీ కూడా కాదు.
పరమాత్మ నుంచి నీ జీవాంకురం
ఎలాంటి శక్తిని గ్రహిస్తున్నది ?
అది మానవాభ్యుదయ పురోగమనంలో
ఎట్టి పాత్రను నిర్వహిస్తున్నది ?
అదీ ప్రధానం !
ప్రేయస్సునూ, శ్రేయస్సునూ పోషిస్తున్నదా ?
చీడగా, పీడగా హింసిస్తున్నదా ?

## 3

తనకు లభించిన జన్మను బట్టి
ఉంటుంది జీవ స్వభావం,
తాను గ్రహించే శక్తిని బట్టి
ఉంటుంది దాని విజృంభణం !

అందుకే చెబుతున్నాను -
సింహం రాజూ కాదు,
గొర్రె బానిసా కాదు !
అధికుడ ననే గర్వం వద్దు,
అల్పుడ ననే దైన్యమూ వద్దు !

మహానది తరంగాలలోది ఏది నీరో
పంట కాలువ బోదెలోదీ అదే నీరు !
దేశ రక్షకుడిచేతిలోని తుపాకీ ఎట్టిదో
గజ దొంగ చేతిలోని తుపాకీ కూడ అట్టిదే !
నీ గుణాన్ని అంచనా వేసుకో !
చెడ్డదైతే మంచిగా మార్చుకో !
పదార్థం ఒక్కటే కనుక
కృషి ద్వారా యోగ్యతను పెంచుకో !

## 4

స్వాతంత్ర్యం నా జన్మహక్కు అన్నాడు తిలక్ ;
కవులు, సంస్కర్తలు, పరిశోధకులు వంటివారికి
స్వాతంత్ర్యం జన్మహక్కే, నిజమే ; కాని
దొంగలకు, దుష్టులకు స్వాతంత్ర్యమే నిషిద్ధం కదా ?

మోక్షం నా జన్మహక్కు అంటున్నాను నేను ;
మోక్షం అంటే విముక్తి, అది
బాధ నుంచి, దాస్యం నుంచి, దారిద్ర్యం నుంచి
దుఃఖపెట్టే దేనినుంచైనా కావచ్చు !

హక్కులు భౌతికమైన వైతే
వాటికి విధి నిషేధా లున్నై,
ఒకరి హక్కులు మరొకరికి చిక్కులు కావచ్చు కనుక ;
ఏ మనిషికైనా, ఏ జీవికైనా సరే
ఏ చిక్కూ లేని జన్మహక్కు ఒక్కటే
అది మోక్షం !

## 5

ముక్తి, మోక్షం, మోచనం వంటి మాటలకు
ఒకటే అర్థం విడుదల అని.
జైలు నుంచి, బాధ నుంచి, బాధ్యత నుంచి
దురాచారం నుంచి, అజ్ఞానం నుంచి,
దుఃఖం నుంచి, దుష్పరిపాలన నుంచి–
స్వేచ్ఛ దేని నుంచైనా సరే, అది మోక్షమే.

ఆధ్యాత్మికంగా మోక్షం అంటే
జన్మ నుంచి విడుదల అని,
జీవ బ్రహ్మైక్యం అని !
ఈ ఆధ్యాత్మిక మోక్షాన్నే
నేను నా జన్మహక్కు అంటున్నది !
నా అంటే పుట్టిన ప్రతి అంశ యొక్క అని !

## 6

పుట్టని దానికి చావు వుండదు
ఏ చావైనా పుట్టిన దానికే !
పుట్టుక లేనిది పరమాత్మ ఒక్కటే.

పరమాత్మ నుంచి పుట్టింది ఆత్మ
అది తిరిగి పరమాత్మ కావడం దాని నైజం,
అందుకు ఏ యత్నమూ అక్కర లేదు.

జ్ఞానం, అజ్ఞానం అనేవి లౌకికాలు,
భక్తి, వివేకం అనేవి పై యుక్తికాలు,
జీవ బ్రహ్మైక్యం సహజ ధర్మం.

జన్మ ఎలా కలిగిందో
మోక్షమూ అలానే కలుగుతుంది ;
పుట్టిన పరమాత్మ ఆత్మ అవుతున్నది
గిట్టిన ఆత్మ పరమాత్మే అవుతున్నది
అదొక సహజ పరిణామ క్రమం !

## 7

జీవం, ఆత్మ, మనస్సు, పరమాత్మ (బ్రహ్మ)

ఈ నాలుగు మాటల్లోనే చెబుతాను, విను -

మాటలు పెరిగే కొలదీ

బాట దుర్గ మారణ్యా మవుద్ది కనుక.

మాటలు, భాషలు కేవల వ్యావహారికాలు
మానవత వికాసనకు కేవలం పరిపోషకాలు !
మానవత లాంటిదే పారమాత్మికత
ఎంత సహజంగా వుంటే అంత సుందరం అది !

నిజానికి మాట లెందుకు పెరుగుతై ?
పాత మాటలు కొత్త వాళ్ల కర్థం కాక !
దృక్కోణాలు ఒకటి కాక !
సూటిగా చెప్పడం చేతగాక !
అందుకే, ఈనాటి నీకు
ఈనాటి మాటల్లో చెప్పుతున్నాను,
మహా వేదాంతాన్ని
మామూలు మాటల్లో చెబుతున్నాను,
వివరాల జోలికి వెళ్లకుండా
విషయం మాత్రమే చెప్పుతున్నాను !

**8**

ప్రతి శాస్త్రానికి ఒకొక్క రకంగా
ఒకొక్క సాంకేతిక భాష వుంటుంది ;
వేదాంతానికీ అంతే ; అయినా -
సాదా భాషలో చెపుతున్నాను, విను !
ఎక్కడైనా కవిత్వం ధ్వనిస్తే
అది నా సహజ వ్యక్తిత్వ దోషం !

నే నిస్తున్న ఉదాహరణలు కూడ
నే నెరిగిన సంస్కృతి నుంచే,
అది విశ్వ మానవతకే సంకేతం కనుక
పాక్షిక సంకుచితత్వ దోషం పట్టదు.

గద, పరశువు, కోదండం, హలం
ఆయా యుగాలకు సంకేతాలుగా
వీక్షణ, శ్రవణం, ధ్యానం, సంకల్పం
ఆయా శక్తులకు మూలక్షేత్రాలుగా
తారాగణాదుల తేజోవిలాసాలు
జీవిత పథాలకు కథా వస్తువులుగా
రూపకల్పన చెయ్యబడినట్టిదే
భారతీయ పూర్వ సాహిత్య మంతా!

తాను రూపం దిద్దిన శిల్పమూర్తికి
తానే సాష్టాంగపడగల కళాలయం అది!

## 9

సర్వసమగ్రమైన సృష్టి ప్రణాళిక వెనుక
ఒక మహా మేధస్సు వుంది !
అదే పరమాత్మ !
అది ఎంత తెలివైనదో, అంత తటస్థం !

పాల సముద్రమే సొంత ఇల్లైనవాడు
పాల కోసం ద్రేపల్లెలో పుట్టాడంటే
మహా మేధస్సు అనుభూతి కోసం
మానవ మేధస్సయిందని వ్యంగ్యం

ఏఅవతారమైనా అనుభవానంతరం
దానికదే శమిస్తుంది,
అందు కే నిష్ఠలూ అక్కరలేదు.

భూమిమీద వలెనే గ్రహ తారాదు లన్నిటా
అనురూప జీవజాలం వుంటే వుంటుంది, కాని
మానవ రూపమంత ఆనందకర మయింది
మరొక టుండదేమో పరమాత్మకు !
అందుకే, సుఖశాంతులనుభవిస్తూ
అజరామరుడవు కమ్మంటున్నాను.

## 10

సమస్త గుణాత్మక మహస్సే పరమాత్మ,
అందు నుంచి ఏదో ఒక గుణం కీలకంగా
వ్యక్తమైన బీజాంకురమే జీవం,
దాని స్వయం స్పృహే ఆత్మ,
దాని విలాసమే మనస్సు.

మనస్సు నిలిస్తే ఆత్మే,
తిరోగమిస్తే మోక్షం !
నిలిచిన మనస్సు మహిమలు చూపగలదు కాని
పరమాత్మ కోరికను తీర్చలేదు !

కనుక, మనస్సు పురోగమించాలి,
ఆత్మకు మృత్యుంజయత్వం సిద్ధించేదాకా
పురోగమించాలి !
తిరోగమించగూడదు !

## 11

దైవం, స్వర్గం, నరకం అంటూ,
భక్తి, జ్ఞానం, వైరాగ్యం అంటూ,
సంసారం సాగరం దుఃఖం కనుక
సర్వసంగ పరిత్యాగంతో

సన్యాసులుగా బ్రతకాలంటూ,
ఎన్నో చెప్పారు, చెపుతున్నారు నేటికీ !
జనన మరణాల విషవలయం నుంచి
విడివడడమే మోక్షం అంటున్నారు !
సరే, అంటే అనినీ –
ఎవరి ఊహలు వారివి !

అయితే, మోక్షం పొందడానికి
కొందరు మాత్రమే అర్హు లంటున్నా రేమిటి ?
మోక్ష మార్గంలో నడవడానికి
షరతులు పెడుతున్నా రేమిటి ?

మోక్షం పొందే హక్కు కొందరికే కాదు
అందరికీ కల దంటున్నాను నేను,
అందుకు ఏ నియమాలూ అక్కర లే దంటున్నాను !

## 12

జప తపాలు, యోగ నిష్ఠలు, భక్తి శ్రద్ధలు, అనుష్ఠానాలు
ఏవీ అక్కరలేదు మోక్షానికి.

అవన్నీ ఎందు కంటే –
జీవ నాడుల్ని స్వస్థ పరచుకొని
ఆత్మ శక్తిని దృఢ పరచుకొని
మనస్సును ఏకాగ్రం చేసుకొని
బలంగా బ్రతకడం కోసం.

మానవుడు శ్రమ పడవలసింది
క్రమోన్నతి కోసం,
మోక్షం కోసం కాదు.

శరీరానికి మృత్యువు ఎలా కోరరానిదో
ఆత్మకు మోక్షం అలానే కోరరానిది !

## 13

మేధా వికాసమే జీవిత క్రమోన్నతి,
విగ్రహ పుష్టి గల సృష్టి ఎంత వున్నా
మనిషికి పెత్తన మిచ్చింది మెదడే !
జీవలత చివర సహస్ర దళ పద్మంగా
వికసించిన పరమ పదార్థమే మెదడు !

వికాస క్రమంలో దశలెన్నో వున్నై కనుక
పూర్ణ వికాస శక్తే పూర్ణ పురుషత్వం,
పూర్ణ పురుషత్వమే పురుషోత్తమత్వం,
ఏ యోగ లక్ష్యమైనా అదే ! అంతవరకే !

కార్యశూరుడు, ఆర్త రక్షకుడు అయిన
పురుషోత్తముణ్నే అవతార మన్నారు !
విశ్వాతీతుడైన దేవుడు వట్టి ఊహ మాత్రమే,
వాస్తవంగా లేడు.
మానవుడి కంటె మార్తాండుడికి
ఆయుస్సెక్కువ, అంతే !

## 14

కృష్ణుడి లోని నేను
శిశు పాలుడి లోని నేను ఒకటి కాదు,
పిల్లి లోని నేను
ఎలుక లోని నేను ఒకటి కాదు.
నేను అంటున్న ఆత్మ ఒకటే అయినా
శరీరాలు వేరు వేరు కనుక
వ్యక్తిత్వాలు వేరు వేరు,
ప్రయోజనాలు వేరు వేరు
బ్రతుకులు వేరు వేరు !
దేని కదే అహం బ్రహ్మాస్మి !

## 15

"వృష్ణీనాం వాసుదే వోస్మి
పాండవానాం ధనంజయః"
"ఝషాణాం మకర శ్చాస్మి
సిద్ధానాం కపిలో మునిః"

అంటున్న కృష్ణుడి లోని నేను
తక్కిన నేనుల యెడ ఎలా
భేద భావం ప్రకటిస్తున్నదో చూడు !

జల చరాలలో మొసలిని నే నంటున్న వాడే
మొసలిని చంపి ఏనుగును రక్షించాడు !

విశ్వంలోని రూపా లన్నీ
తానే అయి నిల్చిన వాడు
మిత్రశక్తుల్ని ప్రోత్సహిస్తూ
శత్రుశక్తుల్ని నిర్మూలించాడు, గమనించు !

## 16

"సర్వ ధర్మాలనూ పరిత్యజించి
నన్ను మాత్రమే శరణు పొందు" అనడం
నేను అనేది ప్రతి వ్యక్తిలోను వుంది కనుక
వ్యక్తి తాను స్వశక్తినే నమ్ముకోవా లనడమే !
ఇప్పుడు కృష్ణుడు లేడు, కాని
శక్తి గల ప్రతి వ్యక్తీ తాను కృష్ణుడే !
ఎవడి దారిదివ్వె వాడి కన్నుల్లోనే వుంది,
ఎవడి మోక్షం వాడి తెన్నుల్లోనే వుంది !

ఇందులో -

మన గురువులు చూపుతున్న దాసత్వం
దాసోను దాసత్వం ఏది ? ఎక్కడుంది ?

## 17

ఆత్మను గురించి కృష్ణు డంటాడు
"న జాయతే న మ్రియతే" అని
"అజః నిత్యః శాశ్వతః అని !"

జనన మరణాలు లేనిది పరమాత్మ,
ఆత్మ కాదుగదా ?
బహుశా అర్జునుడు నమ్మి వుండడు !

అందుకే కృష్ణుడు మళ్లీ అంటాడు –
"ఆత్మకు కూడ జనన మరణా లున్నాయని
అర్జునా ! నీవు భావిస్తే
అలానే భావించు, ఫర్వాలేదు" అని !

అంటే ఏమిటి ?
శరీరం వలెనే ఆత్మ కూడా
మరణిస్తుం దనుకోవచ్చు అనేగా ?

## 18

మేలుకో, లేచి నిలబడు, గురువును ఆశ్రయించు,
పరమ విద్యను గ్రహించు ;
మార్గం సుగమం కాదు, కత్తిమీద సాము -
అంటున్నది కఠోపనిషత్తు !

ఉపనిషత్తులే మన పరమ గురువులు ;
ఏ గురువైనా, బోధ ఒక్కటే -
జీవిత గమ్యం మోక్ష మనీ,
మోక్షం కష్టసాధ్య మనీ !

నేను చెపుతున్నాను, విను -
ఈ బోధల్లో నిజం లేదు,
జీవిత గమ్యం మోక్షం కాదు !
మోక్షం కష్టసాధ్యం కాదు !

జీవిత గమ్యం నవ నవోన్మేష పూర్ణానందం,
మోక్షం అనాకాంక్షిత సహజోప శమనం.

## 19

జీవ బ్రహ్మైక్యం మోక్షం
అది జ్ఞాన సిద్ధం అంటుంది అద్వైతం,
సహజ సిద్ధం అంటున్నాను నేను.

స్త్రీ పురుషాత్మల అనురాగ సమైక్యమే
రసాద్వైతం అన్నాను,
పరమాత్మ రస స్వరూపం కనుక
రసానందమే ఆనంద పారమ్యం కనుక
కవితా తత్వాన్ని రసాద్వైతంగా భావించాను,

జీవితం పారమాత్మికం కావాలంటే
కళారాధన తప్పదన్నాను,
ప్రేమోపాసనే జీవిత పరమార్థ మన్నాను.

పుట్టిన ప్రతి మనిషీ జీవితాన్ని
ప్రేమ కళా రమణీయం చేసుకోవాలి.
మోక్షంలో ఏం లేదు
ఎన్ని వున్నా విశిష్టత లేని తాటస్థ్యం అది !

## 20

మరణానంతరం ఎక్కడో, ఏదో
వున్నదనే వాళ్ల మాటలు నమ్మకు ;
మరణానంతరం జరిగే దొక్కటే ప్రతి జీవికీ,
అది పరమాత్మలో పునరైక్యం.
జన్మ జన్మల అనుబంధాలుగా
నవ గ్రహాల అనుగ్రహాలుగా
హస్త రేఖల ఆలేఖ్యాలుగా
అదృష్ట దేవతల ఆట పట్టింపులుగా
కనిపించే వన్నీ జీవిత ప్రణాళికలోవే.

నాడిలో హృదయాన్ని గుర్తించడ మెలాంటిదో
చేతిలో జీవితాన్ని చదవడమూ అలాంటిదే.

అదొక కళ, ఒక పరిశీలన, ఒక నైపుణ్యం !
అ వేవైనా నీకు వినోదం కల్గించ గల్గితే
వినోదించి ఆనందించు
సాంస్కృతిక ప్రదర్శనాలను వలె !

## 21

తెలియక ముందు ఆచార మౌఢ్యం అనుకొన్నదే
తెలిసిన వెనుక ఆస్వాద యోగ్యం కావచ్చు,
చీకట్లో తాడనుకొని వదిలివేసినదే
నిజంగా పామై ప్రమాదం తేవచ్చు !

ఆచారం, విశ్వాసం, భ్రాంతి, స్ఫూర్తి వంటి
అవాస్తవికాలు కూడ వస్తుగతాలే ;
సృష్టిలో అవసరం లేని దేదీ లేదు, కనుక
నీ అవసరమేదో ముందు తెలుసుకో !
సమగ్రంగా పరిశీలించి స్వగతం చేసుకో !

ప్రకృతిలో ప్రతి శక్తిపైనీ నీ ప్రభావ మున్నట్టే
ప్రతి శక్తి ప్రభావమూ నీపై వుంది !
నీవు ఏకాకివి కావు
నీ ప్రతి కదలికకూ మరొక కదలిక ఆత్మీయమై వుంది.

## 22

నీ పూజ, నీ విద్య, నీ వృత్తి, నీ అభిరుచి
నీ ప్రేమ, నీ ప్రియజనం, నీ అనుబంధం
నీ వినోదం, నీ ధ్యానం అన్నీ నీ వ్యక్తిగతం.

విబూది, తాయెత్తు, మంత్రం, తంత్రం
వంటి వామ విద్యలు కూడ నీ మనస్సును రంజిస్తే
రంజించనీ, వినోదించు !

మనస్సు ఏ రూపంపై నిలుస్తుందో అదే
దానిని సర్వక్లేశాల నుంచీ రక్షించే పరమాత్మ !
నీ తృప్తినీ, ఆనందాన్నీ ఇచ్చే ఆర్ద్రత లన్నీ
ఆత్మీయమైనట్టివి, నీలోవి, బైటివి కావు !
బైటి వన్నీ భౌతికాలు, సాపేక్షకాలు, ఉమ్మడివి !

## 23

నేను వేదాంతం చెప్పడం లేదు
వేదాంతం లోని వాస్తవం చెపుతున్నాను.

అహం బ్రహ్మాస్మి అనేది నిజమే ; అయితే
నేను పరమాత్మ నైనపుడు -
నేను పరమాత్మ కావడానికి షరతు లేమిటి ?

వరమిచ్చింది దేవుడు,
షరతులు పెడుతున్నది పూజారి !
తమాషాగా లేదూ ?

నీవు నమ్మేది దేవుడినా ?
పూజారినా ?
మెజారిటీ ప్రజలకు దేవుడు తెలియదు,
అన్నిటికీ వాళ్ళు నమ్ముకొనేది పూజారినే.

పూజారికి తెలుసునా దేవుడు ?
అతడికి తెలిసిం దొక్కటే -
దేవు డున్నా, చేయగలిగిం దేమీ లేదని !
అందుకే ఆ షరతులు, బేరాలు, రాజకీయాలు !

## 24

జాగ్రత్తు జీవితాన్నీ
స్వప్నం మరణానంతర స్థితినీ
సుషు ప్తి మోక్షాన్నీ సూచిస్తా యని
కొందరు పూర్వర్షుల ఊహ !
అది వట్టి ఊహే, సత్య దర్శనం కాదు.

ఈ మూడు అవస్థలూ జీవితం లోవే
శరీరం తోడివే
స్వతంత్రాలు కావు.

గుండె ఆగిపోతే –
జాగ్రత్తుతో పాటు స్వప్నమూ పోతున్నది,
సుషు ప్తీ పోతున్నది !

పోనీ, శాశ్వత సుషు ప్తే మోక్ష స్థితి అనుకొన్నా
అందులో కోరదగిం దేముంది ?

## 25

కోరవలసింది శాశ్వత సుషుప్తిని కాదు,
నిత్య జీవిత సందీప్తిని !
నిత్య జీవితానికి శరీరం ఆద్యం కనుక
శరీరాన్నే ఆత్మగా మార్చుకోవాలి !

కాలకృత్యాలు కరిగిపోయిన శరీరం
కాంతిగా మారి ఆత్మలో కలిసిపోవాలి !
అప్పుడది మృత్యువును జయించి
తానే పరమేశ్వరు డవుతుంది,

విశ్వ మయతను సాధించి
విశ్వ శ్రేయస్సును సమకూరుస్తుంది.

అయితే, అట్టి అద్భుతం మనకు దర్శన మిచ్చేది
కవితల లోనే, వాస్తవ జగత్తులో కాదు !

## 26

అనంతం కదా వేదాలు ?
అవి నిరంతరంగా, నిత్య నూతనంగా
వెలువడుతూనే వుంటై కదా ?

వేద ఋషులు నేడూ వున్నారు
కర్తవ్యబోధ చేస్తూనే వున్నారు,
భావ వైవిధ్యాలు, వైరుధ్యాలు కలిసి
సహజీవనం చేస్తూనే వున్నై !

పాత సూత్రాలనే కొత్తగా
ప్రచారం చేసేవాళ్లను పోనియ్,
సత్యాన్ని సూటిగా చూచి చూపించే
పరిణత మనస్కులను రానియ్ !

ఆదిలో తిరుగుబాటుగా భయపెట్టే భావాలే
అలవాటై ఆనందమిస్తై, గమనించు !
ప్రతి ప్రవక్తా తాను పుట్టిన మతంపై
తిరుగుబాటు చేసినవాడే, గుర్తించు !

## 27

వేదాల నుంచి తొలి వడపోత ఉపనిషత్తులు,
మలి వడపోత బ్రహ్మ సూత్రాలు,
మూడో వడపోత భగవద్గీత.

లోగడ పుట్టిన ఎన్నో మతాలకు
ప్రధాన మూలకం భగవద్గీతే అంటే -
దాని ప్రవచనం కూడ అసందిగ్ధంగా
అంతిమ నిర్ణయంగా లేదన్న మాటేగా ?

అంటే మరణానంతర జీవస్థితి గురించి
ఇంకా పరిశోధనలు జరిపే అవకాశం
ఆధునిక మేధావుల కున్నదన్న మాట !
ఈ విషయంలో ఎవరి మాటలైనా ఊహలే కనుక
నా ఊహలు కూడ తెలుసుకో !

బహు ముఖాల వేద వేదాంత వనాలలో
నా ఊహలు నిత్యవిహార మధుపాలు,
ఇంత కాలంగా చేస్తూ వస్తున్న ఋషుల ఊహల కంటె
నా ఊహలు పరమాత్మీయ సన్ని ధానాలు !

## 28

పారవశ్యం, తన్మయత్వం, తాదాత్మ్యం
అనబడే దంతా సచ్చిదానందమే ;
సత్ చిత్ సంయోగమే మనస్సు,
పారమాత్మిక మనోరమణమే ఆనందం.

మరణానంతరం మోక్షం పేరుతో
ఆత్మ పొందుతుందనే బ్రహ్మైక్య విభూతి ఇదే,
బ్రతికుండగా లభించగల ఈ సచ్చిదానందమే !
ధ్యానంద్వారా ఎవరైనా సాధించవచ్చు దీన్ని.

ఏకాగ్రతతో, ఏక లక్ష్యం కేసి
ముందుకు సాగడమే జీవితం ;
లక్ష్యం ఏదైనా, ఎలాంటిదైనా ఒకటే,
ప్రతిభా మనస్కమే ! ఆనంద సమాత్మకమే !

## 29

మనస్సును ఏకాగ్రం చెయ్యి,
ఏక లక్ష్యం కేసి నడిపించు ;
స్వేచ్ఛను అరికట్టకు,
స్వేచ్ఛ లేకపోతే లక్ష్యమే దొరక్కపోవచ్చు.

మానవుడు సాధించిన మహా విజయా లన్నీ
మనోరథాల స్వేచ్ఛావిహార ఫలితాలే !
సంప్రదాయం పాండిత్యం వంటిది,
సృజనకు కావలసింది నానాముఖ పర్యేషణ.

నియమ నిగ్రహాదులు స్వేచ్ఛను నియంత్రించడానికే,
నిరోధించడానికి కాదు ;
అపార్థాలు కల్పించుకొని
అభివృద్ధి నిరోధకుడివి కాకు !

## 30 పారమాత్మిక చిద్విలాసమే సృష్టి

జీవితం గురించి చెప్పేది వేదం,
జీవితాంతం గురించి చెప్పేది వేదాంతం.

జీవితాంతం గురించి, మరణం గురించి చెప్పి,
మరణానంతర జీవస్థితిని ఊహించి,
జన్మ కారణాలను నిర్ణయించి,
జన్మరాహిత్య మార్గాలను బోధిస్తుంది వేదాంతం !

మరణానంతర స్థితి గురించి ఎవరేది చెప్పినా
అదంతా కేవలం ఊహే, ఎవరి ఊహ వారిదే కనుక,
నీ ఊహను నీవే నిర్మించుకో !
వేదాంతానికి విజ్ఞానంతో సహపంక్తి లేదు,
వేదాంత సూత్రాలకు ప్రయోగశాలలో
గీటురాళ్ళు లేవు ! గుర్తుంచుకో !

## 31

విజ్ఞానుల పరిశోధనలలో వెలికి వచ్చి
మానవుడికి కైవస మువుతున్నె ప్రకృతి శక్తులు,
అవి వాస్తవాలు, నిర్దిష్టాలు.

వేదాంతుల మానసాలలోని హంసలు
తల కొక మానసం నుంచీ ఎగసి

వేటి కవే విహరిస్తున్నై
అవధుల్లేని అంతరీక్షాలలో !

అందుకే విజ్ఞానం ఫలించి చేతి కందుతున్నది,
వేదాంతం ఊహల్లోనే వుండిపోతున్నది.

## 32

సముద్రానికి పోటూ, పాటూ వున్నై ;
సముద్రం లోని జడశక్తి జాగ్రుతమ్మై
క్రియాశక్తిగా మారేది పోటులోనే.

పోటు ఆత్మ, దాని విన్యాసం జీవితం
జీవికి జీవితమే సత్యం, శివం, సుందరం !

పో టుబికే టప్పు డుండేది ఉత్సాహం,
శిఖర స్థాయిలో నిల్చి వున్నప్పటిది ఔజ్జ్వల్యం,
నిజంగా అదే రసానుభూతి !

ఈ అనుభూతి కోసమే పదే పదే బహుముఖాలుగా
పరమాత్మ తనను తాను సృష్టించుకొంటున్నది !
కనుక, జీవికి జీవితమే ఆదీ, అంతమూ
జీవితమే బ్రహ్మాభివ్యక్తి !

## 33

కనిపించే స్థూల శరీరం వలెనే ఆత్మకు
కనిపించని సూక్ష్మ శరీరాలు కూడ
వున్నాయంటారు కొందరు చింతకులు.

స్వర్గ నరకాలను అనుభవించడానికో
పునర్జన్మను పొందడానికో
పిశాచాలుగా ఆవేశించడానికో
కావాలిగా మరి ?

మానవుడా, నమ్మకు ! నమ్మకు !
మరణానంతరం కూడ ఆత్మ భౌతిక వాసనలతో
బ్రతికే వుంటుందన్న అపోహను సమర్థించడానికి
కల్పించబడినట్టివే ఇలాంటి వన్నీ.

తేరగా తిన మరగిన వేషగాళ్ళకు
ఇప్పు డివన్నీ వ్యాపార సాధనా లైనై !

## 34

గుణా గుణ, రూపా రూప, జీవా జీవ
పాంచ భౌతిక శక్తులన్నీ పారమాత్మికాలే,
శరీర నిర్మాణానికి అవన్నీ ముడి సరుకులు !

భూత పంచకం జ్ఞానేంద్రియ పంచకంగా
అనుభూతిని పొందింది మానవ తనువులోనే,
పరమాత్మ నిర్మించుకొన్న రకరకాల శరీరాలలో
నేటి వరకు ఉత్తమోత్తమం మానవ దేహమే !
తన ఆత్మ వినోదా లన్నిటికీ అనువైన దిదే ?

ఎన్ని బాధలూ, ఇబ్బందులూ, ఘర్షణలూ వున్నా, దీనిలో
అన్నింటికీ మించిన పూర్ణ జ్ఞాన రసానుభూతి వుంది.

అందుకే, చెపుతున్నాను, చూడు –
పరమాత్మ ఎన్ని రూపాలైనా ధరించవచ్చు గాక,
మానవాత్మగా తనను తాను చూచుకొన్న తర్వాత
మరొక దేహాన్ని వరించడం జరగకపోవచ్చు !

## 35

పరమాత్మ మానవాత్మగా
తనను తాను వ్యక్తీకరించు కొన్నదెందుకు ?
పరిపూర్ణ సాఫల్యం కోసం !
ఏమిటా సాఫల్యం ?
తనలో అవ్యక్తంగా పడివున్న గుణాలు
అంకురించి, పెరిగి, ఫలిస్తే
అనుభవించి ఆనందించడం కోసం !

ఆవేశమూ తానే, విజృంభణమూ తానే,
కర్మాచరణమూ తానే, ఫలాస్వాదనా తానే !
అయితే, అన్య జీవులలో అది అనుభూతం,
మానవుడిలో అనుభవజ్ఞం !
కనుక, పరమాత్మకు పూర్ణ స్మృతిలో
పూర్ణానందం అందివ్వ గలిగింది
మానవ శరీరం మాత్రమే !

## 36

ఆత్మకూ, పరమాత్మకూ నడుమ
నిత్య నిరంతర సంబంధం ఆవేశం !
ఆవేశం ఎంత ఎత్తుకు పెరిగితే
అంత అధికంగా పరమాత్మ
ఆత్మీభూత మయిం దన్న మాట !

ఆవేశాన్ని అదుపు చెయ్యాలి,
అరికట్ట గూడదు.
సమనర్గళంగా ఆవేశం
సన్మార్గంలోముందుకు సాగినప్పుడే
విశ్వశ్రేయం విస్ఫార గలదు.

ఆవేశం మరిగిన ఆవిరి నీహారాలే
ఆలోచనల అంతరాళ విహారాలు,
అధర్మాన్ని సహించని శక్తిగల ఆవేశ పరుడే
అవతార పురుషుడు !

## 37

జీవిత లక్ష్యాలను గురించి చెపుతారు కొందరు,
జీవితానికి ఏకైక లక్ష్యం సుఖం !
సుఖం స్వార్థనిష్ఠం, వ్యక్తిగతం ;
ఏ వ్యక్తి సుఖం ఆ వ్యక్తిదే,
సుఖం ఆత్మ సంబంధి !

లక్ష్యాలుగా చెప్పబడేవి ఆసక్తులు,
ఆసక్తి సహజ గుణ లక్షణం ;
దీక్ష, నేర్పు, తన్మయత, ఆనందం
ఆసక్తి తోడివే కనుక
ఎవడి ఆసక్తి వాడికి సుఖప్రదం.

వ్యక్తికొక సుఖం, కనుక
ఒకొక్క వ్యక్తిలో ఒకొక్క సుఖం చొప్పున
సమస్త సుఖాలనూ అనుభవించేదే
సచ్చిదానంద పరమాత్మ !

## 38

జ్ఞాన శక్తి ఆత్మది,
దాని జన్మగుణం తోడిది ఇచ్ఛా శక్తి,
క్రియా శక్తి మనస్సుది !
ఆత్మ సంకల్పం ఎంత దృఢంగా వున్నా
దానిని అమలు జరిపే మనస్సుకు స్థైర్యం లేకపోతే
జరిగే దేమీ వుండదు.

మనో రూపంలో స్వేచ్ఛగా విహరిస్తుంది ఆత్మ,
ఆత్మీయమైన మనో వ్యాపారా లన్నీ
పరమాత్మకు వాస్తవ అనుభవాలే.

నేటి ఆలోచనను రేపు కార్య రూపంలో పెట్టడానికి
మనస్సును నియమిస్తుంది ఆత్మ,
తన అనుభూతి కోసం మనస్సుకు
పూర్ణ స్వేచ్ఛా వేగాన్ని ప్రసాదిస్తుంది పరమాత్మ !

ఈ ఆత్మ పరమాత్మల విధి విలాసాల ద్వైధీ సేవనమే
ఏ మనో వైకల్యానికైనా మూల హేతువు !

## 39

ఒక సుందర దృశ్యాన్ని చూచినప్పుడు
ఒక సముచిత్తుణ్ణి కలుసుకొన్నప్పుడు
పూర్వం ఎప్పుడో చూచినట్టే వుంటుంది !
జన్మాంతర సౌహార్దం అనిపిస్తుంది !
అదంతా మన సంస్కారంలోని చమత్కారం !

పరమాత్మ ఒక గుణార్ణవం, భావార్ణవం ;
అందునుంచి అనుగుణాలను, సమభావాలను
గ్రహిస్తూ విహరించేది మనస్సు !
దేశకాలాలనుబట్టి వుంటుంది దాని ఆసక్తి,
ఆసక్తికి పాత్రాపాత్రతలు లేవు !

నీ మనస్సు నీ ఆసక్తి రూపం ధరిస్తుంది,
అదే నీ ముందు సాక్షాత్కరిస్తుంది –
నీకు నచ్చిన దృశ్యంగా,
నీవు మెచ్చిన దైవంగా !

అంతా ఒక చమత్కారం,
నీ మనో విక్రీడితం !

## 40

మానవుడా ! మనస్సును నిలుపుకోడానికి
నీ (ఆత్మ)కు శక్తి చాలడం లేదా ?
అదనపు బలం కావలసి వున్నదా ?
ఏ బలమైనా పరమాత్మ నుంచి రావలసిందే
కనుక, ధ్యానించు !

ధ్యానం, ప్రార్థన, తపస్సు, యోగం అన్నీ
ఆత్మ శక్తిని పెంచుకొనే ప్రక్రియలే,
పరమ శక్తిని చేదుకొనే చేదలే !
మంత్ర తంత్ర యంత్రాదులు కూడ అలాంటివే !

అందులో నీకు అనుగుణమైన ఒక సాధనతో
నీకు కావలసిన శక్తిని చేదు !
అదే నీ జీవిత విజయ రథసారథి !

## 41

పరమాత్మ ఒక తటస్థ శక్తి,
దాని ఇష్టమే జీవాంకురం,
ఆత్మగా వికసించి విరజిమ్మే రశ్మి మనస్సు !

ఆత్మ గుణాన్ని బట్టి వుంటుంది మనో వ్యాపారం
మంచిగానో, చెడుగానో !

నీ పుట్టుగుణంలో నెత్తురు మరకలో
చీకటి చారలో వుంటే కడిగేసుకో !
పరమాత్మకు గుణ తారతమ్యం లేదు,
ఆత్మోన్నతికి సౌమనస్యమే సర్వస్వమూ !

మామూలు మాటల్లో చెప్పాలంటే
మనస్సే సగుణ పరమాత్మ,
పనే జీవితం !
నీ ఇరుగు పొరుగు పట్ల నీవు ప్రదర్శించే
సౌహార్దమే నీ జీవిత విజయోత్సవం.

## 42

సృష్టికి పూర్వం ఏమీలేదు,
ఏమీలేని దానిలోనే అంతా వుంది !
ఏమి వుండి ఏమి లాభం
అనుభవానికి రానప్పుడు ?

అంతా వుండి ఏమీ లేని పరమాత్మ
అందుకే తనను తాను సృష్టించుకొన్నది !
ఏ ఆనందానికైనా కావలసింది అవకాశం
కనుక అదే సృష్టి కంతా అది భూత మయింది !

నిజానికి, సృష్టికి పూర్వమంటూ ఏం లేదు,
ఏదో ఒకటి వుంటూనే వుంటుం దెల్లప్పుడూ !
అవకాశం నిండా ఎన్ని విశ్వాలు !
విశ్వం నిండా ఎంత సృష్టి !

## 43

సమస్త సృష్టి తానే అయిన పరమాత్మ
సృష్టి లయాల నడుమ మన వైపు
తనతో తానే ఆడుకొంటున్నది
పూల తోటలో తుమ్మెదలా !
తోటలో ప్రతి పువ్వూ తానే
ఆ తుమ్మెదే మనస్సు !
తన ఆత్మ నుంచి వెల్వడిన
తానే అయిన మనస్సు !

మనస్సే పరమాత్మకు తుది రూపం,
ఈశ్వరుడు, దేవుడు మనోరూపాలు ;
ఊహలు, ఆలోచనలు, సంకల్పాలు, సిద్ధులు,
విశ్వ విశ్వాంతర పర్యవేక్షణలు అన్నీ
మనోవ్యాపారాలు ;
తానే మనస్సై వికసించిన
అభ్యుదయ సాధకుడే అవతార పురుషుడు !

## 44

పాంచ భౌతిక శరీరం విచ్ఛిన్నమై
దేని మూలకంలో అది చేరిపోగా
ఆత్మ మిగిలి వుంటుందను కోవడం అపోహ.

ఆత్మలన్నీ ఒకే పరమాత్మ బీజాంకురాలే అయినా
దేహాన్ని బట్టి దేని జీవితం దానిది,
దేహం పోయిన వెనుక ఆత్మకు వ్యక్తిత్వ్ం లేదు,
ఒక దేహి అనుభవం మరొక దేహిది కాబోదు.

దేహాని కంటిన ఏవేవో వాసనలు
దేహం పోయినా ఆత్మను పీడిస్తా యనడం
ఆనాడు అజ్ఞానం
ఈనాడు రాజకీయం !

## 45

జీరో బల్బు వెలుగు లోదీ కరెంటే
సెర్చి లైటు కాంతి లోదీ కరెంటే,
కరెంటు పోతే రెండూ పోతై.

రక రకాల బల్బులు ఈ మెదళ్ళు,
అవి వెలిగినంత సేపే వాటి కాంతులు,
వాటి పరిధులలోని కార్య కలాపాలు.

కార్య కలాపాలు బీజ గుణం తోడివి
వాటిని మార్చుకోగల శక్తి
మానవాత్మ కుంది, గుర్తించు !
సమాజ శ్రేయస్సును సాధిస్తూనే
నిజ వ్యక్తిత్వంతో పురోగమించు !

## 46

జీవాంకురం యొక్క సహజ స్వభావం
పెరిగి, తరిగి, తిరిగి పరమాత్మలో
కలసి పోవడమే కదా ? మోక్షమే కదా ?
అది ప్రకృతి కంతకూ సమాన ధర్మమే !
మానవాత్మకు పరమలక్ష్యం మోక్షమే అంటూ
ప్రచారం చేసే తత్త్వ బోధకు లంతా
నమ్మి చేస్తుంటే తమో గుణులు -
వృత్తిపరంగా చేస్తుంటే వంచకులు !

మానవాత్మ పుట్టింది మృత్యుం జయత్వం కోసం,
అది వికసించవలసింది అజరామరత్వం కేసి !
సత్వ తేజంతో రజస్తమస్సుల్ని నిర్జించి
అది సాధించవలసింది నిత్య జీవత్ జ్ఞాన శక్తిని !

## 47

బ్రహ్మ సత్యమూ, జగత్తు మిథ్యా కాదు
జగత్తు కూడ సత్యమే,
సత్యంలో పుట్టి, సత్యంలో కలిసి పోయే
క్షణిక సత్యం జగత్తు.

సముద్రం సత్యమూ, అలలు మిథ్యా కాదు
అలలు క్షణికాలు, అంతే !
సూర్యుడు సత్యమూ, కాంతి మిథ్యా కాదు
కాంతి ఒక నిరంతర కిరణాణు ధార !

నేను, నీవు, జగత్తు
పరమ సత్యాలం ! పరమాత్మలం !

## 48

ఏ పదార్థాలతో శరీరం ఏర్పడిందో
ఆ పదార్థాలలోకి అది తిరిగిపోవడం మరణం,
ఆత్మ తన మూల పదార్థంలో
తాను తిరిగి లయించి పోవడం మోక్షం.
భేదం పేర్లలోనే తప్ప
క్రియలో కాదు.

ఆత్మా, శరీరమూ కూడ ఒకే బ్రహ్మ పదార్థం
అది ఆకాశాది భౌతిక రూపాలు ధరించే కొలదీ
దానిలోని గుణాలు సాంద్రీభూత మవుతై.

నానా గుణ వర్ణ రస మూలకం బ్రహ్మ,
అవి వ్యక్తం కావడమే సృష్టి.

## 49

ప్రసవ వేదన వంటిదే మరణ వేదన,

ఒకటి రాకడ లోని రాపిడి

ఒకటి పోకడ లోని ఒరిపిడి.

నిజానికి –

జీవితమే ఒక నిరంతర వేదనా స్రవంతి !

వర్తమానంలోని ప్రతి క్షణమూ

గత క్షణాన్ని పెకల్చుకొని వస్తున్నట్టిదే !

జననం – మరణం రెండూ
జీవితానికి బొమ్మ బొరుసులు !
రెండూ కలిసిందే జీవితం, కాని
రెంటిమీదా దానికి కంట్రోలు లేదు !
కనుకనే –
మృత్యువును చూచి జీవి భయపడడం !

శరీరం కరిగి పోవడం మరణం
ఆత్మ కరిగి పోవడం మోక్షం.

రెండూ క్రమంగా పెరిగి పెరిగి
తిరిగి క్రమంగా తరిగి తరిగి
తమ తమ మూలకాలలో కరిగి పోయేవే,
రెండిటికీ మూలకం పరమాత్మే !

పరమాత్మ ఒక రసార్ణవం
గుణార్ణవం, ఆనందార్ణవం.
అచలం కాదది, నిత్యోల్బణం
శరీరాలు బుద్బుదాలు.

చలన శీలమైన అర్ణవంలో
జాగృతమైన బుద్బుదం తిరిగి
కరిగిపోతుంది అదే అర్ణవంలో.

## 51

సర్వ గుణ సంపన్నమైన
బీజాణువుల సమామ్నాయం పరమాత్మ,
బీజాణువే జీవాణువు, ఆత్మాంకురం.

అది మొలకెత్తి నప్పుడు, తనలోకి
తన మూల గుణాలన్నీ రావాలి,
అలా రానప్పుడు
తెచ్చుకొనే శక్తి మానవుడి కుంది,
ఇతర జీవులకు లేదు.

ఇచ్చా జ్ఞాన క్రియా శక్తులన్నీ
ఆత్మగా వికసించింది మానవుడి లోనే,
తాను కావాలనుకొన్నది కాగలిగిన శక్తి
ఒక్క మానవుడికే వుంది.

## 52

ముషిణికి విషమూ, మామిడికి రసమూ
ఒక మట్టి నుంచి వస్తున్నవే కదా ?
పరమాత్మలోని గుణశక్తులుకూడ
ఆత్మ కలానే సంక్రమిస్తై.

ముషిణి మామిడి కాలేదు,
క్రూరుడు సాధువు కావచ్చు !

సహజ గుణాన్ని మార్చుకోగల శక్తి
ఒక్క మానవాత్మకే వుంది.

అది గుణోపగుణ పూర్ణ బీజం కనుక
అక్కర లేని గుణాన్ని వదిలెయ్యగలదు,
కావలసిన గుణాన్ని చేదుకోగలదు –
నిరంతర మనోరమణం ద్వారా !
చీకటిని చిమ్మేస్తూ వెలుగును ఆస్వాదించే
ఏకాగ్రత ద్వారా !
యోగ సంయోగ సంకల్పం ద్వారా !

## 53

శరీరా లన్నిటా ప్రవహించే జీవధార
ఒక్కటే, నిజమే కాని -
అది ఒక శరీరాన్ని నిర్మించుకొన్న తర్వాత
వ్యక్తిత్వం పొంది నేను అవుతున్నది.

శరీరాలు ఎన్ని వున్నాయో
నేనులు అన్ని వున్నై,
ఏ నేనుకు ఆ నేను సర్వ స్వతంత్రం !

అహం పెరిగేకొలదీ ప్రతి నేనూ
తానే పరమాత్మగా ప్రవర్తిస్తుంది,
అనాసక్త నేనులపై సహజంగానే
పెత్తనం చెలాయిస్తుంది !

## 54

వ్యక్తమైన పరమాత్మే ఆత్మ,
ఆత్మ పొందిన వ్యక్తిత్వమే శరీరం.
శరీరం పోతే వ్యక్తిత్వమూ పోతుంది,
వ్యక్తిత్వం పోయిన ఆత్మ పరమాత్మే అవుతుంది.

కరిగి పోయిన నీటిబుడగ నీరే,
మట్టి కుండ మట్టే,
పంచదార చిలుక పంచదారే !

పరమాత్మ నుంచి ఆత్మ
ఆత్మ నుంచి శరీరం క్రమంగా
చిక్క బడుతూ వచ్చిన ఒకే పదార్థం,
నిర్గుణం సగుణమైన పరిణామం !

## 55

బల్బు వున్నంత వరకే కాంతి
బల్బు పోయినా కాంతి పోతున్నది
కరెంటు పోయినా కాంతి పోతున్నది.

ప్రమాదం, వ్యాధి, వృద్ధాప్యం
దేనివల్ల నైనా దేహం పోవచ్చు,
పారమాత్మిక చేతనా తరంగాల
నిత్యఘర్షణ వల్ల జీవం పోవచ్చు.

దేహం పోయినా ఆత్మ పోతున్నది
జీవం పోయినా ఆత్మ పోతున్నది !

ఆత్మ పోవడం అంటే
అది తిరిగి పరమాత్మ కావడమే,
మధ్యవర్తిత్వం ఏదీ లేదు.

## 56

సముద్ర జలమూ, ఉప్పుకయ్య నీరూ ఒకటే కాని
సముద్రం అపరిమితం, ఉప్పుకయ్య పరిమితం.
సూర్యరశ్మీ, దీప కాంతీ ఒకటే కాని
దీపం సూర్యుడు కాదు.

చెట్టు ఒక్కటే
విత్తనాలు అసంఖ్యాకం,
విత్తనాలు ఒక చెట్టువే అయినా
ఏ విత్తనం బ్రతుకు ఆ విత్తనానిదే !
పరమాత్మ ఒక్కటే అయినా
ఏ ఆత్మ వ్యక్తిత్వం ఆ ఆత్మదే !

## 57

మానవునిలోని అన్నమయ ధ్రుతులు
ప్రాణమయ శక్తులు, మనోమయ సిద్ధులు
అన్నీ పరమాత్మ నుంచి వచ్చినట్టివే.

ఒకే మట్టిలోని పలు రకాల వనస్పతుల వలె
బహుముఖాలుగా పొడచూపే అభివ్యక్తు లవి.

నిరంతర చలనాత్మక చైతన్యంలో
పరిస్ఫుటించే బీజాంకురాల ప్రవృత్తులవి,

అవి ఏ క్రమంలో అంకురించి వికసిస్తాయో
అదే క్రమంలో అంతరిస్తాయి !
ముందు మనస్సు, తర్వాత ప్రాణం, దేహం.

## 58

మనస్సు కోతి అన్నారు - చపలం, చంచలం కనుక ;
లోకోత్తర శక్తికలదే అయినా
పరాధీనమై వున్నందున హనుమ అన్నారు.

అయితే, ఇక్కడొక సత్యాన్ని మరిచారు -
మనస్సుకు గల ఆ చాంచల్య గుణమే
దానికి సృజన శక్తి నిచ్చింది !
దానిని ఆత్మకు కట్టి వుంచే ప్రయత్నం వల్లనే
మానవ ప్రగతి మందగించింది !

మానవుడా ! దృక్పథం మార్చుకో !
రూపకల్పన లేకుండా ఊహించ లేకపోతే
ఆత్మను పరమశివు డనుకో ! అప్పుడు
మనస్సే పరాశక్తి !

## III నీ గుణమే నీవు

మోక్షం లభించాలంటే ముందుగా
నిన్ను నీవు తెలుసుకోవా లంటుంది వేదాంతం,
నిన్ను నీవు తెలుసుకోడానికి
నియమ నిష్ఠ లనేకం విధిస్తున్నది,
మోక్ష ప్రాప్తికి షరతులు పెడుతున్నది !

మోక్ష ప్రాప్తికి ఏ షరతూ
అక్కర లే దంటున్నాను నేను,
నీవు వద్దనుకున్నా నిన్ను విడిచిపెట్టని
సహజ జీవ పర్యవసానం మోక్షం !

నిన్ను నీవు తెలుసుకోవడం అంటే
నీవే పరమాత్మవుగా తెలుసుకోవడం ;
అదే జ్ఞానం, ఎరుక !

నిన్ను నీవు తెలుసుకోవడం అవసరమే ;
అయితే, అది మోక్షం కోసం కాదు
జీవిత నిర్వహణలో పాటవం కోసం.

## 60

నీవే పరమాత్మవుగా తెలుసుకోవడం అంటే
తాను మట్టినే అని కుండ తెలుసుకోవడం, అంతే !
సన్యాసులు చెప్పే బ్రహ్మానుభూతి
కేవల మనో నైచ్చల్యం మాత్రమే !

పరమాత్మ బహు గుణాత్మకం,
బహు పదార్థ మిశ్రమం.
అందులో నీలోకి ప్రధానంగా వచ్చిన
గుణ మేదీ ? పదార్థ మేదీ ?

నీ వెవరో తెలిసిన తర్వాత
నీ వేమిటో తెలియాలి,
నీ పరిసరాలు తెలియాలి,
నీ దేశ కాలాలు తెలియాలి.

ఈ తెలివి తేటల వెలుతురులో సాగినప్పుడే
జీవితం విజయవంత మవుతుంది.

## 61

ఒకడు తాను బంగారం అనుకొన్నాడు !
అవు నన్న వాళ్ళను అభిమానిస్తూ,
కాదన్న వాళ్ళను కంటగించుకొంటూ,
తిరుగులేని చెలామణీ కోసం
పదవినీ, పరపతినీ వాడుకొంటూ,
మూడు లోకాలూ తిరిగాడు
ముసలివా డై పోయాడు !

అప్పుడు తెలిసిం దతడికి
తాను బంగారం కాదనీ, రాగి అనీ ?
ఆ వాస్తవాన్ని చిన్నప్పుడే తెలుసుకొని వుంటే
అంత జీవితం వ్యర్థమై వుండేదికాదు కదా !

## 62

నిన్ను నీవు తెలుసుకోవలసింది
జీవిత ప్రాంగణం లోనే,
నిష్క్రమణ ద్వారం వద్ద కాదు.

బంగారం కంటె రాగి తక్కువదేం కాదు
దేని ప్రయోజనం దాని కుంది.

రాగిని బంగారంగా చెలామణి చెయ్యడానికి
యత్నించి విఫలం కావడం కంటే
రాగితోనే వ్యాపారం చేసి
బంగారం సంపాదించవచ్చు కదా !

అందుకే, నీ జీవిత ప్రాంగణంలోనే
నిన్ను నీవు తెలుసుకోవలసి వుంది.

## 63

పరమాత్మ నుంచి తనలోకి వచ్చిన గుణాలలో
ప్రధాన గుణం ఏది ?
జ్ఞానార్జన, ధన సంపాదన, రాజ్యపాలన
వంటి కళలలో ఏ కళ వైపు
తన మనస్సు ఆకర్షించబడుతున్నది ?
తాను ఎంచుకొంటున్న జీవిత మార్గం
తన గుణానికి తగి వున్నదా ?

బ్రతుకు గడపలో అడుగిడుతున్నప్పుడే
ప్రతి వ్యక్తీ తెలుసుకోవలసిన
ప్రాథమిక సంగతు లివి !

ప్రవృత్తికి తగిన వృత్తి లభించి నప్పుడే
తన జీవితం తన దవుతుంది.

## 64

సమస్త గుణ సంపన్నమైన పరమాత్మ నుంచి
ఏదో ఒక గుణం వికసిస్తుంది నీలో ;
అదే ఆ వికాసమే ప్రజ్ఞ, ప్రతిభ, ధీ శక్తి, ప్రాభవం.

ప్రతి గుణమూ అవసర మైనట్టిదే,
మితిమీరి ప్రకోపించి నప్పుడే అది దోషం అవుద్ది.

ఒకొక్క వ్యక్తిలో ఒకొక్క గుణవికాసం
ఒకొక్క క్షేత్రంలో ఒకొక్క పుష్కల ఫలసిద్ధి.

అందరి కృషీ, అన్ని ఫలితాలూ కలిసి
అందరికీ ఉమ్మడి సంపద,
ఉమ్మడి సంపదే విశ్వ శ్రేయస్సు.

## 65

ఒకడు తన గత జన్మను వర్ణిస్తే
మరొకడు తన వచ్చే జన్మను సూచిస్తాడు !
అవన్నీ మనస్సు చేసే కోతి చేష్టలు,
ఆధ్యాత్మిక విక్రీడలు !

పరమాత్మ నుంచి ఒకొక్క ఆత్మాంకురం లోకి
ఏవేవో విపరీత గుణాలు రావచ్చు,
అద్భుతాలు ప్రదర్శించవచ్చు !

కాసులు సృష్టించి ప్రేక్షకులపై చల్లే గారడీడు
తిండి కోసం పైస లడుక్కుంటాడు !
తానే దేవుణ్ణని చెప్పుకొనే మఠంసన్యాసి
ఆక లైనప్పు డెల్లా వాకిట్లో నిలుస్తాడు !

కనుక, మానవుడా !
ఎవ రెన్ని వేషాలు వేసినా, ఎన్ని నీతులు చెప్పినా,
ఎన్ని మహిమలు చూపినా, లక్ష్యం ఒక్కటే -
క్షుద్బాధ నుంచి మోక్షం !
అందుకోసం వేట !
గుర్తుంచుకో !

## 66

నీవు ధనం గడిస్తావో, ధాన్యం పండిస్తావో
కవిత్వం చెపుతావో, కర్ర పెత్తనం చేస్తావో
వ్యాపారం నడుపుతావో, వినోదాలు చూపుతావో
ఏదైనా ప్రతిభ తోడిదే
పరమాత్మకు చెందినట్టిదే
పరస్పరం పంచుకోవలసి నట్టిదే.

నీ పొలంలోని ధాన్యాలూ
నా తోటలోని కూరగాయలూ కలిసి నప్పుడే
అది సంపూర్ణ భోజనం అవుద్ది,
నీవు వస్త్రం నేయడం
నేను ధరించడం కోసమే !

నీ ధనంపై నాకు, నా కవితపై నీకు
సమాన హక్కులే వున్నై,
మన ప్రతిభ పారమాత్మికం,
మన కృషి ఫలితానికి మనం ధర్మకర్తలం !

## 67

ప్రతి జీవీ జీవించడానికే పుడుతుంది,
జీవించా లనే కోరుకొంటుంది.
జీవించనీ ! దాని జోలికి నీవు వెళ్ళకు !
ఏదైనా నీ జోలికి వస్తే, సహించకు ?

శీలం, సంప్రదాయం, ఆచారం, అభిజాత్యం
అన్నీ సంఘు మర్యాదలు, సృష్టిధర్మాలు కావు,
జీవించడం ఒక్కటే సృష్టి ధర్మం;
నైజగుణం ఒక్కటే జీవి వ్యక్తిత్వం !

దేశ కాల పాత్రలను బట్టి
సంఘు మర్యాదలు మారుతూ వుంటై,
పేరు గలవాడి నోరూ, పుష్టి గలవాడి ముష్టీ
వాటిని పాలిస్తూ వుంటై.

సృష్టి ధర్మాలకు కృతక మర్యాదలు అడ్డుతగిలితే
ధిక్కరించి ముందుకు సాగు !
అప్పుడే నీ ప్రతిభ పరమేశ్వరీయ మవుతుంది,
జీవి వికాసానికి త్రోవ చూపే దవుతుంది !

## 68

మానవ సమాజం ఒక గ్రంథాలయం,
ప్రతి మానవుడూ ఒక గ్రంథం !
పెద్దదో, చిన్నదో, మంచిదో, చెడ్డదో
నవలో, నాటకమో, కావ్యమో, శాస్త్రమో
ప్రతి మానవుడూ ఒక గ్రంథం
ప్రతి గ్రంథానికీ ఒక సెల్ఫు (షెల్ఫు).

అందుకే, మానవుడా !
నీ సెల్ఫేదో నీవు చూచుకో,
ఇరుగు పొరుగుల జోలికి వెళ్ళకు !

తనకు తాను బృహద్గ్రంథ మైనవాడే
పొరుగు గ్రంథానికి చెదపురుగు కావచ్చు !

కనుక, జాగ్రత్త !
నీవు మాత్రం చెదపురుగువు కాకు !
మరొకర్ని చెదపురుగు కానీకు !
నీ సెల్ఫును నీవు రక్షించుకో !

## 69

దోమ చస్తే ఎంతో
దొర చచ్చినా అంతేనా ?
అంతే అనడానికి మన స్వాప్పడం లేదు !

పుణ్యానికీ, పాపానికీ, ప్రాభవానికీ, దాస్యానికీ
జ్ఞానానికీ, అజ్ఞానానికీ ఒకటే ముగింపా ?
అవు నని ప్రకటిస్తూనేవుంది మృత్యువు !
మనస్సే అంగీకరించడం లేదు !

పేదల, సామాన్యుల గమ్యాల నుండి
తమ గమ్యాలను వేరు చేసుకోవడానికి
గొప్పవార మనుకొనేవారి మనస్సు
నానా తంటాలూ పడుతోంది !

గత్యంతరా లనేకం వూహిస్తోంది !
నీతి కథలు చెపుతోంది,
నియమ నిష్ఠలు పెడుతోంది !
అది దాని సంస్కార దోషం,
సంప్రదాయ వ్యూహం !

## 70

ఆకు రాలినా, పువ్వు రాలినా
ఆకాశం నుంచి చుక్క రాలినా
కలిసేది మట్టిలోనే
చేరేది ఒకే అజ్ఞాతం లోకి.

కనుక, మానవుడా !
గుర్తించు వాస్తవాన్ని –
చిన్నదీపం ఆరినా, పెద్దజ్యోతి ఆరినా
పర్యవసానం చీకటే !
పులిని మనిషి తిన్నా
మనిషిని పులి తిన్నా
తీరే ఆకలి ఒకటే !

కనుక, దోమ చస్తే ఎంతో
దొర చచ్చినా అంతే !

## 71

జీవితం వెలుగు, మరణం చీకటి ;
సుఖమో, దుఃఖమో, రాగమో, భోగమో
తెలిసేది వెలుగు లోనే !

చీకట్లో ఏ ముందో తెలియదు
అసలు అ దేమిటో కూడ తెలియదు,
మరణం అంటే భయం అందుకే !

ఇంత సుందరమైన ప్రపంచాన్ని వదలుకొని
తెలియని ఒక అగాధంలోకి పోవడానికి
ఏ మనస్సు ఒప్పుకొంటుంది ?
అందుకే –
ఎంత యాతన నైనా భరిస్తుంది గాని
మరణించడానికి కొప్పుకోదు మనస్సు !

అందుకే – మరణం తప్పనిది కనుకనే –
మరణా నంతరం కూడ బ్రతికే
వుంటానులే అని తృప్తిపడుతోంది !

## 72

మరణించేది శరీరం మాత్రమే ననీ
ఆత్మకు చావు లేదనీ ఒక అందమైన
ఆశను కల్పించుకొన్న మనస్సు
మరణానంతర జీవితం కోసం
కట్టుకొన్న మేడలు ఇన్నీ అన్నీ కావు !

ఆ పరలోకాల మేడల్లో
ఎని స్వర్గాలు, ఎన్ని నందనాలు !
ఎందరు రంభలు, ఎందరు నలకూబరులు !
ఎన్ని కామధేనువులు, ఎంత అమృతం !

అదంతా నిజమేనని నమ్మించడానికి
ఎన్ని కథలు, పురాణాలు ! ఎన్ని సిద్ధాంతాలు !
ఎంత గ్రంథం, ఎంత రంధి !

## 73

యజమానికీ, సేవకుడికీ
కోటీశ్వరుడికీ, బిచ్చగాడికీ
చంపిన వాడికీ, చంపబడిన వాడికీ
ఒకే పరలోకమా ?

అలా వీల్లే దన్నారు బలవంతులు !
ఇక్కడ లాగే అక్కడ కూడ
పెత్తనం తమకే వుండా లన్నారు !
ఇక్కడ బలహీనుల నెత్తురుపై వలనే
అక్కడ దేవుడి అమృతంపై కూడ
జన్మహక్కు తమదే నన్నారు !

ఫలితం –
ఇక్కడి నిరంకుశ ప్రభు వ్యవస్థే
అక్కడ కూడ ఏర్పడడం !
మంత్ర తంత్రాలు, యజ్ఞయాగాలు, బలిదానాలు
పాదపూజలు, ప్రార్థనలు వంటి వన్నీ
స్వర్గానికి నిచ్చెన లై పోవడం !

## 74

నరక భీతి, స్వర్గాశ, మోక్ష కాంక్ష,
జన్మకు కారణం కర్మే అనే విశ్వాసం,
ఇవన్నీ అల్పజ్ఞుల అపోహలే కావు –
స్వార్థ పరుల దుస్తంత్రాలు కూడ.

దేవుడు, మతం, ఆచారాల పేర్లతో
పామరుల్ని రెచ్చగొడుతున్నారు,
ఆర్థిక రాజకీయ ప్రాబల్యం కోసం
పరమార్థాన్ని వెచ్చబెడుతున్నారు !

"సంసారం సాగరం దుఃఖం" అని నమ్మిస్తూ
జన్మరాహిత్యం కోసం
జనమేధాలు నిర్వహిస్తున్నారు !
పర లోకాలకు టిక్కెట్లిస్తూ
పదవులకు వోట్లు పుచ్చుకొంటున్నారు !

## 75

తాను పులిపిల్ల నని తెలిసినా, తెలియకున్నా
పులిపిల్ల పులిలాగే వర్తిస్తుంది,
తాను పరమాత్మ నని తెలిసినా, తెలియకున్నా
ఆత్మ పరమాత్మ వలెనే ప్రవర్తిస్తుంది.

బహురూపి అయిన సృష్టిలో
విభిన్నమైన ఆత్మల తిరునాళ్లలో
స్వప్రతిష్ఠ కోసం యత్నిస్తుంది ప్రతి ఆత్మా.

స్పర్థలు, ఘర్షణలు, విజయాలు, వైఫల్యాలు
ఆ సమ్మర్దంలో తప్పవు !
ఏకాగ్ర కృషితో విజయం సాధించే ఆత్మ
లోకోత్తరమైన మహాత్మ అవుతుంది.

## 76

తాను మానవుడి ననుకొంటే చాలదు
మానవతను వికసింప జేసుకోవాలి.

తాను పరమాత్మ ననుకొంటే చాలదు
పరమాత్మ గుణాలలో ఒక దాని నైనా
పూర్తిగా తనలోకి తెచ్చుకోవాలి.

"పరమాత్మ నిర్గుణ పరబ్రహ్మ కదా
దానికి గుణా లేమిటి ?" అంటుంది వేదాంతం !
నేటి వరకు అదే వేదాంతం, అయితే
ఏ వేదాంతమూ నిర్ధారిత పరమ సత్యం కాదు.

బీజంలో లేనిది దేహంలోకి రాదు,
పరమాతము నిర్గుణం అయితే
ఆత్మ సగుణం ఎలా అవుద్ది ?

## 77

వర్షం కురిసి నప్పుడు ప్రతి చినుకుకీ
నదిగా ప్రవహించే అవకాశం వుంది,
మరి ఎన్ని చినుకుల కది లభిస్తున్నది ?

కొన్ని ఆకాశం మధ్యలోనే
కొన్ని క్రింద పడిన వెంటనే
కొన్ని చిరువాగులైనా కాక పూర్వమే
తిరిగి ఆవిరై పోతున్నై కాదా ?

చెరువుల్లో పడిన వాటి కైతే
ప్రవాహ కాంక్ష కూడ తీరదు !

శక్తులలో, సైజులో నానాత్వమే
ఆనంద సుందరంగా భాసించే ప్రకృతిలో
ఆత్మ పూర్ణా విష్కారం కోసం
స్వయం కృషి తప్పనిసరి.

## 78

శరీర లాఘవాన్ని పెంచుకొంటే
గొప్ప వస్తాదువు కాగలవు,
మనో లాఘవాన్ని అలవరచుకొంటే
గొప్ప బాబావు కాగలవు,
అట్టి లాఘవాలకు రాజసమో, తామసమో తోడైతే
గొప్ప రాక్షసుడివే కాగలవు !

చీకటి నుంచి వెలుగులోకి
వెలుగు నుంచి విశ్వాత్మ లోకి
వికసిస్తున్న జీవాంకురానికి
ఇప్పు డిక రాక్షసత్వంతో పనేముంది ?

ఆత్మ లాఘవంతో సత్యాన్ని ఛేదుకొని
ఆదిత్య హృదయుడివే ఎందుకు కావు ?

## 79

మహాత్మ, దురాత్మ, పుణ్యాత్మ, పాపాత్మ అంటూ
మనం ఆత్మకు ఆపాదించే గుణాలు
ఆత్మవి కావు, సాంఘిక వ్యక్తిత్వాలవి.

మంచి చెడ్డ లనేవి ఆత్మవి కావు
మానవ సామాజిక దృక్పథానివి శ్రీ!

సత్ – చిత్, ఆనందం – రసం, స్థిరం – వేగం
వంటి వివిధ స్థితుల అద్వైతంగా
అనంత గుణ సమాశ్రయ మైవున్న పరమాత్మ నుంచి
ఏ గుణా న్నైనా చేదుకోవచ్చు ఆత్మ !
రాక్షసత్వం చెడ్డ దనడం లేదు నేను,
దాని వల్ల ప్రయోజనం లే దంటున్నాను !

## 80

దేహ కౌశలాన్ని పెంచుకొని
సర్కసు ఫీట్లు చెయ్యవచ్చు,
మనస్సును మచ్చికచేసుకొని
మహిమలు ప్రదర్శించ వచ్చు,
బ్రహ్మరంధ్రాన్ని భేదించుకుపోవచ్చు,
జీవ సమాధి సిద్ధినే సాధించవచ్చు.

ఎన్ని సిద్ధులైనా
జీవిత ప్రసిద్ధి కోసమే,
ఎంత గొప్ప తనమైనా
గొప్పగా బ్రతకడం కోసమే !

అందుకే, సత్వగుణాన్ని పెంచుకో !
సాధు యోధుడవై నిలబడు !
లోకం లోని ప్రతి మనిషికీ
ఉపాధి ఉచితంగా లభించే ప్రణాళికలో
సమసమాజ నిర్మాణానికి నడుం కట్టు !

కనీ సావసరాలకు గ్యారంటీ వుంటే
కర్కోటకు డెందు కవుతాడు మనిషి ?

## 81

ఇదిగో, వేదాంత రహస్యం చెపుతున్నాను -
ఉన్నత విద్యాభ్యాసం ప్రారంభించే ముందు
ప్రతి యువకుడూ ఉపనయనంగా
గ్రహించ వలసిన రహస్యం ఇది.

మోక్షం సహజ సిద్ధం,
మోక్షం కోసం ఏ వ్యక్తీ
ఎట్టి ప్రయత్నమూ చెయ్యక్కర లేదు.
చెయ్య వలసిన కృషి అంతా
జీవిత వికాసం కోసం.

నీ స్వభావ మేమిటో, నీ సామర్థ్య మేమిటో
నీ కెలాంటి పనుల పట్ల ఆసక్తి వుననదో
ముందుగానే తెలుసుకో !
అదే నిన్ను నీవు తెలుసుకోవడ మంటే !
అదే అపరోక్షజ్ఞాన మంటే !

## 82

ఉన్న దొక్కటే నేను,
నా బైట గల నేనువే నీవు,
నా చుట్టూ బహు నీవుల వృత్తాలే జగత్తు,
పరమాత్మ నుంచి నా – నీ – మన
రాకపోకల వృత్తాంతమే ఈ నా వేదాంతం !

రాకపోకలు ఎవరి అధీనంలోను లేవు
వాటిని గురించి బెంగపడడం వ్యర్థం,
రాకడ ఎంత సహజమో
పోకడ అంతే సహజం.

రాకడ ద్వైతం, పోకడ అద్వైతం,
ఆ నడుమ జీవితమే రసాద్వైతం !
ఆత్మార్పణ, ఆరాధన, అనుభూతి యోగం అది ;
జీవిత పరమార్థం ఆనంద పారవశ్యం !

## 83

ధర్మం, అర్థం, కామం, మోక్షం -
జీవితానికి ఇవి చతుర్భుజాలే,
సామం, దానం, భేదం, దండం
ఇవి నాలుగూ శాంతి సాధనాలే.

యాత్రలో ఎదురయ్యే అవరోధాలను
ఈ ఉపాయాలతో తొలగించుకొంటూ,
అఖిల భూతాలలోను
ఆత్మ రూపాలను దర్శించుకొంటూ,
సర్వ జీవుల పట్ల స్వపర భేదం లేని
సమ హితత్వం నెరపుకొంటూ
పురోగమించడమే మానవ ధర్మం.

చివరి మజిలీగా చెప్పబడ్డ మోక్షాన్ని కూడ
అధిగమించి జీవించడం ఆత్మయోగం,
దాని సిద్ధే మృత్యుంజయత్వం !

మానవాత్మకు పరమ లక్ష్యం
నిత్య ప్రవృత్తి, నివృత్తి కాదు !

## 84

పారమాత్మిక లీలా లాలిత్యాలే ఏ కళ లైనా,
ప్రవృత్తికి తగిన పనిలో ప్రావీణ్యమే కళ అంటే ;
ప్రవృత్తి, ప్రజ్ఞ, ప్రతిభ మెదడు తోడివి,
మెద డొక కంప్యూటరు.

అయితే, అది స్వయం చోదితమా ?
దూర ప్రచోదితమా ?
రెండూను !
దూరానికీ, దగ్గరకూ తేడా లేనిది పరమాత్మ !
స్ఫూర్తికే కాదు –
ప్రేరణకూ అదే ఆది మూలం !

నీవు చేసే ప్రతి పనీ కళగా విరిసినప్పుడే
నీవు చూచే ప్రతి వ్యక్తీ కాంతిగా ప్రకాశించేది !

## 85

ఇదిగో, నేను చెపుతున్నాను, విను !
మరణం తర్వాత మిగిలే దేం లేదు.
ఆత్మ మిగులుతుం దనేది వూహ,
వాస్తవం కాదు.

దేహంతో పాటు ఆత్మ కూడ పోతున్నది !
దీపం ఆరినట్టు, అల నీరైనట్టు
అవ్యక్తమై పోతున్నది,
అనంతాత్మలో కలిసి పోతున్నది !

అదే మోక్ష మంటే,
దాని కోసం ఏ ప్రయత్నమూ అక్కరలేదు,
అసలు దాని స్పృహ అక్కర లేదు !

మోక్షం నీ జన్మ హక్కైతే
జీవితం నీ సంకల్ప సిద్ధి !
నీవు చెయ్యవలసిన ప్రయత్నమంతా
సంపూర్ణ జీవిత వికాసం కోసం.

## 86

కాకిపిల్ల కాకికి ముద్దు
పంది జన్మ పందికి హాయి !
జన్మలో నీచా లనీ, ఉత్తమా లనీ లేవు,
దేని జన్మ దానికి పరమోత్తమం !

ఉత్త మాధము జన్మలు పుణ్యా పాపాలకు
కారణా లనడం అజ్ఞానం,
తన జన్మ అధమ జన్మ అని
ఏ పందీ అనుకోదు, గమనించు !

కనుక, మానవుడా !
పూర్వ జన్మ కర్మ అనే దేం లేదు
జన్మ పారం పర్య సూత్రం ఒక అపోహ.
ఏ జన్మకైనా మరణమే ముగింపు,
ప్రతి ముగింపూ పరమ లయమే.

## 87

పరమాత్మ ఒక జీవాణు మహార్ణవం,
జీవబ్రహ్మైక్యం ఒక నిత్య కార్య కలాపం.
పదార్థంలోని పరమాణువులలో
ఏ అణువూ స్వయం స్వతంత్రం కాదు.
మంచి చెడ్డలు సామాజిక దృక్పథానివి,
కర్మకు మంచి చెడ్డలు లేవు,
కర్మ జీవక్రియ, జీవధర్మం.

జీవధర్మమే ఆ జీవి వ్యక్తిత్వం,
వ్యక్తిత్వం వినా జీవిలేదు,
ఈ రెండూ ఒకటే, వేరు వేరు కావు ;
మరి, జీవధర్మం జీవినే ఎలా బంధిస్తుంది ?
చావు పుట్టుకల పౌనః పున్యం వట్టి అపోహ,
నమ్మకు దాన్ని.

## IV ప్రాంతీయ నాయకుడే దేవుడంటే

దేవుడంటే ఎవరో
అత డెక్క డుంటాడో, ఎలా వుంటాడో
ఆనాటి జ్ఞానులకూ తెలియదు,
ఈనాటి విజ్ఞానులకూ తెలియదు !

పుడుతున్న దేమిటో, ఎందుకు చస్తున్నదో
చస్తూ దేహం నుంచి పోతున్న దేమిటో
ఎక్కడికి పోతున్నదో, ఏమై పోతున్నదో
తెలియదు, ఎవరికీ తెలియదు !

ఎందరో ఎన్నో చెపుతారు
అన్నీ వూహలు !
బ్రతికి వున్న వాళ్ల వూహలు,
చచ్చిన వాళ్ల స్వానుభవాలు కావు !

## 89

మానవాత్మ ఇంకా శైశవ దశలో వున్న కాలంలో
పాంచ భౌతిక శక్తులు, రుగ్మతలు, ఘటనలు,
జరా మరణాలు ఎన్నెన్నో
అర్థం గాక భయపెడుతున్న రోజుల్లో
మానవుడు ఆత్మ రక్షణ కోసం
కల్పించుకొన్న ఇలవేల్పు దేవుడు !

వ్యక్తి కొక వూహ, వూహ కొక కల్పన,
కుటుంబాని కొక ఇల్లు, ఇంటి కొక దేవుడు !
దేవుడు మానవుడి వ్యక్తిగత ఆస్తి !
సామూహిక సంపత్తి కాదు !

ఎవరి ఊహో కల్పించిన దేవుడు
నీ సొంత దేవు డెలా అవుతాడు ?
కాడు, కాగూడదు !
దేవుణ్ణి సామూహికం చెయ్యడం
సొంత ఊహను చంపి వెయ్యడమే.

## 90

పరమాత్మ అవగాహనకు అతీతం కనుక
దేవుణ్ణి సృష్టించుకొన్నాడు మనిషి,
ప్రపంచంలో ఎన్ని భాష లున్నాయో
అన్ని పేర్లు, అన్ని రూపాలు వున్నై దేవుడికి.

మనిషికి చిన్నప్పటినుంచీ దేవుడు
ఏ రూపంలో పరిచయ మయ్యాడో
ఆ రూపంలోనే కనిపిస్తుంటాడు కనుక
తన దేవుడే అసలు దేవు డనుకొంటాడా మనిషి !

దేవుణ్ణి సృష్టించింది మనస్సు,
మనస్సు కొక మాదిరిలో కనిపిస్తాడు దేవుడు ;
ఈ వాస్తవం తెలిసినవాడు జ్ఞాని
తెలియనివాడు మతోన్మాది.

కనుక, మానవుడా !
దేవు డొక ఊహ,

అతడివల్ల జరిగే దేం లేదు ;
నీ శక్తి నీ మనస్సే, పోషించుకో !

## 91

మానవుడు దేవుణ్ణి సృష్టించుకొన్న దెందుకు ?
తాను ఎంతవరకు ఎదగవలసి వున్నదో గుర్తు కోసం !
మరి ఇంతవరకు ఎదిగిం దెంతవరకు ?

తిండిని వెతుక్కొంటూ
పరిసరాలతో పోటీ పడుతూ
ఎక్కడి వా డక్కడే కుంచించుకుపో లేదా ?
దేవుడు ఒక ఆదర్శ లక్ష్యమూర్తి
మానవుడు కల్పించుకొన్న ఒక సుందరశిల్పం
దాన్ని పరమాత్మగా భ్రమించరాదు.

పరమాత్మ సార్వజనిక సర్వాంతర్యామి,
సర్వ జీవ బీజ క్షేత్రం !
దేవుడు వ్యక్తిగ తాదర్శం,
ఎవడి ఆదర్శం వాడిది.
ఆదర్శం అందుకోడానికి,
ఆరాధిస్తూ కూర్చోడానికి కాదు.

## 92

కాలం గడిచే కొలదీ –
బలం కలవాడే రాజు అనే పంథాలో
రాజు కొల్చిన వాడే రాజ్యానికి దేవు డైనాడు,
రాజే దేవుడుగా కీర్తించబడ్డాడు !
ఆ నాడు అభయం కోసం
మానవుడు కల్పించుకొన్న ఒక ఊహామూర్తి
మొత్తం జాతికంతా దేవుడై నిలిచాడు –
మహిమలతో, మహా బల దర్పాలతో
ఆగ్ర హానుగ్రహాలతో, స్వర్గ నరకాలతో
ఆశ్రితులకు అన్నదానాలు చేసుకొంటూ !

ఆది కాలపు ఒక ఊహ చుట్టూ
ఎంత చరిత్ర సృష్టించబడిందో, చూడు !
చివరి కతడు మత పెద్దల చేతుల్లో పడి
మతాని కొక ముక్కగా పంచుకోబడ్డాడు !

ఇప్పుడు ప్రతి మతమూ ప్రకటిస్తుంది –
తనకు వచ్చిన వాటాయే పూర్ణదేవు డనీ !
తక్కిన వాళ్ళవన్నీ వట్టి కేశ నఖాదు లనీ !

## 93

"దేవు డొక్కడే, మా ఎల్లయ్య !"
"దేవు డొక్కడే, మా పుల్లయ్య !"

దేవు డొక్క డనేది నిజమే కావచ్చు, కాని
ఆ ఒక్కడూ ఎవరు ? ఎవరి వాడు ?
అది తేల్చడానికే మత యుద్ధా లన్నీ !

"ఏ దేవుడైతే నేం లే" అని నీవు మంచిగా
శాంతి ప్రతిపాదన చేస్తే
సహజీవనం కోసం ప్రయత్నిస్తే
"మా దేవుడే గెలిచా" డంటూ అవతలివాడు
విజృంభించి దెబ్బ కొడతాడు !

అందుకే తెలుసుకో –
దేవుడు వ్యక్తిగత విషయం,
మతం సామూహికం !
అది సామూహిక మయిం దంటే
రాజకీయ మయిం దన్న మాట !

## 94

ప్రాచీన నిరంకుశ సార్వభౌమత్వం నమూనాలో
ఊహించ బడినట్టిది ఏకేశ్వరత్వం,
ఆ ఏకేశ్వరత్వం తన దేవుడికే కట్టబెట్టడానికి
ప్రతి మతమూ పరమతాలతో ఢీకొంటున్నది !

ఆధునికి ప్రజాస్వామికం నమూనాలో
ఏర్పడినట్టిది బహుదేవతా వ్యవస్థ,
ధీరు డెవరైనా దేవుడు కాగల వ్యవస్థ ఇది !

ఏకేశ్వరత్వం, బహు దేవతాత్వం
రెండూ రెండు మనస్తత్వాలు !
స్వచ్ఛందమైన నీ మనస్సే నీ పరమాత్మ !
పిలిస్తే పలికే వాణి అదే
చూస్తే కనబడే దీప్తి అదే !
ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా సరే
ఇచ్ఛా శక్తీ, ఇష్ట దైవ సాక్షాత్కారమూ అదే !

## 95

విగ్రహారాధన మంచిదా, చెడ్డదా అనే ప్రశ్నకు జవాబు
అన్నం తినడం మంచిదా, చెడ్డదా అనే ఎదురు ప్రశ్నే !

అన్నం తినడం ఎంత సహజమో
విగ్రహా రాధన కూడా అంతే సహజం !
ఒకటి శరీరాన్ని పోషించేది,
రెండోది మనస్సును పోషించేది !

జొన్న రొట్టె తినేవాణ్ణి
వరి గంజి తాగేవాడు పరిహసించడం వంటిదే
స్వర్ణ విగ్రహారాధకుణ్ణి
శవ పేటి కారాధకుడు వెక్కిరించడం !

సకల పదార్థాలూ కలిసిన అన్నమే
సంపూర్ణ భోజన మైనట్టు
సమస్త మనోభీష్టాల సమష్టి ఫలసాయమే
విశ్వ శ్రేయ మవుతుంది.

అయితే, మనస్సుకు ఇష్టరూపం ఇచ్చుకొనే స్వేచ్ఛ
బహు దైవ వ్యవస్థలో వుంది
ఏక దైవ నియంతృత్వంలో లేదు.

## 96

నీవు విగ్ర హారాధకుడివా ? మంచిది ; అయితే
నీ ఏ కోరికకు ఆ విగ్రహం చిహ్నమో గుర్తుంచుకో !

పసుపు రాసి కుంకుమ పెట్టిన చెట్లు, పుట్టలు, రాళ్లు
అలంకరించిన బొమ్మలు, ప్రతిమలు, శిల్పాలు
నీతి బోధకుల శవపేటికలు, చితా భస్మాలు, జ్ఞాపికలు
పెద్దల ఫోటోలు, స్టాట్యూలు, స్మృతి మందిరాలు
అన్నీ విగ్రహాలే, ఏదో ఒక భావానికి ప్రతీకలే.

కళలకు, విద్యలకు, కోరికలకు, మహిమలకు
అందమైన రూపాలు కల్పించుకొని ఆరాధించే నిన్ను
విమర్శించే హక్కు లోకంలో ఎవరికీ లేదు.
అందరూ విగ్రహారాధకులే ఏదో ఒక విధంగా !

నీవు ఆరాధించే విగ్రహం
నీ మనస్సులోని కోరికకు బాహ్యరూపమే,,
కోరికను తీర్చేది కూడా
మనస్సుకు గల ఇచ్ఛాజ్ఞాన క్రియా సమైక్య శక్తే.

## 97

కొందరికి దయ్యాలు కనిపిస్తాయి,
మృత బంధువుల జీవాత్మలు కనిపిస్తై ;
ఆస్పత్రిలో చచ్చి బ్రతికిన వాళ్ళు, ఏవో
పరలోకాలను చూచి వచ్చినట్లు చెపుతారు ;
ఇవన్నీ నిద్రలో స్వప్నాలు లాంటివే –
వికల మనస్తరంగాల ప్రతిఫలనాలు !

మనం విన్నవి, కన్నవి, చదివినవి,
అనుభవించినవి, ఆలోచించేవి
ఎన్నిటి ఎన్నెన్నో ముద్రలు
చెదిరిన, చితికిన మనఃఫలక శకలాల నుంచి
దూసుకువచ్చి నిలుస్తై ఎన్నో రూపాలలో !

అన్నీ మన మనస్సులోవి
బైటివి కావు.

## 98

కనుక, మానవుడా, గుర్తుంచుకో -
నీకు బైట ఎక్కడో వున్నట్టున్న శక్తి
అవసరానికి ఆదుకొంటున్న శక్తి
పిలిస్తే పలుకుతున్న శక్తి
నీలోదే, నీదే, పరాయిది కాదు.

ఆవేశంలో ఆత్మే
ఆది శక్తిగా మారుతుంది,
సంకల్ప బలమే సర్వేశ్వరు డవుతుంది.

అయితే -
సదావేశం జగదానంద కరం,
దురావేశం దుఃఖ తమో భీకరం.
అందుకే, తెలుసుకో !
నిన్ను నీవు తెలుసుకొని పురోగమించు !

## 99

దేవుడనే వా డొక డున్నాడా ?
పులికీ, మేకకూ దేవు డొకడేనా ?
స్వర్గం, నరకం వున్నాయా ?
ఏ పనులు చేస్తే పాప మంటున్నారో
ఆ పనులే చేస్తున్నా రెందుకు దొరలు ?
పాపభీతీ, దైవభీతీ వుండవలసింది
ప్రజలకేనా ? ప్రభువుల కక్కరలేదా ?

మానవుడా ! ఎప్పుడైనా
ఇలాంటి ప్రశ్నలు వేసుకొని

నీకు నీవే జవాబులు చెప్పుకొన్నావా ?
లేదు కదూ ?

అవును ! ఆది నుంచీ నీ కోసం
తామే ఆలోచించి పెడుతున్న దొరలు
నిన్ను ఆలోచించుకోనివ్వలేదు !

## 100

దేవు డున్నా డనుకొనే ఆస్తికుడూ

లే డను కొనే నాస్తికుడూ,

వైజ్ఞానిక నిదర్శన కోరే హేతువాదీ

హేతువు కందని మౌన యోగీ,

అన్ని రకాల, అన్ని రంగుల, అన్ని అభిరుచుల
అందరూ స్వేచ్ఛగా కలిసి మనగల్గినప్పుడే
అది మానవ సమాజ మవుతుంది.

పర లోకాలను గురించి ఎవరేమి చెప్పినా,

అవన్నీ వూహలే కనుక, పట్టించుకోకు !

రుజువు కందని ఒక రకం ఊహ

అలాంటిదే మరో రకం వూహ కంటే

గొప్పదేం కాదు !

ఒకరి అనుభూతి

మరొకరి వూహ కందేది కూడ కాదు !

## 101

నీవు పరమాత్మనే దేవు డంటున్నావా ?
నీకూ మెద డుంది, ఆలోచించు !
పుట్టి గిట్టిన ఎవడూ దేవుడు కాడు
నామ రూప పరిమితు డెవడూ దేవుడు కాడు
రాగ ద్వేషాలు, స్వపర భేదాలు
ఆశ్రిత పక్షపాతాలు కల ఎవడూ దేవుడు కాడు.

అందుకే, దేవుడు లే డంటున్నాను,
నీ విశ్వాసమే నీ దేవుడైతే
అది నీ వ్యక్తిగతం,
నీ మనో రూపం.

నీ మనస్సు నీది
నా మనస్సు నాది.

## 102

నీవు మహా ప్రవక్తవో, పరమావతారుడవో కావచ్చు !
నీవు చెప్పే నీతులూ, పెట్టే ఆంక్షలూ,
అహర్నిశలూ శ్రమ పడితేనే కాని కడుపు నిండని
సామాన్య మౌలిక జనానికి
అందుబాటులో వుండాలి,
ఆచరణ సాధ్యం కావాలి.

ఆచరణ సాధ్యం కాని నీతులు
వట్టి మిణుగురు పురుగులే తప్ప
నిప్పు చేసుకోడానికి పనికి రావు.

అబద్ధ మాడకు అనే దొక నీతి సూత్రం,
దాని అమలుకు ఏ ఒక్కడూ ప్రయత్నించడు,
సాధ్యం కాదనైనా పైకి ఒప్పుడోడు !
ప్రతి నీతి బోధకుడూ వెల్లుల్లి కథకుడే !
ఎంత హిపోక్రసీ !

## 103

ఏ వ్యక్తీ సర్వజ్ఞుడు కాదు
మరణానంతరం గురించి ఎవడికీ తెలీదు
ఎవడికి తోచినట్టు వాడు చెపుతాడు.
సరే, కాని – ఒకొక్కడు
తాను చూచినట్టే వర్ణించి చెపుతాడు !

నరక మంటాడు, స్వర్గ మంటాడు, పునర్జన్మ అంటాడు
స్వర్గానికి టికెట్లు అమ్ముతాడు !
మోక్ష ప్రాప్తికి మంత్రం ఉపదేశిస్తాడు !
అదీ మోసం !

నీవు చెప్పే లక్ష్యం నిష్కాపరుడికే కాదు
సోమరికి కూడ చురుకుదనం కలిగించాలి !
నియమ నిబంధనలు సాంఘిక ప్రవర్తనకు మాత్రమే,
మోక్షప్రాప్తికి కాదు ! గుర్తించు !

## 104

అందుకే, చెప్పుతున్నాను -
మోక్షం గురించి ఆలోచించకు,
అది ఎల్లప్పుడూ నీతోనే వుంటున్నది
నీవే అయి వుంటున్నది.

నీవు ఆలోచించవలసింది జీవితం గురించి !
సామాన్య జీవితం దానికదే సాగుతుంది
సహజంగా, నీరు పల్లానికి వలే !
దాని మార్గం స్వగుణ నిబద్ధం.

సామాన్య జీవితాన్ని కూడా
విశిష్ట గుణ సంపన్నం చేసుకోగల శక్తి
మానవాత్మ కుంది కదా !
అదే ఆలోచించు మంటున్నాను.

నీ జీవితం నీ చేతుల్లోనే వుంది,
నీ వెలా అనుకొంటే అలా తయారవుద్దది !

## 105

చేత నాచేతన చిదానంద శక్తి
రాతిలో లేదా !
లే దన్న వాడు మూఢుడు !

రాతి నుంచి వెలువడే రమణీయమూర్తి
పరవశించి వరించేది నీ సుత్తినా ?
నీ చిత్త వృత్తిని !

## 106

అనాదిగా అక్కడున్నది అదే శిల్పం, కాని
దానికి ప్రదక్షిణం చేసిపోతున్న యాత్రికులు
ఎప్పటి కప్పుడే కొత్తవాళ్లు ; కనుక
వాళ్లకది నిత్య నూతనం.

శిల్పి కనిపించని శిల్పం అది,
శిల్పం తయారయే కొలదీ శిల్పి
దానిలో లీనమైపోయిన అద్భుత మది,
శిల్పీ, శిల్పమూ ఒకటే అయిన మూర్తి అది !

శిల్పి ప్రధానమా ? శిల్పం ప్రధానమా ?
నీకు ఏ మూర్తి స్ఫూర్తి నిస్తే
ఆ మూర్తినే వరించు !
ఆద్యంతాలు లేని ఈ క్యూలో
నీకు దొరికే అవకాశం అణు మాత్రం !

## 107

లక్ష్మి, విష్ణువు, భృగు మహర్షి
ఈ ముగ్గురి ఆత్మలూ ఒకే పరమాత్మ కదా ?
మరి, తేడా ఎక్కడి నుంచి వచ్చింది ?

పరమాత్మ నుంచి అవి తీసుకున్న గుణాల లో దది,
అవి నిర్మించుకొన్న శరీరాల లో దది !
మనస్సు చేసే చిత్ర కల్పనలే
అతీత శక్తి రూపా లన్నీ !

మానవుడు దేవుడి స్వరూప కల్పన కాదు
దేవుడే మానవుడి స్వరూప కల్పన.

## 108

మనస్సు కల్పించే పాత్రలు
దాని సమకాలానికి ప్రతిబింబాలు,
అవి పాతబడే కొలదీ
దేవతలై కూర్చుంటై !
విగ్రహాలై వెలుస్తై !

ఆత్మ, దేవుడు, పరమాత్మ – వీటిలో
మృత్యువును జయించిన ఆత్మ దేవుడు,
మోక్షం పొందిన ఆత్మ పరమాత్మ.

దేవుడు, ఈశ్వరుడు, భగవంతుడు
వంటి పదాలతో పిలువబడే మృత్యుంజయుడు
సాహిత్యంలో తప్ప కనిపించడు,
అందుకే లే డంటున్నాను.

మోక్షం సహజ సిద్ధం కనుక, దాని కోసం
కృషి చెయ్యవలసిం దేమీ లేదు.

మనం తెలుసుకోవలసిం దంతా ఆత్మ గురించి,
పరమాత్మ తనను తాను ఆత్మగా
జాగృతం చేసుకోవడంలోని ఆంతర్యం గురించి !

## 109

ఎవరికీ ఎవరి దయా అక్కర లేదు
న్యాయం జరిగితే చాలు,
పుట్టిన ప్రతి జీవికీ బ్రతికే హక్కుంది.

నీ బ్రతుకు తెరువును అడ్డగించి
నీ సహజ హక్కుల్ని అపహరించి,
"కాల్మొక్కుతా, బాంఛను" అంటూ సాగిలబడితే
దయాభిక్ష పెడతా డట ప్రభువు !

ఆలోచిస్తున్నావా, మానవుడా ?
కరుణ, కృప, జాలి అనబడే దయ

నిరంకుశ ప్రభువుల స్వార్థ సృష్టి !
అమాయక జనాన్ని తొక్కిపట్టి వుంచడానికి
ఈ దయ అనేదే మూలమంత్ర మయింది !

ఎందుకు దయ ? ఎవరి దయ ? ఎవరిమీద దయ ?
మానవ జాతిని పెడదారి పట్టించిందిదే,
ప్రభువుల దయకోసం ప్రాకులాడే దౌర్బల్యమే !
నీ కర్తవ్యం స్వశక్తితో జీవించడం,
మరొకరి దయతో జరిగే పని కాదది.

# 110

దేవుడు లే డను కొనే కంటే
ఉన్నాడనుకోవడమే ఉత్తమం కదా
కొంత ధైర్యగా అయినా వుంటుంది అంటున్నావా ?
అదొక అసమర్థుని స్వార్థ విశ్వాసం !

నీకూ, మరొకడికీ మధ్య పేచీ వచ్చినప్పుడు
దేవుడు నీకే సాయపడతా డని నీ వనుకొంటావు !
మరి, ఈ ఉభయులకూ దేవు డొకడే కాదా ?

నీపై ఒక పెద్దపులి దూకి నప్పుడు
దేవుడి దృష్టిలో నీ ప్రాణం కంటే
పెద్దపులి ఆకలే ప్రధానమై వుండవచ్చు కదా ?

అందుకే చెపుతున్నాను విను –
అన్నిటికీ దేవుడే బాధ్యు డనుకోవడం
ఒక మానసిక బలహీనత !
ఒక దురలవాటు !

నీ మనసే పరమాత్మ అనుకొన్నప్పుడు
నీ మనో బలమే నిన్ను కాపాడగలదు,
దానికి మించిన అతీత శక్తి మరొకటి లేదు.

## 111

పేదవాడి పట్ల సానుభూతితో
ధనవంతుణ్ణి ద్వేషించకు !
ఇద్దరూ మానవులే, మరచిపోకు !

కలిమి లేము లెక్కడివి ?
అవి వాళ్ళ స్వగుణ సంపాదనలు !

ఎవ డేది సంపాదించగలడో
అది అతడిచే పుష్కలంగా సంపాదించబడనీ,
ఒకొక్క రకం సంపాదన శక్తి
ఒకొక్కడిలో పొందుతుంది పూర్ణవికాసం.

జాతి దారిద్ర్యానికి కారణం
సంపదలోపం కాదు, పంపిణీ లోపం !
అందరి అన్ని సంపదలను ఉమ్మడి చేసి
అందరికీ అందుబాటులో వుంచాలి సమంగా !

ఎవరు ? ఎవరు చెయ్యగల రా పని ?
నీవు ! నీవు చెయ్యగలవు ! యత్నించు !
ఆ పని చెయ్యకుండా
నీతులు చెప్పి లాభం లేదు.

## 112

మానవులలో వుండే వర్గాలు రెండే
పాలకుడు, పాలితులు !

బోధకులు, బాధకులు పాలక వర్గం
వాళ్ళు కొద్ది మందే అయినా, సాహసికులు !
బాధితులు, బోధితులు పాలితవర్గం
వాళ్ళు కోట్లాది మంది కాని, నిరీహులు !

పాలకు లెవళ్ళు ?
పాలితుల నుంచి పైకి వచ్చిన వాళ్ళే
ఎన్నికల ద్వారానో, విద్యల ద్వారానో !

క్రింది నుంచి పైకి వచ్చిన తర్వాత
జీవసారాన్ని క్రింది నుంచే పీల్చుకొంటూ
పైపైనే బ్రతికేసే వాళ్లు వాళ్లు !
వాళ్లకు దేవు డేకాలంలోనూ లేడు !
వాళ్ళ సాహసమే వాళ్ళ దేవుడు,
క్రౌర్యమే వాళ్ళ ఆయుధం !

అలా ఎందుకు జరుగుచున్నది ?
అధిక సంఖ్యాకులు అనాసక్తులు కావడం వల్ల,
హేతువాదులకు సాహసమూ
సాహసికులకు సమతా బుద్ధీ
లేనందు వల్ల !

## 113

ప్రపంచ మానవు లంతా ఒకే మానవ జాతి !
అయితే, ఇన్ని వైరుద్ధ్యాలకు ఏమిటి హేతువు ?

దూర దూర ప్రాంతాలలో మానవులు
తెగలు తెగలుగా ఆవిర్భవించడం !
ప్రాంతాల మధ్య, తెగల మధ్య
ఎట్టి సంబంధాలూ లేకపోవడం !
ప్రాంతాల శీతోష్ణాదులను బట్టి
తెగల ఆచార వ్యవహారాలు రూపొందడం !

విజ్ఞాన వికాసంతో దూరాలు తరిగి
తెగలు చేరువ కావడం జరిగి నా –
వైరుద్ధ్యాలకు సమన్వయం కుదరక
ఆధిక్యత కోసం జరిపే పోరాటాలే
లోకంలోని అశాంతి కంతకూ మూలం !

ప్రశాంతి నిజంగా నెలకొనా లంటే
ప్రపంచ మంతా ఏక ప్రభుత్వం కావాలి !
మతాలనూ, వాటి దేవుళ్ళనూ మూల పడేసి
విశ్వ మానవత వికసించాలి

## 114

మళ్లీ మళ్లీ చెపుతున్నాను -
నీవు ఆత్మవు, పరమాత్మ అంశవు ;
పరమాత్మలో పుట్టి పెరిగి తరిగి తిరిగి
పరమాత్మలోనే లయించిపోతున్న శక్తివి.

నీ శక్తి యావత్తూ నీ మనస్సే,
జీవితం మనస్సు తోడిది !
మనస్సు యథాకామి, స్వేచ్ఛాగామి
సత్వ గుణకే స్వాధీనంలో వుండే భూతం అది !

నిరంకుశమైన మనస్సు
నిత్యావేశ సాహసికం,
దానిని ఏకాగ్రతకు తెచ్చుకొన్నవాడు
ధరిత్రి కంతా అధినాధుడు !

## 115

తన నుంచి, తన చుట్టూ, తన దేహాన్ని
నిర్మించుకొన్న పరమాత్మే ఆత్మ,
దేహ రూప నామాలను బట్టి వచ్చేదే వ్యక్తిత్వం.

వెంకయ్య అనే వ్యక్తిని తీసుకొంటే -
జీవం, దేహం, ఆత్మ, మనస్సు
వీ టన్నిటి సమ్మైక్యరూపమే వెంకయ్య.

అయినా, లోకం వెంకయ్య అంటున్నది
దేహాన్నే, గుర్తుంచుకో !
కోటానుకోట్ల మనుషుల మధ్య
వెంకయ్యను గుర్తిస్తున్నదీ దేహాన్ని బట్టే !

వెంకయ్య పోయా డంటే -
ముందుగా పోయింది ఆత్మ,
తర్వాత పోయేది పంచభూతాలు.
పదార్థ మార్దవంలోని తారతమ్యాన్ని బట్టి
కరిగిపోతా యవి పరమాత్మలో !

ఆత్మ మృదుతమ మైనట్టిది
కనుక, ముందు పోతుంది !

## 116

ఆ ఇల్లెవరిది ? వెంకయ్యది
ఆ కళేబరం ఎవరిది ? వెంకయ్యది
ఆ విగ్రహం ఎవరిది ? వెంకయ్యది.

వెంకయ్యదీ, పుల్లయ్యదీ ఒకే ఆత్మ,
అయినా, దేహాలు వేరు వేరు
జీవితాలు వేరు వేరు
లక్ష్యాలు వేరు వేరు !

లక్ష్యాల మధ్య పోటీ పోరాటాలు ఏర్పడినప్పుడు
గెల్చిన ఆత్మే పురోగమిస్తుంది,
నిరంతర పురోగమనమే పారమాత్మికం !

కనుక, మానవుడా ! వ్యక్తిత్వంతో
నిర్భయుడవై ముందుకు పద !

## 117

విజ్ఞాన మంతా పరమాత్మ లోదే,
పరమాత్మ ఒక జ్ఞాన తరంగిణి ;
ప్రతి జీవాత్మలోనూ కాలక్రమంలో
జ్ఞానాంశ పెరుగుతూనే వుంది.

మానవాత్మది జ్ఞానశక్తి
మనస్సుది ఇచ్ఛాశక్తి
ఇచ్ఛను ఆచరణలో పెట్టేది ఘటాత్మ.

ఈ శక్తులను స్వార్థం కోసం కాక
బహుజన సుఖశాంతుల కోసం
ఏక ముఖం చేసిన వాణ్ణే దేవు డన్నారు ?
పరహితార్థం పనిచేసేవాడే దేవుడు,
అతడు మనలోని వాడే, బైటివాడు కాదు.

## 118

భగవంతుడు లేకుండా
బ్రతకలేడు మానవుడు !
అంతటి అర్భకుడు మానవుడు !

అందుకే సృష్టించుకొన్నాడొక దేవుణ్ణి
తన రక్షణకోసం తనకంటె అధికుణ్ణి.
ఈ రహస్యం తెలుసుకొన్న తొలి తెలివిమంతుడు
దేవుణ్ణి దొంగిలించి దాచేసి,
తానే దైవజ్ఞుడై వెలిశాడు !
అతడి చుట్టూ చేరిన ఆర్తుల ఆకాంక్షే మతం !
దైవ సహాయంకోరే ఏకగ్రీవ అభ్యర్థనమే ప్రార్థన !

అందుకే మానవుడా, నిజం తెలుసుకో !
దేవుణ్ణి సృష్టించినవాడవు నీవే
పార్వతి గణపతిని వలె !

కాగా, నీవే దేవుడవై వెలయగలవు –
కర్మకాండను రోసి, గౌతమ బుద్ధుని వలె !
సర్వసమతను చాటి, పోరాడి, గెల్చి
మార్క్స్ – గాంధీ – అంబేద్కరుల వలె !

## V ఆచార వైరుధ్యాలే మతకలహాలు

నేను ప్రధానంగా కవిని –
నా కార్య రంగం జీవితం !
నా కృషి భూమి మీది పొలాలలో,
భూమి క్రింది అగాధాలలో కాదు.

అయితే –
మంచి పంటలు పండించే రైతు
మట్టి గురించి తెలుసుకోక తప్పదు,
అలా తెలుసుకోనే ప్రయత్నమే
ఈ నా కించిత్ ఆధ్యాత్మిక పరిశీలన !

పరమాత్మ గురించి చెప్పగలిగింది
పాండిత్యం కాదు, పరమారాధన !
సన్యాసం కాదు, సహజీవన రసాస్వాదన !

## 120

ప్రకృతిలోని అంద చందాలకు
జీవితంలోని సుఖ దుఃఖాలకు
సమాజంలోని న్యాయాన్యాయాలకు
ఆవేశ పడిన మెత్తని మనస్సు
మాట్లాడే భాషే కవిత్వం.

గద కంటె కత్తి పదునైనది
బాణం కంటే బుల్లెట్ చురుకైనది
దెబ్బ కంటే మాట బలమైనది.
అలానే, వాఙ్మయంలో కవిత్వం
అమ్ములపొదిలో బ్రహ్మాస్త్రం !

భౌతి కావసర సమస్యలు పిచ్చుకలు,
వాటి పరిష్కారానికి సహజీవన బుద్ధి చాలు ;
ప్రతి పిచ్చుక మీదకూ బ్రహ్మాస్త్రాన్ని విసరకు !
జీవిత సౌఖ్యానికి వసంత కుసుమాస్త్రం అది !

## 121

కవి, యోగి, నాయకుడు, అధికారి -
ఏ మానవుడైనా ఏం చెపుతాడు ?
తాను మునిగిందే గంగ అంటాడు !
అవును, అనుభవం వ్యక్తిగతం !
ఎవడి అనుభవం వాడి దేవుడు,
ఎవడి ప్రయోజనం వాడి లక్ష్యం,
ఎవడి పనిపరిధి వాడి ప్రపంచం !

ఎవడేం చెప్పినా విను !
నీ వేం చెపుతావో చెప్పు !
మెదడుకు నోరున్న వాడు వక్త
నోటికి మెదడున్న వాడు ప్రవక్త !
ఈ రెండూ వున్నవాడు మౌని !
జ్ఞాన మూలకమైన తిరుగులేని
క్రియా శక్తే మౌనం !
గుర్తుంచుకో !!

## 122

వేదంలోనే వేదాంతాన్ని పొదిగారు పూర్వర్షులు,
అన్నంలోనే అజీర్ణ నివారిణిని కలిపారు.

ఇహ లోకంలో ఏ పద్ధతిగా జీవిస్తే
పర లోకంలో సుఖం లభిస్తుందో చెప్పారు,
పైగా అట్టి పద్ధతిలోని విధి నిషేధాలను
చట్ట బద్ధం కూడ చేశారు !

తెలియని పరం కోసం
తెలిసిన ఇహాన్ని వదులుకోవా లన్నప్పుడే
హిపో క్రసీ ప్రవేశించింది సమాజంలో !
సహజ జీవితం చీకటి బజా రయింది,
నీతులు నవ్వుల పాలైనై,
ఆత్మ విద్య మెట్ట వేదాంత మయింది !

## 123

వేదాలను సంకలనం చేసిన వ్యాసుడు
వాటిలోని ఆధ్యాత్మిక భావాలను గ్రహించి
భావాని కొక ఉపనిషత్తుగా ప్రకటించాడు,
వాటి సారాన్ని బ్రహ్మ సూత్రాలుగా కుదించాడు,
అంతటితో కూడ తృప్తిచెందక
భగవద్గీతగా ఏకీకరించాడు !

ఇహ పర లోక వృత్తాలను
ఇదమిద్ధంగా నిర్వచించడానికి ఇంతగా
శ్రమపడ్డ తత్త్వవేత్త లోకంలో మరొక డేడీ ?
అయినా, ఏ మయింది ?
ఏం తెలిసింది ?
తత్త్వమసా ?
అతత్త్వమసా ?

## 124

అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి
త్వమే వాహం
నేను పర బ్రహ్మను, నీవు కూడ అదే
నీవూ, నేనూ ఒక్కటే !

నేను - నీవు - మనం అనే ఈ మూడు మాటలే
మొత్తం వేద వేదాంతాల సార మంతా.

ఈ మూడు మాటలూ కలిసింది ప్రకృతి,
వీటికి మూలహేతువైన పరమాత్మ పురుషుడు.

ప్రకృతి పుడుతున్నది, జీవిస్తున్నది,
ఎందు నుంచి పుట్టిందో అందులోనే
తిరిగి లయమై పోతున్నది,
ఇదంతా ఒక సహజ క్రియ !

## 125

సృష్టి, స్థితి, లయాల లో
ఆదీ, అంతమూ మన చేతుల్లో లేవు.
ఎలా వున్నదాన్ని అలా వదిలేస్తే
స్థితి కూడా మన చేతుల్లో వుండదు.

ఈ మూడు తెరగులకూ నడుమ
ఒక సమన్వయాన్ని సాధించడానికే
మానవుడు సాగిస్తున్న అన్వేసణ అంతా,
అందిస్తున్న విజ్ఞాన మంతా,
చేస్తున్న వూహ లన్నీ,
చూపుతున్న మార్గా లన్నీ !

అందులోవే మన వేదాలు కూడ,
అవి మన పిత్రార్జితం.

## 126

శత్రు శక్తులను నిర్మూలించుకొంటూ
మిత్ర శక్తులను సమీకరించుకొంటూ
ఎవరికి చేతనైన పనిని వాళ్లు చేసుకొంటూ
పురోగ మించ మంటున్నె వేదాలు !

అందరి పనుల అన్ని ఫలితాలనూ
అందరూ సమంగా అనుభవిస్తూ
సుఖ శాంతులతో ఆడుతూ, పాడుతూ
ఆనందంగా జీవించ మంటున్నె వేదాలు !

అంతకంటే కావలసిం దేముంది ?
మరి, అలా ఎందుకు జరగడం లేదు ?

వేదోక్తులలో నమ్మకం లేకనా ?
అవి ఆచరణ సాధ్యం కాకనా ?
ప్రజల కందకుండా చీకటి గోదాములలో
మూసి పెట్టబడడం వల్లనా ?

## 127

సూర్యుడు, ఉషస్సు, కాలం, పంచభూతాలు
అన్నీ నిత్య సత్యాలే ; కాని
వాటిని గురించి ఋషులు చెప్పిన దానిలో
అసహజాలు చాలా వున్నై

కొన్ని అపోహలైతే, కొన్ని అతిశయోక్తులు,
కొన్ని అలంకారాలు, కొన్ని ధ్వనులు,
అందులో అధిక శాతం వినోదకరాలు,
వినియోగానికి పనికి వచ్చేవి తక్కువ.

అవైనా ఆ కాలానికి తగి వుండవచ్చు
కాలానుగుణంగా మార్పు రావలసి వుంది.
ఏ కాలంలోను ఏ నరుడూ సర్వజ్ఞుడు కాదు,
సర్వజ్ఞత కేసి పయనిస్తున్న జిజ్ఞాసువు మాత్రం.

## 128

వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, కావ్యాలు
ఇదంతా మన పిత్రార్జితం.

ఇందులో శాశ్వత సత్యమైన దెంతో
తాత్కాలిక వాడకమే లక్ష్యమైన దెంతో
మరమ్మతులు చేసుకోవలసిన దెంతో
పరిశీలించి తెలుసుకోవాలి.

మన పితరుల కవసరమైన దంతా
మన కక్కర లేక పోవచ్చు.

అదీ గాక, ఒక్క పరమాత్మ తప్ప
శాశ్వత సత్యమైన దేదీ సృష్టిలో లేదు.
మనం శాశ్వతమూ, సత్యమూ అంటున్నదంతా
కేవలం గతానుగతికమైన మన సంప్రదాయం గురించి.

సంప్రదాయం అనేది వెనుకవుండి దారి తెలిపేదే కాని
ముందుండి దారి తీసేది కాదు.
ప్రవాహాన్ని నడిపేది పైనుంచి వచ్చే తోపుడు,
ప్రవాహం నడిచేది మాత్రం స్వానుకూలతను బట్టి !

## 129

బ్రాహ్మణుడు, గోవు, ఏనుగు, కుక్క
కుక్కను తినేవాడు – ఈ అందరి పట్లా
సమ దృష్టి కలవాడే పండితు డన్నది గీత !

గీతకు ముందు గాని, తర్వాత గాని, నేడు గాని
అలాంటి పండితు డెవడైనా వున్నాడా ?

గీతోపన్యాసాలు, గీతా యజ్ఞాలు చేసే
ఆచార్యులకు గాని, భక్తులకు గాని
గీత పట్ల గౌరవ విశ్వాసాలు కలవా ?
ఉంటే, గీత చెప్పినట్లు చెయ్యరేమి ?

మానవుడా –
ఇన్ని మతాలు, ఇందరు దేవుళ్లు, ఇన్ని సుభాషితాలు
జాతిని సన్మార్గంలో నడిపించలేకపోవడానికి
హేతు వేమిటో గమనించావా ?
ప్రతివాడూ బైట నీతులు చెపుతాడు,
లోన ఎవడి స్వార్థం వాడిది !

స్వార్థం జీవ ధర్మం కనుక –
అది నీలో కాని, నాలో కాని, మరెవరిలో కాని
మితిమీరకుండా నియంత్రించడం నీ కర్తవ్యం !

## 130

సమాజం అనే ప్రమిదలో
చీకటి అనే తైలంలో
నీ ఆత్మే వత్తిగా వెలిగే దీపానివి నీవు !

వత్తి పూర్తిగా కాలిపోయే సరికి
చీకటి సీదాగా ఇగిరి పోవలసి వుంది !
మరి, అలా జరుగుచున్నదా ?

నీలోది చీకటి కాదు
అది బైటి చీకటి యొక్క నీడ !
చీకటి మొత్తం తొలగా లంటే
సమాజ మంతా ఒకే వత్తిగా వెలగాలి !

ఏ ఒక్క ప్రవక్త ఆత్మో కాలి మసైపోతే
ఆ వెలుగులో ఇళ్ళు చక్కబెట్టుకొన్నవాళ్ళు
ఆ మసితో వ్యాపారం కొనసాగిస్తుంటారు ;
ఆ వ్యాపారమే మతం !
అది మనకు వద్దు !

మానవుడా ! నీ ఆత్మే పరమాత్మ,
నీ వెలుగే శ్రేయో జ్యోతి,
నీకు నీవు పురోగమించు !
నీతోపాటు సమాజాన్ని నడిపించు !

## 131

నీవు అదృష్టం పంటచేలో గుడ్డెద్దువు కావద్దు,
గుడ్డికర్మ చేతిలో రాయివీ కావద్దు,
అవి రజస్తమస్సులు ;
నీవు కావలసింది చీకటిలో దీపం !

నల్లదీపం కనిపించదు
ఎర్రదీపం ప్రమాద సూచకం
తెల్లదీపం ఒక్కటే జగత్ ప్రవర్తకం,
ఇవి సహజ గుణాలు.

వీటిని మార్చా లనుకొంటున్నావా ?
పైపూతలు అసలురంగుల్ని మార్చగలవా ?

అధికారపీఠం నుంచి ధనికుణ్ణి దింపి
పేదవాణ్ణి కూర్చోబెడితే ఏ మవుద్ది ?
క్షణాలలో అతడు ధనార్జనలో పడతాడు !
మార్చవలసింది వ్యక్తిని కాదు, వ్యవస్థను !
నలుపును తెలుపు చేయడం
సున్నం పూసి కాదు, భావన చేసి !

## 132

శరీరం, జీవం, ఆత్మ అన్నీ ఒకే పదార్థం కనుక
శరీరం జీవంగా, జీవం ఆత్మగా మారి
పరమ లయలో భాగస్వాములు కావచ్చు !

పరమాత్మ ఒక పరమ లయ, ఒక రిథం,
దాని రూపకల్పనే లయకారుడు నటరాజు.

లయలో లయించిపోవడం మోక్షమైతే
లయకు శ్రుతిచేసుకోవడం మృత్యుంజయత్వం !
మృత్యుంజయత్వం సాధ్యమా అంటే –
జీవితానికి పరమ లక్ష్యం మరేముంది ?

అమృతత్వం సాధ్యమే
అది మనలోనే వుంది ;
నిర్వికల్ప సమాధి ద్వారా పరిణమించే
సశరీర సజీవ సమాత్మీకృతి అది !

అలాంటి వాళ్లున్నారా అంటే – ఉన్నారు,
ఆ శ్రుతిలో పిలిస్తే పలుకుతారు
ఆ స్థాయి నుంచి చూస్తే కనిపిస్తారు !

## 133

కొన్ని కొన్ని మానవ శరీరాలలో
మృగ మస్తిష్కా లుంటూ వుంటై !
దగాలు చేసేవాళ్లూ, దయమాలి వర్తించేవాళ్లూ
అలాంటి దుష్ట మృగాంశజులే.

సింహాలు, నక్కలు, నాగులు, గొర్రెలు
నరుల్లోనూ వుంటై, గమనించు !

సింహాలకు భక్తి ముక్తు లక్కర లేదు
అవి మృగ రాజులు !
రాజ్యాంతే నరకం ధ్రువం అంటుంటై
ఆ నరకం కోసమే ప్రజల ప్రాణాలు తీస్తుంటై !

ప్రగతిని కోరే ఏ మానవుడి కైనా
దుష్టశిక్షణ విధ్యుక్త ప్రథమ ధర్మం,
సంస్కరించలేకపోతే సంహరించి పారేస్తూ
నిర్దుష్ట పథంలో ప్రగతిని
నడిపించగలవాడే పురుషోత్తముడు.

## 134

ఇక్కడొక వాస్తవాన్ని గుర్తించు -
నేను పురుషోత్తము డంటున్నది ఒక మహితాత్మను,
నీలోని ఆత్మ జగద్ధితంగా స్వయంసిద్ధ మైతే
నీవూ పురుషోత్తముడవే కాగలవు.

నేను కాదంటున్నదీ, ఖండిస్తున్నదీ
ప్రజలలో ప్రచారం చెయ్యబడుతున్న దేవ భావనను !
రక్షకుడూ, సృష్టికర్తా అయిన దేవు డెక్కడో
పరలోకంలో వుంటా డన్న దురూహను !
దేవుడి పేరు చెప్పి పొట్ట నింపుకొంటున్న
తెలివైనవాళ్ల వంచనా చాతుర్యాన్ని !
తమ కష్టాలకు కారణం కర్మో, దేవుడో తెలియక
మత్తులో గడిపేస్తున్న సామాన్యుల కొరగామిని !

## 135

మానవుడా ! ఈనాడు
ప్రతి మతమూ ఒక రాజకీయ వ్యవస్థే,
ప్రతి వ్యవస్థ లక్ష్యమూ ఆర్థిక పెత్తనమే !
లక్ష్యం స్వర్గమో, మోక్షమో అయితే
మతాల మధ్య ఇంత మానవరక్తం ఎందుకు చిందాలి ?
జాతీయ సమైక్యానికి, సంఘ బల సమీకరణకు
మత వ్యవస్థ అవసరమా ?
మానవుణ్ణి నియమబద్ధుడుగా వుంచడానికి
దైవ భీతి అవసరమా ?

ప్రతి మనిషికీ సాంఘిక న్యాయం సమకూర్చితే
వీటి అవసరమే వుండదు, గుర్తించు !

## 136

దేవు డున్నాడా, లేడా అనే మీమాంస
శిశు మనస్కులది,
శిశువులు పుడుతూనే వుంటారు.

గొప్పది నీ మతమా, నా మతమా అనే వివాదం
ఆకతాయులది,
ఆకతాయులను అదుపుచేసే సత్వశాలి ఎవరు ?

అట్టి సత్వశాలినే దేవు డంటా నంటావా ?
అయితే, ఒక్క సత్యం గుర్తుంచుకో –
అట్టివాడు ఏ మతానికీ చెందని
విశ్వ మానవుడై వుండాలి !

ఏ దేవుడూ దివినుంచి దిగిరాడు,
భువినుంచి పైకెదుగుతాడు.
నీవూ ఎదగగలవు, యత్నిస్తే !
ప్రపంచ మంతా ఉమ్మడి కుటుంబం లా
భాసిస్తుంది అలా ఎదగగల్గితే !

వేల సంవత్సరాలుగా మానవుడి మెదడులో
వికాసనం లేదంటున్నది విజ్ఞానశాస్త్రం !
నిజమే – వాల్మీకి నాటికీ, వేమన నాటికీ
మార్పు ఏముంది మానవ స్వభావంలో ?

మెదడును వికసించ నివ్వదు మతం,
గతాన్ని పట్టుకు వ్రేలాడే మృతభారం అది.

నీవు నిజంగానే భక్తుడివా ?
అయితే – నీ ఇష్టదైవాన్ని ఆరాధించుకోడానికి
మత ప్రమేయం ఎందుకు ?

అందుకే, ఆలోచించు –
నీ దైవం నీ వ్యక్తిగతం,
నీవు సర్వ స్వతంత్రుడివి !

## 138

దేవుడు వేరు, పరమాత్మ వేరు.
ఏకత్వం నుంచి పుట్టిన నానాత్వంలో
అధికాధిక సత్వ సంపన్నుడై
తన సత్వాన్ని విశ్వ శ్రేయం కోసం
వినియోగించే ధర్మవీరుడు దేవుడు.

ఏదో ఒక వర్గాన్ని మాత్రమే అభిమానించే
పరిమిత చిత్తు డెవడూ దేవుడు కాడు !

అందుకే, మానవుడా !
సత్వాన్ని ఆర్జించుకో, క్రియాశీలివి కా,
విశ్వానికే ధర్మకర్తవుగా వికసించు !

విశ్వ మానవుడుగా ఎదిగే పురుషోత్తముడు
ప్రతివాడూ దేవుడే, గుర్తించు !

## 139

ఈ నాడే కాదు, ఏ నాడూ కూడ
మతం విశ్వజనీనమ్మై లేదు ;
దానిది సమకాలీన స్వజాతీయ పక్షపాతం,
అది చెప్పే దేవుడు
దాని సొంత సేనాధిపతి మాత్రమే !

కాల ప్రవాహం ఒడ్డున నిలబడి
కొట్టుక పోతున్న రద్దు కోసం ఏడుస్తూ
పొంగి వస్తున్న కొత్త కెరటాలకు బెదురుతూ
ప్రవాహ వేగాన్ని శపిస్తూ బ్రతుకుతున్న
చిరకాలపు చింతచెట్టు మతం !

ఒడ్డు విరుగుతున్నది
వేళ్ళు బయట పడుతున్నవి
ఇక వదిలెయ్ దాన్ని !

## 140

కవులు, పండితులు, తాత్త్వికులు, మేధావులు
అన్ని కాలాలలో, అన్ని జాతులలోను వున్నారు.
వాళ్లంతా మతాతీతులు, జగత్కుటుంబులు !
నామరూపాలు, రాగద్వేషాలు, స్వపర భేదాలు
కల ఎవణ్ణీ దేవు డనరు వాళ్లు.

సృష్టికీ, విశ్వానికీ, దాని ప్రవర్తనకూ
హేతువైన ఒక పరమశక్తి వుంది !
అ దేమిటో తెలుసుకొనే ప్రయత్నాలే
విజ్ఞానుల పరిశోధనలూ, ప్రయోగాలూ,
వేదాంతుల యోచనలూ, యోగనిష్ఠలూ,
అన్నిటికీ జ్ఞానపీఠం మానవ మేధస్సే !

## 141

జన్మ ఏదో పాప ఫలం, కర్మ ఫలం అంటూ,
పరలోక సుఖాల కోసం
ఇహ లోక సౌకర్యాలను వదులుకోవా లంటూ,
సంప్రదాయవాదులు, గతానుగతికులు
ప్రచారాలు చెయ్యవచ్చు గాక !
అవన్నీ అపోహ లని, సత్య విరుద్ధా లని
మేధావులకు తెలియదా ?

మరి, జన్మ కర్మ దుస్తంత్రాలను పట్టుకొని
వాళ్లు కూడ వేదాంతీకరిస్తున్నారెందుకు ?
అజ్ఞుల వ్యూహాల్లోని అపవర్గాల కోసం
వాస్తవ జీతంలోని వసంత మాధుర్యాలను
విధి నిషేధాల నిప్పుల్లో
తగలెయ్య మంటున్నా రేమిటి ?

## 142

లోకంలో ప్రసిద్ధులైన తత్త్వవేత్తలు కూడా
సత్యాన్ని తలక్రిందులుగానే పట్టుకొన్నారు,
"ఊర్ధ్వమూలం, అధశ్శాఖా" అంటూనే వున్నారు.

పరలోకాలు ఏవేవో పైని వున్నాయనీ
సృష్టికర్త దేవుడు అక్కడే వుంటున్నాడనీ
అతణ్ణి ఆశ్రయించకపోతే స్వర్గం, మోక్షం వంటి
మరణాంతర సుఖాలు లభించ వనీ
పూర్వులు నమ్మితే నమ్మి వుండవచ్చు !
మరి, ఆధునికు లెందుకు నమ్ముతున్నారు ?

ప్రజల అజ్ఞానంతో మతాలు
వ్యాపారం చేస్తున్నాయనుకోవచ్చు,
తత్త్వవేత్తలూ, వేదాంతులూ అయినా
సొంతంగా ఆలోచించ వద్దా ?

## 143

మతా లన్నీ దేవుడొక్కడే అంటున్నై
అయితే ఏమి టట ?
ఒక మతం పుట్టిన దేశంపై రుద్దే యత్నమే
మతకలహా లన్నిటికీ మూలం !

తూర్పుకు వెళ్లినా, పడమటికి వెళ్లినా
ఎటు వెళ్లినా, ఏ మార్గంలో వెళ్లినా
చేరే దొకే దేవుడి నని తెలియని వా డెవడు ?

మతానికి కావలసింది దేవుడు కాదు,
దేవుడి పేరుతో నీతులు చెప్పకు !
ఏ మతానికైనా కావలసింది అధికారం,
ఇతర మతాలపై పెత్తనం !
అందుకే ఆ వివాదాలు, ఘర్షణలు, శిక్షలు !!

అందుకే మతం వద్దంటున్నాను,
మానవత్వం పెంచుకోమంటున్నాను.

## 144

మతం లేకపోతే మనిషే లే డంటూ
ఉద్ఘాటిస్తూ వుంటారు మతజీవులు !
ఈనాడు మతం లేదా ?
మరి, మని షెక్కడున్నాడు ?

మత తత్వం నానాటికీ పెరుగుతూ వుంటే
మానవత్వం అదే నిష్పత్తిలో తరుగుతూ వుంది !

మానవుణ్ణి స్వార్థ సంకుచిత మృగంగా
తన మందలో ఒక జీవిగా తయారుచేసింది మతమే !
మతం నుంచి విముక్తి పొందకుండా
మనిషికి స్వేచ్ఛా వికాసం లేదు.

అందుకే, మానవుడా ! నమ్మకు,
మతమే వృత్తిగా గల వాళ్ల బోధల్ని నమ్మకు !
సహ జీవనం సృష్టినైజం,
నైజ ధర్మాన్ని ముక్కలు చెయ్యకు !

## 145

కనపడడం లేదా !
ఆధ్యాత్మిక రంగంలో కృషి చెయ్యవలసిన మతం
నిరంతరం సత్యాన్వేషణ సాగించవలసిన మతం
రాజకీయ పోరాటాలు నిర్వహిస్తున్నది !

పరలోకాలలోను, పాప పుణ్యాలలోను
నమ్మకం లేని యుక్తిపరులు భక్తి ముసుగులో
తమ అధికార దాహ నివృత్తి కోసం
పదవీ రాజకీయ నాయకత్వం కోసం
ప్రజలను బెదరగొట్టి వేటాడుతున్నారు !

యుద్ధోన్మాదం, పరమత జిఘాంస
దేవుడిదా ? ప్రవక్తలదా ? లేక -
ప్రవచనాలు వల్లిస్తూ ప్రజలను కొల్లగొట్టే
దురాక్రమణదారులదా ? ఆలోచించు !

## 146

పాప భీతీ, దైవ భీతీ దొరల కక్కర లేదు,
అవి ప్రజలను బెదిరించడానికి కల్పించబడ్డ
దిష్టి బొమ్మలని దొరలకు తెలుసు.

ప్రజలను భయపెట్టడ మెందు కట ?
వారిని సన్మార్గంలో నడిపించడాని కట !
ఇంతకంటె వంచన మరేముంది ?

ఇది అందరకూ తెలిసిన రహస్యం, కనుకనే
సామాన్యుడు అవకాశం చిక్కి దొర అయినప్పు డెల్లా
రెట్టించిన వంచనతో పెచ్చరిల్లి పోతున్నాడు !

ఈనాడు తెలియని దెవరికి –
మానవుణ్ణి సన్మార్గంలో నడిపిస్తున్నది
దైవభీతి కాదు, సంఘ భీతి అని ?
క్రియకు ప్రతిక్రియ సహజ ధర్మమని ?

## 147

ఒకడికి విగ్రహం దేవుడు
ఒకడికి పుస్తకం దేవుడు,
ఒకడికి జ్ఞాపిక దేవుడు
ఒకడికి సమాధి దేవుడు !

అందులో ప్రతి ఒక్కడూ
తాను పుట్టిన సంప్రదాయాని కనుగుణంగా
తన మెదడు మలచబడ్డ వాడే,
పైతృకాచార నిబద్ధుడే.

నీ సరదాకు నీ వొక బొమ్మను చెక్కుకోవచ్చు,
మరొకడి బొమ్మను విరగ గొట్టే అధికారం నీకు లేదు.

నీ బలమే నీ అధికార మనుకొంటే
నీవు బలవంతుడి వయే కొలదీ
నీలో వికసించవలసింది ధీరోదాత్తత.
తామస స్వార్థం కాదు.

## 148

ప్రతి కొత్త మతం ప్రవక్తా
తాను పుట్టిన మతం మీద
తిరుగుబాటు చేసిన వాడే !
పాతను ఖండించిన వాడే !
అయితే, ఒక్క క్షణం నిలకడగా నిలబడి
ప్రపంచ చరిత్రను సమీక్షించి చూడు !
మతాల సంఖ్య పెరుగుతున్నదే తప్ప
మానవుని బుద్ధి మెరు గవుతున్నదా ?

ప్రవక్తల ప్రవచనాలు పైర పాటలై పోతున్నై,
మానవుడి మనస్తత్వం మట్టిలోనే వుండిపోతున్నది !
కారణ మేమిటో ఆలోచించావా ఎప్పుడైనా ?

మబ్బుల నుంచి దిగివచ్చే మెరుపు ఎంత గొప్పదైనా
చీకట్లో దేవులాడుకొనే పేదవాడికి
చేతి లాంతరు పాటి విలువ కూడ చెయ్యదు !

## 149

కాలం గడిచేకొలదీ మానవుడు
కాంతి శరీరం ధరించాలి,
పాంచభౌతిక రూప సౌందర్యానికి
పరమ వేగం లభించాలి.
త్రికరణ శుద్ధి ఒక మహా సిద్ధిగా
ప్రతి మనిషీ వికసించాలి,
శ్రేయోరూప పరమాత్మలో
విద్యుద్విహారం చెయ్యాలి !

ఇదేదో ఊహాభిలాష అనుకోకు,
ఉటోపియా గా కొట్టి పారెయ్యకు !

నీ గృహంలో, నీ కాలేజీలో, నీ పార్టీలో,
నీ పదవిలో, నీ పనిలో, చుట్టూ
నిజాయితీని ప్రవేశపెట్టు !
సమాజం ఎందుకు తెలివినిపడదో చూద్దాం !

# VI పునర్జన్మ ఒక అపోహ

నీవు పరమాత్మ అంకురం,
నీలోని శారీరక మానసిక శక్తు లన్నీ
ఆత్మ రూపంలో వ్యక్తమైన పరమాత్మే !
ప్రతి ఆత్మా ఒక పరమాత్మ తరంగం,
తరంగం ఎందునుంచి పుట్టిందో
అందులోనే లయించి పోతుంది,
అదే తరంగం మళ్లీ పుట్టదు
పుట్టేది మరొకటి.

జన్మ వుంది
పునర్జన్మ లేదు ;
పదార్థం అదే కాని
వ్యక్తి దేని కదే.

## 151

వ్యక్తుల నడుమ తేడాలకు
సమాజంలోని అసమానతలకు
ఆకస్మిక సంఘటనలకు, సుఖ దుఃఖాలకు
ఆ నాటి అమాయకులు
తరువాతి స్వార్థపరులు
కల్పించిన కారణాలను
జనం నమ్మిన కాలంలో
పుట్టింది కర్మ సిద్ధాంతం.

దాని చుట్టూ నిర్మించబడ్డాయి
ఎన్నెన్నో ఆధ్యాత్మిక చింతనా దుర్గాలు.

సిద్ధాంతం శిథిలమై పోయినా
దుర్గాలు నిలిచే వున్నై,
విజ్ఞానం వెన్నెల కురుస్తున్నా
అజ్ఞానం ఆవరించే వుంది !

## 152

నలుగురు శిశువుల్ని - పుట్టగానే
వారి భిన్న సంప్రదాయాల నుంచి వేరుచేసి
ఒక చోట వుంచి పెంచు !
మానవత్వం ఒక్కటే సంప్రదాయంగా పెంచు !
ఫలితాన్ని పరిశీలించు !

అలా మొత్తం ప్రపంచంలో
ఒక తరం శిశువుల్ని పెంచగల్గితే
జాతి మత భేదాలు లేని
ఏక మానవత ఏర్పడదా ?
ప్రతిభ స్వేచ్ఛగా పరిపుల్లం కాదా ?
విజ్ఞానం విశ్వ విహారం చెయ్యదా ?
మరి, అలా ఎందుకు చెయ్యవు ?

## 153

నీవు ముందుకుపోయేకొలదీ
వర్తమానం గతమైపోతూ వుంటుంది,
గతమే ప్రారబ్ధం.

జీవితం ఒక (క్రికెట్) ఆట అనుకొంటే
స్కోరు బోర్డు దాని గతం,
బోర్డును పరిశీలించి ఆట ఎలా సాగిందో
ఏ తజ్ఞుడైనా చెప్పగలడు.

స్కోరు బోర్డు లాంటిదే మానవ హస్తం
స్కోరు అంకెలే చేతి రేఖలు,
ఆట సాగే కొలదీ అంకెలు మారుతుంటై
అవి భవిష్యత్తును చెప్పలేవు కాని
సూచించవచ్చు, హెచ్చరించవచ్చు.

ప్రారబ్ధవాదం కాదు నాది, ప్రయత్న వాదం ;
ప్రయత్నమే జీవితం, అది సహజ గతిశీలం !

## 154

జీవితంలో సగం వెలుగు, సగం చీకటి ;
ఇది సహజ ధర్మం.
ఒకొకసారి అంతా వెలుగే, లేక
అంతా చీకటే అనిపించవచ్చు ;
అది పరిస్థితులు కల్పించే భ్రమ,
వాస్తవం కాదు.
వెలుగును వీలైనంత ఎక్కువగా వాడుకో,
చీకటి గురించి పట్టించుకోకు !
నీ చీకటి లోకానికంతా చీకటి కాదు,
గుర్తుంచుకో !

చీకటితో పేచీ పడుతూ కూర్చోకు !
దాని నుంచి ఆత్మ రక్షణ చేసుకొంటూ పద !
నీవు చాల దూరం పోవలసి వుంది,
అమృత శిఖరాలను అధిరోహించవలసి వుంది !

నిజానికి నీవు సూర్య వేగంతో పోగలిగితే
అసలు చీకటే లేదు, తెలుసుగా ?
నీ మనోవేగం ముందు
సూర్య వేగం ఏపాటిది ?

## 155

బలవంతులు చేసే హింసను సహిస్తూ
బలహీనులకు అహింసను బోధించడం,
పరమేశ్వరు డొక్కడే – అని ప్రకటిస్తూ
పర మతాల పందిళ్లను పీకించడం,
అన్న మైతేనేం, సున్న మైతేనేం అని పాడుతూ
అన్నమంతా బలవంతులే దోచుకు తినడం
వంటి దగాలతో ఎదుగుదల ఆగిపోయి
తిరోముఖం పట్టిన నరజాతిని
అంతరించి పోకుండా ఆపగల వా రెవరు ?

నీవు ఆపగలవా ?
అంతటి అతీత శక్తి నీకున్నదా ?
ఉన్నది, పరీక్షించుకో !

## 156

పుట్టిన ప్రతి జీవీ శాశ్వతంగా బ్రతికేస్తుంటే
కొత్తజీవుల పుట్టుకకు అవకాశమే వుండదు !

పుట్టడం ఎంత సహజమో
గిట్టడం అంతే సహజం కనుక
భయపడవలసిం దేదీ మృత్యువులో లేదు.
మృత్యువు ఒక సహజ పరివర్తన క్రియ !

బొందితో కైలాసానికి పోవడం అనేది
జీవాత్మ ఆకాంక్షకు పరమ లక్ష్యం,
తాను తానుగా సంపూర్ణ స్పృహతో వుంటూ
అజరామరత్వాన్ని పొందాలి !
మోక్షాన్ని అధిగమించిన
మృత్యుంజయత్వం అది !

## 157

జీవ పదార్థాన్ని తినకుండా
జీవి బ్రతకలేదు,
ఒకదాన్ని ఒకటి తినేసుకొంటూ పోతే
సృష్టి మిగలదు !

నీవు గడ్డి తినే గొడ్డువో
నెత్తురు త్రాగే జలగవో
ప్రాణాలు తీసే పెద్దపులివో –
నీ వేట నీ ఆకలి తీరేటంత వరకే,
ఆ పైని వేటాడే హక్కు నీకు లేదు.

## 158

జంతువులూ తింటై, జంతువులూ కంటై,
జంతువులూ నవ్వుతై, జంతువులూ ఏడుస్తై,
జంతువులూ చంపుతై, ఓరి మానవుడా !
అంతకంటె నీవు ఒరగబెడుతున్నదేమిటి ?

తన క్రమ వికాస సృష్టి పథకంలో పరమాత్మ
తుది దశగా సృష్టించుకొన్న మానవుడా !
తిండికోసమే బ్రతుకుతున్నావురా నీవుకూడ ?
తిండిని కూడబెట్టుకోవడం కోసం
నీ సాటి మానవుణ్ణే దోచుకొంటున్నావు కదరా !

పరమాత్మ నీ నుంచి
ఆశించిన ప్రయోజనం ఏమిటి ?
పారిపోయి వచ్చి
తన కొంగు మాటునే దాక్కోమనా ?

నీ లక్ష్యం మోక్షం కాదు,
దాన్ని అధిగమించి జీవించడం !

## 159

తీగ, పుష్పం, పరిమళం
జీవం, శరీరం, మెదడు
ఆత్మ, మనస్సు, భావం
ఇలా పుట్టి మెరుగుతున్నదీ సృష్టి !
పుట్టుకలో క్లిష్టత వుంది
పెరుగుడులో భిన్నత వుంది
వికాసంలో దశ లున్నై –
బీజాంకురం గ్రహించే శక్తిని బట్టి,
దాని పట్టు విడుపుల నైజాన్ని బట్టి !

సూర్యకాంతి లాంటిది పరమాత్మ
సమస్త గుణ వర్ణశక్తి సమామ్నాయం అది,
దానితో సాన్నిహిత్యం ఆత్మకే వుంది
ఆత్మ వెల్లివిరిసింది మానవుని లోనే !
అందుకే, సృష్టిపై అతడి కంత కంట్రోలు !

## 160

ఒకే చెట్టు కాయల్లో
ఒకటి పెద్ద దుంటుంది, ఒకటి చిన్న దుంటుంది
ఒకే తల్లి బిడ్డల్లో
ఒకడు మంచిగుంటుండు, ఒకడు చెడ్డగుంటుండు
తరతమ భేదాలు ప్రకృతి సిద్ధాలు.

అయితే, మానవుడా !
ప్రకృతిని కంట్రోలు చేసే శక్తి మనస్సుకుంది
మనస్సుకు బలమిచ్చే శక్తి తపస్సుకుంది
తపస్సంటే ఏకాగ్రత, లక్ష్యశుద్ధి, సాధన !

తల వంచుకు బ్రతికే కంటె
తలెత్తుకు చావడం మే లనుకొనే వాడికి
చావే భయపడుతుంది, చూడు !

"హతోవా, జిత్వావా" అన్న కృష్ణుడిది
శుష్క వేదాంతం కాదు, గమనించు !
ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకుపోతే
నీవు యాచకుడివైనా త్రివిక్రముడివే కాగలవు,
క్రూరుడివైనా వాల్మీకివే కాగలవు !

## 161

మెరుపుకు రక్షణగా వెనుక
ఉరుము వస్తుంది,
పువ్వుకు రక్షణగా ముందే
ముల్లు బైలు దేరుతుంది,
మృదులమైన స్త్రీత్వానికి రక్షణ కవచమే
పరుషమైన పురుషత్వం !

జీవ లతాంతమైన అట్టి స్త్రీమూర్తిని పురుషుడు
పరదా వెనక దాచివేసిన నాడే
మానవ జాతి పతనోన్ముఖ మయింది !

స్త్రీని అధ్యాసనంపై నిల్పి, ఆమె వినోదార్థం
పురుషుడు నటరాజైన పరమ సంస్కృతి నీది !
ఏదీ ? ఏమయింది ?
నీవు ముందుకు పోలేక పోతే మానె -
పోయిన శక్తి నైనా వెదికి పట్టుకొని
పునః ప్రతిష్ఠ చేసుకో లేవా ?

## 162

సహజ వార్ధక్యంలో శరీరం శల్యావశిష్టమై
అశక్తమై అవస్థలు పడి చచ్చే కంటే
అవసరం తీరిన క్షణంలో అదృశ్యమైపోతే
ఎంత హాయిగా వుంటుంది !

స్వచ్ఛంద జననం అక్కరలేదు,పోనీ !
స్వచ్ఛంద మరణమైనా లభించవలసి లేదా ?

గారాబంగా పెరిగి, వీరోచితంగా బ్రతికిన ఒక ధీశాలి
ముదివగ్గై, అందరిలోను సిగ్గు విడిచి
దీనంగా, హీనంగా మంచాన పడి చావడం
ఏమి పరువు ? ఎవరికి పరువు ?
సృష్టి ప్రణాళికలోని ఈ లోపాలను సరిదిద్దే దెవరు ?
నీవా ? నీ విజ్ఞానమా ?

## 163

ఉదయంనీ పెదవికి అమృతం అందించిన మందారం
ప్రొద్దువాలే కొలదీ వాడిపోతూ వుంటే
మౌనంగా ఏడ్చుకోవడం తప్ప
ఏం చెయ్యగలుగుతున్నావు, మానవుడా ?
జరామరణాలు సహజం అనుకొంటూ
అసహజంగా గడిపేస్తున్నావు కాలాన్ని !

పుట్టడం గిట్టడం కోసమే అయితే
అసలు పుట్టడమే ఎందు కట ?

అజరామర జ్ఞానోజ్జీవన కోసం
నిరంతరంగా అన్వేషిస్తున్న పరమాత్మ
ప్రయత్న – వైఫల్య సూత్రాన్ని అనుసరించి
చివరకు ధరించిన రూపం మనిషే కదా ?

మరి, మనిషి చేస్తున్న దేమిటి ?
తదితర జీవజంతువులు వలెనే
ఆహారమే పరమార్థంగా బ్రతికేస్తున్నాడు !
తదితర జీవజంతువుల వలెనే
కాలాధీనుడై చచ్చిపోతున్నాడు !
ఇంకేమి టిట ఇతగాడి ప్రత్యేకత ?

## 164

ముదిమిని జయించకుండా
మృత్యుం జయుడవు కాలేవు !
ప్రొద్దు వాలితే, పోకుండా పట్టుకోలేవు !

అయినా, అమరత్వం దేనికి ?
పరమాత్మకు ఆత్మత్వ జాగృతిని శాశ్వతీకరించి
నిరంత రానందంలో ఓలలార్చడానికే కదా ?

మోక్ష కామిత్వం పలాయన వాదం,
వీధిలో గెలవలేక ఇంట్లోకి పారిపోవడం !
అందుకే మోక్షం పేరెత్త వ ద్దంటున్నాను.

కామక్రోధాదులు ఉద్రేకాలు,
అవి శత్రువులు కాదు, విజయ సాధనాలు !
సక్రమంగా వాడుకొంటూ పరిక్రమించు !
ఇంతకాలం కవితలలోనే జీవిస్తున్న అజరామరత్వం
వాస్తవం కాగలదేమో చూద్దాం !

## 165

ఒక మూలిక వుంది
అది ప్రాణం తీయగలదు
రక్షించనూ గలదు, అయితే
ఆ సంగతి దానికి తెలియదు !

ప్రకృతి నిండా ఎన్నో శక్తులున్నై
వాటినే దేవత లంటున్నై కళలూ, కావ్యాలూ ;
వాటిని గుర్తించగలదీ, స్వాధీనం చేసుకోగలదీ,
వాడుకోగలదీ ఒక్క మనస్సే !

అందుకే చెప్పుతున్నాను –
మనస్సును గతానికి కట్టి పడెయ్యకు !
స్వేచ్ఛగా ముందుకుపోనీ, విహరించనీ !

ఆచారం, సంప్రదాయం, సెంటిమెంటు
వంటి వన్నీ ప్రగతి నిరోధకాలు, గతాలు ;
మోక్షాతీత జీవసౌందర్య మంతా పరమాత్మలో వుంది,
సుశిక్షితమైన మన స్సొక్కటే
దానిని అందుకో గలిగి నట్టిది !

## 166

భౌతిక విజ్ఞానం నిన్ను దాటి పోలేదు,
నీవే దానిని దాటి పోగలగాలి !
మనస్సును పోలీసు కుక్కగా మారిస్తే
అది విశ్వరహస్యాలను పసిగట్టగలదు,
పంచ కల్యాణిలా పోనిస్తే
విశ్వసౌందర్యాలను రుచి చూపగలదు !
అయినా, అది నీ చేతిలోదే కదా !

పాంచ భౌతిక శారీరివైన నీవు
భూమిని విడిచి పోలేవు !
మనస్సు పోగలదు కాని, అది ఆత్మగతం !
ఆత్మ శరీర గతం !

అగ్నితోపాటు దాని జ్వాలా, కాంతీ కూడ పోయేలా
శరీరంతోపాటు ఆత్మా, మనస్సూ కూడ పోతున్నై !
అలా పోకుండా శరీరం తరిగి, కరిగి
ఆత్మగా మారి మాయం కాగల్గితే !

## 167

పాప కర్మ వలెనే పుణ్యా కర్మ కూడ
మోక్ష సాధకం కా దంటుంది వేదాంతం,
నిష్కర్మ కూడ మోక్ష సాధకం కాదట !
నిష్కామ కర్మ ఒక్కటే మోక్ష సాధక మట !

నిష్కామ కర్మ అనేది ఒక బంగారు లేడి,
అటువంటి దెక్కడా వుండదు.

ప్రతి పనీ ఏదో ఒక ఫలితం కోసం చేయబడేదే,
ఫలితం అనుకూల మైతే సంతోషం
ప్రతికూల మైతే విచారం సహజం.

నిర్వికారమనస్కత పనిఫలితానికి తరువాతిది,
పనికి ముందుది కాదు.

మోక్షానికి షరతులు లేవు,
భక్తి జ్ఞాన వైరాగ్యాలు మోక్షమార్గాలు కావు,
జీవిత మార్గంలో ప్రయాస తీర్చే పాథేయా లవి !
మోక్షానికి ఏ మార్గమూ అక్కరలేదు.

## 168

జీవ జాతు లన్నిటి లోకీ
మానవ జాతి పరమ శ్రేష్ఠం !
సౌందర్యం, రసం, ఆనందం వీటి పరమానుభూతి కోసం
పరమాత్మ నిర్మించుకొన్న స్వగృహం మానవ దేహం !
అందుకే, దీని ఆంతరంగిక నిర్వహణాపై
ఆత్మకు కూడ అధికారం లేదు !

అనంత గుణ క్రియా సంకులమైన సృష్టిలో
ఎప్పుడూ ఏదో ఒకటి జరుగుతూనే వుంటుంది.
అనుకోని సంఘటనను దైవికం అంటాం
అదృష్ట మనో, దురదృష్ట మనో అంటాం
కర్మ అనుకొంటూ తృప్తి పడతాం.
అవి మనం అనుకొనే మాటలు,
అలవాటైన మాటలు, అంతే !

దైవం స్వజన రక్షకుడూ, పరజన శిక్షకుడూనా ?
అవు నంటున్నది మన మత సాహిత్య మంతా !
అందుకు ఉప బలకాలుగా సృష్టించబడి నట్టివే
పరలోకాలు, కర్మబంధాలు, పునర్జన్మలు, మోక్షపంథాలు !
అవన్నీ శిశు ప్రాయుల వూహలు !
స్వార్థ పరుల ప్రచారాలు !
వాస్తవాలు కావు !

## 169

ఒకడు కోరికను చంపుకోమంటాడు,
కోరికకు మూలం మనస్సు కనుక
మనస్సునే చంపుకోమంటా డింకొకడు !

మనస్సు నశిస్తే –
ఆత్మ నిరామయ మవుతుం దట
అప్పుడు "కాలువ లాకు" న్యాయం పనిచేసి
ఆత్మ పరమాత్మ మట్టానికి పెరిగి
దానిలో లయమై పోతుం దట !

ఇంత కఠిన యమ యోగమూ
తన మెడమీదనే వున్న మేకపిల్లను
వెదికి పట్టుకోవడం కోసం !
తనంతట తానే లభించే మోక్షం కోసం !

## 170

మనస్సును అదుపులో పెట్టుకోవచ్చు,
అంతం చెయ్యడ మేమిటి ?
మనుగడకు వేడి మనస్సే కదా !

వేడి తగ్గితే చలి, వేడి హెచ్చితే మంట
రెండిటి సమానీకరణమే చలిమంట !
చలి దిగువ మట్టం ఖననం
మంట ఎగువ ఘట్టం దహనం
ఇవి రెండూ జీవ తరంగాల అవధులు.

మానసం లోని తరంగాలివి,
వాటి నడుమ క్రీడించే హంసే ఆత్మ ;
మనస్సు లేకపోతే ఆత్మ నిష్ప్రయోజకం.
జీవిత లక్ష్యం ఆత్మ పురోహితం
తిరోగతం కాదు.

## 171

ఏ పురాణ సాహిత్యాన్నైన పరిశీలించి చూడు !
ఎంతో తపస్సు తర్వాత దేవుడు ప్రత్యక్ష మైతే
చావు లేకుండా వరం కోరుకున్న వాళ్ళే చాల మంది !
అయితే, అది ప్రకృతి విరుద్ధం కనుక ఫలించలేదు.

తమకు సహజంగా లభించగల
మోక్షాన్నే కోరుకొన్నారు అమాయకులు !

ఈ నాటికీ గుడులలో దేవుణ్ణి కోరుకొనేవి
ఆయు రారో గ్యైశ్వర్యాలే కదా !
ఇవన్నీ ఆధునిక విజ్ఞానం తీర్చగల కోరికలే !

"బ్రతుకు, బ్రతక నివ్వు" అనే నీతిని
ప్రతి వ్యక్తీ త్రికుద్ధిగా అమలు పరిస్తే
నివారణ కాగలవే ఈ మానవ సమస్యలన్నీ !

## 172

ఇంత ప్రియమైన జగత్తు నుంచి
ఏదో తెలియని శూన్యంలోకి ఒంటరిగా
శాశ్వతంగా నిష్క్రమించడం నిజంగా
ఎంత దుఃఖోల్లోలం !

ప్రేమలు, వాత్సల్యాలు, అనురాగాలు
నేత్రపర్వాలు, వీనుల విందులు, స్పర్శా సుఖాలు
కనిపెంచిన అనుబంధాలు -
అన్నిటినీ వదిలేసి పోవలసిన దుర్భర దుఃఖం !
ఎవరు ఓదార్చగలరు ?
ఎంత భక్తి, ఎంత జ్ఞానం, ఎంత వైరాగ్యం
మృత్యు ముఖంలో చిరునవ్వును చూపగలవు ?

## 173

ఒక దుఃఖితుండు తన దుఃఖానికి కారణం
పూర్వ జన్మ కర్మ అనుకొంటాడు,
అలా అనుకోవడంలో అతడికి ఓదార్పు వుండవచ్చు !
మందులేని వ్యాధికి మత్తుమందే శరణ్యం కదా !

ప్రారబ్ధం, ఋణానుబంధం, పురాకృతం
వంటి వన్నీ పెయిన్ కిల్లర్లు ;
దుర్భర బాధా నివారణ కోసం వాటిని వాడడం
తప్పదు ఎంత గొప్ప డాక్టరుకైనా !

నీ వెంతటి హేతువాదివో, విజ్ఞానివో అయినా
తల పోటుకు ఆస్పిరిన్ వాడవా ?
మూఢ విశ్వాసాల పూర్తి నిర్మూలనకు కూడ
తచ్ఛాంతి చికిత్స లవసర మవుతై ! గుర్తించు !

## 174

కర్మ బంధం నుంచి వెలువడడమే
మోక్షం అంటుంది మన వేదాంతం !
అది వేదాంతం కాదు, అపోహ !

కదలిక సృష్టి స్వభావం,
ప్రతి కదలికా ఒక పనే, కర్మే.
ప్రతి పనికీ వుంటుం దేదో ఒక ఫలితం !

ఆత్మ చేసే ఒక పని
ఆత్మనే కట్టి పడవేస్తుందా ?
కర్మకు వ్యక్తిత్వమే లేదు,
కర్తృత్వ మెక్కడిది ?

## 175

ఎడ తెగని పనే జీవితం,
జీవితం లోని ప్రతి కదలికా పనే, కర్మే !
కర్మ లేకుండా జీవించడమే లేదు,
కర్మ వేరూ, జీవితం వేరూ కాదు.

కర్మకు వ్యక్తిత్వం కల్పించడం
ఆత్మను దానికి బానిసను చెయ్యడం
పునర్జన్మకు హేతువు కర్మే అనడం
ఈ అబద్ధాన్ని నేటికీ ప్రచారం చెయ్యడం
పూర్వకాలపు బానిసరాజ్య వ్యవస్థను
ఇంకా కొనసాగించడం మాత్రమే కాదా ?

## 176

మరణ శయ్యపై, వృద్ధాప్యంలో, కోమాలో
తన ఆత్మీయులనే గుర్తు పట్టలేని ఆత్మకు
తనను తానే మరిచిపోయిన ఆత్మకు
పునర్జన్మ ఎలా వుంటుంది ?

దేహాన్ని జీర్ణ వస్త్రంలా తీసి పారవెయ్యడానికి
అసలు తాను జీర్ణం కాకుండా వుంటేగా ?
పని చేసిన ఇంద్రియాలు ముందే పోగా
చేయించిన ఆత్మకు స్ఫురణే పోగా
మిగిలే దేమిటి ?

మరణం తర్వాత ఏదో మిగులుతుం దనుకోకు !
నీ వారసులు సజ్జనులు కాకపోతే
నీవు దాచుకొన్న కోట్లు కూడా మిగలవు.

## 177

నీ ఇంటిని ఎవడో ఒక దొంగ దోచా డనుకో,
గత జన్మలో అతడి ఇంటిని
నీవు దోచా వన్న మాటేనా ?
కర్మ సిద్ధాంతం ఆచరణలో అంతే మరి !
క్రియకు ప్రతి క్రియ

కాగా –
నీవు కర్మ సిద్ధాంతాన్ని నమ్మే వాడివైతే
పోలీసులకు ఫిర్యాదు చేసే హక్కు నీకు లేదు.

"అంతా కర్మ, ప్రారబ్ధం !
మన చేతుల్లో ఏముంది ? అంతా ఆ పైవాడి ఇచ్ఛ !"
అనుకొంటూ కూర్చుండి పోవడంలో
నీకు ఓదార్పు లభిస్తున్నదా ?
సరే, అలాగే కూర్చో !
అయితే, అది బాధను జోకొట్టడానికి
తీసుకొనే మత్తు మందు మాత్రమే !
బాధా నివారణకు ఏకైక మార్గం
అపజయాలను ఎదిరించి జయించడం !

## 178

జ్ఞానం అంటే నిన్ను నీవు తెలుసుకోవడం
అంటే నీ వస్తుగుణ మేమిటో గుర్తించడం.
కర్తవ్యం అంటే నీదైన అట్టి గుణాన్ని
స్వ పర ప్రయోజకంగా నియమించడం.
అట్టి నియమిత గుణ ప్రవర్తనమే జీవితం,
ఫల పుష్ప పత్ర విన్యాసమే దాని పరమార్థం !
జ్ఞాన ప్రయోజనం మోక్షం కాదు,
జీవిత పురోగమనం !

## 179

మానవుడా ! జ్ఞానరూపం ధరించు !
విజ్ఞాన లతా లతాంతంగా వికసించు !
ఎవరి ఆలోచన మీదో ఆధారపడకు,
నీకు నీవే ఆలోచించడం నేర్చుకో !

సొంత బుద్ధితో పురోగమించడమే
సుఖ జీవిత మంటే,
పరమాత్మ మనిషిగా మారింది
సుఖ జీవితం కోసమే !

మాలిన్యాలను విదల్చుకొంటూ
మాధుర్యాలను పండించుకొంటూ
విశ్వవిహారం చెయ్యి !

## VII జీవితలక్ష్యం సుఖంగా జీవించడం

ఆకలికి అన్నం లభించడం సుఖం

లభించక పోవడం దుఃఖం.

భక్షణ, విజ్ఞానం, కామం, భద్రత, నిద్ర

జీవి సహజ అవసరా లివి.

అవసరాలు తీర్చుకోవడం కోసం
జీవి చేసే కృషే జీవితం.

సామాన్య కృషి చాలక పోవచ్చు -
పోరాటమే జరపవలసి రావచ్చు -
తనతో పాటు సహజీవనం నెరపుతున్న జీవకోట్లు
పోటీ పడినప్పుడు, అడ్డం వచ్చినప్పుడు !

కష్టపడినా, దుఃఖపడినా సుఖం కోసమే
త్యాగం, సహనం, తృప్తి వంటి వన్నీ సుఖం కోసమే.

## 181

నీవు నిర్గుణ నిరాకార పరమాత్మవు, సరే -
మరి, నీ సగుణ సాకార జన్మకు ప్రయోజన మేమి ?
తిరిగి అదే అవ్యక్తంలో కరిగిపోవడమేనా ?
అయితే, అందుకు నీ ప్రయత్నమెందుకు?
జన్మకు జీవించడమే ప్రయోజనం,
జీవితానికి ఆనందమే పరమావధి !

సుఖంగా జీవించాలి, కనుక
శక్తి లేకుండా సుఖం వుండదు, కనుక
ఏదో ఒక శక్తినైనా వశం చేసుకోవాలి.

శక్తి హీనుడు సుఖపడలేడు
సంపూర్ణ శక్తిమంతుడే సర్వేశ్వరుడు
అట్టివాణ్ణే పురుషోత్తము డంటున్నాను !

# 182

కనుక, మానవుడా !
నీవు జీవించు, సుఖంగా జీవించు !
నీతో పాటు నన్ను కూడ జీవించనీ !

మ నిద్దరం ఒకే పరమాత్మ అంశలం కదా ?
ఏదో ఒక శక్తి నా లోనూ వుంటుంది,
అది మిత్ర శక్తి కావచ్చు, శత్రు శక్తి కావచ్చు.

ఇద్దరూ శాంతి కాములే అయితే సుఖం
ఇద్దరూ క్రూరులే అయితే దుఃఖం !
ఒకడు సాధువూ, ఒకడు క్రూరుడూ అయితే ?
సాధువు బాధపడక తప్పదు కదా ?

సాధుశక్తి బాధపడే కొలదీ అది
చండ ప్రచండంగా విజృంభిస్తుంది,
తెలుసు కదా ?
అందుకే, చెపుతున్నాను, విను !
నీ వెంతటి మదమాత్సర్యాలు కల దాదా వైనా
తుది గెలుపు సాధువుదే !
జీవలత లక్ష్యం పుష్ప సౌందర్యమే,
కంట కోన్మాదం కాదు !

## 183

సుఖమే జీవితం కనుక
సుఖానికి శాంతి అవసరం కనుక
నీ వెంతటి ఉద్ధతుడి వైనా
శాంతికి భంగం కలిగించకు.

పులి తన క్రౌర్యాన్ని వదులుకోలేదు
మానవుడు వదులుకోగలడు.
సర్వ గుణాలనూ వదులుకొంటూ
సత్వాన్ని పెంపొందించుకొనే శక్తి
ఒక్క మానవుడికే వుంది.

నీవు సుఖ పడా లంటే
నీ పొరుగు వాణ్ణి సుఖ పడనివ్వాలి,
ప్రపంచ శాంతి కిదొక్కటే మార్గం.

## 184

కోటి విద్యలూ కూటి కోసమే అయినప్పుడు
కూడు పెట్టే ప్రతి విద్యా పరమాత్మీయమై నట్టిదే.
నీ వే విద్యను ఆశ్రయిస్తావో
ఆ విద్యనే ఆరాధిస్తూ జీవించు !

విద్యల మధ్య హెచ్చు లొచ్చులు లేవు,
గౌరవ న్యూనతలు లేవు, కార్యాకార్యాలు లేవు.
భేదా లన్నీ సాంఘిక మైనట్టివే,
పార మాత్మికాలు కావు.

భేదా లెంచకు, నీతులు చెప్పకు,
సుఖ జీవన కాంక్ష అందరికీ వుంది.
తన కేది వస్తే అదే తన విద్య,
తన కేది సుఖమో అదే తన నీతి.

భేదాలకు, ఘర్షణలకు హేతు వేమిటి ?
మనందరికీ చాలినంత కూడు
మన ముందు లేకపోవడమే !
కూటిలోకి వస్తున్న జీవ పోషక శక్తి
నేరుగా మనలోకి రాక పోవడమే !

## 185

ఆట పాటలు, వేడుకలు, కళలు, విద్యలు
పూజలు, ఉత్సవాలు, తీర్థాలు
ఏవీ వ్యర్థమైనట్టివి కావు !
అన్నీ ఆత్మకు హాయి నిచ్చేవే !

దేనినీ అజ్ఞానంగా తోసి వెయ్యకు
జ్ఞానా జ్ఞానాలు సాపేక్షకాలు.

నిన్నటి జ్ఞానం నేటికి
అజ్ఞానంగా మారి నప్పుడు
నేటి జ్ఞానం రేపటి వరకూ
జ్ఞానంగానే వుండకపోవచ్చు !
మానవుని ప్రతి ముందడుగూ
అజ్ఞానం నుంచి జ్ఞానంలోకి పడుతున్నట్టిదే,
ముందున్న వెలుగు నీడగా వెనుకబడుతన్నట్టిదే,
అది అనంతంగా సాగే పరిణామ యాత్ర !

## 186

ఎంత కాలం బ్రతికా వన్నది కాదు ప్రధానం
ఎలా బ్రతికా వన్నది !

ఏ వృత్తిలో రమిస్తున్నా
ఏ క్షేత్రంలో శ్రమిస్తున్నా
శ్రమ ఫలితాన్ని ఏ విధంగా గ్రహిస్తున్నా
నీవు మానవుడవు, మరచిపోకు !

మత ప్రవర్తకులు, నీతి బోధకులు, స్మృతి కర్తలు
ఎవరేం చెప్పినా చెప్పనీ –
ఆ చెప్పిన సూక్తులలో ఏ ఒక్కటైనా
ఎప్పుడైనా అమలు జరిగిందేమో పరిశీలించు ?

కనుక, మానవుడా !
బ్రతికినంత కాలం స్వతంత్రంగా బ్రతుకు !
శక్తికొలదీ సంపాదించు !
నీ సంపాదనను ఇతరులకు పంచుతూ
ఇతరుల సంపాదనలో పాలు పంచుకొంటూ
పురోగమించు, అదే జీవిత పరమార్థం !

## 187

మానవుడా ! నీ లక్ష్యం ఏమిటి ?
ఏ పనిలో నీకు ఆసక్తి వుంది ?
ఏ పనిచేస్తే ఆనందం కలుగుతున్నది ?

ఆడుకోవాలని వున్నదా ?
ఆటే నటరాజు, క్రీడే కృష్ణుడు !
పాడుకోవాలని వున్నదా ?
పాటే సరస్వతి, లక్ష్మి !
చదువుకోవాలని వున్నదా ?
చదువే చతుర్ముఖ బ్రహ్మ !
ఉద్యోగం చెయ్యాలని వున్నదా ?
ఉద్యోగమే ఉగ్ర గణపతి !

నీకేం చెయ్యాలని వుంటే
అదే నీవు చెయ్యవలసిన పని !
అదే నీలోని పరమాత్మ
నీ నుంచి పొంద తలచిన పూజ, లాజ !

## 188

శక్తిని పోషించు, పూజించు, ప్రయోగించు,
అది ఏ రూపంలో నిన్ను అలరిస్తే ఆ రూపంలో !
రూపారాధన, వ్యక్తి పూజ తప్పేం కాదు -
ఆ రూపంలో నీకు రసాద్వైతం సిద్ధించినప్పుడు,
ఆ వ్యక్తి నీకు మార్గ దర్శక మైనప్పుడు.
అయితే, ఒక్క వాస్తవం ఎరిగి వుండు -
నీ పూజలు, నీ ఆరాధనలు, నీ ప్రయోగాలు అన్నీ
నీ ప్రగతి కోసం నీవు చేసుకొనేవే !
నిన్ను నీవు ఉత్తేజ పరచుకొనేవే !
నీకు వినా మరొక శక్తి ఏదీ లేదు,
అన్ని శక్తులూ ఒకే పరమాత్మ !

## 189

ఏ జన్మ కాజన్మే సర్వ స్వతంత్రం,
ఏ బ్రతుకు కాబ్రతుకే స్వయం చోదితం !
సామూహిక జీవితం ఆత్మ రక్షకే,
ఆత్మ వికాసానికి కాదు.

సమాజం సమంగా, సుందరంగా
పాల పుంతలా ప్రకాశించాలి
పూల తోటలా వికసించాలి.

నిజమే, కాని -
సూర్యుని జగన్నాయకత్వమూ
చంద్రుని ఓషధీశత్వమూ స్వార్జితాలే !
స్వయం ప్రతిభతో సిద్ధించినట్టివే !

ఎందరో వ్యక్తుల బహుముఖ ప్రతిభల
సరాసరి ప్రతిభే జాతి ప్రతిభ,
నీ జాతికి నీవు చిరుచుక్కవే కాదు,
వేగుజుక్కవే కావచ్చు !
ఎక్కడి వాడి వక్కడే నిలబడి పోకు !
జీవాణువు తన శరీరాన్ని వలనే
ఆత్మ తన జీవితాన్ని తానే నిర్మించుకొంటుంది,
దాని క్రమాభివృద్ధికి తోడ్పడు !

## 190

నీళ్ళలో బుడ బుడ శబ్దాన్ని
ఏను గనుకొన్నాడు దశరథుడు,
బంగారు మాయ లేడిని
నిజం లేడి అనుకొన్నాడు రఘురాముడు.

సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నాడని,
వాయువు, అగ్ని, జలం వంటి ప్రకృతి శక్తులు
మానవుని ప్రార్థనల్ని మన్నిస్తాయని,
నిజంగానే నమ్మారు పూర్వర్షులు !

అవన్నీ అపోహాలే కదా ?
దేవుడు కూడ ఒక అపోహ !

అయితే మరి, రోజు రోజుకూ జనంలో
భక్తి ఎక్కువై పోతున్నదే అంటావా ?
అందుకు రెండు కారణాలు -
మతంలో రాజకీయాలు చేరడం,
వ్యక్తిలో నిరాశా నిస్పృహలు మితి మీరడం !

## 191

దైవ కృప కోసం, బాధానివారణ కోసం యాత్రికులై
ప్రార్థనలు చేసే కోట్లాది జనం

తమ అందరి కోరికలూ తీరే ప్రణాళిక పైకి
ఒక్కసారి దృష్టిని సారిస్తే –
ఏ దైవమూ ఇంతవరకూ ఇవ్వలేని సుఖశాంతుల్ని
తామే సాధించుకోగలరు కదా !

కనుక, మానవుడా ! జాగృతుడవు కా !
నిన్ను గతానికి కట్టి పడవేసి వుంచిన
అపోహల నుంచి బైటపడు !

పరమాత్మ ఆత్మగా అవతరించింది
మోక్షంకోసం కాదు, జీవితం కోసం !
సుఖ జీవితం కోసం
నిత్య జీవితం కోసం !

లేచి నిలబడు !
ముందుకు నడు !

## 192

కుల మత వర్గ దౌర్జన్యాలను ప్రతిఘటించకుండా
నీతులు చెప్పేవాణ్ణీ, నినాదాలు చేసే వాణ్ణీ,
అవసరాలు తీర్చకుండా
ఆధ్యాత్మిక బోధలు చేసే వాణ్ణీ నమ్మకు !

అందరూ ఏక లక్ష్యోన్ముఖు లైతే
ఆనంద సామరస్యం ఎందు కేర్పడదు ?
ఆత్మలన్నీ ఒకటే అయినప్పుడు
అందరం కలిసి సమానంగా ఎందుకు బ్రతకలేము ?

పరమాత్మీయులైన, ప్రతిభావంతులైన
సమతా వాదు లంతా కలవండి !
స్వప్రయోజనాలను సంత్యజించండి
నిజమైన ప్రజా ప్రతినిధులుగా నిలవండి
సోషలిస్టు ప్రణాళికను అమలు జరపండి !

ఆరు అవసరాలనూ ఫ్రీగా తీర్చడమే
నా ఆత్మీయ సోషలిస్టు ప్రణాళిక !
సామూహిక సౌఖ్యమే దాని దేహం,
వైయక్తిక వికాసమే దాని సోహం !

## 193

రాజస తామసాలూ పరమాత్మ గుణాలే,
సాత్త్వికమూ పరమాత్మ గుణమే,
వాటి ఆవేశమే క్రియా శక్తి.

మొదటి రెండూ క్రూర శక్తులు
అవి సృష్టించేది బాధనూ, దుఃఖాన్నీ, కనుక
ప్రకృతి నుంచి వాటిని నీవు తొలగించ గలగాలి !

పరమాత్మ మానవ రూపం ధరించడం
సర్వ గుణైక సముత్సేకం కోసం,
రాజస తామసాలను అధిగమించిన
అపమేయ సుఖ శాంతుల కోసం.

అది జరగనప్పుడు,నీ చేత కానప్పుడు,
సాధువు క్రూరుణ్ణి నిర్మూలించ లేనప్పుడు,
మానవుణ్ణి జంతు వర్గంలోకి నెట్టేసి
మరొక ఉత్తమ రూపం మొలకెత్త వలసి లేదా ?

## 194

ఆత్మ జన్మకు వచ్చిపోవడం
కుక్క సంతకు వచ్చి పోవడం వంటిదేనా ?
దొరికింది తింటూ బ్రతికిపోవడాని కేనా ?

కుక్క విషయంలో అంతే,
మనిషి మాత్రం తాను తిన్నంత తిని కూడ
తన వాళ్ళకోసం దాచిపెట్టి పోతాడు !

మనిషి కుక్క కంటె స్వార్థపరు డెందుకయ్యాడు ?
కుక్క పిల్ల కంటె మనిషి బిడ్డ
స్వయం పోషణ చేసుకోలేని వ్యర్థుడా ?
మానవ జన్మలో ఉత్తమోత్కర్షను సాధించిన ఆత్మ
లక్షించిన పరమార్థం ఏమిటి ?

అలసి, సొలసి, చిక్కి శల్యమై
తిరోముఖం పట్టడానికి కాదు,
ఆత్మ జన్మకు వచ్చింది
అమృత చేతన కావడానికి !

## 195

పూర్వం రాక్షస బల్లు లుండే వట
రాక్షసు లుండే వారట
నర భక్షకు లుండే వారట
అని ఇప్పుడు మనం చెప్పుకొంటున్నాం !

కొంతకాలం తర్వాత –
పులు లనబడే క్రూర జంతువు లుండే వట
అవి మనుషుల్నే తినేసే వట
అని చెప్పుకొంటారు.

అలాంటి దుష్ట జీవుల వరసలో
స్వజాతి హంతగా నిరసించబడి
మానవుడు కూడ నశించి పోవచ్చు
ఈ నాటి దౌర్జన్యాలను బట్టి చూస్తే !
మానవుడా ! ఆలోచిస్తున్నావా ?
స్వార్థానికీ, క్రౌర్యానికీ, హింసకూ
భవిష్యత్తులో స్థానం లేదు,
జాగ్రత్త పడు !

## 196

నీవూ పరమాత్మే, నేనూ పరమాత్మే కనుక
నిన్ను నేను, నన్ను నీవు ఆకర్షించుకోగలం,
వికర్షించు కోనూ గలం !
కౌగిలించు కో గలం,
ఖండించుకోనూ గలం !

రాపిడి, స్పర్థ, పోటీ, పోరాటం
కష్టనష్టాలకు కారణాలైనా
అవి ప్రకృతి విలాసాలు,
అభ్యుదయానికి ప్రేరకాలు.

బలా బలాలు ప్రధానం కాదు,
గెలుపోటములు తప్పొప్పుల సూచికలు !

రాపిడి లేకుండా నెరసు పుట్టదు !
రాగ ద్వేషాల జంటల నుంచే
సహ జీవనం పుట్టి పెరగవలసి వుంది !
కనుక –
ఘర్షణకు బెదరిపోకు,
కాలుష్యాన్ని పెరగనీకు.

## 197

నేనే భాషలో మాట్లాడినా అది నీకు
నీ భాషలో వినిపించడం నాదబ్రహ్మ,
నాలో నీవు, నీలో నేను కనిపించడం
జ్యోతిర్బ్రహ్మ,
ఎక్కడ ఎవరిలో ఏ భావ వీచిక పుట్టినా అది
నీ మనస్తీరాలకు తట్టడం సగుణ బ్రహ్మ.

స్ఫూర్తి ఎక్కడిది ?
కొత్త కొత్త భావా లన్నీ ఎక్కడివి ?
పరమాత్మలోవి.

కుంభ కటకం సూర్యకాంతిని వలె
మనస్సును ఏకాగ్రం చేసుకో !
నీలోని పరమాత్మ అపుడు
నీ ముందు స్వస్వరూపంతో జ్వలిస్తుంది,
అడు గడుగునా విజయ శంఖమై రణిస్తుంది !
నీవు నీవుగా జీవిస్తూనే
జీవబ్రహ్మవు కాగల్గుతావు !

## 198

తినే నోళ్ల సంఖ్య పెరుగుతున్నది
తిండికోసం పోటీ మితిమీరుతున్నది.

భక్తిముక్తుల ఎండమావులతో దుష్టులు
సామాన్యుల నోళ్లను తడుపుతూ
ధనధాన్యాలతో తమ నోళ్లను నింపుకొనే యత్నం
దినే దినే కాలుష్యం పెంచుతున్నది.

రాజసం తామసం రెండూ ఎగబడి
సత్వాన్ని తినేస్తున్నై, చూడు !
వాటిని ఎదిరించి నిర్జించగల శక్తిని
సాత్వికం సమకూర్చు కోకుండా
నరజాతికి సుఖశాంతు లెలా లభిస్తై ?

అందుకే, మానవుడా
రజస్తమస్సులను అదుపుచేసి, సాత్వికుడవు కా !

తిండిని అందరికీ సమంగా అందించు !
దుష్ట శిక్షణ మాత్రమే కాదు నీ కర్తవ్యం,
అసలు దుష్టులే పుట్టని వ్యవస్థను నిర్మించడం
కావాలి నీ ఆదర్శం !

## 199

నీ జీవితం నీ చేతిలో వుంది
నీ శక్తి నీ మనస్సులో వుంది
నీ కష్టసుఖాలు నీవు కల్పించుకొంటున్నవి.

సుఖం ద్వారా కంటె కష్టం ద్వారానే
పురోగమనం సులభతరం,
కనుక, కష్టాన్ని నిరసించకు !

కష్టపడు, కృషి చెయ్యి,
అధర్మాన్ని సహించకు,
అవరోలను ప్రతిఘటించు, పోరాడు !

అప్పుడే నీవు హేతువాదివి
అప్పుడే నీవు మార్గదర్శివి
అప్పుడే నీవు పూర్ణ మానవుడివి !
పూర్ణ మానవుడే పురుషోత్తముడు !

## 200

ఆహారం కోసం మొక్కను పెంచుతాం
ఆనందం కోసం వీణ వాయిస్తాం
విజ్ఞానం కోసం పరిశోధన చేస్తాం
దేహానికీ, హృదయానికీ, మెదడుకూ మేత లివి.

ఇందులో ఏది కొరవడినా
ఆ జీవితం సమగ్రం కాదు,
ఆ జాతి స్వతంత్రం కాదు !
అట్టి జీవాత్మవల్ల పరమాత్మ ఇచ్ఛ తీరదు కనుక
అది వెనుకకు నెట్టి వేయబడుతుంది !

వెనుకబడిన తనం సహించరానిది,
అశక్తత ఎవరి కైనా స్వయంకృ తాపరాధమే,
ఏ తల్లి అయినా సమర్థుడైన కొడుకునే
అభిమానిస్తుంది, ఆసరా ఇస్తుంది !
పరమాత్మ కూడ అట్టి తల్లే !

## 201

మోక్షం గురించి మొదలు పెట్టి
సాంఘిక న్యాయం గురించీ
రాజకీయ కర్తవ్యం గురించీ కూడా
చెపుతున్నాను కదూ ?

అవును
జీవికి జీవించడమే ప్రధానం కనుక,
మానవుడికి జీవించడంతోపాటు
సుఖంగా సుందరంగా జీవించడం సైజం కనుక,
సాంఘిక న్యాయం అందరికీ అందాలి !
అట్టి కృషిని రాజకీయం చేపట్టాలి !

ప్రతి వ్యక్తికీ కనీసావసరాలను తీర్చలేకపోతే
అది రాజకీయం కాదు, రాబందీయం !
రాబందీయం నుంచి వెలువడ్డ మోక్షమే
మానవుడికి నిజమైన మోక్షం !

## 202

నిజాయితీతో, నిర్దుష్టంగా, మహితాత్ముడై
మానవుడు పురోగమించాలని నీ కున్నదా ?
నీ కోరిక అసాధ్యమైనదేమీ కాదు,
నీలో నిజాయితీ వుంటే చాలు.
తిండి, వసతి, విద్య, పని, వైద్యం,
వృద్ధ సంక్షేమం – ఈ ఆరు అవసరాలూ
ఫ్రీగా లభించే గ్యారంటీ వుంటే
మనిషి మోసగా డెందు కవుతాడు ?

పరులను పీడించి అయినా ధనాన్ని
కూడబెట్టి దాచుకోవడానికి హేతువు
భవిష్యత్తుకు భద్రత లేకపోవడమే కదా ?

భద్రత కలిగించవలసింది ప్రభుత్వం,
ప్రభుత్వం సోషలిస్టు అయినప్పుడే అది సాధ్యం.
అవసరాలు తీర్చలేని
ఆధ్యాత్మ కీర్తన లెందు కోసం ?

## 203

నాకు దేవుడులేడు, పరమాత్మ వుంది,
సమస్త గుణ రసార్ణవం పరమాత్మ, కనుక
పరమాత్మనే రకరకాల పేర్లతో పిల్చి
పలు అభిలాషలతో ఆరాధిస్తాను నేను.

అభిలాషలే వూహలు, యోచనలు, వ్యూహాలు
అవి మనస్సు నుంచి పుట్టేవి.
మనస్సుకు లభించే పూజా ఫలాలు భావాలు,
అవి పరమాత్మ నుంచి ప్రసరించేవి.

తన అనుభూతి పరిధిని దాటి ఊహించలేడు,
అనుకూల భావాలను తప్ప స్వీకరించలేడు మనిషి!
నాకు పరమాత్మ రమ్య, రాజ్యద, రోహిణి !
నీ కేమిటో నీవే నిర్ణయించుకో !

## 204

నా కావ్య వస్తువు మానవుడు
కలిమి లేములు, సుఖ దుఃఖాలు,రసభావాలు
వస్తు చిత్రణలో నేను వాడే ద్రవ్యాలు.

నా కావ్య నాయకుడు ప్రాథమికంగా ఏమీ లేనివాడు,
కృషిద్వారా చివరకు అన్నీ సాధించిన కలవాడు.

మానవుణ్ణి లేమినుంచి కలిమికి నడిపించే
ప్రణయం ద్వారా పరమైశ్వర్యాన్ని అందించే
రసానంద ప్రణాళిక నా కావ్యం.

జీవిత సంపూర్ణ వికాసమే జీవాత్మ లక్ష్యం,
వికాస రసాస్వాదన సారంగమే ఆత్మ,
దాని ఆనంద పారవశ్యమే బ్రహ్మైక్యం.

దీనికి ఎవరి మార్గ దర్శకత్వమూ అక్కర లేదు
ఎట్టి నియమ నిబంధనలూ అక్కరలేదు
ఇది నిత్య నిరంతర సృష్టి స్థితి లయ క్రియ !

నీలో, నాలో, మన చుట్టూ, విశ్వం నిండా
ఇదే లీల, ఇదే డోల !
డోలలో మృత్యువును దాటి పోవాలి,
మోక్షాన్ని అధిగమించి
నిత్య చైతన్య హేలవే కావాలి !

## 205

గుణా లన్నిటిలోకి సత్వమే ప్రధానం, కనుక
నీవు సాత్వికుడివి కా !
రాజస తామస వైరస్యాలను నిర్మూలించు !
కనీస అవసరాలు తీర్చి, మనీషా స్థాయిలో
మానవ సమాజాన్ని మహితాత్మకం చెయ్యి !

మంచీ, చెడ్డా, జ్ఞానం, అజ్ఞానం అనేవేం లేవు,
బహు జన సంక్షేమం, విశ్వ శ్రేయస్సు కోరి
నీ వెటు సాగితే అదే ప్రగతి,
నీ వేమి చేస్తే అదే సుకృతి !

స శరీర సమనస్కంగా ఏకాత్ముడవై
అవతార మూర్తిత్వం వహించు !
మృత్యుంజయుడవై, మానవోద్ధర్తవై
మహా మహస్సునే పాలించు !

## 206

దైవం అనేది ఒక ఊహ !
దయకు, ఔదార్యానికి, శక్తికి, అభయానికి
పరమ సంకేతంగా రూపొందించుకొని
మానవు డారాధించుకొనే స్వభావ శిల్పమే దైవం !
నిజానికి నీ శక్తే నీ దైవం, నీ మనస్సే నీ శక్తి.

మనస్సును ఏకాగ్రంగా వికసింప జేసుకో,
పరమాత్మ లక్ష్యం అదే నన్న సత్యాన్ని మరవకు !
మరుపే మృత్యువు,
నిరంతర స్ఫూర్తే అజరామరత్వం !
నీ అస్తిత్వమే నీ దైవత్వం
నీ జీవితమే నీ అస్తిత్వం ;
నీవు ఎక్కడ, ఎప్పుడు, ఏ తెగలో జన్మించినా
మొత్తం మానవజాతికే ఉమ్మడి బిడ్డవు !
కనుక, తెలుసుకో !
కాంతిని కూర్చుకో !

## 207

అద్వైతాచార్యుడికి లభించే మోక్షమే
అమాయకపు రైతుకూ లభిస్తుంది,
యోగ సాధకుడికి లభించే మోక్షమే
చెట్టు కింద పీడరుకూ లభిస్తుంది.

మరణంతో ప్రతి జీవాత్మా
మహాత్మగా అయిపోతుంది.
కనుక, మానవుడా, గుర్తుంచుకో –
బ్రతుక్కు మోక్షమే లక్ష్యం కాదు !

బ్రతుక్కు సుఖంగా బ్రతకడం లక్ష్యం
సువిశాలంగా బ్రతకడం లక్ష్యం
అజరామరంగా బ్రతకడం లక్ష్యం !
అందుకు ప్రయత్నించు, ప్రయాణించు
నీదైన మార్గంలో ప్రయాణించు
నీ వెలుగే నీ దారి దివ్వెగా ప్రయాణించు !

# ఓయి, కవీ!
# కవిత్వం వ్రాయి!

*

## బోయి భీమన్న

* *

అఖిల భారత తెలుగు రచయితల
ఐదవ మహాసభలలో
కవి సమ్మేళన అధ్యక్ష పీఠం
నుంచి

భాగ్యనగరం 31—5—1971

ఓయి కవీ !
కవిత్వం వ్రాయి !
జీవితాన్ని మథించు
భావ లతలు పూయించు,
అందాలను ఆనందంతో నింపి
అందరికీ అందించు ! 1

కవి అనేవాడు కావ్య వ్యవసాయి,
మానవ హృదయం కావ్య మధుపాయి;
ఎవర్నో విమర్శించడం కాదోయి !
ఎలనీరే ఎండలకు మందోయి ! 2

ఒక్కొక్క జిహ్వకు ఒక్కొక్క రుచి
ఒకొక్క పుర్రెకు ఒకొక్క బుద్ధి;
ప్రతి జిహ్వనూ, ప్రతి పుర్రెనూ లాలించగలది
కవిత్వం ఒక్కటేనోయి ! 3

మేము నీనుంచి ఆశించేది-
చీకటిని కాదు, వెన్నెలను,
ఉద్రేకాన్ని కాదు, ఉపశాంతిని,
రక్తపాతాన్ని కాదు, రక్తి ప్రభాతాన్ని. 4

నీతులు చెప్పకయ్యా ! కవీ !
నీకు తెలిసిన నీతులు మాకూ తెలుసు;
వేదాంతం బోధించకు,
ఆ మాత్రం ఎరగనివా డెవడూ ఇక్కడ లేడు. 5

మా దారికి, మా తిండికి ఎవరైనా అడ్డంవస్తే
మా దగ్గర కత్తులున్నై, శక్తులూ ఉన్నై;
నీ కలం నరకడానికి పనికిరాదయ్యా !
ఆమ్రఫలం ఆటంబాంబు కాలేదయ్యా ! 6

గోవు గడ్డి తింటుంది
వ్యాఘ్రం మాంసం తింటుంది,
మనిషి గోముఖ వ్యాఘ్రమయ్యా, బాబు !
అర్థం చేసుకోవయ్యా మనీషి డాబు ! 7

తన తిండికి మరొకడు పోటీ రానంతకాలం
మనిషి మనీషిగా నీతులు చెపుతాడు,
పోటీ ఏదైనా అగుపిస్తే చాలు–
అశ్వత్థామ నైనాసరే హతః అంటాడు ! 8

ఏ జీవుడి స్వభావమైనా ఇంతే-
ప్రేయసికి పారిజాతం తెస్తాడు,
ప్రత్యర్థి గుండె నెత్తురు తాగుతాడు,
స్వప్రయోజనం కోసం సహచరినైనా వదిలేస్తాడు. 9

సృష్టిలో మానవుడు తలెత్తి నప్పటి నుంచీ
చూస్తున్నావు కదా అతడి మనో నైజాన్ని?
వీరులు, ప్రవక్తలు, అవతార మూర్తులు
ఎవరైనా మార్చగలిగారా మనిషిని? 10

కవికూడ మనిషేనయ్యా !
మనిషిని మరో మనిషి మార్చలేడయ్యా !
నీవద్ద నిజంగానే కవితామధు వుంటే
కొసరవయ్యా అదేదో మాకు కూడ ! 11

యుగే యుగే పుడుతున్న దేవుడి నన్నవాడు కూడ
ఏ కొందరు దుష్టులనో చంపగలిగాడే తప్ప
దౌష్ట్యాన్ని తుంపగలిగాడా ఇప్పటికీ ?
నరుడు నరుడేనయ్యా ఎప్పటికీ ! 12

మానవ ప్రకృతి మహితాత్మక మనుకొని,
మానవ నైజాన్ని అపార్థం చేసుకొని,
మానవ ప్రవర్తనను నిందిస్తున్నావా, కవీ ?
పంకం లేకుండా పంకజం ఉంటుందా, కవీ ? 13

గురి తప్ప మరేదీ కనిపించలే దర్జునుడికి,
ఆ గురే తారక మంత్రమయింది లోకానికి,
కళగా ఆరాధిస్తేనే ఏదైనా
కల్యాణ ప్రదమవుతుంది జనానికి. 14

ఇంటి భోజనం పేదవాడి ఇంటిదైనా
హోటలు భోజనం కంటె ఉత్తమం;
నీ కవితను నీ కోసమే సృష్టించుకో !
నీలో విశేషముంటే, అవుతుందది విశ్వజనీనం ! 15

మట్టిముంతలు, రజత పాత్రలు, రత్న చషకాలు
అన్నీ ప్రజల కోసమే, వారి సుఖం కోసమే;
ప్రధానం ప్రక్రియలు కావు–
వాటిలో నీ వందిస్తున్న మధు రసాలు. 16

మా రైతులు చుట్టలు కాలుస్తారు
మా కార్మికులు బీడీలు కాలుస్తారు
మా ఆఫీసర్లు సిగరెట్లు కాలుస్తారు
అందరూ ప్రజలే, అభిరుచులే వేరు! 17

కళ ప్రజలకోసం అనడం
అన్నం తినడం కోసం అనడమే ?
రాజకీయ నినాదాల రోజు లివి,
రాజీపడవద్దు వాటితో ! 18

కళ ప్రజల కోసమే,
పందుల కోసం కాదు;
సిటీలో రిక్షా లాగుడూ కళే,
సినీమాలో సెక్సువాగుడూ కళే. 19

తెలుగు సినీమా పలుగు పాటలు వద్దయ్యా !
శ్రావ్య కంఠాలకు సంగీతాన్ని ఎరగా గ్రుచ్చి
సెక్సును సొమ్ము చేసుకొంటున్న గాలా లవి !
యువకులను చెట్టెక్కిస్తున్న వాలా లవి ! 20

కిరాయి నటుడి ఫొటోకు ఫ్రేము కట్టించి
పూజగదిలో అలంకరించుకొనే జాతి
కవితను కమర్షియలైజు చెయ్యగలదు,
సరస్వతిచేత కచేరీలే చెయ్యించగలదు ! 21

కవీ ! నీవు అమ్ముడు పోవద్దు,
భక్తి రంజని పేరుతో సెక్సురంజని పాడొద్దు,
రాజకీయాల ప్రాపకం కోరొద్దు,
రక్తం వెల్లువలైనా రాగవీణ మానొద్దు. 22

వేద, వేదాంత, కావ్య పురాణాదులకు
టీకలు, తాత్పర్యాలు, భాష్యాలు కూడ వ్రాయి !
నీ కవిత్వంలోకి మాత్రం వాటిని దించకు,
మూల ఋషికి తోకలు తగిలించకు ! 23

వాల్మీకి శ్లోకం నీ పద్యం కంటె సరళం,
కాళిదాసు డెందం నీ కందం కంటె సరసం,
సూటిగా తీసుకువెళ్ళు వారిని ప్రజలవద్దకు,
బంధించకు వారిని బండిరాల బళ్ళకు 24

మల్లెతీగ తుపాకిగుళ్లు పూయదు,
తేనెటీగ విషాన్ని సేకరించదు,
కోకిల కోడిపుంజులా పోరదు,
మృగశిర లావా వర్షించదు. 25

అందుకే నయా, ఓయి కవీ !
నీవు నిజంగా కవివే అయితే–
నిజంగా కవిత్వం వ్రాయి !
నినాదాలు మానెయ్యి ! 26

తాను తృప్తిగా తినేవాడు సహృదయుడు,
మిగిలితే ప్రజలకు పంచేవాడు కవి !
నీవు తినగా మిగిలేది ఎంత ?
మాకు పంచగలిగింది ఎంత ? 27

అందాలకు నిలయాలు
నందన బృందావనాలే కాదు
మా కూలీల వాలు కొప్పుల్లో కూడ
మందారాలు పరువశిస్తై. 28

మనిషి స్వార్థపరుడయ్యా !
బలం కలవాడిదే రాజ్యం,
తన స్వప్రయోజనానికి లోబడి నట్టివే
దయ, దైవం, భక్తి, నీతి ! 29

పేద, ధనికుడు, అధికారి, సేవకుడు-
వంటి తేడాలన్నీ కేవల రాజకీయ మైనట్టివి,
ఏదో ఒక పక్షం వహించకయ్యా, కవీ !
అందరూ గుండెలనిండా కోరికలున్న వాళ్ళే ! 30

నీ కవితా మధువును అందరికీ పంచు,
అందరి గుండెబలాన్నీ పదిలంగా పెంచు,
గుండె బలమే అన్ని పాపాలకూ పరిష్కారం,
గుండెబలమే సుఖశాంతుల శోభనాగారం. 31

నీ వే దృష్టితో చూస్తే
ఆ రూపంలో కనిపిస్తుంది నీకు సృష్టి,
ఆరాధనకు కనిపించేది అందం,
ఆకలికి కనిపించేది ఆరటం ! 32

భూమి నుంచి పుట్టేది కవిత్వం,
కార్ఖానాల నుంచి పుట్టేది పాండిత్యం,
ప్లాస్టిక్ పువ్వుల్ని చూచి భ్రమసిపోకు
ఎంత చిన్నదైనా నీ తోటపని నీవు మానకు ! 33

ఒకడు కిటికీలు మూసుకొని పడుకొంటాడు,
ఒకడు ఆరుబైట వెన్నెల్లో విరహిస్తాడు,
ఒకడు పాతాళానికి ప్రవహిస్తాడు,
ఒకడు చంద్రగోళానికి ఎగిరిపోతాడు. 34

మనిషి – తనచుట్టూ ఉన్న మనుషులతో,
పరిసరాలతో, పరిస్థితులతో సమరసంగా
మెలగుతూ, బ్రతుకుతూ, వర్ధిల్లుతూ ఉంటాడు;
సమస్యలు ఎవడివి వాడివే ఎల్లప్పుడూ ! 35

రాజకీయాలు, భజనలు, ఉపన్యాసాలు, తీర్మానాలు
మనిషిని ముంచేస్తున్న దుర్దినా లివి;
వ్యక్తి, సంఘం, దేశం – దేనికైనా సరే
స్వప్రయోజన మొక్కటే ప్రత్యక్ష దైవం ! 36

పదవీ రాజకీయాలు
పచ్చికలో పసిరి పాములు;
కవి పాములవాడు కావచ్చు,
తానే ఒక పాము కారాదు. 37

రాజకీయాల రభసల నడుమ
తిండిపేట త్రిప్పల నడుమ
చిట్లిన చిత్తాలను అతకలేనిది
కళా కాదు, కవితా కాదు. 38

ఉల్లి పువ్వూ పచ్చడికే-
మల్లి పువ్వూ పచ్చడికే కాదు,
కంకర రాయీ విసరడానికే-
కమలాఫలమూ విసరడానికే కాదు. 39

నేటి తెలుగు సాహిత్యంలో ఎటుచూసినా
పురిటి గదులు, శ్మశానాలు, తిట్లు
ముళ్ళు, మురికి, నల్లులు, పిల్లులు
ఇంతే కదా అని ఈసడించుకోకు. 40

మాటకు నూరు అర్థాలు,
పాటకు వేయి రాగాలు,
తోటకు లక్ష కుసుమాలు,
కూటికి కోటి విద్యలు ! 41

వ్రాయనీ ప్రతి మొండి కలాన్నీ,
పాడనీ ప్రతి మూగి కంఠాన్నీ,
ఏ కలంలో కల్ప వృక్షాలు ఫలిస్తాయో !
ఏ గొంతులో మాణిక్య వీణలు రవిస్తాయో ! 42

సాహిత్యానికి దేశ కాలాలు లేవు,
సరస్వతి నిత్య యౌవని, సనాతని,
ఆనాడు కంచిపట్టు చీరలు కట్టింది,
ఈనాడు నైలాన్ సిల్కువోణీలు వేస్తున్నది ! 43

చమత్కారాలు, అంత్యప్రాసలు, విమర్శలు
ఉంటే ఉండవచ్చు ఔచిత్యానికి లోబడి;
అయితే -- అవి మాత్రమే కవిత్వం కాదు,
అసలు అందం ఉంటే అలంకారాలు అక్కరలేదు 44

మానవుడు తన అప్పటి స్థాయి నుంచి
ఉన్నత స్థాయి కోసం యత్నిస్తూ ఉంటాడు,
ఆతని స్థానంలో నీవు నిలబడి చూడు !
చేతనైతే సానుభూతితో తోడ్పడు ! 45

దేనికీ మారని విలువలు లేవు,
నీతి నియమాలు మనిషి సృష్టించుకొన్నవే,
నీకు వినా దేవుడు కూడ మరొక లేడు,
మనిషిని తిట్టకు, మంచిగా మరొక మెట్టెక్కించు ! 46

సమాజం వికసించింది, మానవుడు ఫలించాడు,
సామాన్య మానవుడే విశ్వ మానవుడైనాడయ్యా !
కీలు గుర్రాలతో కర్రకత్తులతో కుర్రకుంకలా
నీ వింకా కంకరలో ఆడుకొంటున్నావా, కవీ ? 47

నిన్ను చూచి పెద్దవాళ్లు నవ్వుతున్నారు !
రాజకీయ నాయకులు నీ ముఖమే చూడకున్నారు !
ఒక సినీ ఎగస్ట్రా గోటి కున్న విలువైనా
నేడు నీ కున్నదా ? గుండెపై చేయివేసుకు చెప్పు ! 48

సమాజానికి రసభావ సౌందర్య దాతవు
సమైక్యానికి సాక్షాత్ పరమేశ్వరుడవు,
త్యాగానికి దధీచివి, అగరు వత్తివి, జటాయువువు,
ఎందు కవుతుందయ్యా బ్రతుకు నీకు బరువు ? 49

నీవేదో చెప్పాలనుకొంటున్నావా ?
దాన్ని గురించి పూర్వం ఎవరేమి చెప్పారో తెలుసుకొన్నావా ?
కొత్తగా నీవు చెప్పవలసిం దుంటేనే చెప్పు !
పాత సీసాలకు కొత్త లేబుళ్ళు అతికించకు ! 50

కాలం విమానంలా దూసుకుపోతున్నది,
సంఘం సముద్రాలు దాటిపోతున్నది.
యాత్రికులు కోరేది శ్రమను మరిపించే నవత !
అందుకు పనికిరాకపోతే మరెందుకు నీ కవిత ? 51

కవుల పేర్లు దాచేసి, కవితల్ని మాత్రం ప్రకటిస్తే-
నేటి కవిత లన్నీ ఒకటే మోడలుకు కాపీలు !
తన అసమర్థతకు మరెవర్నో నిందిస్తున్నాడు ఆధునికుడు !
నిస్పృహ వద్దు నిజ స్థితిని గుర్తించు ! 52

జీవితాన్ని నలుముఖాలుగా అనుభవించు,
అనుభవం నుంచి ఆనంద సుధను వెలయించు,
కుల మత ముఠాలకు అతీతంగా జీవించు,
తెలుగుకు మూలసాహిత్య భాగ్యాన్ని కలిగించు. 53

ఎండ వానల దాంపత్యం ఈ జీవితం,
రెంటికీ సమంగా గొడుగు పట్టగలిగిందే సాహిత్యం !
చిమ్మ చీకటిలో చిరుదీపమైనా కావాలి నీ పాట !
మరింత చికాకు కల్పించే కారు మబ్బు కారాదు నీ బాట ! 54

* * *

# COMPLETE WORKS OF BOYI BHIMANNA VOL - 3 : VACHANA KAVITHALU PART - 1

## డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు

1. సంపుటి - 1 - భీమన్న గేయ కావ్యాలు : భాగం 1 & 2
2. సంపుటి - 2 - భీమన్న పద్య కావ్యాలు : భాగం 1 & 2
3. సంపుటి - 3 - భీమన్న వచన కవితలు : భాగం 1, 2 & 3
4. సంపుటి - 4 - భీమన్న వచన గ్రంథాలు : భాగం 1 & 2
5. సంపుటి - 5 - భీమన్న నాటకాలు : భాగం 1 & 2
6. సంపుటి - 6 - Works of Boyi Bhimanna
7. సంపుటి - 7 - భీమన్న అముద్రిత రచనలు
8. సంపుటి - 8 - భీమన్న పీఠికలు : భాగం 1 & 2

## ఇతర రచనలు :

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమవతీ భీమన్న
2. భీమన్న సాహితీ షష్టి పూర్తి సంచిక - సంపాదకుడు : శ్రీ గనుమల జ్ఞానేశ్వర్
3. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - (సదస్సు పత్రాలు)
4. బోయి భీమన్న నాటకాలు - సార్వజనీనత - (సదస్సు పత్రాలు)
5. బోయి భీమన్న సాహిత్యం - వర్తమాన సమాజానికి సందేశం (సదస్సు పత్రాలు)
6. బోయి భీమన్న రచనలు - కావ్యతత్వ వివేచన (సదస్సు పత్రాలు)